RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 9(2) Monthly September 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



# కాళోజి నారాయణరావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

**(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)**

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 9(2) - September 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**

## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ప్రజాకవి కాళోజి నారాయణరావు

రఘువీర నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజి అంటే చాలా కొద్దిమంది మాత్రమే గుర్తుపడతారు. కారణం ఆయన పూర్తిపేరుతో కంటే 'కాళోజి' లేదా 'కాళన్న' లేదా 'కాళోజి నారాయణరావు' గానే సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడబడతాడు. ఆయన రాజకీయ, సాంఘిక చైతన్యాల సమాహారం. తన కవిత్వంతో హక్కులనడిగిన ప్రజాకవి. నిజాం నిరంకుశత్వాన్ని, అరాచక పాలనని వ్యతిరేకించ, కలం ఎత్తిన ధీశాలి.

"ఒక్క సిరాచుక్క లక్షల మెదళ్ళకు కదలిక॥ - కాళోజి

"పుట్టుక నీది - చావు నీది - బతుకంతా దేశానిది" అంటూ తన బతుకునంతా తెలంగాణ కిచ్చిన నికార్సైన ఉద్యమకారుడు కాళోజి. తెలంగాణ తొలిపొద్దు కాళోజి.

"అన్యాయన్నెదిరిస్తె నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి
అత్యాయాన్నెదిరించినవాడే నాకారాధ్యుడు"

అని సగర్వంగా ప్రకటించి, ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజి నారాయణరావు.

కాళోజి కేవలం తెలుగులోనే కాకుండా ఉర్దూ, హిందీ, మరాఠి, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో కూడా రచనలు చేసిన బహుబాషావేత్త. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో ఆయన దిట్ట. 'నా గొడవ' పేరుతో సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాల్ని సంధించి ప్రజాకవి అయ్యారు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన ఆయన గేయాల్లో కనబడతాయి.

తెలంగాణలోని ప్రతీ గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజి ఆకాంక్ష. తెలంగాణలో అక్షరజ్యోతిని వెలిగించాలనే తపనతో "ఆంధ్రసారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో ఒకడిగా నిలిచాడు. జీవితకాలంల ప్రజా జీవితంలోనే గడిపిన కాళోజిని భారత ప్రభుత్వం కూడా విశిష్ట పురస్కారాలతో గౌరవించింది. 1992లో భారత రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు అనేక సాహితీ సంఘాలు కూడా ఈ ప్రజాకవిని సన్మానాలతో సత్కరించాయి.

'నా గొడవ', 'జీవన గీత', 'అణా కథలు', 'నా భారతదేశ యాత్ర', 'కాళోజి కథలు', 'ఇదీ నా గొడవ', 'తెలంగాణ ఉద్యమ కవితలు' మొదలగునవి కాళోజి ప్రసిద్ధ రచనలు.

"తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు సంకోచపడియెదవు సంగతేమిటిరా? అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా" అంటూ తెలుగు భాష పట్ల తనకున్న మమకారాన్ని చాటాడు. "భాష రెండు తీర్లు - ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకుబడు భాష. పలుకుబడుల భాషగావలె" అంటూ వ్యవహారిక భాష ఔన్నత్యాన్ని కూడా చూచిన భాషాభిమాని. "హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు" అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించిన శాంతి కాముకుడు, ప్రజల మనిషి, ప్రజాకవి కాళోజి అన్ని సందర్భాల్లో అసల సిసలైన తెలంగాణవాదిగా జీవించాడు.

- సంపాదక వర్గం

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగు సాహిత్యపు భావం, బలం గురజాడ | - బి. నాగశేషు | 6 |
| 2. | అమెరికా తెలుగు కథలు - మాతృభూమిపై మమకారం | - డా. పలివెల చిరంజీవిరావు | 9 |
| 3. | 'మాలపల్లి' - దేశభక్తికి నిర్వచనం | - డా॥ ఎ.ఎ. నాగేంద్ర | 14 |
| 4. | బసవ పురాణం - కన్నప్ప పాత్ర | - డా. జరుపుల రమేష్ | 16 |
| 5. | తిక్కన సంబోధనలు - కారకౌచిత్యము | - డా. ఎం. కాశీంబాబు | 20 |
| 6. | నన్నయ మహాభారత రచనకు దోహదం చేసిన ఆనాటి పరిస్థితులు | - డా॥ అజ్మీరా సిల్మా నాయక్ | 25 |
| 7. | దళిత కథల్లో మహిళ కుటుంబ సమస్యలు | - మల్లెల నాగరాజు | 30 |
| 8. | వైజయంతీ విలాసం - అంధకారం చంద్రోదయం సూర్యోదయం వర్ణనలు | - డి. నాగరత్నమ్మ | 33 |
| 9. | భాషను రక్షించాలా? ఎందుకు? ఎలా? | - డా॥ పి.ఎ. సత్యనారాయణ | 38 |
| 10. | విశ్వనాథరెడ్డి భరద్వాజల తెలుగు సాహిత్యయాత్ర | - ఎమ్.ఎన్.వి. సూర్యకుమారి | 39 |
| 11. | జానపద సాహిత్యము - స్త్రీల పాటలు | - నలిని | 44 |
| 12. | సంఘసంస్కర్తగా, విమర్శకుడిగా కందుకూరి | - డా॥ భూక్యా తిరుపతి | 47 |
| 13. | తెలంగాణ నవలల్లో కులవృత్తుల స్త్రీ - సామాజిక జీవనం | - డా॥ లింగాలమంగమ్మ | 51 |
| 14. | దేశికవితా ప్రక్రియల ఆద్యుడు - పాల్కురికి సోమనాథుడు | - జె. విజేందర్ | 54 |
| 15. | తెలంగాణ నవల - బహుజన అస్తిత్వ చిత్రణ | - డా. పంతంగి వెంకటేశ్వర్లు | 57 |
| 16. | ముక్తేవి భారతి జీవితం - సాహిత్యం | - టి. దేవరాజ్ | 61 |
| 17. | కాళోజీ కవిత్వము - ప్రజారాజకీయాలు | - డా॥ గంగు కిషన్ ప్రసాద్ | 65 |
| 18. | చింతా అప్పలనాయుడు కవిత్వం - 'దళిత స్పృహ' | - అంపావిల్లి ఈశ్వరరావు | 70 |
| 19. | అలపర్తి రామకృష్ణ నవలలు - సామాజిక స్పృహ | - సి. విజయలక్ష్మి | 73 |
| 20. | దళిత స్త్రీల కథలు - స్త్రీవాద ఉద్యమం | - డా. ఎస్. స్రవంతి | 77 |
| 21. | ఆవేశంలో కెరటం - ఆలోచనలో కిరణం - కుమారస్వామి నాయుడి కవిత్వం | - డా॥ పి. విజయకుమార్ | 85 |
| 22. | నల్లమల అడవి బిడ్డలైన చెంచుల - జీవన విధానం | - డా॥. కె. భాను నాయక్ | 89 |
| 23. | ప్రపంచీకరణ - తెలుగు సంస్కృతి | - డా॥. హెచ్. కిషన్ | 92 |
| 24. | తమిళ, తెలుగు జానపద శ్రామిక గేయాలు | - డా॥. ఎస్. యజ్ఞశేఖర్ | 96 |
| 25. | శ్రీ సిద్ధాంత శిఖామణి - వచన సాహిత్యం | - డా॥. మఠపతి మాంతయ్య | 102 |
| 26. | Telugu students of Upper Primary and High School Classes : Conversational Analysis : A Study | - B. Suresh Naick | 105 |

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు సాహిత్యపు భావం, బలం గురజాడ

– బి. నాగశేషు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, మైసూరు, కర్నాటక.

18 వ శతాబ్ధం ఆఖరినుండి ఇప్పటిదాకా ప్రతీ కవీ ప్రతీ రచయితా, రచయిత్రి, ప్రతి సందర్భంలోనూ స్మరించు కొంటున్న పేరు గురజాడ. మరి ఈ పేరు అంతగా ఎలా ప్రభావితం ఎలా చేయగలిగింది?, ఒక వ్యక్తి తెలుగు సాహిత్య జాతకాన్ని మార్చగలిగేంత శక్తి ఎక్కడనుండి వచ్చింది. ఒక్కసారి మనం ఆలోచిస్తే గురజాడలోని ప్రత్యేకతలు తెలుస్తాయి. తిరుగుబాటు తత్వం, సంస్కరణ దృక్పథం,శాస్త్రీయమైన ఆలోచన, విరివిగా పుస్తకపఠనం సమాజాన్ని నిశితంగా పరిశీలించే గుణం, వ్యర్థసాంప్రదాయాలను ధిక్కరించే శక్తి తనను ఇతరులనుంచి వేరుచేస్తాయి. ఆరోజుల్లో గురజాడ సాంప్రదాయ విరోధి అని, గురజాడ రచనల్లో భాష బాలేదని ఆరోపించి, విమర్శించిన వాళ్లెవరు ఇప్పుడు మనకు వాళ్ల పేర్లుకూడా తెలీడంలేదు, మందిలో మనం ఒకరుగా ఉండిపోవడం ప్రత్యేకత కాదు మందిని ప్రభావితంచేసే శక్తి యుక్తులు ఉన్నప్పుడే ఇతరుల నుండి మనల్ని భిన్నంగా చూస్తారు. గురజాడను ఎంతమంది మత ఛాందసుల తీస్కారాలకు గురయ్యుంటారు, ఎంత మంది సాంప్రదాయవాదుల శాపనార్థాలు గురజాడపై గుప్పించింటారు కానీ అవేవిగరజాడ నీడను కూడా తాక లేకపోయాయి. మనిషి భావాలు, ఆలోచనలు సమా జాన్ని వెనక్కి నెట్టేలా ఉండకూడదు. విరుద్ధ సంఘర్షణ శక్తుల తోనే సమాజం అభ్యుదయం వైపు నడిపిస్తుంది. మహా భారతం గొప్ప వంశ చరిత్రే అయినా ఎంతమంది తెలుగు వారు దాన్ని చదివారు? చదవకపోయినా పాండవులు మంచివారు, కౌరవులు చెడ్డవారని తేలుస్తున్నారు. ఇది కేవలం ప్రచారం మాత్రమే. మంచి చెడులు పూర్తిగా చదివినవారికెరుక, మంచైనా చెడైనా చేసే ప్రచారంలోనే ఉంటుంది. దురదృష్టం ఏంటంటే పూర్వ సమాజపు పునాదులు చెడుమీద ప్రబలంగా పెరిగాయి. చెడే ప్రచారం జరిగింది మంచి లేదనేది కాదు నా ఉద్దేశ్యం పైచేయి చెడుదే అని నేను చెప్పగలను. సమాజపు చీడ పీడల పునాదులను కదిలించడానికి అనేకమంది సంఘ సంస్కర్తలు ప్రయత్నించారు. నవయుగ వైతాళికులు అని వారిని పిలుస్తారు. వైతాళికులు అనిపించుకునేంత బలమైనముద్ర వేశారంటే సమాజాన్నివాళ్ల రచనలద్వారా ఎంతగా ప్రభావితం చేసుంటారో అర్థం చేసుకోవచ్చు.ఇదే పనిని గురజాడ చేశారు తను వందల పుస్తకాలు రాయకున్నా తెలుగు సాహిత్యం ఉన్నంత దాకా గురజాడను గుర్తుచేసుకొంటునే ఉంటాం. నాటకం అంటే కన్యాశుల్కం దగ్గరే ఆగిపోతున్నాం,కథ అంటే దిద్దుబాటును ముద్దాడుకోకుండా ముందుకుపోలేము. కారణం అటు పాశ్చాత్యభాష ఇంగ్లీషు, ఇటు సాంప్రదాయక భాష సంస్కృత చట్రాన్ని పటాపంచలు చేయడమే.గురజాడ తరువాత కొన్నివేల మంది రచయితలు, కవులు గురజాడ దారిలో ప్రయాణిస్తూనే వారివారి పంథాలో రచనలు చేస్తున్నారు. కొంతమంది ఉత్తమ రచనలు, మరికొంత మంది ఉత్త రచనలు చేశారు. స్మరించుకోడానికి సృజనాత్మకతే కారణం. విస్మరించడానికి మూస ధోరణే కారణం. శాస్త్రీయత, హేతువాదం లోపిస్తే రచయిత లిస్ట్‌లో ఉంటారు జనం గుండెలకు దూరంగా. గురజాడ సమాజాన్నిశాస్త్రీయతవైపు నడిపించడంలో కృతకృత్యులయ్యారు.

గురజాడ కన్యాశుల్కం నాటకంలో అంతవరకు వచ్చిన ఒక గౌరైదాటుతత్వాన్ని కాలదన్ని సంప్రదాయాల వలయాల్ని దాటి నాటకానికి సాంప్రదాయవాదులు కట్టిన గోడలు కూల్చేశారు. నాటకం ఇలాగే ప్రారంభం అవ్వాలి, ఇలాగే అంతమవ్వాలి అనే ఆద్యంతాలను ఉద్దేశ్యపూర్వకంగానే బద్దలుకొట్టారు. నాటకం ముగింపు కూడా విషాదాంతమో, సుఖాంతమో చెప్పలేని విధంగా ముగించి పాఠకుల్ని వినూత్నంగా ఆలోచింపచేశారు. వసంతసేనలా బతుకుదామనుకొన్న మధురవాణి ఆకోరిక

తీరకుండానే నిష్క్రమించడం విషాదమైనదిగా కనిపిస్తుంది. ఒక వేశ్య సంస్కరింపబడి నిష్క్రమించడం అనే దృష్టితో చూస్తే ఇది సుఖాంతంగా అనిపిస్తుంది.గురజాడ ఉపయోగించిన మాండలిక పదజాలం కూడా కన్యాశుల్కం నాటకం విజయవంతం కావడానికి కారణంగా చెప్పవచ్చు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ సామాన్యుల గురించి ఎలుగెత్తి చాటారు. మనుషులంటే రాజులు. రాజకీయనాయకులే కాదు సామాన్యులు కూడా అని గురజాడ గుర్తుచేశారు. అలాగే భాష కూడా సామాన్యుల భాషను అందలం ఎక్కించినప్పుడే సామాన్యులు గద్దెనెక్కుతారు అని లోతైన పరిజ్ఞానంతో చెప్పిన మాటలివి. విద్యారంగంలో వాడుక భాషను ఉపయోగించినప్పుడే సామాన్యులు చదవగలరు. పండితుల భాష విద్యారంగంలో పాఠ్యాంశంగా ఉండడం వల్ల సామాన్యులు తెలుగుభాషను అదేదో కొత్త భాషగా అనుకోవడానికి అవకాశం లేకపోలేదు. ప్రజల భాషలోనే చదువు కొనాలని 1914లో తను సమర్పించిన డీసెంట్ పత్రం సారాంశం కూడా అదే. కరుడుకట్టిన సామ్రాజ్యవాదులైన బ్రిటీష్ వారు సైతం ఆంగ్ల, సంస్కృత భాషలే కాకుండా దేశభాషలను కూడా ప్రోత్సహించాలని అందుకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఉండాలని నిర్ణయించారు. జె.ఎ ఏట్స్ కూడా ప్రజల భాషకు మద్ధతు పలికారు. సామాన్యులను చదువుకు దగ్గర చేయాలంటే వాడుక భాషలో బోధన జరగాలని ఏట్స్అభిప్రాయపడ్డారు. గురజాడకు ముందు తెలుగు సాహిత్యం కొంతమంది భాషా ఛాందసుల పంజరాల్లో ఊపిరాడకుండా ఉన్నింది. పంజరాన చిక్కుకున్న భాషను స్వేచ్ఛ వాయువులు పీల్చేలా చేసి, తెలుగు సాహిత్యానికి ఉరకలెత్తే ఉడుకు రక్తాన్ని ఎక్కించారు. గురజాడ భావజాలాన్ని బయటకి రానివ్వకూడదని చాలా ప్రయత్నించారు కానీ కాలమే కొత్త భావజాలానికి గురజాడ రూపంలో స్వాగతించింది.

గురజాడ అపూర్వ సృష్టి ముత్యాలసరం ఛందస్సు అయితే ఇది గురజాడ కంటే ముందుగా కన్నడ భాషలో రగళె ఛందస్సును అనుకరించారని, పార్శీ గజల్ రీతిలో ముత్యాలసరం కనబడుతుందని కొంతమంది పండితుల అభిప్రాయం. 'కొత్త పాతల మేలుకలయిక క్రొమ్మరుంగుల క్రమ్మగన్' అంటూ గురజాడ కవిత్వమేనిఫెస్టోను తానే ప్రకటించుకొన్నారు. తెలుగు దేశి ఛందస్సులలో ముత్యాలసరం చెప్పుకోదగ్గది. తెలుగు సాహిత్యంలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖింపచేసింది. సాహిత్యరంగంలో గురజాడకు ప్రాధాన్యత లభించాక గ్రాంథికభాషా ఛాందసులు బ్రాహ్మణీయభావజాల ఫ్యూడల్ అభివృద్ధి నిరోధకులు గురజాడ సాహిత్యంపై విమర్శలకు పూనుకున్నారు.వారిని వామపక్ష గ్రూపుల్లోకి జతకట్టారు,కామ్రేడ్ గురజాడ అన్నారు అయినా వెరవలేదు. ఆధునికత ఇంతగా సాధించిన నేటికాలంలోనే ప్రశ్నించే తత్వం ఉన్నవాళ్లను చూస్తే జీర్ణించుకోలేరు మరి ఆనాటి మత, భాషా ఛాందసుల మౌఢ్య ఉన్మాదుల కాలంలో గురజాడ మార్పు పదాన్ని ఉచ్చరంచడానికి కూడా అనువుకాని కాలం అది, అయినా ఎన్ని విమర్శల రాళ్ళ దెబ్బలనైనా తట్టుకొని నిలిచారు అంటే మామూలు విషయం కాదు. కులం రేవులు కూడినా, కరడుగట్టిన కుళ్లు కళ్లు వెక్కిరించినా, గురజాడ అడుగును అడ్డుకోవడానికి ఎంతమంది ప్రయత్నించినా అవేవి గరజాడ నీడనుకూడా చేర లేదు. వెక్కిరించిన కళ్లే మెచ్చుకొంటూ చెమర్చాయి, ఛీత్కారించిన చేతులే చప్పట్లు కొట్టాయి. గురజాడ తెలుగుకు మాత్రమే కవి కాదు జాతీయ కవి జాతిని జాగృతం చేసిన కవి. ఈవిషయం దేశభక్తి గేయంద్వారా తెలుసుకోవచ్చు. పెత్తందార్ల ఆలోచన ప్రజల్ని ప్రజల భాష నుండి వేరు చేయడమే, ప్రజలకు అర్థంకాని భాషని ప్రజలనాలుకల మీద నిలిచేలాగ చేస్తారు. అదే వారి దోపిడీ మార్గానికి మొట్టమొదటి విజయం. తెలుగు సాహిత్యానికి సంకెళ్ళను త్రుంచింది గురజాడ మాత్రమే. సమాజంలోని స్త్రీల అణచివేత, నిస్సహాయత, పరాధీనత గురించి వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలనుండి స్త్రీలను కాపాడాలని గురజాడ ప్రయత్నించారు.వివాహ వ్యవస్థలో స్త్రీల అసమస్థితిని, విపత్కర పరిస్థితులను ప్రస్తావిస్తూ, వివాహ వ్యవస్థ పురోగతికి తాత్వికత ఉంటే వివాహబంధం

అవిచ్ఛేద్యమైనదనే భావం అసంఖ్యాకమైన విషాదాలకు కారణమైందనే విషయం. మెటిల్డా కథానికలో మెటిల్డా దుస్థితి ద్వారా తెలియజేస్తారు.అలాగే స్త్రీ అభివృద్ధిలో దేశాభివృద్ధి దాగివుందని ఆయన ఏనాడో చెప్పారు కానీ నేటికీ ఇంకా పరిస్థితిలో మార్పు ఆశించినంత జరగలేదు.

మాయమర్మం లేని నేస్తము / మగువలకు మగవారి కొక్కటే / బ్రతుకు సుకముకు రాజమార్గము / ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును / ప్రేమనిలిపిన ప్రేమనిలుచును మగడు వేల్పన పాతమాటది. ప్రాణమిత్రుడు నీకు నీనెనరు / కలుగక యున్న పేదను, కలిగినను /నా పదవి వేల్పుల దేనికెక్కడ అని కాసులు గేయంలో స్త్రీ దాస్యభావనను పటాపంచలు చేశారు. ఆడవారి గురించి అనవసర పసలేని ప్రసంగాలు, అర్థం పర్థంలేని వాదాలు స్త్రీ పురుష తార తమ్యాలు ఎందుకో ఇవన్ని గురజాడ చెప్పినట్లు మాయ మర్మం లేని నేస్తం ఆడ, మగ తేడా ఏముంది. నేటికీ భర్త అంటే దేవుడనే నమ్మకం ప్రబలంగా ఉంది. గురజాడ ఏమన్నాడో చూడండి ప్రాణమిత్రుడంటారు నిజానికి భార్యగా వచ్చాక తండ్రికంటే భర్తనే

ఎక్కువుగా నమ్ముతుంది. మరి అలాంటప్పుడు వేల్పు అని దూరంపెంచితే ఎలా? స్వాతంత్ర్యం వచ్చి నప్పటి నుండి ఇప్పటిదాకా దళితులను, స్త్రీలను అభివృద్ధి చేస్తున్నట్లు అన్ని రాజకీయ పార్టీలు చెప్పుకుంటూ వస్తు న్నాయి కానీ ఏదీ మరి వారు చెప్పిన మార్పు. ఉన్నత ఉద్యోగాల్లో సేవలందిస్తున్న మహిళలకు కూడా లైంగిక వేధింపులు తప్పడంలేదు. దళితులపై దాడులు ఆగడం లేదు. ఈనిజాన్ని లవణరాజుల కలలో మాలవాడు కనపడ గానే భ్రాతృత్వం చాలా దూరం పలాయనం చేస్తుంది. మాలవాణ్ణి చూడగానే అమాంతం కౌగిలించుకోనివాడికి దేశమాత పేరెత్తడానికి అర్హతలేదని నాగట్టి నమ్మకం. అని దేశంకోసం, మార్పుకోసం అని ప్రగల్భాలు పలికే కపట కులపిచ్చి విష పురుగులకు చావు మందు చాలా తినిపించారు గురజాడ.

మీపేరేమిటి అనే కథలో మతాచారాల పేరుతో జరిగే వంచనను ఎండగట్టారు. మానవునికి నిజమైన ఆనందం పరోపకారంలో ఉందని మానవాళి పూసిన అత్యంత ఉజ్వలమైన పుష్పం ప్రేమ. వెర్రిప్రేమ కాదు వ్యామోహం కాదు అందమైన ఆత్మలసౌందర్యాలన్నీ స్ఫటిక స్వచ్ఛతను మెచ్చుకోవడం....... మంచితనమే దైవం అంటారు.

వేదాంతం, దేవుడి పేరుతో జరిపే మోసాలకు అంతే లేదు, దొంగ బాబాలకు కొరతేలేదు మతాచారాల ముసుగులో నడుస్తున్న మోసాలకు అంతేలేదు. వీటన్నిం టినీ గురజాడ 'మీపేరేమిటి' కథలో తూర్పారబట్టారు. మానవ సంబంధాలు ఉద్వేగాలు, మతాలకు అతీత మైనవి అని 'పెద్ద మసీదు' కథ నుండి తెలియజేశారు. గురజాడ శాంతి ప్రియులు సామరస్యంతో ముందుకు సాగాలని కోరుకొన్నారు. మొదటి ప్రపంచయుద్ధాన్ని పూర్తిగా వ్యతిరేకించారు 'దించులంగరు' అనే గేయం శాంతి కోరుతూ రాసినదే. 'పూర్ణమ్మ' గేయం మనపక్కనే కూర్చొని కత చెబుతున్నట్లు ఉంటుంది. మనం చిన్న పిల్లలమీద జరుగుతున్న అత్యాచారాలను నిత్యం వింటున్నాం వాటన్నింటినీ పూర్ణమ్మ గేయం ద్వారా కనువిప్పు కలిగిం చారు. మిణుగురులు ద్వారా శాస్త్రీయవిద్యావశ్యకతను తెలిపారు. బూరుగుచెట్టు చిలకతోను ఏమని పలికింది? ఎండినదూదై పకపక నవ్వింది. పాలించేవారే పీడిస్తే, కంచే చేనుమేస్తే పంటమాటేమిటి అనే నిజాన్ని కన్యక గేయంలో పట్టపగలే నట్టివీధిని పట్టబోరే జారచోరులు.. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అన్నిఅనార్థాలను ఎప్పుడో హెచ్చ రించారు. గురజాడ సాహిత్యం ఎప్పటికీ నూతనంగానే ఉంటుంది. మనం నడవాలంతే కానీ గురజాడ ఎప్పుడో జాడ పరిచారు, మనమే మేల్కోవాలంతే కాని ఆయన ఎప్పుడో సమసమాజాన్ని దర్శింపచేశారు.' భావించడం నా ముచ్చట, ఆలోచన నా బలం' అని అనటంలో ఆయన నమ్మకబలాన్ని పరిశీలించవచ్చు. తనమాటల్లో మనుషుల్ని భావించారు, మనసులకు బలం నింపారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అమెరికా తెలుగు కథలు - మాతృభూమిపై మమకారం

- డా. పలివెల చిరంజీవిరావు, సహాయాచార్య(తెలుగు శాఖ), ఐఐఐటి శ్రీకాకుళం, ఆర్.జి.యు.కె.టి.

ఉన్నతోద్యోగాలను తెచ్చుకొని ఇతరదేశాలకు వెళ్ళి అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న మన భారతీయులకు స్వదేశం మీద మమకారం లేదనడం నిజంకాదు. జన్మ భూమిని, తల్లిభాషని, పుట్టిన ఊరుని మన ప్రవాస భారతీయులు మరువలేదు. మాతృభూమిపై తమకున్న అభిమానం గొప్పది. తుఫానులు, భూకంపాలు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వారు సహృదయంతో సహాయం చేస్తున్నారు. అమెరికాలో నివసిస్తున్న అనేక మంది భారతీయులు వారికి వచ్చిన జీతంలో సగం సొంత గ్రామాలకు పంపుతూ, లేని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇలాంటి సహాయ సహకారాల ద్వారా మాత ృభూమి ఋణాన్ని తీర్చుకుంటున్నారు. కొంతమంది ఒకప్పుడు చదువుకున్న విద్యాలయాల అభివృద్ధికి విరాళాలు వసూలు చేసి చేయూత నందించి బాగుచేయిస్తున్నారు. ప్రవాసాంధ్రులు అనేక మంది వారి పెట్టుబడులను స్వదేశంలో పెట్టి పరోక్షంగా మాతృదేశాభివృద్ధికి తోడ్పడుతున్నారు.

భారతీయులు అనేకమంది విదేశాలలో స్థిరపడినా మాతృభూమిపై మమకారం విడిచిపెట్టలేదు. ఎన్.ఆర్.ఐ పేరు మీద స్కూలులు, కాలేజీలు అనేకం నడిపిస్తున్నారు. చాలా సంవత్సరాలనుంచి విదేశాలలో ఉన్నాగాని ఇప్పటికీ కూడా భారతీయ పాస్పోర్టునే కలిగిన దేశభక్తులున్నారు. వ్యక్తులుగా వారు అమెరికాలో ఉన్నాగాని, వారి మనసు మాత్రం జన్మభూమిపైనే ఉంటుంది. మధుర స్మృతులను, మధుర అనుభూతులను ఎప్పుడూ స్మరించుకుంటూనే ఉంటారు. మాతృభూమిని ప్రేమిచడంలోను, జాతీయత భావాలను కలిగి ఉండటంలోను వీరు ఇక్కడి వారికి ఏమాత్ర తీసిపోరు. మాతృభూమిపై వారికున్న అభిమానం అమెరికా తెలుగు కథకులు వారి కథలలో మనకు వ్యక్తం చేశారు. ఏది ఏమైనా పుట్టిపెరిగిన మట్టి మీద మమకారం తగ్గలేదని ఈ కథల ద్వారా చెప్పవచ్చు.

**అమ్మ :**

తల్లి మరణించిన వార్త విన్న కుమారుడు తల్లిని చూడడానికి అమెరికా నుంచి ఇండియారాలేని పరిస్థితులను అతని మధుర స్మృతులను తల్లితో పంచుకున్న మధుర అనుభూతులను కథగా మలిచారు రచయిత. అమ్మ ప్రేమను అమ్మజ్ఞాపకాలను మరువలేని కుమారుడి గాథాను కథా వస్తువుగా రాశారు.

రచయిత ఇంటికి ఒకరోజు ఫోన్ వస్తుంది. ఆ ఫోన్‌లో రచయిత తల్లి మరణించిందని తమ్ముడు వేణు చెప్పగానే రచయిత దిగ్భ్రాంతికి గురౌతాడు. అమెరికాలో ఉన్న అందరికీ ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి వార్త వినవలసి వస్తుందన్న ఆలోచన రచయితకు ఉన్నప్పటికీ, దాని పర్యవసానం ఎంత భయంకరంగా ఉంటుందో రచయిత స్వయంగా అనుభవిస్తాడు. దూరంగా ఉండటమనేది ఒక సమస్యే కాదని ఎప్పుడూ సమర్ధించుకునే రచయిత ఆ క్షణంలో మాత్రం మనస్సుకు సర్ది చెప్పుకోలేకపోతాడు. ఎల్లవేళలా తన భార్య బిడ్డలను గూర్చే ఆలోచించే తాను తల్లిదండ్రులను గూర్చి ఎందుకు ఆలోచించలేక పోయానా? అని బాధపడతాడు.

రచయిత తాను డాక్టర్ అయ్యి ఉండి కూడా తల్లి గుండె పోటును ఆపలేక పోయినందుకు తన అసమర్ధతను తానే నిందించుకుంటారు. 25 ఏళ్ళకే తల్లిని కోల్పోయిన తన చిన్న చెల్లిని ఆ ఇంటి పెద్ద కొడుకుగా ఎలా ఓదార్చాలో రచయితకు అర్థం కాదు. ఆ క్షణం నుండి తల్లితనతో మాట్లాడదు, నవ్వదు అనే భావం మనస్సులోకి రావడమే అతను భరించలేకపోతాడు. చివరి చూపుకు నోచుకోలేకపోతాడు. తన తల్లి అంత్యక్రియలు జరుగుతున్నాయని తెలిసి ఏమి చెయ్యలేని నిసహాయ స్థితిలో ఉండిపోవడం రచయిత వంతయింది. మనిషి విలువ మనిషికి ఉన్నప్పటికంటే లేనప్పుడే బాగా తెలుస్తుందనే విషయాన్ని ఈ కథ మరోసారి పాఠకులకు గుర్తుకు

తెస్తుంది. సదా తమ పిల్లలను గూర్చే ఆలోచించే తల్లిదండ్రులు తాము ఒక తల్లికి బిడ్డలమేనని మాత్రం గ్రహించలేరని ఈ కథ తెలుపుతుంది.

అమ్మ కథలో దూరానున్న కొడుకు అమ్మ అంత్యక్రియలకి అందుకోలేక అక్కడ అశ్రుతర్పణం కావించడం జాలేస్తుంది ఈ కథ చదివితే.కొన్ని సంవత్సరాల క్రితం ఎవరైతే ఇండియాను వదిలివెళ్ళి తల్లిదండ్రులతో జీవించలేక పోతున్నారో, వారి బాగోగులు చూసుకోలేక పోతున్నారో అటువంటి వారికోసం అమ్మ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటు రాసింది ఈ కథ. ఏదైన విజయం రావాలంటే కొంత మూల్యం చెల్లించాలి. ఆవిధంగా చేసిన అమూల్య చెల్లింపే తల్లిదండ్రులను వదలిపెట్టి విదేశాలలో జీవించడమని మాచిరాజు ఈ కథలో తెలిపారు.

## వెనుదిరిగితే...?

ఈ కథ మనదేశం విడిచిపెట్టివెళ్ళీ పరాయి దేశంలో బ్రతుకుతున్నవారి గురించి తెలుపుతుంది. పరదేశంలో ఎన్నో కష్టనష్టాలు, ఎత్తుపల్లాలను చవిచూసి గత అయిదారేళ్ళు తర్వాత జీవితమంతాగాడిలో పడుతుంది. అంతలోనే జననీ జన్మభూమిశ్చ స్వర్గాదఫీ గరియసీ....అనే పాట ఇన్స్పిరేషన్‌లో ఇండియాకి తిరిగివచ్చిదేశాభిమానాన్ని చాటుతూ ఇండస్ట్రియల్స్ రంగంలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న నిజమైన భారతీయుడి కథను జయ సంగసాని రాశారు.

శ్రీరాం చదువుకునే వయస్సులోనే అమెరికాకు వచ్చి, అక్కడే భార్య, పిల్లలతో చక్కగా స్థిరపడ్డాడు. ఆ విదేశీ గడ్డపై ఎన్నో విజయాలు సాధించి, సుఖమయజీవితాన్ని గడుపుతుంటాడు. తన విజయాలకు తోడు, నీడగా నిలిచిన భార్య అంటే శ్రీరాంకి ఎంతో గౌరవం. సంవత్సరాలు గడిచేకొద్దీ శ్రీరాం జీవితంలో ఒక అసంతృప్తి చోటు చేసుకుంటుంది. జీవితపోరాటంలో తాను ఎన్ని సుఖాలు కోల్పోయాడో, ఎన్ని సంతోషాలకు దూరమయ్యాడో ఆలోచించుకొని శ్రీరాం బాధపడుతుంటాడు. అతని ఆలోచనలన్నీ స్వదేశం చుట్టూ తిరుగుతుంటాయి.

అమెరికాను వదిలి స్వదేశానికి వెళ్ళాలని శ్రీరాం బలంగా నిర్ణయించుకుంటాడు. ఇకమీదట తన తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు స్వదేశానికే వినియోగించాలని నిశ్చయించుకుంటాడు. శ్రీరాం నిర్ణయానికి మొదట అతని భార్య ఆశ్చర్యపోయినా, ఆ పిమ్మట అతని మనసెరిగి అందుకు సమ్మతిస్తుంది. స్వదేశానికి వెళ్ళిన శ్రీరాం అచిరకాలంలో ఉత్తమ పారిశ్రామికవేత్తగా ఖ్యాతిపొంది, ప్రముఖుల ప్రశంసలు అందుకుంటాడు. అలా తన దేశపు ఋణం తీర్చుకున్నందుకు శ్రీరాం అసలైన సంతృప్తిని పొందుతాడు.

## వేపచెట్టు :

ఏ దేశంలోనున్నా, అక్కడ ఏ స్థాయిలోనున్నా, భారతీయులు తమ మాతృదేశపు జ్ఞాపకాలను గుండెల్లో పదిలంగా భద్రపరుచుకొని ఉంటారని తెలియజేసిన కథ ఇది. అమెరికాలో స్థిరపడిన ఓ వ్యక్తి తాను చిన్నప్పుడు మాతృదేశంలో తన ఇంటి పెరటిలో నాటిన చెట్టుతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకోవడం ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం. ఈ కథను రాసింది శివ పార్వతి అనంతు.

శ్రీధర్ తన చిన్నప్పుడు ఒక వేపచెట్టును తెచ్చి ఇంటి పెరటిలో నాటతాడు. ఆ చెట్టునాటే సమయంలో శ్రీధర్ తల్లి నువ్వు పెద్దయిన తర్వాత ఎప్పుడు ఇంటికి వచ్చినా, మేమున్నా లేకున్నా ఆ వేపచెట్టు నీ కోసం ఎదురుచూస్తూ ఉంటుందని చెబుతుంది. ఆ మాటలు శ్రీధర్ మనస్సులో నాటుకుపోతాయి. శ్రీధర్‌తో పాటు ఆ వేపచెట్టు కూడా పెరిగి పెద్దదవుతుంది. శ్రీధర్ జీవన గమనంలో అనేక మధుర స్మృతులు ఆ చెట్టుతో ముడిపడి ఉంటాయి. అమెరికాలో ఉన్న శ్రీధర్ ఒక ఉగాదికి తన సొంత ఊరికి వస్తాడు. శ్రీధర్ తల్లిదండ్రులు భౌతికంగా లేకపోయినా, వారి ఆత్మీయత ఆ వేపచెట్టులో దర్శనమిస్తుంది. ఒక్కరోజైనా భార్యపిల్లలతో తాను పుట్టి పెరిగిన ఆ వాతావరణంలో ఉండాలనే కోరిక ఇన్నాళ్ళకు తీరినందుకు శ్రీధర్ ఎంతో ఆనందపడతాడు.

### అమ్మమ్మ చెప్పిన కథలు :

అమెరికాలో చికాగోలో నివసిస్తున్నాన్న అబ్బాయి అమ్మమ్మ చెప్పిన మాటలకు ముగ్ధుడౌతాడు. ఇండియా గొప్పతనం గురించి తెలుసుకోవాలనుకుంటాడు. అక్కడ ఉన్న ప్రేమలు, ఆప్యాయతల గురించి, తన అమ్మమ్మ చెప్పిన మాటలు ఎంతవరకు నిజమో తెలుసుకోవాలని ఇండియాలో ఉన్న అత్తయ్య, మామయ్యల దగ్గరకు వెళతాడు. మామయ్యగారి దగ్గరనుంచి చిన్నిఅన్నయ్యా, ప్రియను చూసి అక్కడనుంచి చీరాల, జాండ్రపేట, వేట పాలెం, పందిళ్ళపల్లిదాటి కడవకుదురుకు వెళ్ళి అమ్మమ్మ చెప్పినట్టు అందరినిచూసి పాండురంగవిఠల్ గారి దగ్గరకు వెళ్ళుతాడు. విఠల్ "ఇంకా లేవ లేదా బాబూ! అయ్యా మీ మీద ఎండపడుతోంది లేచి ముఖం కడుక్కొని కాపీ త్రాగండి" అంటూ ఆ పెద్దయన లేపుతాడు. తర్వాత ఘాలి కుటుంబాన్ని చూసి కరణం శ్యామ్ గారింటికి వెళ్తాడు. అంజయ్య పర్సనాలిటీ అమ్మమ్మ చెప్పినట్టు ఉంటుంది. ప్రకాశం ఇంటికి వెళ్తాడు. ప్రకాశం హరిజనుడు అతని వ్యక్తిత్వం మాత్రం చాలా గొప్పది. కాని అతను చనిపోయి కొన్ని సంవత్సరాలవుతుంది. అక్కడ నుంచి చలపతిరావుని, అతని భార్య ఆదిలక్ష్మిని చూసి గోవింద పురం చేరుకొని జనార్ధన స్వామిగుడి దర్శించి రాయసం వారి ఇల్లు చేరతాడు " అమ్మమ్మ కోరిన ఊళ్ళు వెళ్ళి .. ఆయా మనుష్యులను చూసి రావటం వాళ్ళకు చిన్నచిన్న బహుమతులిస్తాడు. (వాళ్ళ అనురాగం ముందు ఆ గిఫ్టుల విలువేంలేదని అమ్మమ్మ చెప్పింది నిజమనిపిస్తుంది) అతనికి. అమ్మమ్మ అతని భార్యకు డైమండ్ నెట్ అంద చేయమని చెప్తూంది. అమ్మమ్మకు డాక్టరులన్నా! వారి మానవసేవన్నా మహా ఇష్టమట అందుకే పట్టుదలగా, మా నాన్నను వారి అల్లుడుగా తెచ్చుకున్నారట. ఇండియాలో ప్రేమలు బాగుంటాయని చెప్పి, అతనికి తన ఆదీ మామయ్య కూతురిని పైగా డాక్టర్ని చెయ్యాలనుకొని అమ్మకు చెప్పి పెళ్ళి సంబంధాలు అడగాలనుకుంటారు కథ ముగుస్తుంది.

### ఫాస్ పోర్ట్ :

ఈ కథను రాసింది మాచిరాజు సావిత్రిగారు. సమాజంలో మానవులు విద్య ద్వారా విజ్ఞానాన్ని వివేకాన్ని సంపాదించుకుంటారు. దాని ద్వారా జీవితాలను చక్క దిద్దుకుంటారు. జీవితానికి ఒక స్థిరత్వాన్ని సంపాదించు కుంటారు. ఈ కథలో అమెరికా పౌరసత్వం పొందనిమూర్తి గ్రీన్‌కార్డ్‌హోల్డర్‌అజయ్ అమెరికా పౌరసత్వం వల్ల బహు ప్రయోజానాలున్నాయని తెలుపుతూ వారి అనుభవాన్ని వివరిస్తున్న సందర్భంలో మూర్తి ఎదుర్కొన్న గత అనుభవాలన్ని సామాజిక సమస్యలుగా గుర్తించాలి. ఇదొక కోణమైతే రెండవ కోణంలో విద్య ద్వారా జ్ఞానం సంపాదించి ఆజ్ఞానం ద్వారా వివేకాన్ని ఆలోచన శక్తిని పెంచుకోవడానికి బదులు కొందరు వ్యక్తులు యేహ్య భావాన్ని పెంచుకొని వినాశన కార్యాలు చేయడానికి పూనుకుంటారు. సమాజం పట్ల వీరికి సంద్భావం కంటే విరుద్ధ భావాలే నానాటికి పెంపొందుతుంటాయి. అందువల్ల వీరిని తీవ్రవాదులుగా, సమాజానికి కీడుచేసే వ్యక్తులుగా పెర్కొనడం జరిగింది. ఇటువంటి వారు చివరకు శిక్షలతోనే జీవితాన్ని గడప వలసివస్తుంది. ప్రస్తుతం కథయైన పాస్‌పోర్ట్‌లో విమాన హైజాక్ వృత్తాంతమే ఓ నిదర్శనం.

అమెరికాలో అజయ్, మూర్తులు పాస్ పోర్ట్ రీన్వాల్ ఆఫీసు దగ్గర కలుసుకొని ఒకే విమానంలో ప్రయాణం చేస్తున్నారు. ఆ సందర్భంలో వారిస్నేహం బలపడుతుంది. ఇద్దరు న్యూయార్క్‌కు వెళుతుంటారు. వారి సంభాషణ సాగుతుండగానే ప్రయాణం మొదలవుతుంది. ఒకరి వివరాలు ఒకరు చెప్పుకోవడంతో వారిద్దరూ యు.ఎస్.ఎ లో తలో మూలా ఉంటున్నారనీ తెలుస్తుంది. మూర్తి యూనివర్సిటీ ప్రొఫెసర్ గానూ, అజయ్ ఒక కంపెనీలో ఇంజనేరుగానూ పనిచేస్తుంటారు. అజయ్ యు.ఎస్. సిటిజన్ షిప్ తీసుకొని ఎన్నాళ్లైంది. మీరొచ్చిన టైములో ఇప్పటికంటే బాగా సులువనుకుంటానని అడుగుతాడు. అందుకు మూర్తి "నేనసలు తీసుకోలేదు ఇంకా సిసలైన ఇండియన్నే ఏమిటి ఇంకా తీసుకోలేదా ఎందుకని ఇన్నాళ్ళ నుంచీ ఇక్కడుండి కూడా అజయ్ ఈ నిజాన్ని

జీర్ణించుకోలేకపోయాడు. భారతీయుడంటే మనసాటి వాడని కాకుండా ఓ చీడపురుగులాచూసి విదేశీ పాసెంజర్లపైనే శ్రద్ధచూపించే ఏర్ ఇండియా సిబ్బందీ వేరే దేశంలో ఉంటూ తన వాళ్ళనకునేవారికోసం మొహం వాడిపోయినా వారికి ముఖం చిన్న బోయేలా, మనసు ముడుచుకునేలా అందించిన చేదు అనుభవాలు ఎన్నో, ఎన్నెన్నో నిట్టూర్చాడు మూర్తి. వారిద్దరి సంభాషణని భంగపరుస్తూ విమానం ముందునుంచి ఎదోకలకలం వినిపిస్తూంది. ముగ్గురులో నాయకుడు కాబోలు, అందర్ని ఉద్దేశించి ప్రకటిస్తాడు. "మేము ఈ విమానాన్ని హైజాక్ చేస్తున్నాం, గొడవ చేయ్యకుండా మేము చెప్పినట్టు చేస్తే ఎవ్వరికీ ఏ ప్రమాదం ఉండదు. ముందుఅందరూ మీ మీ పాస్ పోర్ట్లన్ని తీసి మా వాడికి ఇవ్వండి"అని ఆదే శిస్తాడు. బుసలు కొడుతూ తిరుగుతున్న నాయకుడిని చూస్తూ ఎదో గొణుక్కుంటాడు అజయ్. "ఏంట్రీ పోజు? మా గవర్నమెంటుకీ సంగతి తెలియగానే నీపని పట్టకపోతే చూడు అంటాడు. ఇంతలో ఒక హైజాకర్ అజయ్ పక్కకి వచ్చి నుంచున్నారు ఈ పాస్ పోర్టు నీదేనా కర్క శంగా"అడుగుతాడు నాతోరా! అంటూ దారి తీస్తాడు హైజాకర్ యాంత్రికంగా అతని వెనకాల అజయ్ వెళ్తాడు.

ఈ వేళ అగ్రరాజ్యంగా పేర్కొంటున్న అమెరికా ఉగ్ర వాద సమస్యను ఎదుర్కొవలసి వస్తుంది. పెంటగాన్ ఘటన, కాందహార్ సంఘటన ఈ కథ చదివితే మరోసారి జ్ఞాపకం వస్తాయి. దీనిని బట్టి ఉగ్రవాదులను నిరోదించాలి. ఈ భాద్యత సమాజంలో ఉన్న ప్రతి పౌరుడి లక్ష్యంగా గుర్తించాలి.

జీవితంలో అత్యధిక భాగం విదేశిగడ్డపై గడిపిన ఒక భారతీయుడు, జీవితపు చివరి దశలో స్వదేశానికి వచ్చి తన దేశాభిమానాన్ని ఎలా చాటుకున్నాడో ఈ కథ తెలియజేస్తుంది.

### పన్నెండు పంపుల కథ :

ఈ కథను వేలూరి వేంకటేశ్వరరావురాశారు. ఈయన ఏలూరు నివాసి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. ప్రతి సంవత్సరం ఒకసారి తన సొంత ఊరికి వచ్చివెళ్లేవాడు. ఒకప్పుడు తన ఊరిలో ఉన్న పరిస్థితులకి, ప్రస్తుత పరిస్థితులకి పోలిక చేస్తూ ఈ కథ రాశాడు. మారుతున్న కాలంతోపాటు ఏలూరులో వచ్చిన మార్పుల గురించి, నీటికోసం పడుతున్నపాట్ల గురించి తన ఆవేదన ఈ కథ ద్వారా రచయిత వ్యక్తపరిచాడు.

తన చిన్న తనంలో ఊరిలో ఒక వీధిలో పన్నెండు నీటి పంపులు ఉండేవట. ఆ పంపుల ద్వారా నీరు ధారా ళంగా వచ్చేదట. ప్రొద్దున్నే ఆ వీధిలోని స్త్రీలు బిందెలతో పంపుల దగ్గరకు వచ్చేవారు. ఊళ్ళోని విషయాన్నీ అక్కడ వాళ్ళు చర్చించుకునేవారు. వారిమధ్య పరస్పరం ఆదరాభిమానాలు ఉండేవి. రచయిత తన ఈ అనుభ వాన్ని ఇలా వ్యక్తపరిచాడు. "ఏ పచ్చడి ఎలా చెయ్యాలో, ఏ కూరలో ఏ తాలింపు బాగుంటుందో, ఎవరికి మనవ రాలు పుట్టిందో, ఎవరబ్బాయి రంగం పారిపోయి అక్కడ పిల్లని పెళ్ళిచేసుకుంటానని బెదిరించాడో %--% ఒకటేమిటి, అందరి సమస్యలూ అందరూ చర్చించు కోవడం ఆనవాయితీ. ఏ రోజన్నా ఎవళ్ళన్నా మంచి నీళ్ళకి రాకపోతే అందరికీ ఆదుర్దాగా ఉండేది" ఈ మాటల్ని బట్టి నాడు ప్రజలమధ్య సత్సంబంధాలు, ఆప్యాయతలు ఉండేవని తెలుస్తుంది. కారణం నీరు సమృద్ధిగా దొర కడం, పంపుల దగ్గర నీరు ధారగా రావడం వల్ల అందరికీ నీరు సరిపోయేది. వంతుల కోసం ఎవరూ దెబ్బలాడేవారు కాదు. ప్రస్తుతం ఆ ఊళ్ళో ఈ పరిస్థితి మారిపోయిందని రచయిత ఈ కథలో తెలియజేశాడు. వీధిలో పన్నెండు నీటి పంపులు మాయమైపోయాయి. ఇంటికొక కుళాయి వచ్చింది. కానీ నీళ్ళు రావు డబ్బుపెట్టి నీటి డబ్బాలు కొనుక్కోవాలి.

ఒకవేళ ఎక్కడైనా పంపు ఉంటే నీటికోసం ఆడ వాళ్ళు పోటీ పడటం, గొడవలు ప్రస్తుతం తన గ్రామంలో కనిపిస్తున్నాయట. చెరువుల్ని భూస్వాములు సొంతం చేసుకొని అపార్ట్ మెంట్స్ కట్టిస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు నీటికోసం పడేపాట్లను రచయిత ఇలా తెలిపారు. "మా పక్క లాయరు గారింట్లో రెండు పంపులున్నాయి. ఎండా కాలంలో గొట్టాలోకి నీరెక్కదు, ఎవడికీ చెప్పచెయ్య

కుండా దొంగతనంగా మోటరెడితే కానీ వానాకాలంలో రోడ్డుమీద సప్లై పంపు గొట్టాల్లోకి మురిక్కాలవల మురుగు ఎక్కేసి, పంపుల్లో వచ్చే దోసిలి నీళ్ళు దొడ్డోకెళ్ళి కాళ్ళు కడుక్కోటానికి కూడా పనికిరావు" అని ఈ కథా రచయిత తన ఆవేదన వ్యక్తం చేసుకున్నాడు. ఒకప్పుడు తమ వీధి పన్నెండు పంపులతో అందరికీ నీరు అందించేది. ప్రస్తుతం అదే నీటిని అంగళ్ళలో కొనాల్సివస్తుందని రచయిత తన స్వగతాన్ని ఈ కథలో చిత్రించారు.

పన్నెండు పంపుల కథ మన సంస్కృతీ సంప్రదాయాలకి సంబంధించిన విషయాలు ఉన్నాయి. యాభై సంవత్సరాల క్రితం ఉన్న పన్నెండు పంపుల వీధి గురించి తెలుపుతూ ఏలూరులో ఒక వీధి చరిత్రను తెలుపుతుంది ఇది. ఏలూరుకు ఆ పేరు ఎలా వచ్చిందో తెలిపారు. ఏరులూరు అన్న పేరు ఏళ్ళూరు అయి ఏలూరు అయిందని, దానిని పండితులెవరో హేలాపురి అని సంస్కృతీకరించారని ఇలాంటివి తెలియని వారికి తెలియజేశారు. రచయిత నిజానికి ఈ కథలో వర్ణనలు కూడా చాలా తక్కువ వాస్తవ సంఘటనలతో రాశారు. ఈ కథ చదవడానికి ఆసక్తికరంగా ఉంది. తెలుగుదనం ఉట్టి పడుతుంది. ముఖ్యంగా ఇది నీటి ప్రాధాన్యతను తెలుపుతుంది. మంచినీరు ఎంత ఎక్కువగా దొరుకుతుందో పశ్చిమ గోదావరి జిల్లాలో అంత ఎక్కువ నీరు వృథాచేసి నీటిమీద ఆధారపడుతున్నారని తెలుపుతూ రాశారు.

## సిరిచుక్క :

అమెరికాప్రవాసంలో ఉన్న భారతీయురాలు ఆమె మధుర స్మృతులను తలచుకుంటూ, అప్పటి కష్ట సుఖాలతో పోల్చి చూస్తూ, ఇప్పుడు మారుతున్న విద్యావిధానాలను, పిల్లల నడవడికను తెలుపుతూ శ్యామలదేవి దశిక రాసిన కథ ఇది.

గతాన్ని మధురస్మృతిగా మార్చి మననం చేసుకోవటం ప్రతిఒక్కరిలోనూ ఉంటుంది. మరీముఖ్యంగా ప్రవాసాంధ్రులలో తలెత్తే పరిస్థితులు అలాగే వారి పిల్లలు చదువుల విషయంలో వారు ప్రతిదానికి టీచర్లను తప్పు పట్టడం చేస్తారు. కాని ఆ రోజుల్లో 1966 ఆ కాలం మాస్టార్లను ఎదిరించడం కాని, తల్లిదండ్రులకు ఉపాధ్యాయుడు కోసం పిర్యాదు చేయడంకాని ఉండేదికాదు. ఈ రోజుల్లో దానికి భిన్నంగా ఉంది. ఒకప్పుడు చదువులకు ఇప్పటి పిల్లలుకొంచెం బడిలో కష్టమనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు పిర్యాదు చేస్తారని రచయిత ఈ కథను ముగించారు.

## ముగింపు :

మధుర స్మృతులను,మాతృభూమిపై మమకారాన్ని, ప్రాంతీయా అభిమానాన్ని, బంధుప్రేమను, భారతీయ పౌరసత్వాన్ని మరచిపోకుండా అమెరికాలో ఎన్నో కష్టాలు పడుతున్నాగాని మన ప్రవాస భారతీయులు చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోలేక పోతున్నారు. ఏ దేశంలోనున్నా, అక్కడ ఏ స్థాయిలోనున్నా, భారతీయులు తమ మాతృదేశపు జ్ఞాపకాలను గుండెల్లో పదిలంగా భద్రపరుచుకొని ఉంటున్నారనిఈ పై కథలు తెలుపుతున్నాయి. అమెరికాలో స్థిరపడిన ఓ వ్యక్తి తాను చిన్నప్పుడు మాతృదేశంలో తన ఇంటి ప్రేమ, అప్యాయతలను, తనకున్న అనుబంధాలను నెమరువేసుకోవడం ఈ అమెరికా కథల్లో మనకు కనిపిస్తుంది.పరదేశంలో ఎన్నో కష్టనష్టాలు, ఎత్తుపల్లాలను చవిచూసి గతాన్ని తలచుకుని,అమ్మప్రేమను, అమ్మజ్ఞాపకాలను మరువలేని విధానాన్ని ఈ కథల ద్వారా తెలుసుకోవచ్చు. ఏదైమైనా గాని మన మాతృభూమి గొప్పదని ఈ కథలు తెలియజేస్తున్నాయి.

## ఆధార గ్రంథాలు :

1. అమెరికా తెలుగు కథా సాహిత్యం - ఒక సమగ్ర పరిశీలన
2. అమెరికా తెలుగు కథలు - సామాజిక విశ్లేషణ
3. అమెరికా తెలుగు కథలు - నాల్గవ సంకలనం
4. అమెరికా తెలుగు కథలు - ఐదవ సంకలనం
5. అమెరికా తెలుగు కథలు - ఏడవ సంకలనం
6. అమెరికా తెలుగు కథలు - ఎనిమిదవ సంకలనం
7. అమెరికా తెలుగు కథలు - తొమ్మిదవ సంకలనం
8. అమెరికా తెలుగు కథలు - పదవ సంకలనం
9. అమెరికా తెలుగు కథలు - పదకొండవ సంకలనం

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# 'మాలపల్లి' - దేశభక్తికి నిర్వచనం

-డా॥ ఎ.ఎ. నాగేంద్ర, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురము.

'మాలపల్లి' నవలా రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ (1877-1958) మొదటి స్వాతంత్ర్య ఉద్యమం అణచి వేయబడిన తర్వాత భారతజాతీయ కాంగ్రెస్ ఏర్పడక ముందు - ఈ మధ్యకాలంలో భారతమాత ముద్దుబిడ్డగా ఉన్నవ లక్ష్మీనారాయణ జన్మించారు. సంఘసంస్కరణ ఉద్యమం బలంగా కొనసాగుతూ, స్వాతంత్ర్యోద్యమం మొలకదశగా ఉన్న నేపథ్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణ తెలుగుబిడ్డగా పుట్టాడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుపాలై, రచయితగా ఎదిగి అర్థవంతమైన జీవితాన్ని గడిపాడు ఉన్నత లక్ష్మీనారాయణ. ఆయన మీద కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'సంఘ సంస్క రణోద్యమం', గాంధీజీ గారి 'స్వాతంత్ర్యోద్యమం', 1917 నాటి 'రష్యన్ విప్లవం' ఈ మూడు ముప్పేటగా ప్రభావం చూపించాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి జీవితాన్ని, ఆయన సాహిత్యాన్ని పరిశీలిస్తే, ఆయన దేశభక్తి సంకుచితమైనది కాదని, చాలా విశాలమైనదని అర్థమవు తుంది. ఆయనదృష్టిలో కేవలం వలసపాలన పోయి స్వపరిపాలన రావడమే స్వాతంత్ర్యం కాదు. ఈ రాజకీయ కోణంతోపాటు భారతదేశం అనాదిగా అనుభవిస్తున్న సాంఘిక వివక్షతలు, ఆర్థిక అసమానతలు కూడా నశిం చడం అసలైన స్వాతంత్ర్యం. ఉన్నవ లక్ష్మీనారాయణ కోరు కున్న స్వాతంత్ర్యం విశాలమైనది, శాస్త్రీయమైనది. భారత దేశం అన్ని రకాలుగాను ఆధునిక దేశంగా ఎదగడం ఆయన ఆకాంక్ష. ఈ ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి ఉన్నవ లక్ష్మీనారాయణ ఒకవైపు బ్రిటిష్ వ్యతిరేక రాజకీయ ఉద్యమంలో పాల్గొంటూనే అనేక సంస్కర ణోద్యమాలు కూడా నడిపాడు.

1920-22 నాటి గుంటూరు ప్రాంత జీవితాన్ని వస్తువుగా తీసుకొని నవలగా రాశారు ఉన్నవ లక్ష్మీనారా యణ. అంటే గాంధీజీ రాజకీయాలలోకి ప్రవేశించిన తొలినాటి భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులే 'మాలపల్లి' నవలలో వస్తువు. మానవ జీవితాన్ని సమగ్రంగా చిత్రించే వచన ప్రక్రియ నవల అని విద్వాం సులు చెప్పిన నిర్వచనానికి తొలి తెలుగు ఉదాహరణ 'మాలపల్లి'. ఉన్నవ లక్ష్మీనారాయణ కన్నా ముందు తల్లాప్రగడ సూర్యనారాయణ గారి 'హేలావతి', వేంకట పార్వతీశ్వరకవుల 'మాతృమందిరం' ఈ రెండు నవలల్లో దళితుల జీవితాలు చిత్రింపబడ్డాయి. ఆ రెండు నవలలు దళితులు ఇస్లాం, క్రైస్తవ మతాలలోకి వెళ్ళిపోవటాన్ని అందుకు కారణాలను చిత్రించాయి. 'మాలపల్లి' నవల వాటికన్నా చాలా విశాలమైన దృక్పథంతో గాంధీమహాత్ముని నాయకత్వంలో నడుస్తున్న స్వాతంత్ర్యోద్యమాన్ని దానితో పాటు ఇతర ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను కూడా చిత్రించింది. ఒక దళిత కుటుంబం ఆధారంగా ఒక సమగ్రమైన నవల రావడం అప్పటికి విప్లవమే.

'మాలపల్లి' నవలలో రెండు రకాల ఉద్యమాలు ప్రతి బింబించాయి. అవి: 1) భారతదేశంలో గాంధీజీ నాయ కత్వంలో కొనసాగుతున్న 'స్వాతంత్ర్యోద్యమం', 2) 'రష్యన్ విప్లవ' ప్రభావం ప్రపంచ దేశాల మీద పడి కొనసాగుతున్న సామ్యవాద ఉద్యమం ఉన్నవ లక్ష్మీనారాయణ గారు స్వయంగా గాంధేయవాది. గాంధీజీ సంకల్పించిన హరిజ నోద్ధరణ, మహిళా జనోద్ధరణకు విశేషంగా కృషిచేశారు. ఆయన నిజాయితీ గల రచయితగా, ప్రపంచ పరిణా మాలన్నింటినీ అధ్యయనం చేసిన వ్యక్తిగా, సామ్యవాద ఉద్యమాలను కూడా తన నవలలో ప్రతిబింబించాడు.

రామదాసు ఒక దళితరైతు, ఆయుర్వేద వైద్యుడు, గాంధేయవాది, అచలసిద్ధాంతవేత్త. ఆయనకు వెంకట దాసు, సంగదాసు, రంగదాసు అనే కుమారులు ఉన్నారు. చౌదరయ్య మంగలాపురం భూస్వామి. రామదాసు, వెంకటదాసు సొంత పొలంలో పనిచేసుకుంటూ వుంటారు. సంగదాసు చౌదరయ్య ఇంట్లో జీతగాడుగా పనిచేస్తూ ఉంటాడు. సంగదాసు జీతగాడుగా ఉన్నా గొప్ప

సంస్కారవంతుడు. గాంధీజీ సిద్ధాంతాను జీర్ణించుకున్న వాడు. చౌదరయ్య కొడుకు రామానాయుడుతో స్నేహ పూర్వకంగా ఉంటాడు. భూస్వామి కొడుకైన రామా నాయుడుకు శ్రమ అంటే ఏమిటో, దానికి దక్కుతున్న ఫలమేమిటో తెలియజేస్తాడు. ఇద్దరూ కలసి ఒక రైల్వేస్టేషన్‌లో భోజనం చేసి విజయవాడలో జరిగే కాంగ్రెస్ మహాసభలకు వెళతారు. అక్కడ గాంధీగారి కార్యక్రమంలో వాలంటీర్లగా పాల్గొంటారు. అదివరకే గ్రామంలో కూలీలకు కూలీ పెంచమని సంగదాసు ఉద్యమం లేవ దీసి విజయం సాధించి వుంటాడు. ఇది చౌదరయ్యకు, ఇతర రైతులకు కంటగింపుగా తయారైంది. తన కొడుకుతో కలసి ఒకేచోట భోజనం చేయడం, అతన్ని రాజకీయ సభలకు పిలుచుకుపోవడం తెలిసి చౌదరయ్య ఆగ్రహోదడవుతాడు. అందుకే విజయవాడ సభనుంచి సంగదాసు ఇంటికి తిరిగిరాగానే చౌదరయ్య అతన్ని రోకలిబండతో కొట్టి చంపేస్తాడు. డబ్బు ఖర్చుపెట్టి కేసు ల్లోంచి తప్పించుకుంటాడు. ఈ హత్య జరిగిన తరువాత వెంకటదాసు ఇంటి నుంచి అదృశ్యమైపోయి 'తక్కెళ్ళ జగ్గడు' అనే పేరుతో ఉద్యమకారుడై 'ధర్మకన్నాలు' వేయడం మొదలుపెడుతాడు. ఎవరిదగ్గరైతే అవసరానికి మించి తిండిగింజలు వున్నాయో వాళ్ల ఇంట్లోకి ప్రవేశించి ఆ ఇంట్లో వున్న మనుషులకు సరిపడనన్ని గింజలు వదిలిపెట్టి తక్కిన గింజలను ఎత్తుకుపోయి తిండిలేక బాధపడుతున్న వారికి అందించడమే 'ధర్మకన్నం'.

ఇలా ఈ నవలలో సంగదాసు గాంధీజీ చెప్పిన సత్యం, అహింసలకు ప్రతినిధి కాగా, వెంకటదాసు విప్లవవాదానికి వారసుడు అవుతాడు. సంగదాసును భారతీయ భూస్వామి చంపివేయగా, వెంకటదాసును బ్రిటిష్ ప్రభుత్వం చంపివేస్తుంది. రామదాసు కూతురు జ్యోతి అనే అమ్మాయి వలస సైనికుల బారినుండి తప్పించుకోబోయి కృష్ణా నదిలో దూకి చనిపోతుంది. చివరికి మిగిలింది రామ దాసు. రామదాసు గాంధేయ మార్గంలో జీవనం గడు పుతూ, అచలవేదాంతాన్ని ఒంటబట్టించుకొని శేష జీవి తాన్ని గడుపుతాడు. గాంధేయవాదిగా ఉన్నవ లక్ష్మీ నారాయణ విప్లవవాదంలో వున్న నిజాయితీని, త్యాగాన్ని గుర్తిస్తూనే రక్తపాతంతో కూడిన విప్లవోద్యమాన్ని వ్యతి రేకించాడు. వ్యక్తి సంస్కారంతో కూడిన గాంధీజీ మార్గాన్ని సమర్థించాడు. భారతస్వాతంత్ర్యోద్యమంలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు గాంధీ మార్గంలోనే పాల్గొన్నారు. గాంధీజీ ప్రబోధించిన సత్యం, అహింస అనే సిద్ధాంతాలు రామదాసులో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. వలస పాలకులు ఎంత హింసించినా, ఆ హింసను రామదాసు అహింసతోనే ఎదుర్కొన్నాడు. వలస పాలకులు అనుసరించిన మత మార్పిడి విధానాన్ని తన వాదనా పటిమతో ఓడించాడు. తన కొడుకులిద్దరూ హింసాత్మకంగా చంపబడినా చలించ లేదు. కూతురు నదిపాలైనా చలించలేదు. 'కాన్సన్‌ట్రేషన్' క్యాంపులలో వలస పాలకులు ఎన్ని బాధలు పెట్టినా భరించాడు. చివరికి దేశానికి స్వాతంత్ర్యం రావడం కళ్లారా చూసి మరణించాడు. ఒకరంగా 'మాలపల్లి' నవలలో ఉన్నవ లక్ష్మీనారాయణ 'గాంధీయన్ సోషలిజం' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడని చెప్పవచ్చు.

నవల ప్రారంభంలోనే రామదాసు తన జొన్న చేనులోకి వచ్చి మంచెఎక్కి చేనంతా ఒక్కసారి తేరిపార చూసి జొన్న కంకులలో వున్న ఎక్కువ, తక్కువలను గమనించి ఇలా అనుకుంటాడు. "వెనుక జిక్కిన జాడుబోడు గూడా పండితేనే గాని పాలి వుండదు. ముదు మొక్కే వచ్చిన యే పదికర్రలో పండితే యేమి ప్రయోజనం." అంటే రామదాసు పాత్ర ద్వారా నవల ప్రారంభంలోనే రచయిత సమసమాజాన్ని ప్రతిపాదించాడు. అయితే ఆ సమాజం గాంధీజీ చెప్పిన మార్గంలో శాంతియుతంగా సిద్ధించాలని, విప్లవోద్యమం చెప్పినట్లు హింసాయుతంతో కాదని ఉన్నవ లక్ష్మీనారాయణ ప్రబోధించాడు. అస్పృశ్యతను ఉన్నవ లక్ష్మీనారాయణ ఖండించాడు. ఆర్థిక అసమానత లను వ్యతిరేకించాడు. గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యాన్ని ఆహ్వానించాడు. ఆధునిక భారతదేశాన్ని కలగన్నాడు.

# బసవ పురాణం - కన్నప్ప పాత్ర

- డా. జరుపుల రమేష్, తెలుగు శాఖాధిపతి, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ఖమ్మం.

తెలుగు సాహిత్యం మొదలై అనేక శతాబ్దాలు గడిచి పోయింది. సాహిత్యంలో అనేక భిన్న కోణాలు వెలుగులోకి వచ్చాయి. నేడు ప్రాచీన సాహిత్యంలో కొత్త కోణాలు గుర్తిం చవలసిన అవసరం ఉంది. కాలం మనిషిని నిర్ణయిస్తుంది. మనిషి కాలాన్ని నిర్ణయించలేడనే సత్యాన్ని గుర్తుంచు కోవాలి. కాల ప్రభావం వల్ల వచ్చిన సాహిత్య మార్పే కన్నప్ప పాత్రచిత్రణలో కొత్త కోణం. ఆ కోణాన్ని గిరిజన సంస్కృతి పరంగా నిరూపించడం ఈ పత్రం ఉద్దేశం.

### పరిచయం :

పాత దారులు తొక్కుకుంటూ ముందుకు నడవడం సాధారణమే! అలా కాకుండా కొత్త దారులను వేయడం కష్టమైన పనే! అయినా దాన్ని ఇష్టమైన పనిగా భావించాడు పాల్కురికి సోమనాథుడు. ఆ దారుల్లో ద్విపదనే ఛందస్సును తెలుగు వాళ్ళకు పరిచయం చేసి, తన జీవి తాన్ని సార్థకం చేసుకున్న గొప్ప కవి పాల్కురికి. పాల్కురికి సోమనాథుడు రాసిన కావ్యాలే ఆయనకు స్థిరస్థానాన్ని ఇచ్చాయి. పాల్కురికి రాసిన ద్విపద కావ్యం బసవ పురాణం. బసవ పురాణం ఇతివృత్త పరంగా, పాత్రల పరంగా గొప్పగా రాసిన మహాకావ్యం. అనేక పాత్రలు గల ఈ కావ్యంలో కన్నప్ప పాత్రని ప్రత్యేకంగా పరిశీ లించాలి.

### బసవ పురాణంలో కన్నప్ప :

శ్రీకాళహస్తి పర్వత ప్రాంతంలో ఉడుమూరి కన్నప్ప అనే చెంచు భక్తుడు ఉండేవాడు. శివభక్తులలో ఘనతర మైన కీర్తి పొందినవాడు. అతడు ఒక రోజున జంతువులను వేటాడడానికై ఇతర ఎరుకల వారితో కలిసి, ఆ తీర ప్రాంతంలోని అడవికి వెళ్లి, వేటాడి వేటాడి అలసిపోతాడు. కన్నప్ప నిద్రలో ఉండగా పరమేశ్వరుడు ఒక తపస్వి వేషంలో కలలో కనిపించి ముందుకు పోతే నీకు మహా లింగం కనిపిస్తుందని చెప్పి అదృశ్యమౌతాడు. కన్నప్ప అలానే చేశాడు. లింగం కనిపిస్తుంది. పూజాదికాలు లేని ఆ లింగాన్ని చూసి బాధపడి స్వామికార్యం చేయడానికి పూనుకుంటాడు. గిరిజన ప్రాంతంలో లభించే అనేక రకాల తేనెను, ఇప్పపువ్వును, కందమూలాలను వెదికి తెచ్చి అర్పిస్తాడు.

మృగాలను వేటాడి చంపి, వాటిని ముక్కలు చేసి, వండి, సువర్ణముఖి నది నీటిని పుక్కిట బట్టి స్వామికి అభిషేకం చేయడంతోపాటు, మాంసపు ఖండాలను నైవేద్యంగా సమర్పిస్తాడు. వాటిని చూసి శివబ్రాహ్మణుడు అసహ్యించుకొని, కన్నప్పను చంపాలనుకుంటాడు. చివరికి పరమశివుడే కన్నప్ప ముగ్ధభక్తిని బ్రాహ్మణుడికి తెలియజేయాలనుకున్నాడు. ఆ ఉద్దేశంతో మూడు నేత్రా లను ధరించి, ఎడమ కంటి నుండి కన్నీరు కార్చడం, దాన్ని కన్నప్ప చూసి, 'నా కన్నే నీ కన్నుకు మందు, నా మంచి కన్ను తీసి నీ జబ్బు కన్నులో ఉంచుతాను' అని ఒక వాడి బాణంతో కన్నును తీసి శివుడికి అర్పిం చడం,అలా రెండవ కన్నును కూడా సమర్పించబోతుండే శివుడే ప్రత్యక్షమవడం జరుగుతుంది. ఇది చూసిన శివబ్రాహ్మణుడు రహస్యంగా బయటికి వచ్చి కన్నప్పకు సాష్టాంగ నమస్కారం చేసి, కన్నప్పతో నీ భక్తి తెలియక కీడు తలపెట్టాను. క్షమించమని అడుగుతాడు. శివుడు అపారవాత్సల్యంతో కన్నప్పను ఆలింగనం చేసుకొని, ఏదైనా కోరిక కోరుకోమంటాడు. అప్పుడు కన్నప్ప శివుని పాదపద్మాలకు నమస్కరించి, 'స్వామీ! మోక్షమంటే నేనెరుగను. కోరికలంటే ఏమిటో తెలియదు. నాకు తెలిసిందల్లా ఒక్కటే! నా కంటి చూపులో నిలిచివుంటే చాలు! నాకు ఆ ఒక్క వరం మాత్రం ప్రసాదించు' అంటాడు. దాన్ని శివుడు అలాగే అని చెప్పి అడిగిన వరం ఇవ్వడంతో ఈ పాత్ర చిత్రణ ముగుస్తుంది.

### గిరిజన సంస్కృతి - కన్నప్ప :

భిన్నత్వంలో ఏకత్వం కల్గిన దేశం మనది.ఈ దేశంలో

గిరిజనుల స్థితి ఏమిటి! దేశ వ్యాప్తంగా, ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు నివసిస్తున్నారు. వారిలో చెంచు, ఎరుకల, యానాది, గోండు, లంబాడా మొదలైన తెగలున్నాయి. నాటి నుండి నేటి వరకు వారి జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదనిపిస్తోంది. అందుకే పాల్కురికి చిత్రించిన కన్నప్ప పాత్రను గిరిజన సంస్కృతిలో భాగంగా పరిశీలిస్తే అనేక విషయాలు తెలుస్తున్నాయి.గిరిజనుల పుట్టుక, సంస్కృతి గురించి ప్రముఖ రచయిత బాలగోపాల్ అభిప్రాయాన్ని గమనించినట్లయితే "గిరిజనులు అనగానే తలలో ఈకలు, మొలలో గజ్జెలు ఉండే విచిత్ర జీవులని సామాన్య నాగరికులు భావిస్తారు. ఎక్కడో అడవులలో నివసిస్తూ తెల్లబట్టలు కనబడగానే పారిపోయే భయస్తులు అని కొంత చదువుకున్న వాళ్ళు భావిస్తారు. గిరిజనుల మాటల్లో చెప్పాలంటే వాళ్ళు తమను తాము 'కొండమనుషులు' గాను 'అడవి మనుషులు' గాను వర్ణించుకుంటారు. ఈ రకంగా చూస్తే వాళ్ళకు మనం పెట్టుకున్న గిరిజనులు, ఆటవికులు అనే పేర్లు వాళ్ళ చైతన్యం యొక్క సంస్కృతీ కరణే" అనే అభిప్రాయం వెయ్యేళ్ళ గిరిజన జీవితానికి అద్దం పడుతుంది.

గిరిజన తెగలో చెంచువాళ్ళ జీవనవిధానాన్ని చూస్తే అలాంటి పరిస్థితే కనిపిస్తుంది. నాడు పాల్కురికి కన్నప్పను చెంచువాడుగా చిత్రించాడు. కన్నప్పలో ఎలాంటి జీవన విధానం కనిపించిదో, నేడు కూడా అవే పరిస్థితులు కని పిస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో జీవిస్తున్న చెంచులు కన్నప్ప లాగే వేటవృత్తినే కొనసాగిస్తున్నారా? లేదా మారిన కాలానికి అనుగుణంగా వృత్తిని మార్చుకున్నారా? కన్నప్ప కాలంలో ఉన్న వాటికి, నేటి కాలపు చెంచుల సామాజిక పరిస్థితులు ఏమిటి? పాల్కురికి కన్నప్పను అంత గొప్పగా ఎందుకు చిత్రించాడు? అనే విషయాలను చూడాలి.

**వేషధారణ :**

మానవ ప్రపంచంలో అత్యధిక సంఖ్యాకులు అందాని కన్నా అవసరానికి బట్టలను హెచ్చుగా వాడుకుంటారు. మనిషికి కూడు తర్వాత కావల్సింది గుడ్డ. ఈ గుడ్డలే శీలాన్ని కాపాడతాయి. గౌరవాన్ని పెంచుతాయి. కూటికి గతిలేని బీదవారు ఏదో చింపిరి గుడ్డల్తో కాలాన్ని వెళ్ళ బుచ్చుతుంటారు. డబ్బులున్న వారు విలువైన వస్త్ర ధారణతో అలరారుతుంటారు. అయితే ఎటువంటి దుస్తులు ధరించినా అవి దేశ, జాతి, కుల, తెగల, ఆచార సంప్రదాయాల్ని ప్రతిబింబింపజేస్తాయి. వస్త్రధారణ వల్ల కలిగే ప్రయోజనం గురించి అనుశీలన జరిపి పెటబొగటి రెట్ "Peter bogatyrer categorizesmigical, religious, and national, age group erotic, and every day fan citrons off traditional affine the form of the costume reflects its particular function" అని అన్నారు. వస్త్రధారణ స్త్రీ పురుష భేదాల్నేకాక బాల, యవ్వన, ముత్తైదు, విధవ విభేదాల్ని ప్రత్యేకించి చూపు తాయి. ఇంతేకాక పండుగలు, వివాహం, ఉత్సవాల సంద ర్భాల్లోని దుస్తుల్లో కూడా భేదాలు కన్పిస్తాయి. గిరిజనులు వేసుకున్న వస్త్రధారణను చూడగానే ఇట్టే చెప్పవచ్చు.

బసవ పురాణంలో కన్నప్ప ధరించిన దుస్తులు, వేసుకున్న చెప్పులే గిరిజనేతరులకు అపవిత్రం అనిపిస్తే, అవి స్వయంగా దేవుడికే పూజ్యంగా అనిపిస్తాయి. పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో కన్నప్ప వేష ధారణను ఆ కాలంలో అలా చిత్రిస్తే, చెంచుల వేషధారణ ఇంచుమించుగా నేటికి అలాగే ఉంది. కాలం మారినా జీవితాల్లో మార్పు రాలేదు. దాంతోపాటు వారి వృత్తిలో కూడా మార్పులేదు. అదే వేట, అదే కూలీ. ఇంకా వెయ్యేళ్ళ అయినా చెంచుల జీవన విధానంలో మార్పు రాదేమో! అనిపిస్తోంది.

**ఆహారపు అలవాట్లు :**

ఆహార పద్ధతులు మనిషి జీవించే పరిసరాల్ని బట్టి వేరు వేరుగా ఉంటాయి. ప్రాచీన శిలాయుగంలో ఆదిమ మానవుడు పంటలు పండించి ఆహార సంపాదించుకొనే వాడు. తెలియని దశలో అడవిలో దొరికే దుంపలు, ఆకులు, కాయలు, పళ్ళు పోగు చేసుకొని పొట్టనింపు కునేవాడు. ఆనంతరం జంతువులను జలచరాలను వేటాడి జీవించేవాడు. ప్రకృతిలో దొరికే ఆహారంతో జీవించే వారికి ఆనాడు ఆర్థిక విధానం ఆహార సంగ్రహణమనే

చెప్పాలి. కొందరు మానవ శాస్త్రజ్ఞులు ఆహారసేకరణ తెగలను రెండు రకాలుగా విభజించారు. "1. సామాన్య ఆహార సంగ్రాహకులు 2. అభివృద్ధి చెందిన ఆహార సంగ్రాహకులు"

బసవ పురాణంలో కన్నప్ప ఆహారపు అలవాట్లును ప్రత్యేకంగా చిత్రించకపోయినా, దేవుడికి అర్పించే ఆ ఆహారపు విధానాన్ని చూస్తే..."మా పల్లె గలదెల్ల సుఖము/ అడవుల మనంబిళ్ళ కడు మంచి పాలు/ నాడిసిలి పాసెంటు నుడువ నేతులును/ విప్పపూవును దేనె లెల్ల ఫలాదు/ లొప్పెడు వెదురు బ్రాలోగిరంబులును/ మఱి యట్లు గాక నీ మనసు వచ్చినను/ నెఱచులు గఱకుట్టు లెన్నేని గలవు/ రావయ్య"(బసవపురాణం) అని వర్ణించాడు. మా పల్లెకు వస్తే నీకు పరమ సౌఖ్యం లభిస్తుంది. అడవుల్లో మనంబిళ్ళున్నాయి. మాకు చాలా మంచిపాలు దొరుకు తాయి. కమ్మని నెయ్యి సమృద్ధి మాకు, ఇప్పపువ్వు కొల్లలు, రకరకాల తేనెలు, రకరకాలైన పండ్లు, వెదురుబియ్యపు అన్నం ఎంత రుచికరమో నీవే చూస్తావు! ఇవే కాక నీకు మనసైతే పరమ రుచ్యమైన మాంసాలెన్నో లభిస్తాయి. కరకుట్లు కాల్చి పెడతాము. ఓ దేవదేవా! రావయ్యా! మొక్కుతాను. ఎందుకు కడుపుమాడి పేవులు నకనక లాడగా ఇక్కడ పడి ఉంటావు? అంటూ సాగిలపడతాడు.

చెంచువాళ్ళులో గానీ, మిగిలిన గిరిజన తెగల్లో కాని ఆహారనియమాలు కన్నప్ప వివరించినట్లే ఉంటాయి. ఇప్పపువ్వు వారి జీవనవిధానంలో కీలకమైంది. దీనికోసం పడిగాపులుగాసి, అడవి నుండి తెచ్చుకుంటారు. తేనె కూడా అంతే! వాటిని కష్టంగా కాకుండా, ఇష్టంగా సమర్పించడానికి కన్నప్ప వ్యవహరించిన తీరు గిరిజనుల మంచిమనస్సుకు నిదర్శనంగా కనిపిస్తుంది.

### కన్నప్ప భక్తితత్త్వం :

"శ్రవణం కీర్తనం విష్ణో: స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్"
అంటూ నవవిధ భక్తి మార్గాలను పేర్కొన్నారు పండితులు. బసవపురాణంలో కన్నప్ప పాటించిన భక్తిమార్గం నవ విధాలుతో పాటు ముగ్ధభక్తి మార్గం కనిపిస్తుంది. లోకంలో ఉన్న వాటితో ఎవరైనా సంతృప్తి చెందడం చూస్తుంటాం. కానీ, పాల్కురికి దానికి విరుద్ధంగా మూఢ భక్తి మార్గాన్ని ఎన్నుకున్నాడు. సాధారణంగా గిరిజన తెగల్లో ఒక ఆచారం ఉంది. కొత్త వాళ్ళు ఎవరైనా తమ ప్రాంతాల్లోకి వస్తే, వాళ్ళను నమ్మరు. పైగా తమ రహస్యాలను చెప్పడానికి ముందుకురారు. అంతేకాకుండా గుడారాల్లోకి కూడా రానివ్వరు. ఇక్కడ కన్నప్ప వేటకు వెళ్ళిన తర్వాత అప్పటి వరకు తనలో దాగి ఉన్న మూఢభక్తి బయటికి వచ్చింది. ఒకవేళ ఆ రోజు వేటకు వెళ్ళ కుండా ఉండి ఉంటే కన్నప్పలో ఉన్న భక్తి బయటికి వచ్చేదా? అనే సందేహం విమర్శకులకు వస్తుంది. కానీ, కన్నప్ప ఎవరికి సాధ్యం కానీ భక్తిని ప్రదర్శించి, ఏకలవ్యుడికి వారసుడుగా నిలిచాడనిపిస్తోంది. ఏకలవ్యుడు గురుభక్తికి ప్రతీకగా తన బొటనవేలును గురుదక్షిణంగా ఇచ్చి ఎల్లలోకంలోనే గొప్ప శిష్యుడుగా నిలిచాడు. ఇతడు గిరిజనుడే. శైవ సంప్రదాయం శివుణ్ణి ఏ రకంగా పూజించినా అతడు మోక్షానికి అర్హుడని చెబుతుంది. కన్నప్పది కల్మషం లేని భక్తి. అందుకే అతడు శివభక్తుల చరిత్రలో చిరస్థాయిగా నిలిచాడు. బసవపురాణంలో కన్నప్ప అనాగరికంగా ఉన్న సంస్కృతి సంప్రదాయాలతో, దేవుడిని వివిధ భక్తిమార్గాలను పాటించి, తనలో ఆవాహనం చేసుకున్న గొప్ప చెంచు భక్తుడు. ఒక సందర్భంలో ఇలా అనుకుంటాడు. "కడుపుగాలంగ నాకటికోర్వలేక / తడవయ్యె రాడని తలించి యేడ్చెదవొ? / యక్కడ దండిమృగాలిచే నాదు / చిక్కుట నూహించి నిక్కమేడ్చెదవొ?/" అంటూ అమాయకత్వాన్ని ప్రదర్శిస్తాడు.

ఇక్కడ పాల్కురికి సోమనాథుడు వర్ణించిన తీరు ఎంతో సహజసుందరంగా ఉంది. గుడికి వెళ్ళిన భక్తుడు మళ్ళీ వచ్చి దేవుడ్ని దండం పెడతాడని, లేక మరేదో సేవ చేస్తాడని ఎవరూ ఊహించరు. కానీ, కన్నప్ప చేత 'నేను వెళ్ళిపోయావనుకున్నవా? నా తండ్రి' అని అనిపించడంలో ఎంతో తాదాత్మ్యం కనిపిస్తుంది. అందుకే 'నేను నిన్ను తప్ప ఎవరిని సేవింతును' అని మొరపెట్టుకుంటాడు. మొదటిసారి శివుడ్ని లింగాన్ని పూజించిన

తర్వాత, నాగరికేతర పూజారి ఇలాంటి 'ఎంగిలి నీరు అభిషేక జలమా! ఎంగిలి మాంసం నైవేద్యమా! చెప్పు కాలితో పూజ చేయడమా! ఇటువంటి శివభక్తి ఎప్పుడైనా ఎక్కడైనా విన్నామా? చూశామా?'' అంటూ హేళన చేసిన పూజారి, చివరికి 'నీవే సర్వదా దేవుడవ'ని ఒప్పుకుంటాడు.

కన్నప్ప భక్తిని దేవుడే పరీక్షించినప్పుడు 'తన కన్నులనే శివుడికి అర్పించిన తీరు' లోకంలో ఇలాంటి భక్తుడు ఉంటాడానిపిస్తుంది? కాబట్టి ఇలాంటి పాత్రలను ప్రాచీన రచనలో చిత్రించడం వల్ల, ఆ కాలంలో ఉన్న గిరిజన సంస్కృతి కొంతవరకు తెలిసివచ్చిందని, నాడు ఉన్న సంస్కృతికి, నేడు ఉన్న సంస్కృతికి ఉన్న తేడాలు ఈ పాత్ర చిత్రణ ద్వారా తెలుస్తుంది. బసవపురాణంలో అనేక పాత్రలున్నా, పాల్కురికి సోమనాథుడు కన్నప్ప పాత్ర చిత్రణలో ప్రత్యేకతను ప్రదర్శించాడనిపిస్తుంది. ఇంకా ఎన్ని తరాల వారికైనా బసవపురాణం చదివినప్పుడు కన్నప్ప భక్తితత్త్వం పునీతం చేస్తూనే ఉంటుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కె. బాలగోపాల్. అడవిలో వెన్నెల ముందుమాట.1985. పుట: 01
2. Rechard M. Dorson. Folklore and Folklife.1972.The University of Chicago Press. Pg: 25
3. డి. వి. రాఘవరావు. ఆర్థిక వ్యవస్థాపక భౌతిక సంస్కృతి. పుట: 11
4. పాల్కురికి సోమనాథుడు. బసవపురాణం. తెలుగు విశ్వవిద్యాలయం.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తిక్కన సంబోధనలు - కారకౌచిత్యము

**- డా. ఎం. కాశింబాబు,** అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, భారతీయ భాషా సంస్థ, మైసూర్, కర్నాటక.

"ఔచిత్యస్య చమత్కార కారిణశ్చారు చర్వణీ
రసజీవిత భూతస్య విచారం కురుతే ధునా॥"

ఔచిత్యం రసానికి జీవితంలాంటిది. దాని చారుత్వ చర్వణం చమత్కార కారణమవుతుంది. కావ్యానికి జీవితం లాంటి ఔచిత్యమే కరువైపోతే, అలంకారాలతో పనే ముంది. లెక్కకు మిక్కిలిగా గుణాలను కూర్చటం వలన ప్రయోజనం అనేది కావ్య సుందరికి అలంకారాలు అలంకారాలే, గుణాలు గుణాలు మాత్రమే. రససిద్ధమైన కావ్యానికి స్థిరమైన జీవితం ఔచిత్యమే. అటువంటి ఔచిత్యాన్ని గురించి క్షేమేంద్రుడు 'ఔచిత్యవిచారచర్చ' అనే గ్రంథాన్ని రాసి, సాహిత్య సరస్వతికి ప్రాణభూతమైన సిద్ధాంతాన్ని విచారంలోకి తెచ్చాడు. ధ్వనిప్రస్థాన కారకుడైన ఆనంద వర్ధనుడు కూడా ఔచిత్యాన్ని పట్టించుకున్నవాడు. అతడు తన ధ్వన్యాలోకంలో అలంకారౌచిత్యం, గుణౌచిత్యం సంఘటణౌచిత్యం, ప్రబంధౌచిత్యం, రీత్యౌచిత్యం, రసౌచిత్యం వంటి వాటిని నిరూపించాడు.

"అనౌచిత్యాదృతే నాన్యద్రసభంగస్య కారణమ్
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్పరా"

కావ్యంలో అనౌచిత్యం కంటే రసభంగ హేతువైనది మరేదీ లేదు. ఔచిత్యమంతమైన కావ్యం రమణీయమైన రసోపనిషత్తు అని ఆనందవర్ధనుడు చెప్పిన మాటలు తరువాతి ఆలంకారికులందరూ ఆమోదించారు. ఏది దేనికి తగివుంటుందో దానినే ఉచితమని ఆచార్యులు చెప్పారు. దాని భావమే ఔచిత్యం. అంటే ఆనురూప్యమని చెప్పవచ్చు. ఉచితమైన రసము, అలంకారము, రీతి, ధ్వని, వక్రోక్తి, చమత్కారం లేకపోతే ఆ గ్రంథం ఔచిత్యమంతం కాదు అని చెప్పి, క్షేమేంద్రుడు 27 రకాల ఔచిత్యాలను పేర్కొన్నాడు. అవి పదము, వాక్యము, ప్రబంధార్థము, గుణము, అలంకారము, రసము, క్రియ, కారకము, లింగము, వచనము, విశేషణము, ఉపసర్గము, నిపాతము, కాలము, దేశము, కులము, వ్రతము, నామము, ఆశీస్సు ఇలా ఇవికాక సూనృత తిలకంలో వృత్తౌచిత్యాన్ని కూడా పేర్కొన్నారు. ఇలా క్షేమేంద్రుడు గుర్తించిన ఔచిత్యస్థానాలలో కారకౌచిత్యం కూడా ఉండటం విశేషం.

క్షేమేంద్రుడు కారకౌచిత్యాన్ని గురించి ఇలా చెప్పాడు. "సాన్వయం శోభతే వాక్యముచితై రేవ కారకైః కులాభరణ మైశ్వర్య మౌదార్య చరితైరివర్"- సద్వంశ సంపన్నమైన ఐశ్వర్యం, ఔదార్య చరితము చేత రాణించినట్లు, అన్వయ సంపన్నమైన వాక్యం సముచితమైన కారకాలచేత సౌభాగ్య వంతమవుతుంది - అని క్షేమేంద్రుడు వాక్యంలో కారకాన్వయాన్ని గురించి సంభావన చేసాడు.

కారకమంటే వాక్యంలోని నామవాచకానికి, క్రియకు మధ్యగల సంబంధాన్ని దృష్టిలో పెట్టుకొని వాక్యాన్ని అర్థం చేసుకోవటానికి దోహదపడే వ్యాకరణయుక్తమైన వాక్య దోహదం కారకం. నామవాచకం ఏదో ఒక విభక్తి ప్రత్యయంతో కలవటం వలన క్రియ యొక్క అర్థం మారుతుంది. ఇలా నామవాచకంతో సమన్వయింపబడుతూ క్రియాన్వయాన్ని కలిగించేది కారకమవుతుంది. ఇటువంటి కారకాన్ని తిక్కన ఎంత ఔచిత్యమంతంగా ప్రయోగించాడో చెప్పటం నా ఉద్దేశం.

సంప్రదాయ వ్యాకర్తలు తమ వ్యాకరణ గ్రంథాలలో వాక్యాన్ని గురించి ప్రత్యేక పరిచ్ఛేదంలో వివరించలేదు. దానికి కారణం కారకాన్ని గురించి వివరిస్తే వాక్యాన్ని గురించి చెప్పినట్లే. వాక్యంలోని పదాల మధ్య సంబంధాన్ని కూర్చి క్రియతో అన్వయాన్ని కలిగించేది కారకం. అటువంటి కారకాన్ని వివరిస్తే వాక్యస్వరూపాన్ని వివరించినట్లే. వక్త యొక్క ఇచ్ఛ మీద ఆధారపడి ప్రవహించే వాక్యవిన్యాసాన్ని సర్వత్రా నిర్దేశించి చెప్పటం సాధ్యమయ్యే పనికాదు. అందుకే వాక్యం బదులు కారకాన్ని సంప్రదాయ వ్యాకర్తలు వివేచించారు. కావ్యంలో ఛందస్సు అంటే కేవలం చంపక, మత్తేభాలు, వాటి గణాలు, యతులు

మొదలైన లక్షణాలు మాత్రమే కాదు. కావ్యంలో ఛందస్సు కవిమనోవృత్తికి దర్పణం. ఒక్క ఉత్పలమాలని వంద రకాలుగా నిర్మించవచ్చు. మరి ఉత్పలమాలకి లక్షణం 'భరనభభరవ' అయినపుడు నిర్మాణంలో వైవిధ్యం రావటానికి కారణం ఏమిటి? ఒక కవి నిర్మించిన ఉత్పలమాలలో భిన్నవిధాలైన వాక్య విన్యాసంతో అలరారుతుంది. దీనికి కారణం ఏమిటంటే కవి భావసమాధిలో మథించి, వెలువరించే ఛందం అతని చిత్తవృత్తికి వాహిక అవుతుంది. కవి తన భావాల్నిగాని, కావ్యగత పాత్రల భావాల్నిగాని ఛందోగతంగా వెలువరించేటపుడు అందులో ప్రతిబింబించేది తన మనోవృత్తే. అందుచేత కావ్యాన్ని నిర్మించేటపుడు కవి ఛందస్సును ఎంచుకోవటంలో ఈ భావాన్ని ఈ ఛందస్సులో చెప్తాను. ఈ భావాన్ని ఈ ఛందస్సుచేత ఆహ్లాదమయం చేస్తాను అని భావించి వాక్య ప్రయోగం చేస్తాడు. అలా భావించలేకపోతే ఛందస్సును వివిధ రసభావాది అర్థాలకు అనుకూలంగా ప్రయోగించలేడు. అంటే కవి తన మనోవృత్తిని కావ్యమనోవృత్తిగా ఛందంలో ఆవిష్కరిస్తున్నాడన్న మాట. అప్పుడు ఛందస్సు కావ్యానికి హృదయమవుతుంది. హృదయంలాగే ఛందస్సు కూడా అప్పుడు వివిధ భావాల ప్రభావంతో వివిధ రకాలుగా స్పందనాస్పదమవుతుంది. ఇలా ఛందస్సులోని వాక్యాలు వర్తించే తీరునిబట్టి కావ్య చైతన్యాన్ని గుర్తించవచ్చు. హృదయస్పందనాన్ని ఋతము లేక వృత్తి అని పేర్కొన్నారు. కావ్యంలో కవి ఛందస్సు ద్వారా సాగించే వృత్తి 'ఛందోవృత్తి' అంటారు. చిత్తవృత్తిని బట్టి మాట్లాడే వాక్యాలలో ఎలా వివిధ రకాల వృత్తులు ఏర్పడతాయో, కవి వాక్కులో కూడా వివిధ రకాల వృత్తులు ఏర్పడతాయి. చదివిన వాక్యం లేదా వాక్యార్థం హృదయ స్పందనకు కారకమవుతుంది. అంటే ఏదో స్పందనని కలిగిస్తుంది. ఆ స్పందనయే వృత్తి. వృత్తి బలీయంగా ఉంటే భావం కూడా బలీయంగా ఉండి రసంగా పరిణమిస్తుంది. రసాస్వాదానికి అనుకూలమైన చిత్తవృత్తిని కలిగించటం ఛందోవృత్తి ధర్మమైతే, రసగుణాన్ని వ్యక్తీకరించటం ఛందోగుణానికి ధర్మం. అక్షరగమనంలోని, పద విన్యాసంలోని, వాక్యనిర్మాణంలోని వివిధభేదాలే ఛందోరీతిని నిర్దేశిస్తాయి. ఈ రీతి సహజమైన వృత్తినే రసాదివ్యంజకంగా ఆలంకారికులు నిరూపించారు.

రససిద్ధులైన మహాకవుల చేతిలో ప్రతివాక్యము ఔచితీమంతంగానే రూపుదిద్దుకుంటుంది. తిక్కనగారి విరాటోద్యోగపర్వాలలోని వాక్యనిర్మాణంలో చోటు చేసుకున్న కారకాలు ఎలా ఔచితీభరితంగా ప్రకాశిస్తున్నాయో స్థాలీపులాకన్యాయంతో పరిశీలిస్తాను.

సాధారణంగా కావ్య పఠనం రసాస్వాదన కోసం చేస్తారు. కావ్య నిర్మాణమర్మాన్ని కూడా రసదృష్టితో పరిశీలిస్తారు. ఈ పత్రం కేవలం ఔచిత్యదృష్ట్యా తిక్కనగారు కారకాన్ని ఎలా పరిపోషించారో చెప్పటం. భాషలో కారకాలు సహజంగానే ఉంటాయి. అలాగని కనిపించిన ప్రతిచోట కారకం రసదృష్టితో కవి ప్రయోగించాడని చెప్పలేము. కానీ ఔచిత్యదృష్ట్యా రసదీప్తిని కలిగించే కొన్ని సందర్భాలు కవి ప్రయత్నాన్ని మరింత తేజోమయం చేస్తాయి. అలా ఔచిత్యాన్ని గీటురాయిగా చేసుకొని అలంకారదృష్ట్యా కారకౌచిత్యాన్ని వివేచించే ప్రయత్నం చేసాను. ఇది స్థాలీపులాక న్యాయంతో చేసిన ప్రయత్నమే కానీ సమగ్రం కాదు. దానికి ప్రత్యేక పరిశోధన చేయవలసి ఉంటుంది.

### సంబోధన ప్రథమ :

ప్రాతిపదికార్థంతోపాటు సంబోధనకు ప్రథమరావటం తెలుగుభాషాలక్షణం. ఇది సహజంగా ఏ భాషలోనైనా ఉన్న లక్షణమే. దీనిని ఆమంత్రణము, ఆహ్వానము, సంబోధనము, సంబుద్ధి, సముఖము వంటి పేర్లతో వ్యాకర్తలు పేర్కొన్నారు.

సంబోధనకు వాక్యాలలో ఎలాంటి స్థానముందో గమనిద్దాం. "మనస్సులోని భావం, సంబోధ్యవాచకంతో కూడి వాక్యంగా వెలువడినప్పుడు ఆ వాక్యానికి రెండు లక్షణాలను గుర్తించవచ్చు. ఒకటి వాక్యం వెలువడటానికున్న హేతువు. రెండు వాక్యం వెలువడిన తీరు. మొదటిది అంతర్లక్షణం. రెండోది బాహ్యలక్షణం. మానవుని హృదయమందున్న సహజ లక్షణాలు ప్రాతిపదికగా వాక్యం ఒక

రూపాన్ని సంతరించుకొంటుంది. అంటే వాక్యానికి అంతరంగంలో అనురాగం - ద్వేషం, కామ - వైరాగ్యం, గౌరవం - తిరస్కారం, అభిమానం - క్రోధం మొదలైన స్వభావాలుంటాయి. ఇక బాహ్యనిర్మాణంలో అభ్యర్థన, నివేదన, సంప్రార్థన, ప్రశంస, శాపం, సంప్రశ్నం వంటివి ఉంటాయి. ఇలా వెలువడిన వాక్యంలో ఉన్న సంబోధనకు బాహ్యనిర్మాణంలో ఒకటికి మించిన లక్షణాలు కనపడినప్పుడు ప్రాధాన్య వివక్షనుబట్టి నిర్ణయించుకోవాలి. ఉపరితల స్వరూపంలో సంబోధ్యవాచకం లోపించటం కూడా సంబోధనలో ఒక లక్షణమే. సంబోధ్యవాచక లోపం ఆ సంభాషణ వెలువరించిన పాత్ర అంతరంగస్వభావం మీద ఆధారపడి సాభిప్రాయతను సంతరించుకొంటుంది.

అనురాగం, ద్వేషం వంటి పైన చెప్పిన ఆత్మగత లక్షణాలు లేకుండా కేవలం సమాచారం అందించే సంభాషణల్లో సంబోధ్య వాచక రాహిత్యం కనిపిస్తుంది. అంటే, సంబోధన లేకుండా సూటిగా విషయ ప్రస్తావన ఉంటుంది. ఇది సంబోధన అక్కరలేని సన్నివేశం.

ఈ పైన ప్రస్తావించిన మూడువిధాలైన సంబోధనలతోపాటు వాక్చమత్కృతితో ప్రయోగించిన సంబోధనలు కూడా ఉంటాయి. అవి కూడా బాహ్యస్వరూప లక్షణాన్ని కలిగిన తరగతికే చెందుతాయి. తిక్కన సంబోధనలు సాభిప్రాయంగా కనిపిస్తాయి. సంబోధ్య వాచకంలేని సంభాషణలు కూడా అదేవిధంగా ఎంతో సార్థకంగా స్ఫురిస్తాయి. సాధారణంగా ఈ సంబోధనలు పద్యశైలిని నిర్దేశిస్తాయి. తిక్కనలోని సంబోధ్యవాచకాలు నేను గమనించినవి సుమారు ఆరు విధాలుగా కనిపిస్తాయి. 1. అభ్యర్థన, 2. సంప్రార్థన, 3. అభినందన, 4. నింద, 5. పృచ్ఛ, 6. సంబోధ్యవాచక రహిత సంబోధన.

**1. అభ్యర్థన :**

ద్రౌపది కారణంగా తమ అన్న కీచకుడు చనిపోయాడని ఉపకీచకులు ద్రౌపదిని కూడా తన అన్న శవానికి కట్టి తీసుకుపోతున్న సందర్భంలో ద్రౌపది చేసిన అభ్యర్థన ఈ సీసపద్యంలో గమనించవచ్చు.

తొడఉగిన పని చలం బెడపక యతి దుష్కరంబైనం
గడతేర్చు ప్రభువులార!
పెనంగిన వైవస్వతునినైనఉ గడిమిపై వ్రేల్మిడి
ఉబలమార్చు వీరులార!
శరణార్థియగు దుష్ట శాత్రవునైనను గరుణ రక్షించు
సత్పురుషులార!
యర్థికిఉ బ్రాణంబు లైనను డాఉపక తమకించి
యిచ్చు నుదారులార!
తే. నాథులారా! గంధర్వ రత్నంబులార! నన్ను
నుపకీచకులు తమ యన్న శవము నందు
బంధించికొని వెస నరుగుచున్న వారుబీ రక్షింప వేగ
రావలయు మీరు (విరాట. 3-22)

ఈ పద్యంలో పాదాంతంలో కనిపించే ప్రభువులార!, వీరులార!, సత్పురుషులార!, ఉదారులార!, నాథులార!, గంధర్వ రత్నంబులార! అంటూ చేసే సంబోధనల్లో ద్రౌపది తన ఆర్తినంతా నిక్షిప్తంచేసి, కాపాడమన్న అభ్యర్థన ఉంది. ఇటువంటి సార్థకమైన సంబోధనలు తిక్కన భారతంలో అడుగడునా కనిపిస్తాయి. అది అజ్ఞాతవాస సమయం కాబట్టి తమ భర్తల ఉనికి బయటపడనీయకుండానే, పాండవులను ఉదాత్తగుణంతో పిలవటం ఇందులోని ఔచిత్యభరితమైన సంబోధనలకు ఉదాహరణగా కనిపిస్తుంది.

**2. సంప్రార్థన :**

సుధేష్ణ తన తమ్ముడైన కీచకుణ్ణి, సైరంధ్రి పట్లగల దుష్టబుద్ధి నుంచి విముఖుడిని చేసే ప్రయత్నంలో చేసిన ఈ సంబోధనలను గమనిద్దాం.

క. "కాని తెరువునఉ బోయినఉ గలు
గునయ్య! బ్రదుకు? చవి యెంతయై
న నపథ్యములకు వేడ్క సేయుదురయ్య వివేకు? లెవ్విధ
మున నా బుద్ధి వినవయ్య తమక ముడిగి" (విరాట. 2-73)

ఈ పద్యంలో కలుగునయ్య!, వేడ్క సేయుదురయ్య!, వినవయ్య! అనే సంబోధనల వెనుక కీడును

శంకిస్తున్న బుద్ధి, తమ్ముడికి నచ్చచెప్పాలనే తహతహ అన్నీ కలిసిన మనఃస్థితి నుంచి ఆర్యార్థకమైన 'అయ్య' చేరి వ్యతిరేకార్థాన్ని బోధించే ప్రశ్నార్థకమవుతుంది. ఇటువంటి సంప్రార్థనతో కూడిన సంబోధనలు చాలానే తిక్కనభాషలో కనిపిస్తున్నాయి.

ఉ. "మ్రొక్కెద వాసుదేవునకు, మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం,
దక్కటి మిత్ర బాంధవ హిత ప్రియమంత్రి వయస్య కోటికిన్
సుక్కుచు విన్నవించెద నసూయలు దక్కి యనుజ్ఞ సేయుండీ
యిక్కరుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధ శాంతికిన్" (ఉద్యో. 1-302)

ఈ పద్యంలో సంబోధన వాచకాలు కనిపించవు. కానీ ఎదుటి వ్యక్తి తీవ్రతను తెలిసి, ఆ తీవ్రతను తగ్గించటానికి చేసే ప్రార్థనలో భాగంగా చేసిన చమత్కారపు రచనగా కనిపిస్తుంది. వాస్తవానికి 'వాసుదేవ నీకు మ్రొక్కెదను', 'సవ్యసాచి నీకు చేతులు మోడ్చుతున్నాను' అంటూ రాయ వచ్చు. అలాకాకుండ క్రియలను ప్రధానం చేసి మ్రొక్కెద వాసుదేవునకు, మోడ్చెదంజేతులు సవ్యసాచికిం, సుక్కుచు విన్నవించెద... అంటూ సాగిన ఈ రచనలో సంప్రార్థన కనిపిస్తుంది. చేతులెత్తి నమస్కరించటం, చేతులు జోడించటం వంటి చర్యలకు తన సంప్రార్థనను తెలియజెప్పి, ఎదుటివారిని సానుకూలం చేసుకొనే ప్రయత్నంలో భాగంగా చేసిన వ్యవహారమిది.

క. "ఆపదఁ గడవం బెట్టఁగ
నోపి శుభంబైనదాని నొడఁ గూర్పను మా
కీ పుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁజూపి చనియె మహాత్మా!" (ఉద్యో. 3-6)

రాయబారానికి శ్రీకృష్ణుణ్ణి పంపే నిమిత్తమై అర్థిస్తూ చెప్పిన పై పంక్తుల్లో మహాత్మా! అంటూ చేసిన సంబోధనలో ధర్మరాజు సంప్రార్థనముంది. మా తండ్రి పోతూ పోతూ నిన్ను చూపించి వెళ్ళాడని, తమను రక్షించి, పోషించవలసిన బాధ్యత నీదేనని అభ్యర్థిస్తూ చేసిన సంబోధన ఇది.

**3. అభినందన :**

క. "ఇదైపోయెదఁ గౌరవ్యులం
బదనికి రాం బలికి సంధి వాటించెదవీ నా
కది యొప్పది! కాని తుదిం
గుదురితకు నీవ కావే గుణరత్ననిధీ!"
(ఉద్యో. 3-69)

ఈ పై పద్యంలో గుణరత్ననిధీ! అనేది ప్రశంసాపూరితమైన సంబోధన. సంధికోసం ఏకీభవించి శాంతవచనాలు పలికే ధర్మరాజుతో పలికిన భీముణ్ణి కృష్ణుడు రెచ్చగొట్టాడు. రెచ్చగొట్టిన భీముణ్ణి మళ్ళీ కృష్ణుడు శాంత వచనాలతో శాంతపరిచాడు. ఆ సందర్భంలో భీముణ్ణి ప్రశంసిస్తూ అన్నమాటలు 'గుణరత్ననిధివైన ఓ భీమా! నేను కురుసభకు ఇప్పుడే వెళ్తున్నాను వాళ్ళతో సంధి పొసగేలా ప్రయత్నిస్తాను. అలా సంధి కుదరకపోతే నాకు నువ్వే ఆధారమని' ఉబ్బవేస్తూ చేసిన ప్రశంసాపూరిత సంబోధన.

**4. నింద :**

శా. "దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్లు నిను దోర్లీలన్ వెసం గిట్టిగం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిల గీచకా!"(విరాట. 2-55)

ఈ పద్యంలో ద్రౌపది చేసిన సంబోధనను పరిశీలిస్తే గొప్ప గొప్ప బలవంతులు, పరాక్రమవంతులైన వారినే తమ భర్తలైన గంధర్వులు పిండిపిండి చేశారని, తన జోలికి వస్తే నీకూ ఆ గతి పడుతుందని చెప్పకనే చెబుతూ, తన భర్తల పరాక్రమాన్ని తెలియజేస్తూ, కీచకుణ్ణి బలంగా హెచ్చరిస్తూ, తన భర్తలు నిన్ను మింగేస్తారన్న నిందాగర్భితమైన సంబోధనగా కనిపిస్తుంది.

**5. పృచ్ఛ :**

"ఓటయొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేదుబీ నీ
మాటలఉబోవునే దురభిమానమ యెక్కుడు పూనుఉ గాకబీ య
చ్ఛోటన సంగరంబు లగు చొప్పులు పుట్టిననైనఉ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ! పోదురొ కానల నుండ నచ్యుతా!" (ఉద్యో.3-104)

కొన్ని సంబోధనలు సంభాషించేవ్యక్తి వేసే ప్రశ్నలతో కూడి ఉంటాయి. రాయబారానికి వెళ్ళే శ్రీకృష్ణునికి ధర్మరాజు అన్నమాటలు ద్రౌపదికి బాధ కలిగించాయి. కృష్ణా! సుయోధను మనసులో రవ్వంతైనా భయం లేదు. రాజ్యాన్ని ఇవ్వనని మాట్లాడి, శ్రీకృష్ణునికి కీడు తలపెట్టినా తొందరపడి సభను వీడి రావద్దని, ఓర్పుతో పాండవుల సత్ప్రవర్తన సభలో వాళ్ళకు తెలిసేలా మాట్లాడి రమ్మని ధర్మజుడు అన్నాడు. ఆ మాటలకు స్పందిస్తూ అన్న ద్రౌపది మాటలలో కురుసభలో యుద్ధం జరిగే సూచనలు ఏర్పడితే అప్పటికైనా యుద్ధానికి సన్నద్ధులవుతారా? లేక అడవులకు వెళ్ళి నివసిస్తారా? అని ద్రౌపది తన ఆవేదనను ప్రశ్నార్థకంగా శ్రీకృష్ణునికి తెలియజెప్పే సంబోధన ఈ అచ్యుతా!. ఇలా సంబోధన వాక్యం లేకుండానే వాక్యంలో ఉద్దేశించిన వారికి తగిలేలా చెప్పే పద్ధతి కూడా ఉన్నది. సంధి సమాలోచన సందర్భంలో ద్రౌపది పలికిన మాటలు ఇటువంటి సంప్రశ్నతో కూడి ఉంటాయి. జానపదుల తడిక రాయబారాలు ఇటువంటివే.

**6. సంబోధ్యవాచకరహిత సంబోధన :**

తే. దేవి తృష వుట్టి వారుణి దేరం బనుప
నరుగుదెంచితిఉ బోయింపుఉ డనిన నింతి
నెమ్మొగంబున దృష్టులు నిలిపి, తమక
మడర నిట్లను నా కీచకాధముండు

(విరాట. 2-116)

సుదేష్ణ మోమాట పెట్టి, బలవంతం చేసి ద్రౌపదిని కీచకుని మందిరానికి మదిర కోసం పంపింది. మాట తీసేయలేక ద్రౌపది కీచకుని మందిరానికి వెళ్ళింది. లోనికి ప్రవేశించిన ద్రౌపది సంబోధ్యవాచకం లేకుండ చేసిన ఈ సంభాషణలో కీచకుని పట్ల ద్రౌపదికి గల అసహ్యం, క్రోధం వెల్లడవుతాయి. నిజజీవితంలో మనం కూడా ఇష్టంలేని పని చేయవలసి వచ్చినపుడు, ఇష్టంలేని చోటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు అక్కడి వ్యక్తులతో వ్యవహరించే పద్ధతి ఇలాగే ఉంటుంది. ఇలా ద్రౌపది సంబోధ్య వాచకాన్ని ప్రయోగించకుండా కీచకుణ్ణి సంబోధనార్హుడు కాదన్నట్లుగా ప్రవర్తించి వ్యవహరించటం పాత్రకు ఎంతో వన్నె తెచ్చే విషయం.

ఇలా తిక్కన సంబోధనలు సందర్భానుసారంగా, పాత్రల మనోవృత్తిని తెలియజేసేవిగా ఉంటాయి. సన్నివేశ ప్రయోజనాన్ని కలిగిస్తూ, కథాగమనాన్ని రక్తి కట్టిస్తాయి.

**ఆధారగ్రంథాలు :**

1. చేరెడ్డి మస్తాన్ రెడ్డి, భారతం పద్యశైలి, ఆశాలత ప్రచురణలు, నరసారావుపేట, 1989
2. పాటిబండ మాధవశర్మ, ఆంధ్రమహాభారతము ఛంద:శిల్పము, అభినవ భారతీ ప్రచురణలు, హైదరాబాదు, 1966
3. బూదాటి వేంకటేశ్వర్లు, సంప్రదాయ తెలుగు వ్యాకరణాలు, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2014
4. శలాక రఘునాథశర్మ, భారత ధ్వని దర్శనము, ఆనందవల్లీ గ్రంథమాల, అనంతపురం, 2000

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# నన్నయ మహాభారత రచనకు దోహదం చేసిన ఆనాటి పరిస్థితులు

- డా॥ అజ్మీరా సిల్మా నాయక్, తెలుగు అధ్యాపకులు, ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్.

**ఉపోద్ఘాతం :**

సంస్కృత సాహిత్యంలో ఆదికవి వాల్మీకి. కన్నడ సాహిత్యంలో ఆదికవి పంపడు. తెలుగు సాహిత్యంలో ఆదికవి నన్నయ. తూర్పుచాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని (క్రీ.శ. 1022-1061) ఆస్థానంలో కుల బ్రాహ్మ ణుడిగా, మంత్రిగా ఉండేవాడు. రాజకీయాలలో మత విద్యా సాంస్కృతిక సాహిద్యాది విషయాలలో రాజుకు తోడుగా ఉండేవాడు. తెలుగులో ఆదికావ్యంగా ఆంధ్ర మహాభారతాన్ని రచించినడానికి ప్రణాళిక సిద్ధం చేసిన వాడు నన్నయ. తాను ఆది, సభా, పర్వాలను పూర్తిగా అరణ్య పర్వంలో సగభాగం వరకు రచించి దవంగతుడై నాడు. ఆ తర్వాత 13వ శతాబ్దంలో తిక్కన విరాట పర్వం నుండి మొదలుకుని స్వర్గారోహణ పర్వం వరకు మొత్తం పదిహేను పర్వాలను రచించాడు. ఆ తర్వాత 14వ శతాబ్దంలో ఎర్రన నన్నయ రాసి వదిలిన సగ భాగాన్ని రచించి మహా భారతాన్ని ముగ్గురు కవులు రచించడం మూలానా 'కవిత్రయ భారతమని" అంటారు. ఈ విధంగా రెండున్నర శతాబ్దాల కాలంలో పద్దెనిమిది పర్వాలు గల ఆంధ్ర మహాభారతం తెలుగు వారికి స్వంతమైనది. ఈ ముగ్గురు కవులు భిన్న కాలాల్లో భిన్న రాజాశ్రయాల్లో ఉండి ఆంధ్ర మహాభారతాన్ని పూర్తి చేశారు. అయినా ఒకే కవి ఒకే కాలంలో రచించినట్లుగా ఈ కావ్యాన్ని చది వితే స్పష్టమవుతుంది. నన్నయ వేద వ్యాసుడు రచించిన సంస్కృత మహాభారతాన్ని రాజరాజుని కోరిక మేరకు తెలుగులో అనువాదం చేసేటప్పుడు అనాటి చారిత్రక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, మత సాహిత్య పరిస్థితులను తెలుసుకోవడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం..

## 1. చారిత్రక-రాజకీయ పరిస్థితులు :

తూర్పు చాళుక్యులు వేంగి దేశాన్ని క్రీ.శ. 7వ శతాబ్ది నుండి 11వ, శతాబ్దం వరకు పరిపాలించారు. వీరి రాజ్యం ఉత్తరాన ఉన్న విశాఖ పట్టణ మండలంలోని చీపురుపల్లి మొదలుకొని దక్షిణాన ఉన్న నెల్లూరు వరకు, పశ్చిమాన ఉన్న కర్నూలు మండలంలోని మార్కాపురం మొదలుకొని తెలంగాణలోని కుక్కునూరు వరకు ఉండేది. వేంగికి ఉత్తరాన కళింగ ఓఢ్ర రాజ్యాలుండేవి. పశ్చిమోత్తరంగా పశ్చిమ చాళుక్యుల రాజ్యాలుండేవి. దక్షిణాన చోళరాజ్యం ఉండేది. ఈ రాజ్యాల మధ్యన జరిగే యుద్ధాలలో వేంగి క్రీ.శ. 10వ, శతాబ్ది చివరి వరకూ అడపాదడపా అస్థిరంగానే ఉండేది .క్రీ.శ. 999లో చోళ రాజు కేసరి వర్మ వేంగిని ఆక్రమించి శక్తి వర్మను రాజుగా నియమించాడు. అతను క్రీ.శ 1011 వరకు పరిపాలించాడు. శక్తివర్మ కుమారుడు విమలాదిత్యుడు (క్రీ.శ. 1011-18) రాజమార్తాండుడుగా ప్రసిద్ది చెందాడు. అతనికి ఇద్దరు భార్యలు. చోళచక్రవర్తి యైన రాజరాజ పుత్రిక కుందనాదేవి మొదటి భార్య. ఈమె వలన రాజరాజనరేంద్రుడు జన్మించాడు. రెండవ భార్య తెలుగు చోళుల ఆడపడుచు మేళవ. ఈమె వలన విజయా దిత్యుడు జన్మించాడు. విమలాదిత్యుని తర్వాత రాజరాజు క్రీ.శ 1019లో రాజైనాడు. కాని విజయాదిత్యునికీ అతనికి పడలేదు. విజయాదిత్యుడు కర్ణాటక(పశ్చిమ) చాళుక్యుల సాహాయంతో రాజరాజుపై దండెత్తినాడు. రాజరాజు తన మేనమామ అయినా మొదటి రాజేంద్ర కూతురు అయినా అమ్మంగదేవిని పెళ్లి చేసుకున్నాడు. క్రీ.శ. 1022 ఆగస్టు 22వ, తేదిన బెజవాడలో పట్టాభిషక్తుడైనాడు. క్రీ.శ. 1031లో విజయాదిత్యుడు కర్ణాటక చాళుక్యుల సహాయంతో తిరిగి వేంగి మీద దండెత్తి బెజవాడను ఆక్ర మించాడు. రాజరాజనరేంద్రుడు చోళదేశానికి పారిపోయి తిరిగి క్రీ.శ.1035లో చోళుల సహాయంతో బెజవాడ (విజయవాడ)ను స్వాధీనం చేసుకుని వేంగీ దేశానికి అధి పతి అయ్యాడు. అలాగే కర్ణాటక చాళుక్యులు క్రీ.శ. 1044లో వేంగిని తిరిగి ఆక్రమించడం. మళీ రారాజు

క్రీ.శ. 1047 లో వేంగిని గెలుపొందడం జరిగింది. అప్పుడు రాజరాజు తన రాజధానిని రాజమహేంద్రవరానికి (రాజమండ్రి) మార్చుకొన్నాడు.

క్రీ.శ. 1053 వరకు వేంగి కొంత శాంతియుతంగానే ఉన్నది. కాని, 1053లో జరిగిన కొప్పం యుద్ధంలో అప్పటి చోళదేశాధిపతి ప్రథమ రాజాధిరాజు మరణించడంతో రాజరాజుకు చోళుల సహాయం అందడం ఆగిపోయింది. అందువల్ల పశ్చిమ చాళుక్యులతో తన జీవిత కాలమంతా మైత్రితో ఉండేటట్లు సంధి చేసుకున్నాడు. ఆ సంధిని సాధించడంలో నన్నయ రాయబారిగా క ృషి చేశాడు. అతనికి సహాయకుడిగా పశ్చిమ చాళుక్య మంత్రి అయినా నారాయణ భట్టు తొడ్పడ్డాడు. అప్పుడు రాజరాజు నారాయణ భట్టుకు 'కోరుమిల్లి అగ్రహారమిచ్చి గౌరవించాడు. ఆ తర్వాతనే అంటే క్రీ.శ. 1054-61 మధ్య కాలంలోనే నన్నయ మహాభారత రచనకు శ్రీకారం చేపట్టి ఉంటాడు.

## 2. సామాజిక పరిస్థితులు :

ఒక జాతి వికాసంలో అనేక దశలలో అనేక మార్పులు జరుగుతుంటాయి. క్రీ.పూ. నుండి ఆంధ్ర జాతి ఉన్నట్లు తెలుస్తుంది. క్రీ.శ. 6, 7వ, శతాబ్దాల నాటికి ఆంధ్రులు తీరాంధ్రలో స్థిరపడి వ్యవసాయాన్ని, సముద్ర వ్యాపారాన్ని సాగించి ఆర్థికంగా బలపడ్డారు. దాదాపు 8, 9, 10, 11వ, శతాబ్దాల్లో రాజకీయంగా ఒక మహా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలనే స్పృహతో ఉన్నారు. రాజుల మధ్య పరస్పర కలహాలు జరుగుతుండేవి. రాజకీయంగా యుద్ధాలు సాగుతున్నా తూర్పు చాళుక్యులు దేశ భాషయైన తెలుగును పోషించారు. తెలుగులో ఉదాత్త సాహిత్యాన్ని నిర్మించాలని తెలుగు జాతికి స్పృహను కల్పించాలని పూనుకున్నారు. చారిత్రకంగా గమనిస్తే తెలుగు జాతి క్రీ.శ. 11వ, శతాబ్దంలో సాహిత్య నిర్మాణాన్ని, 13వ శతాబ్దంలో స్వీయ లలిత కళా పద్ధతులను నిర్మించుకోవాలనే స్పృహను ప్రకటించింది. నన్నయ ఆంధ్ర మహాభారత రచన ఆంధ్రజాతి తనదైన ఉదాత్త సాహిత్య నిర్మాణం చేసుకోవాలన్న చారిత్రక పరిణామానికి సహజ స్పందనగా సాగింది.

చారిత్రక వాస్తవ ద ృష్టిలో ఆనాటి సామాజిక పరిస్థితులను నన్నయ సమీక్షించారు. క్రీ.శ. 7వ, శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు భారత దేశంలో ఫ్యూడల్ వ్యవస్థ మొదటి దశలో ఉండేందని చెపుతారు. మౌర్య సామ్రాజ్య కాలంలో విస్కృత రాజ్య పాలన చేసిన ప్రభువులు కల్పించిన ఫ్యూడల్ పద్ధతిని 7వ, శతాబ్దం నుండి చిన్న చిన్న రాజ్యాలేలే రాజులు, సామంతులు, పాలేగాళ్లు మొదలైన వారందరూ, పరిపాలించే వారు ఫ్యూడల్ వ్యవస్థను పాటించే ప్రయత్నం చేశారు. తామ చక్రమర్తుల వల్లనే ఫ్యూడల్ వ్యవస్థను పోషించారు. రాచరికపు వ్యవస్థను రక్షించడానికి చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థించారు. "నావిష్ణుః పృధివీపతిః" వంటి విశ్వాసాలను ప్రజలలో కల్పించడానికే వైదిక మతాన్ని పాటించారు. ఆంధ్ర మహాభారత రచన కూడా ఈ పరిణామ దశలో వచ్చిందనే చెప్పాలి. ఫ్యూడల్ వ్యవస్థను సమర్థించే సాహిత్య నిర్మాణం చేసే ప్రయత్నమే నన్నయ గారిదని చారిత్రక సామాజిక వాస్తికిక వాదులు పేర్కొంటారు.

## 3. మత పరిస్థితులు :

రాజరాజ నరేంద్రుడు ఎదుర్కొన్న రాజకీయ పరిస్థితుల వెనుక మత విషయకమైన కారణం ఉండడం గమనించదగిన అంశం. 11వ, శతాబ్ది ప్రారంభం నాటికి తీరాంధ్రలో బౌద్ధమతం కిణ దశలోకి వచ్చింది. జైన మతం ప్రాబల్యం కోసం ప్రాకులాడుతుంది. పశ్చిమ చాళుక్యులు జైనులు. వారు వేంగి మీద దండెత్తడానికి, విజయాదిత్యునికి తోడ్పడడానికి జైన మతం కూడ ఒక బలమైన కారణం. విమలాదిత్యుడు చివరి రోజుల్లో వైదిక ధర్మాన్ని వదిలి జైన మతాన్ని స్వీకరించాడు. అతడు పెండ్లాడిన ఇద్దరు రాణులలో మేళవ జైన మతాభిమానం గల రాణి. చోళరాజ కన్య కుందనాదేవి వైదిక ధర్మ మార్గాలు అవలంభించింది. ఈమె శివ భక్తురాలు. ఆ ఇద్దరు రాణులకు పుట్టిన పుత్రులు కూడ తల్లులు అభిమానించిన మతాలనే తమ ధరాలుగా గ్రహించి జీవితాంతం సాగించారు. ఈ వాతా

వరణాలను చూస్తే రాజరాజ నరేంద్రునికి, విజయాదిత్యునికి మధ్య జరిగిన యుద్ధాలకు మత ప్రాతికలు కూడా ఉన్నాయనే విషయం స్పష్టమౌతుంది. అయితే తూర్పు చాళుక్య ప్రభులలో చాలా మంది వైదిక ధర్మాన్ని స్వీకరించి, దానిని పోషించారనే తెలుస్తుంది. దానికి తోడు ఆంధ్ర భాషా సాహిత్యాలపై అమితమైన అభిమానాన్ని ప్రకటించి శాసన భాషగా, ప్రజల భాషగా, కావ్య భాషగా తెలుగును అభివ ృద్ధి చేశారు. మహా కావ్య నిర్మాణానికి దోహదం చేశారు. వైదిక ధర్మాభిమానం

తూర్పు చాళుక్యులకు ముందున్న పల్లవ, శాలంకాయన, విష్ణుకుండినుల కాలం నుండే కొనసాగుతున్నది. ఆ యుగాలలో రాజులు అశ్వమేధాది క్రతువులు చేయగా, తూర్పు చాళుక్యులు క్రతువులనుమాని వేద విద్యను ఘటికా స్థానాల ద్వారా, గ్రామ విద్యా పీఠాల ద్వారా వ్యాపింపచేశారు. వైదిక ధర్మాన్ని దేవాలయ వ్యవస్థల ద్వారా విస్తరింపచేశారు. చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు, వారి శిల్పరీతి, పౌరాణికాది వృత్తులను ఏర్పరిచిన తీరు తెలుగు వారి చరిత్రలో ఒక కొత్త ఒరవడిని సృష్టించాయని చెప్పవచ్చు.

## 4. సాంస్క ృతిక పరిస్థితులు :

వర్తమాన ఆంధ్ర సంస్కృతికి మొదటి సారి ప్రాతిపదికలు బలంగా పడింది తూర్పు చాళుక్యుల కాలంలోనే అని చారిత్రకులు పేర్కొన్నారు. చాళుక్యులు దేవాలయాలను, గ్రామీణ సంస్క ృతికి కేంద్రాలుగా పోషించారు. ప్రజలకు ధార్మిక విద్యను, సంస్కృతిని ప్రబోధించడానికి పౌరాణికులను వినియోగించారు. వేద విద్యాంసులకు అగ్రహారాలను విరివిగా దానం చేశారు. భారతీయ విజ్ఞాన నిధులైన వేద శాస్త్ర, పురాణలను ప్రజల్లో వ్యాపించి చేయడానికి, వర్ణాశ్రమ ధర్మాలనూ, ముఖ్యంగా జైన, బౌద్ధ ధర్మాల వల్ల శిథిలమైన గార్హస్థాది ఆశ్రమ ధర్మాలనూ పునరుద్ధించి వైదిక ధర్మాశ్రితమైన జీవన విధానాన్ని ప్రజలలో వ్యాపింప చేసి సామాజిక వ్యవస్థను పునర్నిర్మించాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో భాగంగానే పంచమ వేదంగా ప్రసిద్ధి గాంచిన ఆంధ్ర మహాభారతాన్ని "కృష్ణ ద్వైపాయనముని వృష భాభిహిత మహాభారత బద్ధ నిరూపితార్థం" ఏర్పడేటట్లుగా తెలుగులో నిర్మింపచేసి, తెలుగులోనే వైదిక ధర్మాన్ని తెలుగువారికి చెప్పించాలని కంకణం కట్టుకొన్నారు. సాంస్కృతికమైన సముద్ధరణానికి భాషాపోషణం చేపట్టి, ప్రజల భాషలోనే ఉదాత్త సాహిత్యాన్ని నిర్మించే ప్రయత్నం చేశారు తూర్పు చాళుక్యులు.

## 5. సాహిత్య పరిస్థితులు :

వేద వ్యాసుడు జయ కావ్యాని రాసినప్పుడు అతని శిష్యుడు దాన్ని మహాభారతంగా విస్తరింప చేసినప్పుడు ఎటువంటి మత సామాజిక పరిస్థితులు ఆయా కాలంలో ఉన్నాయో, వాటికి ప్రేరక శక్తులుగా ఎట్లా పని చేశాయో తెలుగులో కవిత్రయం వారు ఆంధ్ర మహాభారతాన్ని రచించడానికి కూడ ఆనాటి పై పరిస్థితులు కారణమయ్యాయి. వాటికి తోడు సాహితీ పరిస్థితులు కూడ ఆ రచనకు విశేషంగా తోడ్పడినాయి. నన్నయ భారతావతరణకు మత కారణాతెంత బలమైనవో అంతకంటే భిన్నంగా సాహితీ పరిస్థితుల ప్రేరణలు బలవంతంగా కొనబడుతున్నాయి. తూర్పు చాళుక్యులు తెలుగును రాజ భాషగా చేసి ప్రజల భాషను గౌరవించారు. సంస్కృత భాషతో పాటు తెలుగులో కూడ శాసనాలు వేయించారు. ఆయా శాసనాల్లో పద్యాలు ఆ కాలంలో వెలువడిన "పండరంగని అద్దంకి శాసనం" (క్రీ.శ. 849)లో ఒక తరువోజ వాడబడింది. అదే కాలంలోనే వేయించిన "గుణగ విజయాదిత్యుని కందుకూరి శాసనంలో మొత్తం సీస పద్యాలే ఉన్నాయి. ఆ తర్వాత యుద్ధ మల్లుని బెజవాడ శాసనంలో వేసిన తెలుగు శాసనాలలో మూడు చంపక మాలలు, రెండు ఉత్పలమాలలు కనబడుతున్నాయి. అంటే 11వ, శతాబ్ది నాటికి చంపకమాలది సంస్కృత వృత్తాలూ, మధ్యాక్కర సీసం, తేటగీతి, ఆటవెలది, కందం మొదలైన దేశీయ ఛందస్సులు శాసనాలలోకి ఎక్కాయంటే పద్య కవిత్వం ప్రజలకు దగ్గరగా చేరి శైలితో పోలిన రచన ఒకింత గోచరించడం వల్ల నన్నయకు ముందు దాదాపు రెండు, మూడు వందల ఏండ్ల నుండి తెలుగు పద్య కవితా ప్రజాదారణం పొంది ఉన్నదని తెలుస్తుంది.

"మును మార్గ కవిత లోకం
బున వెలయంగ, దేశీ కవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన జాళుక్యరాజు మొదలుగ బలువుర్"

అని నన్నెచోడుడు తన కుమార సంభవ కవ్యావ తారికలో పేర్కొన్నాడు. సంస్కృత సాహిత్య సంప్రదాయాలను అనుసరించి రాసే కవిత్వం మార్గమనీ, దేశభాషా సాహిత్యాన్ని అనుసరించే రాసే కవిత్వం దేశి అని సూలంగా చెప్పారు. తూర్పు చాళుక్యులు దేశ భాషలలో కవిత్వం రాసే ప్రయత్నం చేశారు. నన్నయ కూడా తూరు చాళుక్యులు సాగించిన మార్గంలోనే ఆంధ్ర మహా భారతాన్ని రచించాడనే విషయం స్పష్టమవుతుంది.

నన్నయకు ముందు కన్నడంలో క్రీ.శ. 940 నుండి పంప మహాకవి యుగం సాగుతున్నది. పంపడు వేంగి మండలంలో జన్మించినా, తెలుగువాడైనా, జైనమతాన్ని స్వీకరించి కన్నడ చాళుక్యులను ఆశ్రయించి, వేముల వాడలో అరికేసరి స్థానంలో స్థిరపడ్డాడు. అతను పురాణంగా రచించాడు. మహాభారత కథను జైన మతానికి అను గుణంగా మార్చి, "విక్రమార్జునీయ" మనే కావ్యాన్ని రచించాడు. ఒక మత పురాణం, ఒక మత కావ్యం రాసే సంప్రదాయాన్ని పంప కవి కన్నడ సాహిత్యంలో ప్రారంభించాడు. నన్నయకు ముందు పంప మహాకవి ప్రారంభించిన యుగాన్ని కన్నడ సాహిత్య చరిత్రకారులు స్వర్ణయుగంగా కీర్తించారు.

నన్నయ పంపని కావ్యశైలిని స్వతంత్రంగా తెలుగులో నిర్మించుకొన్నాడు. అయితే పంపనిది రీతి ప్రధానమైన శైలి. నన్నయది గుణ ప్రధానమైన శైలి. అయినా పంప కవిగానే తెలుగులో మార్గదేశి పద్ధతులను మేళవించి దేశీయమైన కావ్య మార్గాన్ని ఏర్పర్చాడని సాక్ష్యం చెపుతున్నది. కన్నడంలో పురాణాలనూ, కావ్యాలనూ మత ప్రచార స్పృహతో రాసే సంప్రదాయం పంపడు ప్రచారంలోకి తెచ్చాడు. నన్నయ మత ప్రచార స్పృహ కంటే సాహిత్య స్పృహను ఎక్కువగా రచనలో పాటించాడు. మత ముద్ర వేసుకున్న పురాణ ప్రక్రియను, కావ్య ప్రక్రియను వదిలి, ఇతిహాసమైన మహా భారతాన్ని ఎన్నుకొన్నాడు. మానవ జీవితంలోని చతుర్విధ పురుషార్థ సాధన సమగ్ర చిత్రణం, దానికి సంబంధించిన శాస్త్ర బోధనం చేయగల భారత సంహితను ధర్మ దృష్టితో కావ్య కళా స్పృహతో నిర్మించాడు. దక్షిణాది భాషా సాహిత్యాలలో దేనికి లేని ఒక విశిష్టమైన వ్యక్తిత్వం తెలుగు సాహిత్యానికి ఆంధ్ర భారత రచన వల్ల నన్నయ కలిగించాడు. నన్నయ కంటే ముందు తెలుగులో ప్రజలు పాడుకునే పాటలు ఉన్నాయి. పద్య రచన ఉన్నది. కాని ఒక మహా కావ్య శైలితో కూడిన కవిత్వం లేదు. నన్నయ దానిని చంపూ పద్ధతిలో రచించాడు. అందువల్ల తెలుగులో ఈ చంపూ కావ్యం" అనే పారిభాషిక పదం మృగ్యమైపోయింది. ఆ కారణంగా తిక్కన నిర్వచన కావ్య ప్రక్రియను ఆ పేరుతో ప్రత్యేకంగా చెప్పవచ్చు.

**ముగింపు :**

"కాలం కడుపుతో ఉండి కవిని కంటుంది" అని శ్రీశ్రీ చెప్పినట్లుగా మనకు కవిత్రయం వారు ఉన్నారు. కవి యొక్క కవితా శైలి అతని సాహిత్య దర్శనం నుండి వ్యక్తిత్వం పుడుతుంది. 11వ, శతాబ్దపు సామాజిక, రాజకీయ, మత, సాంస్కృతిక, సాహిత్యాలను పరిలిస్తే తెలుస్తుంది. నన్నయ ఆ కాలానికి అత్యంత ఆధునికమైన కవితా దృక్పథం కలిగినవాడు. 11వ, శతాబ్దం నుండి 18వ, శతాబ్ది వరకు గల కాలాన్ని అఖిల భారతదేశంలో సాహిత్య దర్శనపరంగా "ధ్వన్యనంతరయుగా"మని సాహిత్య విమర్శకులు వ్యవహారిస్తారు. దానికి నన్నయ ఇతనికి తర్వాత కాలం కవులైన తిక్కన, ఎర్రనలు అనుసరించారు. కవిత్రయంలో నన్నయది వస్తుధ్వని, తిక్కనది రసధ్వని, ఎర్రనది అలంకార ధ్వని ప్రధానంగా పోషించారు. ఆది కవి నన్నయను "ఋషి వంటి నన్నయ రెండవ వాల్మీకి" అని విశ్వనాథ సత్యనారాయణగారు ప్రశంసించారు. ఈ విధంగా నన్నయ కాలం నాటి వివిధ పరిస్థితుల్పి తెలుసుకోవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆచార్య, సుబ్రహ్మణ్యం : జి.వి.- సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' తెలుగు అకాడమీ ప్రచురణ. హైదరాబాద్-2002.
2. ఆచార్య. శ్రీరామమూర్తి కొర్లపాటి: "తెలుగు సాహిత్య చరిత్ర" ప్రథమ భాగం విశాలాంధ్ర పబ్లిషింగ్, హైదరాబాద్-1996.
3. ఆచార్య. నారాయణరెడ్డి.సి. : "ఆంధ్ర మహా భారతోపన్యాసములు" ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ, హైదరాబాద్-2007.
4. డా. నాగయ్య.జి. : "తెలుగు సాహిత్య సమీక్ష" నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి-1999.
5. డా. శాస్త్రి, ద్వా.నా. : "తెలుగు సాహిత్య చరిత్ర", విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్-1998.
6. డా. సుబ్రహ్మణ్యం. జి.వి. : "శ్రీమదాంధ్ర మహాభారతం" తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి-2006.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దళిత కథల్లో మహిళ కుటుంబ సమస్యలు

- కుల్లెల నాగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

"మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలనేది నేటి ఆలోచన". మనిషి తన జీవనానికి డబ్బు అవసరం. మనిషి, కుటుంబం, సమాజంలో బ్రతకడానికి డబ్బు అవసరం. మనిషిగా పుట్టింది మొదలు డబ్బు సాధన ధ్యేయంగానే ముందుకు సాగుతాడు. పితృస్వామిక సమాజంలో పురుషుడు నిరంతరం శ్రమిస్తూ ఆర్థికంగా లాభపడుతూ, కుటుంబాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నంలో కుటుంబ సభ్యులు కూడా, కుటుంబ పెద్దకు సహకరిస్తారు. ఆర్థికంగా ఆ కుటుంబం అభివృద్ధి చెందితే, అన్నింటా అభివృద్ధి చెందినట్లే భావిస్తారు.

దళితులు వేల సంవత్సరలుగా ఆర్థికంగా వెనుకబడ్డారు. బానిసలుగా, బిక్షగాళ్ళుగా, కూలీలుగా, పాలేర్లుగా జీవించారు. నేటికీ జీవిస్తూనే వున్నారు. వీరు యుగాలుగా ఆకలి, దారిద్ర్యంతో ముందుకు సాగుతున్నారు. వీరిలో నిరక్షరాస్యత, వెనుకబాటు తనం, చాలా బలంగా వున్నాయి. వీరి వెనుకబాటుతనాన్ని గుర్తించిన సవర్ణులు, వేల సం॥లుగా బానిసలుగా చేసుకొని, వీరి శ్రమను దోచుకుంటూ, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. కానీ సమాజం చైతన్యం అవుతున్న కొద్ది, దళితుల్లో సామాజిక చైతన్యం ఆరంభం అయింది. దళితులు తమకు సవర్ణుల నుండి జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించడం దానిని పోగొట్టుకునే ప్రయత్నంలో ముందుకు సాగడం, ఆ తర్వాతకాలంలో దళిత చైతన్యం కోసం ఉద్యమాలు సాగడం, తత్ఫలితంగా దళితులు సాంఘిక ఆర్థిక రంగాలలో చైతన్యం కావడానికి ప్రయత్నాలు సాగడం జరిగాయి.

1910లో పుట్టిన తెలుగు కథానిక, దళితుల సామాజిక సమస్యలకు దర్పణంగా నిలిచింది. దళిత దారిద్ర్యాన్ని పోగొట్టుకోవాలని, అక్షరాస్యులు కావాలని, విద్య, ఉద్యోగం, పరిశ్రమలు వంటి రంగాలలో స్థిరపడాలనీ, దళిత మహిళలు పురుషాధిక్య సమాజం నుండి బయట పడటానికి ప్రయత్నించాలనీ, ఆర్థికంగా స్థిరపడాలనీ ఈ సమాజంలో దళిత మహిళా సాధికారికత సిద్ధించాలనే దృక్పథంతో కథానికలు వెలువడ్డాయి. వాటిని పరిశీలిద్దాం.

## దళిత మహిళలు - ఆర్థిక జీవనం :

దళితులు అస్పృశ్యతను అనుభవించడం. ఆర్థికంగా వెనుకబాటు తనంలో వుండటం భూస్వాముల ఇళ్ళలో కూలీలుగా, పాలేర్లుగా పనిచేయడం. నిరంతరం ఆర్థిక ఒడుదుడుకులు పడటం. ఆర్థికంగా ఎదగాలనే అవగాహన లేకపోవడం, దళిత మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం, ఆర్థికంగా మగవారిపై ఆధారపడటం లాంటి అంశాల కారణంగా వీరిలో బాగా వెనుకబాటు తనం కన్పిస్తుంది. దళిత మహిళల జీవితాన్ని చిత్రించిన కథల్లో వారి ఆర్థిక జీవితాన్ని పరిశీలిద్దాం.

### రాజమ్మ :

కుటుంబం కష్టాలను తీర్చుకోవడానికి రెడ్డితో అక్రమ సంబంధానికి దిగిన 'రాజమ్మ' కథ. ఈ కథ రచయిత డా॥ ఎం. హరికిషన్.

నాగన్న కూతురు రాజమ్మ, పుల్లయ్యకు మొదటి వివాహం జరిగింది. ఆమె చనిపోవడంతో, నాలుగు వేలు ఎదురు కట్నం ఇచ్చి పుల్లయ్య రాజమ్మను రెండవ వివాహం చేసుకుంటాడు. వయస్సులో వారిద్దరికీ ఇరవై ఏళ్ళు తేడా, అయినా రాజమ్మ పుల్లయ్యతో సంసారం చేసింది. ఒకసారి వరుసగా రెండేళ్ళు కరువు వచ్చింది. దానికి తోడు పుల్లయ్య వయస్సు కారణంగా అనారోగ్యంతో మంచానపడ్డాడు. కుటుంబాన్ని పోషించడం కోసం రెడ్డితో అక్రమ సంబంధాన్ని నడిపింది. తమ కుటుంబానికి తిండి పెట్టింది. రోగిష్టి భర్తకు రోగాన్ని నయం చేసింది. ఆరోగ్యం కుదుట పడిన భర్త రెడ్డి అక్రమ సంబంధాన్ని బయటపెట్టి నాలుగు వేలు తిప్పికట్టించుకొని

విడాకులు ఇచ్చాడు. రాజమ్మ పుట్టిల్లు చేరి కూలీ చేస్తూ జీవనం గడిపింది. కొన్నాళ్ళకు భర్త వస్తాడు. తాను తీసుకున్న డబ్బు తిరిగి కట్టి రాజమ్మను తీసుకొనిపోతాడు. పుల్లయ్య ఆ డబ్బును రెడ్డి దగ్గర తీసుకుంటాడు. రాజమ్మను రెడ్డి తిరిగి తన ఇంటికి రప్పించుకుంటాడు. రెడ్డి రాజమ్మల మధ్య పాత సంబంధం మొదలైంది. ఊరివాళ్ళ మాటలు పుల్లయ్య చెవినపడుతాయి. దాంతో పుల్లయ్య రాజమ్మను తిట్టడం మొదలుపెడుతాడు. "దాంతో రాజమ్మ' "అవ్ బోతా...నేను బోకుంటే ఈ యిల్లు నువు నడుపుతున్నావా, మొగుడివేనా నువ్. నా మీద బడి బతుకుతున్నావ్ మళ్ళీ నన్నే అంటావ్ ధూ... సాతగాక పోతే వదిలేయ్‌రా...నిన్నేమన్నా యేలుకోమని యెంట బడినా" అంటుంది. అప్పటి నుండి రెడ్డి దగ్గరకి వెళ్ళడం మానేస్తుంది. దాంతో కుటుంబం గడవటం కష్టమవుతుంది. దాంతో చేసేది లేక పుల్లయ్య స్వయంగా రాజమ్మను రెడ్డి దగ్గరకు పంపుతాడు.

కటిక పేదరికాన్ని అనుభవించే దళిత స్త్రీలు. కుటుంబం పోషణ కోసం సవర్ణులతో అక్రమ సంబంధాలు కొనసాగించడం మామూలేనని తెలిపిన కథ. సవర్ణులు డబ్బు, ధనం లాంటి ఆశలు చూపి దళిత మహిళలను లొంగబరుచుకుంటారని...కానీ ఇలాంటి వాటికి దళిత మహిళలు దూరంగా వుండాలని స్వశక్తితో దళితులు జీవించాలనే భావన కన్పిస్తుంది ఈ కథలో.

### పేడ పురుగులు కాటేస్తాయి ఖబడ్దార్ :

పేదరికం కారణంగా దళిత మహిళలను హింసించిన కథ పేడపురుగులు కాటేస్తాయి ఖబడ్దార్ రచయిత కప్పగంతుల మల్లికార్జునరావు.

వరలక్ష్మి సింగన్న దంపతులు. సింగన్న పిరికివాడు తాగుబోతు. సవర్ణుల ఇళ్ళలో చిన్న పనులు చేస్తూ వచ్చిన డబ్బుతో తాగుతుంటాడు. కానీ వరలక్ష్మి వ్యక్తిత్వం కలది. తమ భర్తను చైతన్యం చేయాలనుకుంటుంది. తాను సవర్ణుల పొలాల్లోకి కూలీ పనులకు వెళ్ళుతుంది. కూలీ పని లేనప్పుడు గడ్డి సేకరించి అమ్ముతుంది. తన భర్తను దారిలోకి తెచ్చింది. సవర్ణుల ఇళ్ళ దగ్గరకు వెళ్ళకుండా చేసింది. తాను సంపాదించిన దాంట్లో తాగడానికి కొంత ఇచ్చేది. ఒకసారి రాఘవయ్య మనుమడు మాధవ్‌కు గడ్డి కోస్తూ కనిపించింది. ఈమెను అత్యాచారం చేసే ప్రయత్నం చేస్తాడు. వరలక్ష్మి తప్పించుకుంటుంది. అప్పటి నుండి ఆమె మీద రాఘవయ్య గడ్డి దొంగతనం మోపి, సవర్ణుల పొలాల్లో పని చేయడానికి వీలులేకుండా చేస్తాడు. దాంతో వరలక్ష్మి తమ బ్రతుకు తెరువు కోసం భర్త చేత చిల్లర దొంగతనాలు చేయిస్తుంది. దాంతో ఒకసారి సింగన్న మాధవ్, అతని స్నేహితుల చేతుల్లో పట్టుపడుతాడు. గ్రామంలో పంచాయితీ పేరుతో అతన్ని సజీవ దహనం చేయబోతారు. దాంతో ఉద్రేకించిన వరలక్ష్మి "ఒరేమ్ నా మొగుడు కొజ్జా నువ్వు ముండలు కావాల్సిన మగాడివి. యిప్పుడు సూపించరా నీ మగతనం నా మొగుడి బట్ట లిప్పడం కాదు నీ బట్టలిప్పు..." అంటూ ఆవేశంగా అతనిపై దూకి అతని జీజాలను కోసివేస్తుంది. తనభర్తను తీసుకొని ముందుకు సాగుతుంది.

సమాజంలో ఆర్థికంగా క్రింది స్థాయిలో వున్న వారికి పై స్థాయిలో వున్నవాడు ఏదో రూపంలో శాసిస్తూనే వుంటాడు. ఈ ఆర్థిక అసమానతలు దళితులను మరింత అఘాతంలోకి నెట్టబడుతున్నాయి. ఈ కథలో దళితురాలయిన వరలక్ష్మితో తమ కామదాహం తీర్చుకోవడానికి ప్రయత్నించి ఆమె నిరాకరించడంతో మాధవ్ ఆమె పై దొంగతనం కేసులు పెడుతాడు. ఆమెను ఎలాగైనా లొంగదీసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నం ఫలించక ఆమె భర్తను దొంగతనం పేరుతో హింసిస్తాడు. దానికి ఫలితం అనుభవిస్తాడు. సవర్ణుల దురహంకారాన్ని వ్యతిరేకించిన కథ.

### మాదిగమ్మాయి :

మాదిగమ్మాయితో వ్యభిచారం జరిపిన కథకుడి కథ మాదిగమ్మాయి రచయిత చలం.

కథకుడు ఒకసారి తమ భార్య గ్రామానికి వెళ్ళుతాడు. అది కోనసీమ ప్రాంతం. పొలాలు చాలా అందంగా వుంటాయి. ఒక రోజు కథకుడు పచ్చని పొలాలను కొబ్బరి తోటను చూడటానికి వెళ్ళుతాడు. అక్కడ ఇరవై సం॥లు

ప్రాయం వున్న మాదిగమ్మాయి కన్పిస్తుంది. ఆమె చాలా అందం శరీర సౌష్ఠవం గల మనిషి ఈమె అందానికి కథకుడు ముగ్ధుడవుతాడు. ఈమె శరీరానికి సరైన వస్త్రాలు లేక వుంటుంది. ఆమె అలా వుండటానికి వున్న కారణాలను కనుకనే ప్రయత్నం చేస్తాడు. ఆమె అందాన్ని చూసి కథకుడికి తన భార్య మీద ఈర్ష్య పుడుతుంది. ఆమెను ఒకసారి పలకరించాలనుకుంటాడు. మరుసటి రోజు వెళ్ళి ఆ అమ్మాయిని పలకరిస్తాడు. ఆమె కూడా మాటలు కలుపుతుంది. ఈ మాదిగ కుటుంబం ఒకప్పుడు చాలా బాగా బ్రతికింది. తోట వల్ల వచ్చే ఆదాయం వీరికి సరిపడేది. ఈమె అమ్మ కుటుంబాన్ని నడిపేది. ఈమెను తమ మేనత్త కొడుక్కు ఇచ్చి వివాహం చేశారు. అతడు పని కోసం రంగూన్ వెళ్ళాడు. ఆ కుటుంబం పూటగడవటం కష్టమైంది. తల్లిదండ్రులే ఈమెను కుటుంబ గడవటం కోసం వ్యభిచార వృత్తిలోనికి దింపారు. మొదట వెంకయ్య దగ్గరకు పంపారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నడుపుతున్న మేస్త్రీ ఈమెను బలవంతంగా లొంగదీసుకున్నాడు. ఆ తర్వాత వడ్ల మరలో పని చేస్తూండగా ఆ వడ్ల మర యజమాని ఈమెను బలాత్కరించాడు. అతని నుండి తప్పించుకోవడంలో కొట్టగా అతనికి గాయాలై పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాడు. దాంతో ఈమెను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి ఒకరి తర్వాత మరొకరు బలాత్కరించారు. ఈమె కుటుంబం గడవటం కోసం చివరికి దీనినే వృత్తిగా ఎంచుకొంది. "ఎట్లానూ మా బోటి వాళ్ళం శీలాన్ని కాపాడుకోలేము. ఎట్లనూ పోతున్న శీలాన్ని దాచుకోవాలని చూసే ఈ బాధలెందుకు. వచ్చే డబ్బుని వదులుకోవడమెందుకు" అని కథకుడితో ఈమె చెబుతుంది కథకుడితో అయిదు రూపాయాలు తీసుకొని అతనికి శారీరక సుఖాన్ని పంచుతుంది.

బడుగు బలహీన వర్గాలలో కటిక పేదరికాన్ని అనుభవించే స్త్రీలకు సవర్ణుల నుండి శీలాన్ని కాపాడుకునే శక్తి కరువవుతుందని వారికున్న ఆర్థిక ఇబ్బందులను ధనవంతులు అవకాశంగా తీసుకొని వారి శీలాన్ని చెరిచే ప్రయత్నం చేస్తారనే అంతరార్థాన్ని ఈ కథ అందిస్తుంది.

పై కథలో దళిత మహిళలు ఆర్థిక ఇబ్బందులకు గురవడం, భూస్వాముల నుండి శ్రమకు తగిన కూలీ లేకపోవడం, కట్టు బానిసలుగా బ్రతకడం. తినడానికి తిండి వుండటానికి ఇల్లు లేక ఇబ్బందులకు గురి కావడంతో పాటు దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నాలు జరగడం కన్పిస్తుంది. దళిత మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనే భావన కన్పిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. కె. లక్ష్మీనారాయణ - ఆది భారతీయుల చరిత్ర.
2. ఆర్. చంద్రశేఖరరెడ్డి, కె. లక్ష్మీనారాయణ - దళిత కథలు.
3. గోగు శ్యామల - నల్లపొద్దు- దళిత స్త్రీల సాహిత్యం.
4. యం. హరికిషన్ - మాయమ్మ రాచ్చసి.
5. కాత్యాయనీ విద్మహే - తెలుగులో స్త్రీల సాహిత్యం.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# వైజయంతీ విలాసం - అంధకారం చంద్రోదయం సూర్యోదయం వర్ణనలు

- డి. నాగరత్నమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రబంధాలలో అష్టాదశ వర్ణనలు కవులు చేస్తారు. అయితే పద్నెనిమిది వర్ణనలు ప్రతి కావ్యంలోనూ ఉండాలని కాదు, సందర్భానుసారంగా కథకు అనుగుణంగా ఒదిగే వర్ణనలను కొన్నిటిని ఆయా కవులు తమ ప్రబంధాలలో చొప్పిస్తూ ఉంటారు. సారంగు తమ్మయకవి కూడా తన వైజయంతీ విలాసం కావ్యంలో కొన్ని వర్ణనలను చిత్రించాడు. వాటిలో ఇప్పుడు అంధకారం, చంద్రోదయం, సూర్యోదయం వర్ణనలను అనుశీలిద్దాం. ఈ ప్రకృతి అందచందాలు మానవులకు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని అనడంలో ఏ మాత్రమూ సందేహం లేదు. శాస్త్రవేత్తలు కూడా దీన్ని నిరూపించారు. అందుకే ఇటీవల ప్రకృతి చికిత్సలు మళ్ళీ మొదలయ్యాయి. అంధకారం కూడా ప్రకృతిలోని భాగమే. అంధకారం కూడా అందంగానే ఉంటుందన్న సంగతిని గుర్తుపెట్టుకోవాలన్న కవులు నిజంగా గొప్పవారు. వారిలో సారంగు తమ్మయ కవి ఒకరు.

## 1. అంధకార వర్ణనం :

మసక చీకటి రాను రాను పెరిగి వరుణ మందిరం చొచ్చింది. దాని వెంటే సూర్యుడు కూడా పడమటి సముద్రంలో మునిగిపోయాడు. (2-32).

తే॥ ధాత్రి దినరాజు విడిచి పాతాళమునకు
జనుచు వేలంబు వెలుగజేసిన వెలుంగు
చాయ నెఱసంజ యొప్పె, తదీయ ధూమ
పటలమును బోలె చిమ్మ చీకటులు మించె

తే॥ అంబరారణ్యమున ప్రవృద్ధంబులైన
ఘోర తిమిర తమాల భూమీరుహముల
దట్టముగ నల్లుకొని పూచినట్టి మొల్ల
విరులు నా బొల్చె తారయ్యురుల యందు.
(2-33,34)

ధాత్రిని దినరాజు విడిచిపెట్టి పాతాళానికి వెళుతూ తాను వెలుగజేసిన వెలుగు నీడ ఎర్రగా సంధ్యాకాలం ఒప్పింది. దాని ధూమ (పొగ) సమూహంలాగా చిమ్మ చీకటులు వ్యాపించాయి. ఆకాశారణ్యంలో బాగా వృద్ధి చెందిన ఘోరమైన చీకటి తమాల వృక్షాలు దట్టంగా అల్లుకొని పూచినట్టి మొల్లపుష్పాలు వికసించినట్లుగా నక్షత్రాలు ఆ చీకట్లలో వెలిశాయి. ఇక్కడ నక్షత్రాలను మొల్ల పుష్పాలతో పోల్చాడు కవి. చీకటిని తమాల వృక్షాలతో పోల్చాడు. ఆకాశాన్ని అరణ్యంతో పోల్చడమైనది. అడవిలో తమాల వృక్షాలకు మొల్లలు అల్లుకొని పుష్పాలు వికసించినట్లుగా తారలు తణుకు తణుకుమని వెలుగొందాయి.

ఆ॥ వెఱ్ఱి చెఱకు కోల వింటిబద్ధకు, మర్లు
తీవె నారి జేసి భావభవుడు
పఱచు పువ్వుబోండ్ల పెఱ చోటు లుమ్మెత్త
విరుల తూపు లేసి మరులు కొలిపె.

చెఱకు గడ విల్లుగా చేసుకొని మరులు అనే తీగను నారిగా జేసుకొని మన్మథుడు ఉమ్మెత్త పూలను బాణాలుగా జేసుకొని పూబోడులకు మరులుగొల్పాడు.

చ॥ పరువడి జార కామినుల పల్కులు
జారులకున్, తదీయ వా
క్సరణులు జారకాంతలకు నమ్మతిగా
వినుపింపుచున్, పొరిం
బొరి నుభయానురాగ రసపోషణులై వెస నిందు
నందునున్
తిరుగుదు, రాసుక్రోవుల గతిన్ పురవీథుల
శంభళీసతుల్. (2-37)

జారకాంతలు (వేశ్యలు) పలుకులు జారులకు (విటులకు); ఆ మాటలు, ఆ మాటతీరులు విటులకు విని

పిస్తూ, అత్యంత ఉభయానురాగ రసాన్ని ఆస్వాదించిన వారై అక్కడ ఇక్కడ సాలెవాడు ఆసుపోయునప్పుడు నూలు చొప్పించేరీతిగా పురవీధులలో కుంటెనకత్తెలు (వేశ్యలు) తిరుగుతున్నారు. అంధకారం ఉంటేనే విటులకు జారకాంతలకు అనుకూలంగా ఉంటుంది. మబ్బులో అయితే ఎవరెవరు అనేది గుర్తించలేరు. అందుకే చీకటి తప్పులు అనే పేరు వచ్చింది.

ఈ విధంగా సారంగు తమ్మయ కవి అంధకారాన్ని కూడా కడు రమ్యంగా వర్ణించాడు.

## 2. చంద్రోదయ వర్ణనం :

ప్రకృతిలో చంద్రోదయం చూస్తే మనస్సుకు ఎంతో ఆహ్లాదం కలుగుతుంది. ఎంతో ఉత్సాహం కలుగుతుంది. పూర్వం పిల్లలందరూ వెన్నెల్లో వెన్నెల కుప్పలాట, ముక్కుడు గిల్లే ఆట, వెన్నెల-నీడ ఆట మొదలైన ఆటలెన్నో ఆడుకునేవారు. అందుకే పూర్వం తరం వారు అంత ఆరోగ్యంగా ఉండేవారు. వెన్నెలలో ముఖ్యంగా పున్నమినాడు రాగి చెంబులో గాని, రాగి మగ్గులోగాని మంచినీళ్ళు పెట్టి ఉదయం పూట తాగితే జీర్ణాశయానికి ఎంతో మంచిదని పెద్దలు చెప్పేవారు. అది ఔషధంగా పనిచేస్తుందన్న మాట. అందుకే చంద్రుణ్ణి 'ఓషధీశుడు' అంటారు. కనుకనే కావ్యాల్లో కవులు చంద్రోదయం, వెన్నెల వర్ణన చేస్తూ ఉంటారు. సారంగు తమ్మయ కవి కూడా ఈ 'వైజయంతీ విలాసం'లో చంద్రోదయాన్ని, వెన్నెల వర్ణనను అద్భుతంగా చేశాడు.

క॥ ఆ తఱి ప్రహ్లాద సమ
న్వితంబై కువలయంబు విలసిల్ల, నవ
ద్యోత సటా పటలుండై,
శీతాంశుడు పొడిచె నారసింహుడు పోలెన్.

తే॥ దితిజ రక్తారుణ నృసింహ దివ్యమూర్తి
పోలి యొప్పారె పొడుపు కెంపున విధుండు
త ద్విశాలంక తల దైత్య తనువు వోలె
లాంఛనం బొప్పెనమ్మండలంబునందు.
(2-42;43)

ఆ సమయంలో ఆహ్లాదంగా కలువపువ్వు విలసిల్లగా కొంగ్రొత్తగా ప్రకాశిస్తూ నరసింహుడు మాదిరిగా చంద్రుడు ఉదయించాడు.

ఇక్కడ నరసింహుడు మాదిరిగా ఉదయించాడు అనడంలో పరమార్థం ఏమిటంటే - నరసింహుడు స్తంభం నుంచి ఉద్భవించినప్పుడు ఉగ్రరూపంలో ఉంటాడు. ఇక్కడ చంద్రుడు ఉగ్రరూపం కాదు కాని చంద్రుడు భూమినుంచి పొడుచుకొని బయటికి వచ్చినప్పుడు ఎర్రగా ఉన్నాడని భావం. హిరణ్య కశిపుణ్ణి సంహరించడానికి వచ్చిన నరసింహుడు కళ్ళు ఎర్రబడి ఉంటాయి. అందు వల్ల ఇది చక్కని పోలిక. సూర్యుడు ఉదయించేటప్పుడు కాని, చంద్రుడు ఉదయించేటప్పుడు కాని ఎర్రగానే కనబడతారు.

దైత్యుడైన హిరణ్యకశిపుని రక్తంతో తడిసిన నర సింహుడి మాదిరిగా ఎర్రగా చంద్రుడు ఒప్పాడు. నర సింహుని విశాలమైన తొడలపై పడి ఉన్న శరీరం లాగా ఆకాశంలో చంద్రుడు ఎర్రగా శోభిల్లాడు. నరసింహుడు హిరణ్య కశిపుడిని తన గోళ్ళతో చీల్చినప్పుడు హిరణ్య కశిపుడి శరీరమంతా రక్తంతో నిండి ఎర్రబడింది. ఆ విధంగా చంద్రుడు ఎర్రగా ఉన్నాడు.

చ॥ అనిమిష మండలీ విరచితాభ్ర ధునీ సలిలాభిషేచనం
బున, విమలాంగుడౌ నృహరి పోల్కి సుధా కిరణుం డనంతరం
బున తెలుపొందె తత్ప్రపూరము రోదసి పిక్కటిల్లెనో
యన, బలితంపు వెన్నెల లజాండ విభాండము నిండె నత్తఱిన్.

ఆకాశ మండలంలోని గంగతో అభిషేకించబడ్డ నిర్మలాంకుడైన నరహరి (నరసింహుని) లాగా అమృత కిరణుడైన చంద్రుడు తర్వాత తెలుపు వర్ణంతో వెలు గొందాడు. ఆ తెల్లదనంతో మొత్తం ఆకాశమంతా వ్యాపిం చిందేమో అన్నట్లుగా బలిష్ఠమైన వెన్నెల భూమ్యాకాశాల నిండా వ్యాపించింది. ఇక్కడ నరహరి హిరణ్యకశిపుడిని

గోళ్ళతో సంహరించాడు. అప్పుడు హిరణ్య కశిపుని శరీరం నుంచి వెలువడ్డ రక్తంతో నరసింహుడు ఎర్రబడ్డాడు. అలా వెదజల్లబడిన రక్తాన్ని గంగాజలంతో నరసింహుణ్ణి అభిషేకించడంతో నిర్మల శరీరుడయ్యాడు. ఆ విధంగా మొదట ఎర్రగా ఉదయించిన సూర్యుడు రాను ఎర్రదనం పోయి తెల్ల తెల్లగా అయ్యాడు. ఇది ఒక క్రమ పరిణామం. మొత్తం చంద్రుడి వెన్నెల అంతా భూమ్యాకాశాలు వ్యాపించాయి.

### 3. సూర్యోదయ వర్ణనం :

తెల్ల తెల్లవారగానే క్రమంగా వెన్నెల మాయమై సూర్యరశ్మి భూమిపై బడి నక్షత్రాలు అన్నీ కనుమరుగై పోయాయి. కవి సూర్యోదయాన్ని ఇలా వర్ణిస్తున్నాడు.

ఉ॥ తూరుపు తెల్లవాఱె, శశి తోయధి పాశకు జేరె, వెన్నెలల్
తారలతోన జాఱె, కుముదంబులు నిద్రల కూరె, జక్కవల్
కేరె, ప్రసూన సాయకునికిన్ పని దీఱె, దిగంతరంబులన్
తారె చకోర సంఘము, లుదారత మీఱె సు సాంధ్యరాగముల్.

మెల్లగా తూర్పు తెల్లవారింది. చంద్రుడు పడమటి సముద్రం వెనక్కి చేరాడు. వెన్నెలలు తారలతో కలిసి జారిపోయాయి. కలువలు నిద్రపోయాయి. అంటే కలువలు ముడుచుకు పోయాయి. జక్కవ పక్షులకు ఉత్సాహం వచ్చింది. తెల్లవారితే పక్షులన్నిటికీ ఉత్సాహం రావడం సహజం. పుష్పబాణధరుడైన మన్మథునికి పని తీరిపోయింది. చకోర పక్షుల సమూహాలన్ని దిగంతరాలకు వెళ్ళిపోయాయి. "ఉరుతర రక్తప్రభామండలీకుం డుద యించెన్ భాస్కరుం డత్యుపరి దృఢ సముద్యోత శోభా కరుండై" (2-52) - అత్యంత శోభాకరుడై సూర్యుడు మిక్కిలి రక్తప్రభతో ఉదయించాడు అంటే ఎర్రని ప్రకాశంతో ఉదయించాడు.

ఈవిధంగా సారంగు తమ్మయ కవి ప్రకృతిలో క్రమక్రమంగా జరిగే మార్పులన్నీ వర్ణిస్తూ అంధకారం, చంద్రోదయం, సూర్యోదయం, వర్ణనలను అభివర్ణించి పాఠకులకు ఆహ్లాదాన్ని కలిగించాడు. ఈ ప్రకృతి వర్ణనలను పరిశీలించిన పాఠకులకుగాని, విన్న శ్రోతలకుగాని, మానసికోల్లాసం కల్గడమేగాకుండా, అనేక కార్యక్రమాలు చేయడానికి ఉత్ప్రేరణ కూడా కలుగుతుంది.

### ఉపయుక్త రచనలు :


1. కులదీప్ నయ్యర్, కాశెపోగు :'శశాంక విజయం - కావ్యానుశీలనం' (అముద్రిత పిహెచ్.డి. సిద్ధాంతవ్యాసం -2017), ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు -522510.
2. లక్ష్మీకాంతం, పింగళి : 'సాహిత్య శిల్ప సమీక్ష' (1980), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాదు-1
3. వేంకటరామ నరసింహం, కాకర్ల : 'సాహిత్య దర్శనం' (1979), క్వాలిటీ పబ్లికేషన్స్, రామమందిరం వీధి, విజయవాడ -2.
4. హనుమంతప్ప, ఆదవాని : 'కుమార భారతీ దర్శనం' (1993), కార్తికేయ పబ్లికేషన్స్, భైరవ నగర్, అనంతపురం - 2.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# భాషను రక్షించాలా? ఎందుకు? ఎలా?

- డా॥ పి.ఎ. సత్యనారాయణ

**ఉపోద్ఘాతం :**

తెలుగు భాష యునెస్కో వాళ్ళ మృతభాషల లిస్టులో చేరిపోతుందని, దాన్ని ఎలాగోలా రక్షించుకోవలసిన బాధ్యత తెలుగుభాషా వ్యవహర్తల భుజస్కంధాలపై ఉందని గిడుగు పుట్టినరోజున ప్రతిఏటా మాధ్యమాల్లో హడావుడి చేస్తుంటాం.

తెలుగు మాతృభాషగా కలిగి ఉండటం పూర్వజన్మల పుణ్యఫలమని అంటూ, మాతృభాష గొప్పతనాన్ని ద్విగుణీకృతం చేసే పనిలో మన పూర్వీకుల, విదేశీయుల ఉల్లేఖనాల్ని వకల్తా పుచ్చుకుంటాం. అయినా మాతృ భాషస్థితి రోజు రోజుకి దిగజారుతుందని నిట్టూరుస్తాం. ఈ విధంగా చేయడం వల్ల భాష రక్షింపబడుతున్నదా? మరేం చేయాలి అన్న ప్రశ్నలకు తలాతోక లేకుండా బదులిస్తాం.

సాంస్కృతిక విధ్వంసం, మదర్ సెంటిమెంటు, మన భాషను రక్షించలేకపోతున్న నేపథ్యంలో మనవాళ్ళు బుర్రలు బద్దలుకొట్టుకుని ఏవో ఉచిత సలహాలు మన వాళ్ళు ఇచ్చేస్తుంటారు.

అయితే ఈ సలహాలను క్షేత్రస్థాయిలో అమలుజరిపే పనిని, అసలు సగటు మాతృభాషా వ్యవహర్తలు పట్టించు కుంటున్నారా?

సాంస్కృతిక విధ్వంసం మృతభాష, లాంటి పదాలు సగటు వ్యవహర్త చెవికెక్కవు.

మొన్నటిదాకా ఆంగ్లాన్ని ఆపండి తెలుగు నేర్పండి అన్నా; నిన్న ఇంగ్లీషుతో పాటు తెలుగు కూడా నేర్పండి అని; ఇవాళ కనీసం ప్రాథమిక స్థాయి వరకు అయినా మాతృభాష నేర్పండి అంటున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. అందుకే ప్రజల నాడి తెలుసుకున్న ప్రభుత్వాలు ఆంగ్లం ఎల్.కె.జి. నుంచి తమ స్కూళ్ళలో అమలయ్యేలా కసరత్తులు చేస్తున్నాయి.

అసలు ప్రజల నాడి ఏంటి? ప్రస్తుతం మనం చేయాల్సింది కీలెరిగి వాతపెట్టడం. ప్రజలు ఇంగ్లీషే తమ పిల్లలకు ఉజ్జ్వలభవిత ఇస్తుందని నమ్ముతున్నారు. జపాన్‌లాగ మాతృభాషతో కూడా మనం మెరుగ్గా ఉం డొచ్చని మనవాదన. కాని అది చెవిటి వాడి ముందు శంఖ నినాదం అవుతున్నది.

ఒక పక్క మన పిల్లల్ని మనం ప్రవాసాంధ్రుల్ని చేసేస్తూ మరోపక్క వాళ్ళపిల్లల్ని మాతృభాషా జెండాకర్రలు మోయమంటూ; గోడమీద పిల్లివాటంలా మాటాడు తున్నామని, మనమాటల్లో చిత్తశుద్ధి లేదని సగటు తల్లిదండ్రులు అనుకుంటున్నారు.

ఇవేమీ అన్నవస్త్రాలు, ఆత్మగౌరవాలు, హోదా అంత స్తులు ఇవ్వలేవని, పెంచబోవని వాళ్ళ ప్రగాఢ నమ్మకం.

ప్రజలు తమజీవన ప్రమాణాలు పెరగాలని, తమ స్థాయి, అంతస్తులు వేగంగా పెంపొందాలనే ఆతురతతో ఉన్నారు. అది ఒక ఇంగ్లీషు వల్ల మాత్రమే సాధ్యం అనుకుంటూ దాని మీద లేనిపోని అర్థవంతమైన మోజు పడుతున్నారు. అట్టడుగువాళ్ళలో కొందరు మరీ ముందు కెళ్ళి ఆంగ్లానికి కోవెల కడుతున్నారు కూడా !

అంటే మన భాష ఆకలి తీర్చడమే కాదు, అంతస్తును కూడా పెంచగలగాలన్న మాట. మరాపని మన భాష చేయగలదా?

మన భాష స్వీకృత భాష అన్ని గాలులకు కవాటాలు తెరుస్తుంది. స్థిరీకృతమైన నానుడుల్ని సొంతం చేసు కుంటుంది; మనలాగే.

ఈ నేపథ్యంలో మార్పు సహజం; అనివార్యం, శాశ్వతం అని సరిపెట్టుకోవాలా? లేక ఏటికి ఎదురీదాలా? ఈ రెండూ కాకపోతే ట్రెండ్ ఫాలో కాకుండా ట్రెండ్ సెట్ చేయాలనుకుంటే. ఒకటే మంత్రం. అదేంటంటే ఎక్కువ ఉపయోగం, తక్కువ ఖర్చుకి దోహదపడే నూత్న ఆవిష్క రణలు మనం సృజించగలగాలి.

### సాంస్కృతికతకు ఆర్థికమే వెన్నుముక :

వలస, పరాధీన స్వభావం గల సమాజం సాంస్కృతికంగా ఆర్థికంగా స్వేచ్ఛనుకాకుండా భద్రతను మాత్రమే కోరుకుంటుంది. అలాంటి నేపథ్యంలోంచి పుట్టుకొచ్చిన విద్యావిధానం పరివారంగా, పనివాళ్ళుగా తప్ప యాజమాన్యంగా, నాయకులుగా - మానవ వనరుల్ని తయారు చేయలేకపోతుంది. కాబట్టే భాషా సాంస్కృతిక ఉద్యమాలు బతికిబట్టకట్టలేకపోతున్నాయి.

సీతాకోకలకు చాటింపు వెయ్యక్కరలేదు; తేనె ఉంటే అవే చెంగు పట్టుకు తిరుగుతాయి.

ఒక భాషా సమాజం ఇతర భాషా సమాజాల కంటే ఎంత ఎక్కువ ఉత్పాదక సామర్థ్యాలు కలిగి ఉంటే ; (మూలధనం, నైపుణ్యం లాంటివి) అంత ఎక్కువ శక్తిమంతమవుతుంది. అంటే సాంస్కృతికంగా ఉనికి ఆర్థిక పునాదుల మీద ఆధారపడి ఉంటుందన్నమాట.

మనదగ్గర సత్తా ఉంటే వలసలు మన దగ్గరకు వెల్లువలా కొట్టుకొస్తాయి. అప్పుడు మన భాషా సంస్కృతులు మరింత వినియోగంలోకి వస్తాయి.

ఒక భాష మృతతుల్యం కావటం అంటే అది వినియోగం అంతకంతకు తగ్గుముఖం పట్టడమే! వినియోగానికి ప్రాతిపదిక ఆవశ్యకత.

అంటే ఒక సమాజం అవసరాల్ని సృష్టించడంలోను, అవసరాలను తీర్చడంలోను ఎంత ముందుంటే అంతగా దాని భాష కూడా వృద్ధి చెందుతుంది; జీవిస్తుంది. లేకుంటే మృత్యు ముఖం పడుతుంది; నిఘంటువుల్లో చిమ్మెట మధ్య మూలుగుతుంది.

కీలెరిగి వాతపెట్టకుండా ఎన్ని ర్యాలీలు, ఎన్ని చైతన్య ప్రబోధాలు చేసినా ఫలితాలు రావు. ఈ భాషా సంరక్షక వ్యూహాలన్నీ, నిట్టూర్పులన్నీ గురితప్పిన అస్త్రాలు కాకతప్పదు. అప్పుడు ప్రపంచం మన వెంట నడుస్తుంది. మన భాష నేర్చుకుంటూ మనల్ని, మన భాషను మన సంస్కృతిని వృద్ధిపథంలో నడిపే గొడ్డు చాకిరీ చేస్తుంది.

నూత్న ఆవిష్కరణ ఒకటే మన భాషకు శ్రీరామరక్ష. అది లేకుండా మనం పడే ప్రయాసంతా అరణ్యరోదన. బూడిదలో పోసిన పన్నీరు. పెత్తందార్ల భాషే పదికాలాలు బతికిబట్టకడుతుంది. అబలత్వం కాటికి కాళ్ళు చాపక తప్పదు. ఉన్నత విద్య దాని పరిభాష తెలుగులోకి తర్జుమా కావడం, ఎప్పటికప్పుడు సమాచారం విరివిగా, సునాయాసంగా తెలుగులో లభ్యం కావడం, మేధో వలసల్ని తగ్గించడం లాంటివి తెలుగుమృతం కాకుండా చేసేవాటిలో కొన్ని మాత్రమే.

భిన్న సంస్కృతుల కలగూరగంపలాంటి నేలమీద, వైరుధ్యాల సమాజంలో కృత్రిమ సాంస్కృతిక ఏకత్వం ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతుంది.

అమ్మకు కూడు పెట్టనివాడు పిన్నమ్మకు కోకపెట్టిన చందంలా, సమష్టి వృద్ధి కాంక్షించని సమాజం భాష ఉనికిని పట్టించుకోదు. వ్యసనాలకు బానిసై బతుకేలెక్క చేయని సమాజం భాష గురించి ఆలోచిస్తుందనటం సత్యదూరం. ఆకలే తీరనివాడు ఆత్మగౌరవం గురించి ఏం ఆలోచిస్తాడు ?

ఆవిష్కరణ → అభివృద్ధి → ఆధిపత్యం → పరివారం ఒకదానివెంట మరొకటి అనివార్యంగా వచ్చిపడేవి. కాబట్టి ఆవిష్కరణలకు సమాజాన్ని సంసిద్ధం చేయడం ఒకటే మార్గం. ఈ మేలుకొలుపు పాలకుల్లోను, ప్రజల్లోను ఎప్పుడు వస్తుంది. భాషా పరిరక్షణ, సాంస్కృతిక వైభవం వారసత్వం వాళ్ళిద్దరి స్వప్నం కాదు. వ్యష్టివృద్ధే వాళ్ళ నైజం. కాబట్టి వాళ్ళ కళ్ళు తెరిపించే వైతాళికులు ఎవరో కాదు మనబోటి బుద్ధి జీవులే.

మార్పు సహజం, అనివార్యం, శాశ్వతం కాబట్టి; ప్రాంతీయ వర్గ, వర్ణ, భాషా, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయాది వైవిధ్యాలు, వైరుధ్యాలు, వైషమ్యాలు కలిగి కేవలం భౌగోళిక ఏకత్వం మాత్రమే కలిగిన భిన్నత్వ సమాజాల్లో బలహీనుల సంస్కృతులు మరుగున పడక తప్పదు; వాళ్ళ భాషకు కూడా అదే గతి.

ఏ వేషభాషల ఔన్నత్యమైనా, గుర్తింపైనా; ఆ సమాజపు ఆర్థిక స్వావలంబన మీదే ఆధారపడి ఉంటుంది.

స్వావలంభన నలుగురికి ఆసరా ఇవ్వటానికి ప్రయత్నిస్తుంది.

**ఉపసంహారం :**

నలుగురికి పని కల్పించలేని ఏ సమాజమైనా, వర్గమైనా దాని వేషభాషల ప్రత్యేకతన్ను, వైభవాన్ని మ్యూజియంలో చూసుకోవలసిందే. అంటే నలుగురికి పని కల్పించడమే ఒక సమాజ సాంస్కృతిక ఔన్నత్యానికి, పారంపర్యానికి మూలధనం, ఇంధనం అన్నమాట.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి.
2. తెలుగు భాషా వికాసం - డా॥ బి.ఆర్. అంబేద్కర సార్వత్రిక విశ్వవిద్యాలయం.
3. చేరాతలు - ఆచార్య చేకూరి రామారావు.
4. భాషా శాస్త్రపరిచయం - ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# విశ్వనాథరెడ్డి భరద్వాజల తెలుగు సాహిత్యయాత్ర

- ఎమ్.ఎన్.వి. సూర్యకుమారి, తెలుగు అధ్యాపకురాలు, డి.ఆర్.జి. మహిళాడిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం.

భారతీయ జ్ఞానపీఠ ఫౌండేషన్‌ను 1964లో స్థాపించారు. దీనిని పేరుపొందిన పారిశ్రామిక వేత్త సాహు శాంతి ప్రసాద్ జైన్ అతని భార్య రొమాజైన్ స్థాపించారు. 1965 నుంచి ఈ అవార్డును ఇస్తున్నారు. భారతదేశంలో ప్రాచీన కాలం నాటి ప్రాచీన సాహిత్యంను పెంపొందించాలని వివరణాత్మ కంగా ఆధునిక భారత భాషలలో సాగించిన రచనలకు గుర్తింపుగా ఈ పురస్కారం ఇస్తారు. 1982 తర్వాత నుంచి జ్ఞాన్‌పీఠ ఒక పుస్తకానికి కాక సాహిత్య రంగంలో చేసిన సేవకు ఇవ్వడం ప్రారంభించారు.

తెలుగుభాషలో జ్ఞానపీఠ అవార్డును కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ (1970) రచన శ్రీ రామాయణ కల్పవృక్షం, కవిరాజు సింగిరెడ్డి నారాయణరెడ్డి (1988) రచన విశ్వంభర, మాయా జలతారుతో ప్రసిద్ధికెక్కిన రావూరి భరద్వాజ (2012), రచన పాకుడు రాళ్ళుకు కవిత్రయం సంపాదించి ఈ భారతవానికి వన్నె తెచ్చారు.

## విశ్వనాథ సత్యనారాయణ :

"తెలుగు సాహిత్య సత్కృషీవలుల యందు
వేయి ఎకరాల భూస్వామి విశ్వనాథ
వారి పొలమున పండని పంట లేదు
పండినది యెల్ల పసిండి కాకుండ లేదు"

అంటూ ప్రముఖ పెద్దాపురం కవి డా॥సంపన సూర్య నారాయణగారిచే ప్రస్తుతించబడిన విద్వత్కవి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు. వీరు సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషలలో గొప్ప పండితులు. కావ్యము, నవల, నాటకము, కథానిక వంటి ఎన్నో సాహిత్య ప్రక్రియలను చేపట్టిన బహుముఖ ప్రజ్ఞాశాలి. శ్రీమద్రామయణ కల్పవృక్ష మహాకావ్యానికి తెలుగులో తొలిజ్ఞానపీఠ అవార్డును తెచ్చిన ప్రజ్ఞాశాలి. "వేయి పడగలు" అనే నవలను తెలుగులో రాసినారు. కీ॥శే॥ పి.వి. నరసింహారావుగారు "సహస్రఫణ్" పేరుతో దీనిని హిందీలోకి అనువదించారు. విశ్వనాథవారి కిన్నెర సాని పాటలకు గొప్ప ప్రజాదరణ లభించింది.

## రామాయణకల్పవృక్షం :

విశ్వనాథ సత్యనారాయణగారి ఈ పద్యకావ్యం అతని సాహితీ ప్రతిభకు తాత్విక భావాలకు, ఆధ్యాత్మిక ధోరణికి, తెలుగు సాహిత్యంలో పద్యకావ్యాల విశిష్టతకు నిదర్శనంగా ప్రసిద్ధి కెక్కింది. వాల్మీకి రామాయణంలో ఒక్కొక్క కాండము కొన్ని సర్గలుగా విభజింపబడి ఉంది. రామాయణ కల్పవృక్షంలో సర్గల వింగడింపు ప్రత్యేకంగా ఖండాలనే భాగాలుగా ఉంది.

ఏకవీర, చెలియలికట్ట, బద్దన్నసేనాని, మాబాబు, జేబుదొంగవంటి గొప్ప నవలల్ని వీరు రాసారు. ఖండ కావ్యాలు కూడా రాసారు. వాటిలో "ఆంధ్రప్రశస్తికి" అఖండ గౌరవం లభించింది. ఇది ఆంధ్ర పౌరుషాన్ని రేకెత్తించే గొప్ప రచన. 1916లో తను 21వ ఏటనే "విశ్వేశ్వర శతకము"లో విశ్వనాధ రచనా ప్రస్థానము ప్రారంభమైనది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆ సమయంలో "ఆంధ్ర పౌరుషము" రచించాడు. 1920నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

20వ శతాబ్దములోని ఆంధ్ర సాహిత్యమునకు, ప్రత్యేకించి సంప్రదాయ సాహిత్యమునకు పెద్ద దిక్కు. ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. "నేను వ్రాసిన పద్యములు సంఖ్య, ప్రకటింపబడిన సంఖ్య, సుమారు ఇరువది వేలుండవచ్చును. నేను చింపి వేసినవి ఏబది వేలుండవచ్చును." అని ఆయన అన్నారు. 30 కావ్యాలు, 20 నాటకాలు, 60నవలలు, 10 విమర్శనాగ్రంథాలు, 200 ఖండకావ్యాలు, 35చిన్నకథలు, 3 నాటికలు, 70వ్యాసాలు, 50 రేడియోనాటికలు, 30 రేడియో ప్రసంగాలు, 10 ఇంగ్లీషు వ్యాసాలు, 3 అనువాదాలు, 100 పరిచయాలు ముందు మాటలు రాసారు. ఈయన రాసిన కొన్ని కావ్యాలు, నవలలు, ఇంగ్లీషు, హిందీ,

తమిళం, కన్నడం, మళయాళం, గుజరాత్, ఉర్దూ, సంస్కృత భాషల్లోకి అనువదించబడ్డాయి.

1920లో సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొని చదువుకి స్వస్తిచెప్పారు. ఈయన రచనలకు గుర్తింపుగా బందరులో పెద్దలు సభ జరిపి కవిసామ్రాట్ బిరుదు నిచ్చారు. ఇంకా కళాప్రపూర్ణ, పద్మవిభూషణ్ బిరుదులను కూడా అందుకున్నారు.

విశ్వనాథ మాట్లాడే వెన్నుముక అని శ్రీశ్రీ వర్ణించారు. "ఆదుకాంధ్ర జగత్తంలో విశ్వనాథ ఒక విరంణ్మూర్తి, వచన కవిత్వం వినా ఆయన చేపట్టని సాహితీ ప్రక్రియ లేదు. గేయం వ్రాసినా, పద్యం రచించినా, ముక్తం వ్రాసినా, మహాకావ్యాన్ని రచించినా విశ్వనాథ కృతిలో ఆయనదైన ఒక వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక వైలక్షణ్యం వెల్లివిరిస్తుంది. మహాకవిగా మనుగడ సాగించడానికి ఉండవలసిన మొదటి లక్షణం ఈ వ్యక్తిత్వం అని జి.వి.సుబ్రహ్మణ్యం చెప్పారు.

"నిజానికి శిల్పముకాని సాహిత్యముకాని జాతీయమై ఉండరాదు. వ్రాసి ముక్తి రక్తి, ఎంత సముద్రము మీద ఎగిరిననూ పక్షి రాత్రి గూటికి చేరును. ఇది జాతీయత. ఇది సంప్రదాయము అని కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించిన కవి విశ్వనాథ సత్యనారాయణ ఈయన కవితలో రీతి, వృత్తి, శైలి, పాకం, రసం, ధ్వని, అలంకారాలు అన్నీ వాటంతటే అవే ఒకదాని పక్కనా మరొకటి పేర్చుకుంటూ పోతూ ఉంటాయి. కాళిదాసు, భవభూతి వంటి సంస్క ృత కవులకున్న అక్షరశక్తి, వాక్య నిర్మాణ పటిమ, భాషాశక్తి విశ్వనాథకు ఉన్నాయి. సన్నివేశ కల్పనలో శీల చిత్రణలో, రసస్ఫూర్తిలో శిల్పమర్మాలను ఎరిగిన కవి విశ్వనాథ. అగ్నిపత్రం రాయడం, వేయి రెక్కలలో సాగటంవంటి అభివ్యక్తులు విశ్వనాథ తెలుగు భాషా శిల్ప సౌందర్యానికి అందించిన వరాలు. ఆయన పద్యాల్లో చంధశిల్పం కనబడుతుంది. ధ్వనులు తరంగాలుగా ప్రసరిస్తాయి. కొన్ని పద్యాలో గుప్తశిల్పం సాహితీ విమర్శకులను మైమరిపిస్తుంది. అల్లసాని జిగిబిగి, తెనాలి రామకృష్ణుని పదగుంభనము, శ్రీనాథుని శైలీవిన్యాసము విశ్వనాథ కవితల్లో సాక్షాత్కరిస్తాయి.

"ఎంతటివాడు కావలయునెప్పుడు యత్ప్రతిభా విశిష్టుడై యంతటివాడునే నగదునప్పుడు తత్ప్రతిభా విశిష్టుడై" అనే పద్యం విశ్వనాథకు వర్తిస్తుంది. తెలుగు వారు గర్వించదగిన ఆధునిక కవులలో విశ్వనాథ సత్య నారాయణ ముఖ్యులు. శ్రీనాథునివంటి ప్రాచీనకవుల సరసన నిలబడిన ఆధునిక కవిగా విశ్వనాథవారిని సాహితీవిమర్శకులు పేర్కొన్నారు. తెలుగు కవులలో జ్ఞానపీఠ, అవార్డును అందుకున్నా మొదటివాడుగా తెలుగువారి హృదయాల్లో మిగిలిపోయారు.

కవిరాజు డా॥సి.నారాయణరెడ్డి
దాస్యమనునది గాథ తమ ఆం
ధ్యమ్ముపలె దేశమ్మును ప్రస
స్తము చేసిన వేళలె శం
ఖమ్ము నొత్తినవాడె వీరుడు

- దివ్వెలు మువ్వలులో డా॥సి.నారాయణరెడ్డి

తెలుగులో అభ్యుదయ కవిత్వం పురుడు పోసుకుంటున్న దశలో పుట్టుకొచ్చారు. ఈ భావి అభ్యుదయకవి. దిగంబర, చేతనావర్త, విప్లవస్త్రీ, దళిత, బహుజన, ముస్లిం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల వాదాల ప్రపంచీకరణ వ్యతిరేఖ సాహిత్యకాలాల్లో కవిగా జీవించారాయన. వీటిలో ఒకటీ అరా వాదాలలో ఆయన విభేదించినా, ఈ అన్ని ఉద్యమాల వాదాలసారుసినారె కవిత్వంలో కనిపిస్తుంది. ఆయన కాలంలో పాటు నడిచిన కవి. ప్రజలపక్షం వహించే ప్రజాతంత్ర ప్రజాస్వామిక వాదాలన్నిటినీ ఈయన సమన్వయం చేసుకున్నారు.

సినారెలో కవిగా ఒక పరిణామం ఉంది. "నల్లనిపువ్వు" రాసె నాటికి నాటికి ఆయన భావకవి. నిజానికి అప్పటికి భావకవిత్వం కనుమరుగై పోయింది. కాని దాశరథి, సోమసుందర్‌లాంటి వారు భావకవిత్వ భయాలు వదులుకోకుండానే అభ్యుదయ కవిత్వం రాస్తున్నారు. సినారె భావకవిగా పుట్టుకొచ్చారు. అయితే రెండు మూడేళ్ళలోనే

ఆయన భావకవిత్వంలోకి అభ్యుదయకవిత్వం చొచ్చుకు వచ్చింది. ''విశ్వగల'' లాంటి కావ్యాల్లో ఈ లక్షణం కన్పిస్తుంది. నాగార్జునసాగరం, కర్పూర వసంత రాయలు లాంటి కావ్యాల్లో సినారె భావకవిత్వ ప్రీతి, సంగీతజ్ఞానం దర్శనమిస్తాయి. 1965 నాటికి ఆయన అచ్చమైన అభ్యుదయ కవిగా తనను తాను తీర్చిదిద్దుకున్నారు. మంటలూ- మానవుడు ఇందుకు తొలి ఆనవాలు. ఇక అక్కడి నుండి ఆయన తిరిగి చూడకుండా అభ్యుదయ కవిత్వ ప్రయాణం సాగించారు.

అభ్యుదయ కవి శ్రామికదృక్పథం. సినారె కవిత్వంలో ''మానవాశ్రమ'' అనేక రకాలుగా కవితా వస్తువైంది. ''ఎన్నెన్ని ప్రస్థానాలు మనిషికి'' అని కవిగా ఆయన ఆశ్చర్యపోతారు. ''నిరంతరాన్వేషి మనిషి' అని నిర్వచించారు. మానవజాతి సాధించిన విజయాన్నంతా రంగరించి ఒక్కమాటలో చెప్పారు.

ఈ యుగం సాధించిన గుణం మనుషుల్లా నివసించే దేవుళ్ళు ఈ తరం సాధించిన వరం దేవుళ్ళను ధిక్కరించే మనుషులు అభ్యుదయ కవిది విమర్శనాత్మక గొంతుక. వర్తమాన సామాజిక జీవితంలో కనిపించే అసాంఘిక ధోరణులను ఎత్తిచూపి, మానవ జీవితం మరింత మెరుగు పడాలన్నదే సినారె ఆకాంక్ష. ఈయన రచించిన మంటలూ - మానవుడు, మార్పు నా తీర్పు, ఉదయం నాహృదయం, తేజస్సు నా తపస్సు, కవిత నా చిరునామా, ఇంటిపేరు చైతన్యంలాంటి అనేక కావ్యాలలో స్వాతంత్ర్యానందర భారతీయ సామాజిక పరిణామాలు విమర్శనాత్మకంగా ప్రతిబింబిస్తాయి.

పాతికేళ్ళ కథ అనేక కవితలో 1947-72 మధ్య పాతికేళ్ళలో భారతదేశ చరిత్రల్లోని వెలుగు చీకట్లను ఆవిష్కరించారు.

బువ్వపెట్టే అన్నపూర్ణను - బొరియల్లో దాచే వంచకుల నుంచి ప్రాణాలు పోసే మందుల్లో - ప్రాణాలు తీసి కల్తీల నుంచి పెట్రోలులా మండిపోతున్న - పేపరు ధరలు నుంచి ప్రపంచ అంగళ్ళల్లో దేశలక్ష్మిని - పణమొడ్డి పాచిక లాడే బఖియాన్ల నుంచి దేశం ముందడుగు వేయాలన్నది కవి ప్రబోధం.

సినారెకి స్వాతంత్ర్య దినోత్సవమన్నా, గాంధీ నెహ్రూలన్నా అపారమైన గౌరవం. ఆగష్టు 15మీద ఆయన చాలా కవితలు రాసారు. అలాగే గాంధీజీ మీద జాతిరత్నం అనే కావ్యం రాసారు. నెహ్రూ మరణించినపుడు జవహారుతో పాటు నన్ను చావనిమ్ము, చావనిమ్ము అని విలపించారు. తొలినాళ్ళలో సినారె కవిత్వం వస్తువులోనూ, భాషలోను సంప్రదాయ వాసనలు గుబాలించాయి. కర్పూర వసంత రాయలు దీనికి చక్కని ఉదాహరణ.

సినీరంగ ప్రవేశం చేయాల్సివస్తే సింహద్వారం నుంచే తనయాత్ర సాగిస్తానని పట్టుదలతో సినీగీతాలకు సొగసు లద్దిన విశ్వంభారుడు ఆచార్య నారాయణరెడ్డి, పాట, మాట తనకు రెండు కళ్ళని తన మాట పాటై మెలగాలని ఆ పాట చరిత్రలో నిలచిపోవాలని ఆశించిన సంగీతాభిమాని. 1960లో గులేబకావళి కథ సినిమాతో చలనచిత్ర రంగప్రవేశం చేసారు సినారె. ''కర్ణ'' అనువాద చిత్రంలో పనిచేసినపుడు కె. రాఘవతో (తాత మనవడు నిర్మాత) ఆయనకు పరిచయం ఏర్పడి స్నేహబంధం ఏర్పడింది. ఆయన ద్వారా దర్శకనిర్మాత దాసరి నారాయణరావుతో స్నేహం పెరగడివే కాకుండా ఆయనతో ఎక్కువ సినిమాలలో పనిచేసే అవకాశం కలిగింది.

దాసరి నిర్మించిన ప్రథమార్థపు చిత్రాలలో పాటలు ఎక్కువగా సినారె రాసారు. ఆ తర్వాత యన్.టి.ఆర్. సినిమాలకు కూడా ఎక్కువగా పాటలు రాసే అవకాశం కలిగింది.

దాసరి 2వ చిత్రం కూడా రాఘవ నిర్మించిందే. పరిమిత సంసారం అనే ఆదర్శాన్ని దృష్టిలో ఉంచుకొని తీసిన సంసారం - సాగరం (1974) అనే ఈ ప్రయోగాత్మక చిత్రంలో కూడా సినారె మూడు పాటలు రాసారు. ఇందులో ''సంసారం సాగరం బ్రతుకే ఒక నావగా ఆశే చుక్కానినగా పయనించే ఓ నావికా ఎక్కడుంది ఎక్కడుంది నీ తీరం'' అనే నేపథ్యగీతం జనాదరణ పొందింది. ''దిక్కులేని మనిషీ ఏదిక్కున పడిపోయేవు నీ శవాఇన్న నువ్వే మోసుకుపోతున్నావు'' అంటూ అలంకార పరిభాషలో పాటద్వారా కథాబలాన్ని ఆవిష్కరించారు.

"పాడవోయి భారతీయుడా" సినిమాలో సినారె ఓ గొప్ప గీతాన్ని రాసారు. "బాలభారతి నుదుట చిమ్మిన రక్తం భావిభారతి ఎదను మాయని గాయం"లో మానవరక్తానికి సంబంధించిన ప్రస్తావన చరణంలో తీసుకువచ్చారు. 1982లో దాసరి దర్శకత్వంలో "జయసుధ అనే సినిమా వచ్చింది. జయసుధే ఇందులో కథానాయిక. ఆమె లావణ్యాన్ని వర్ణిస్తూ పాట రాయమని ఆయనకు సూచిస్తే ఈ క్రింది విధంగా రాసారు.

"ప్రణయ కావ్యమున ప్రథమ పంక్తివో
ప్రణయ భావనకు ప్రథమ మూర్తివో
ప్రణయ గగనమున ప్రథమ రేఖవో

రేఖలో శశిరేఖవో సుధవో జయసుధవో అంటూ నడుస్తుంది. ఈ పాటలో చరణాలు కూడా అద్భుతమే. "తరళ తరళ నీహార యవనికల మెరిసే సూర్యకళికా, మృదుల మృదుల నవ పవన వీచికల కదిలే మదన లతికా, నీ లలితాచరణ పల్లవ చుంబనమున పులకించును వసుధ" అంటూ మంచు తెరలా, మన్మథ లతలా ఉందని వర్ణిస్తూ చరణాన్ని పూరించారు. మరో చరణంలో "శరదిందీవర చలదిందిందిరస్ఫురన్నీల కుంతలలో, రుష్యాశ్రమ గత దుష్యంత చకిత దృశాంకిత శకుంతలతో," అని ముక్తాయించారు. రసస్పష్టి కురిసిన ఈ పాట ఎంతో జనరంజకమైనది. 1997లో దాసరి నిర్మించిన స్త్రీ కథాంశంతో వచ్చిన సినిమా ఒసేయ్ రాములమ్మా! ...రాములమ్మా" అంటూ సాగే ఆపాటకు విజయశాంతి తన నటనతో ప్రాణప్రతిష్ట చేసారు. ఇందులోని "నువ్వు కడవమీద కడవ పెట్టి కదిలితేనమ్మ, ఆకరిమబ్బు వరిదొబ్బు కన్ను గిలిపెనమ్మ, నువ్వు అడుగేస్తే నేలంతా అద్దమయ్యే నమ్మా; పొదల మాటు పువ్వులాగా ఒదగాలోయన్నులాంటి ప్రయోగాలు ఒక్క సినారె చేయలగలరంటే అతిశయోక్తి లేదు.

పాటకు పల్లవి ప్రాణమని, పల్లవి చరణాలకు ఉత్తేజం నిల్పుతుందని నమ్మి సినీగీత రచన చేసిన వ్యక్తి సినారె.

## విశ్వంభర :

తెలుగు సాహిత్యానికి అత్యున్నతమైన "జ్ఞానపీఠ పురస్కార గౌరవం అందించింది. విశ్వంభర మానవ వికాసాన్ని భౌతిక, మానసిక ఆధ్యాత్మిక తాత్వికావస్థలలో ప్రతీకాత్మకంగా, వ్యంగ్య సుందరంగా చిత్రీకరించిన రచన ఇది. డా॥సి.నారాయణరెడ్డి సృజించిన ఆధునిక ఇతి హాసమహాకావ్యమిది. ఈ కావ్యానికి నాయకుడు మానవుడు. రంగస్థలం విశాల విశ్వంభర. ఇతివృత్తం తేవలతో నిమిత్తంలేని, పేర్లతో అవసరంలేని మనిషి కథ. ఈ కథకు నేపథ్యం ప్రకృతి. ఆదిమ దశనుంచి ఆధునిక దశ వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు అంటారు సినారె విశ్వంభర ప్రారంభంలో మానవుడు కళాత్మకంగా, వైజ్ఞానికంగా, ఆధ్యాత్మికంగా త్రిముఖాలుగా సాగించిన పురోగతి ఈ కావ్యంలోని వస్తువు.

సినారె సినీగీతాల్లోని మెరుపులన్నీ ఆ మహాకవి రచనా వైమష్యానికి, విస్తారమైన ప్రాచీన సాహిత్యాన్ని ఆపోశన పట్టిన ఆయన మేధకు అద్దం పడుతాయి.

సినారె గొప్పవక్త కూడా ఆయన ప్రసంగాలు వినడానికి ఎంత ఎంతో దూరం నుంచి ప్రజలు వచ్చేవారు. ఆయన కలం బలం అనేక కావ్యాల్లో పదిలమైంది. ఆయన గళ మహత్తు జ్ఞాపకాలలో ఉంటూనే ఉంటుంది. కవిగానే కాదు వక్తగాను సినారె చిరంజీవి.

## రావూరి భరద్వాజ :

భరద్వాజగారి రచనలలో అచ్చయిన తొలికథ విమల. 1946లో ప్రజామిత్రలో అచ్చయింది. అచ్చయిన తొలి పుస్తకం రాణిణి. 1950లలో ఆయన రాసిన దైవరాజ కీయాలు కథ అప్పట్లో స్వర్ణ కంకణం అందుకుంది. తెలుగు లఘుకథారచయిత, నమా రచయిత రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నాడు. గొప్ప భావకుడైన తెలుగు కవి మరియు రచయిత. ఈయన 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస మరియు ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు మరియు 5రేడియో కథానికలు రచించారు.(2)

1965సం॥లో కృష్ణాపత్రికలో సీరియల్‌గా వెలువడిన ఈ పాకుడురాళ్ళు నవలకు జ్ఞానపీఠ అవార్డు లభించింది.

భరద్వాజగారి సమగ్రసాహితీ మూర్తిమత్వం పరిగణనలోకి తీసుకొనే ఒక విశిష్ట రచనగా పాకుడురాళ్ళు నవలను ఎంపిక చేసారు. రావూరి సామాన్య రచయితల మధ్య అసామాన్య రచయిత. సాధారణంగా ఏ రచయిత చూపులకూ తగలని సామాజిక కోణాలే ఈ రచయితకు వస్తువు. తెలుగువాడు తెలుగు వాడి కోసం రాసిన తెలుగు రచనగా ఆయన రచన ఉంటుంది. రచనల్లో వాస్తవికత ఉండాలి అనేవారు భరద్వాజకు. ఈయనకు 3 విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించాయి. వీరి రచనలమీద 4 విశ్వవిద్యాలయాలు పి.హెచ్.డి స్థాయి పరిశోధనలు జరిపాయి.

**పాకుడురాళ్ళు :**

చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా తీసుకొని తెలుగులో వెలువడిన మొట్టమొదటి నవల పాకుడురాళ్ళు.

భరద్వాజ దీనికి మాయాజలతారు అని నామకరణం చేసారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్ళు అనే పేరు పెట్టారు. పాలపుంత అనే ఒక పెద్ద కథని రావూరి పాకుడు రాళ్ళు నవలగా రాసారు. 3 సంవత్సరాలు పాటు కృష్ణా పత్రికలో ధారావాహికగా వెలువడిన పాకుడు రాళ్ళు నవలపై శ్రీ కృష్ణదేవరాయ, శ్రీ వెంకటేశ్వర విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. సామాన్య యువతి అయిన మంజురి కథను తీసుకొని జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకలను ఎంతో చక్కగా వ్రాయగలిగారు. సమాజంలో అన్ని రంగాలలోను పాకుడురాళ్ళుపై ఉన్న నాచు లాగా కనీకనపడని మనస్తత్వాలు ఉన్నాయి. దానినే వస్తువుగా తీసుకొని నవలీకరించిన సందర్భమో "పాకుడు రాళ్ళు" జీవన పోరాట గమనాన్ని తెలిపేది నవల.

**ముగింపు :**

తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడితడు. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఈయనది. దిగువ మధ్యతరగతి మరియు పేదప్రజల భాషపై గట్టి పట్టు ఉంది. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించేవాడు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు అవగాహనకొచ్చాయి. ఆ అనుభవంతోనే ఆయన రచనలు చేసారు. పేరు ప్రఖ్యాతలు సాధించారు.

**ఆధార గ్రంథాలు :**

1. మన ఆధునిక కవుల - జీవిత విశేషాలు - సాహితీవాణి, ప్రచురణ : భరణి పబ్లికేషన్స్ (2014), విజయవాడ.
2. పాకుడురాళ్ళు : జ్ఞానపీఠ గ్రహీత రావూరి భరద్వాజ నవల.
3. తెలుగు వెలుగు - జూలై 2017 సంచిక.

# జానపద సాహిత్యము - స్త్రీల పాటలు

- నళిని

**పరిచయము :**

స్త్రీల పాటలను జానపద సాహిత్యములో ఒక భాగముగానే పలువురు పేర్కొనిరి. కాని స్త్రీల పాటలన్నిటిని పరిశీలించినచో మనకొక విషయము స్పష్టమగును. అది ఏమనగా స్త్రీల పాటలన్నియు జానపద సాహిత్యమునకు చెందవనియు పౌరాణికపు పాటలు, భక్తి పాటలు, పెళ్ళి పాటలు మున్నగునవి కొంత ఉన్నత స్థాయిని కలిగి శిష్ట సాహిత్యమునకు చెందియుండును.

"జాతి దేశి, పామరదేశి అనుచు శుద్దదేశి రెండు విధములు. వీనిలో జాతి దేశికి చెందినవి స్త్రీల పాటలనియు, కాని స్త్రీల పాటలలో పౌరాణికపు పాటలు, భక్తి పాటలు, నోములు, వ్రతములకు సంబంధించినవి, పెళ్ళి పాటలు మున్నగునవి పేర్కొనవచ్చును". - తెలుగులో వీరగాథా కవిత్వము - తంగిరాల వెంకట సుబ్బారావు.

పామరదేశికి చెందిన గేయములను జానపదచ్ఛాయలు కలిగిన పాటలుగా గ్రహించవచ్చును. మొత్తము మీద స్త్రీల పాటలో అటు శిష్ట సాహిత్యమునకు గాని ఇటు జానపద సాహిత్యమునకు గాని చెందక ఒక విశిష్టమైన శాఖగా రూపొందించినవని భావింపవచ్చును.

**స్త్రీ ప్రాధాన్యము :**

స్త్రీల పాటల ప్రాధాన్యమును గూర్చి తెలిసికొనుటకు పూర్వము స్త్రీలకు కుటుంబము నందును, సంఘము నందును గల స్థానమును గూర్చి తెలుసుకొనుటకు అత్యావశ్యకము.

సదనమణిమయ దీపికాజ్వాల బాల
వల్లభ మనోమ దావళవారి నారి
శుభం పరంపర వర్ణించుసోనచాన
పృధుల ధర్మార్థమణిగణ పేటి చోటి - 2

- వరహావతార కథ, పుట - 35.

సంసార సాగరమున తరియింప జేయు తరణి అనియు, నెత్తావి వెదజల్లు చెంగలువ అనియు, శుభం పర వర్ణించుసోన అనియు, ధర్మార్థమణిగణ పేటి అనియు, ప్రముఖముగా స్త్రీ యొక్క ప్రాధాన్యము వివరింపబడినది.

ప్రాచీన కాలము నుండియు మనదేశము నందు స్త్రీకి గౌరవ స్థానము కలదు. స్త్రీని శక్తి స్వరూపిణిగా భావించి గౌరవించుట మన సంప్రదాయము. లక్ష్మీనారాయణులు, ఉమామహేశ్వరులు, సీతారాములు, అనుచు స్త్రీ నామమును మునుముందుగ పేర్కొనుట యందే భారత దేశము నందు స్త్రీకి గల గౌరవాభిమానములు వ్యక్తమగుచున్నవి.

సకార, తుకార, రేఫముల కలయికతో స్త్రీ అను పదమేర్పడినది. సకారము సత్వ గుణమునకు, తకారము తమో గుణమునకు, రేఫము రజోగుణమునకు చిహ్నములు. మృదుత్వము, అణకువ, సహన శీలతలు, సత్వ గుణమునకు; సిగ్గు, భయము, మందత్వములు, తమో గుణములకు; ధైర్యము సాహసము, స్వతంత్రతలు రజోగుణమునకు లక్షణములు. ఈ మూడు గుణముల కలయికయే స్త్రీ. అయినప్పటికిని సత్త్వగుణమే అధికముగ నుండుటచే స్త్రీ సాత్త్వికురాలుగా మన్ననలను పొందుచున్నది.

"ప్రపంచ సాహిత్యం యావత్తూ పరికించి చూస్తే భారతీయ సాహిత్యంలో కనబడే సత్యం ఛాయాలు మరెక్కడా కనబడవు. పాశ్చాత్య రచయితలు, తత్త్వవేత్తలు, మహనీయులు భారతీయ మహిళను అనేక దృష్టి కోణాల నుండి చూచి స్త్రీత్వపు పరిపూర్ణ మూర్తులుగా పరిగణించారు".

- యుగముల్లో భారతీయ మహిళ - శ్రీమతి జి. వసుంధర.

ఈ విధముగా స్త్రీ కుటుంబ విధి నిర్వహణము నందు ప్రముఖ పాత్రను నిర్వహించుచు తన బిడ్డలను సక్రమ

మార్గమున నడిపించుచు సమాజాభివృద్ధికి తోడ్పడు చున్నది.

## స్త్రీల పాటల విశిష్టత :

లలిత సుందరమైన భావన, సూటిగా హృదయమును తాకు అనుభవ గర్భిత పదావళియును నైసర్గికమైన సంగీతమును స్త్రీల పాటల ప్రత్యేక లక్షణములు. స్త్రీల పాటలను ఒక ప్రత్యేక శాఖగ పరిగణించుటకు గల కారణము కుటుంబమునను, సంఘమునను స్త్రీకి గల ప్రాధాన్యము స్పష్టమగును.

తలకట్టుల నుండి చీరకట్టు వరకును గల సౌందర్య పోషణము, వేష భాషల యందు వారికి గల మక్కువ మున్నగు సర్వ విషయములను మనకు స్త్రీల పాటలలో దర్శనమిచ్చును. ఆయా విషయములను స్త్రీ హృదయ మును గూర్చిన సమగ్రమగు అవగాహన, పరిజ్ఞానము కలుగును. కావుననే స్త్రీల పాటలను ప్రత్యేకమగు శాఖగా పరిగణించుట జరిగినది.

## ఇతిహాసములు, పురాణములు పాటలుగా ఏర్పడు టకు కారణములు :

ప్రాచీన కాలమున స్త్రీలకు అక్షరాస్యత తక్కువ. గార్గి, మైత్రేయి, మున్నగు మునికాంతల వలెను, ద్రౌపది, సీత మున్నగు విదుషిమణుల వలెను గాక తరవాతి కాలమున స్త్రీలకు విద్య కొరవడినది.

స్త్రీలకు కేవలము కుటుంబ జీవనమును, భర్తకు, అత్తమామలకు, లోబడియుండి సంతానమును సక్రమ మగు మార్గమున నడిపించుచు ఆతిథ్య భ్యాగతులను ఆదరించుచు కుటుంబ గౌరవమును ఇనుమడింపజేయు బాధ్యత స్త్రీలపై పడినది. ఈ విధి నిర్వహణమున ఆమె తీరికగాని, ఇతర విషయములపై జిజ్ఞాసగాని లేకుండ కేవలము కుటుంబమునకే అంకితమై "లోగిలి కైలాస మనియు, ముంగిలి వైకుంఠమనియు" భావించినది.

కావుననే ఇతిహాస, పురణములను పాట రూపమున రచించినచో వాని నామె నిత్యము గానము చేయుచు ఇహపర సాధ్యమగునట్లు తన జీవితమును నడిపించు కొనగలదను ఆశయముతో వీనిని పాటలుగ రచించిరి.

ఈ పాటలు పాడుటకు ప్రత్యేకించి సమయం వెచ్చింప పనిలేదు. భగవంతుని గుణగానము చేయుట వలన మనసుకు ప్రశాంతత చేకూరి గృహ కృత్యము లన్నింటిని చాకచక్యముతో నిర్వహింపగల సమర్థు రాలగును. ఈ సదుద్దేశముతో స్త్రీలకు ఆవశ్యకమగు విజ్ఞాన మంతయు పాటల రూపమున పొందుపరుప బడినది.

## స్త్రీల పాటల లక్షణములు :

స్త్రీల పాటల లక్షణములన్నియు ఇంచుమించుగ జానపద సాహిత్య లక్షణములనే పోలియుండును. డా॥ బి. రామరాజు గారు నిర్ణయించిన లక్షణములు ఆధా రముగా ఇవి నిర్ణయింపబడినవి.

- ♦ స్త్రీలు మాత్రమే పాడుకొను పాటలు స్త్రీల పాటలు
- ♦ జానపద సాహిత్యము నందు వలెనే దీనియందును కవి యొక్క ప్రసక్తి తక్కువ. కాని శిష్ట సాహిత్య చ్ఛాయలు గల గేయములందు కవి ప్రసంశ కాన వచ్చును. అయినప్పటికిని దీనిని స్త్రీల పాటలుగనే పరిగణింపవచ్చును. కవి ప్రసంశ వచ్చుట కేవలము అపవాదము మాత్రమే ఈ పాటలను వ్రాసినది స్త్రీయైనను కావచ్చును, పురుషుడైనను కావచ్చును, దీనియందు పాటపాడు వ్యక్తికే ప్రాధాన్యము కాని రచయితకు ప్రాధాన్యము లేదు.

## స్త్రీల పాటల పరిధి :

పై లక్షణములు ఆధారముగ స్త్రీల పాటల పరిధిని నిర్ణయించవచ్చును. స్త్రీ గృహ సామ్రజ్ఞి. గృహ జీవనమునకు సంబంధించిన పాటలన్నియు గృహ జీవన సారస్వతము లోనికే చేరును. భక్తి పాటలన్నియు స్త్రీల పాటల పరిధి లోనికి చేరవు. అవి పురుషులు కూడా గానము చేయు దురు. కథా గేయములందు గూడ పౌరాణికములు వ్రత కథలు, వ్యవసాయ సంబంధమైన వానిలో స్త్రీలు పాడు కొనుననియును స్త్రీల కథా గేయములకు చెందినవి. పేరంటాండ్రు కథల పాటలను స్త్రీలు పాడుకొనక పోయినప్పటికిని స్త్రీ జీవితము ఇతివృత్తముగా కలిగి యుండుటచే వీనిని స్త్రీల పాటలుగా పరిగణింపవచ్చును.

**ముగింపు :**

ఈ విధముగ స్త్రీల పాటలు విశాలమగు పరిధిని కలిగియుండి వివిధ విషయములను విశదీకరించుచు స్త్రీ మనస్తత్వమును చాటి చెప్పుచున్నవి. స్త్రీల మనోభావములు, ఆశలు, ఆశయములన్నిటిని ఈ పాటలు ముగ్ధ మనోహరముగా తెలియజేయుచు ఒక విశిష్ట శాఖగా అవతరించినవి.

**ఆధార గ్రంథాలు :**


| పుస్తకము పేరు | రచయిత పేరు |
|---|---|
| 1. తెలుగులో వీరగాథా కవిత్వము | తంగిరాల వెంకట సుబ్బారావు |
| 2. దశావతార చరిత్ర | ధరణిదేవుల రమయమంత్రి |
| 3. యుగముల్లో భారతీయ మహిళ | శ్రీమతి జి. వసుంధర |
| 4. స్త్రీల పాటలు | శ్రీనందిరాజు చలపతిరావు |
| 5. స్త్రీల పౌరాణిక పాటలు, స్త్రీల రామాయణ పాటు | శ్రీపాద గోపాలకృష్ణమూర్తి |
| 6. వేడుక పెండ్లి పాటలు | తెన్నేటి తిరుమలదాసు |


❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# సంఘసంస్కర్తగా, విమర్శకుడిగా కందుకూరి

– డా॥ భూక్య తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**పరిచయం :**

నవ్యాంధ్ర వాఙ్మయ నిర్మాతగా ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో అగ్రస్థానం అలంకరించినవారు కందుకూరి వీరేశలింగం పంతులు (1848-1919). నవల చరిత్ర, స్వీయచరిత్ర, హేళనకావ్యము. విమర్శనాటక కర్త, పద్య కావ్యకర్త, శతక కర్త, కథకుడిగా, వ్యాకరణ కర్తగా, చరిత్ర రచయితగా, ఉపన్యాసకుడిగా విద్యావేత్తగా, గొప్ప సంఘ సంస్కర్తగా పరిశోధకుడిగా ... ఇలా తెలుగు సాహితీ క్షేత్రంలో ఎనలేని సేవచేసి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన నవ్యాంధ్ర వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. స్వార్థం లేకుండా జీవితాంతం సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మానవతావాది. సమాజంలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాల్ని, స్త్రీ వివక్షతను అవిద్యను రూపుమాపడానికి నిరంతరం కృషిచేసినవాడు. తెలుగు సాహిత్యం- సమాజం ఉన్నంతవరకు ఆదర్శ మూర్తిగా నిలిచి తెలుగువారు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగంపంతులు.

నిజమైన ప్రగతివాదులు ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటారు. ప్రజల శ్రేయస్సు కోసమే పోరాటాలు చేసి విజయాలు సాధిస్తారు. బడుగు, బలహీన వర్గాలవారి అవసరాలను వారి బాగును కాంక్షించి పాటుపడ్డవారే కందుకూరి వీరేశలింగం పంతులు. వీరిలో విప్లవ భావాంకురాలు 1873లోనే ఏర్పడ్డాయి. తనకి ఒక అభిప్రాయం పుట్టిందంటే దానిని నెరవేర్చడానికి విశేషంగా కృషిచేస్తారు. 1873లోనే స్త్రీ విద్య అవసరమని గుర్తించారు. కోరంగిలో తన శిష్యులకు సంగ్రహ వ్యాకరణం అనే గ్రంథాన్ని రచించి దాని ఆధారంగానే పాఠాలు బోధించేవారు. వీరేశలింగంపంతులుగారి కాలంలో పద్యాలు రాసిన వాళ్ళకే గాని, వచనం రాసిన వాళ్ళకు గౌరవం ఉండేదికాదు. "ముద్దియ విద్దె పెద్ద కార్యము" అంటూ స్త్రీ విద్యను సమర్థిస్తూ రచన చేసారు. పాండిత్యంలో వీరేశలింగం పంతులుగారు అసమానులు, అప్పటి వరకు ఎవరూ తొక్కని కొత్త పుంతలు తొక్కాలన్నదే వారి ఆలోచనా విధానం.

'శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్య నైషధం' అనే ప్రౌఢ కావ్యమును రచిస్తే విశ్వవిద్యాలయం వారు ఆమోదించి దానిని పట్టపరీక్షకు పఠనీయ గ్రంథంగా చేసారు. ఆ తరువాత 'రసికజనమనోరంజనం' అనే కావ్యాన్ని రాసారు. ప్రభుత్వం ఈ కావ్యాన్ని ఆమోదించి ఎఫ్.ఎ. తరగతికి పాఠ్యాంశగ్రంథంగా పెట్టారు. పంతులుగారు ఇంతటితో ఆగకుండా ఇతర పత్రికలు చదవడం వల్ల వారిలో అభ్యుదయ భావాలు ఏర్పడ్డాయి. ఆనాడు స్త్రీ విద్య మీదనే కాదు, స్త్రీ పునర్వివాహ సమస్యపై కూడా పురుషార్థ ప్రదాయినిలోనూ, తత్త్వబోధినిలోనూ, వ్యాసాలు వస్తూ ఉండేవి. వాటినన్నింటిని పంతులుగారు పరిశీలిస్తూ ఉండేవారు. ఆత్మూరి లక్ష్మీనరసింహంగారి ప్రోత్సాహంవల్ల పంతులుగారు, వారి స్నేహితులు ఒక చర్చావేదిక సొసైటిని ఏర్పాటు చేసుకున్నారు. నలుగురు ఒకచోట చేరి సభ చేయడం ఆ రోజుల్లో తప్పు. అందువల్ల వాళ్ళు ఇంట్లో తలుపులు మూసుకొని సభ ఏర్పాటు చేసుకొని చర్చించుకొనేవాళ్ళు. పంతులుగారు తన ముప్పయ్యోయేట రాజమండ్రిలో ప్రార్థన సమాజాన్ని స్థాపించారు. కొంతమంది పెద్దమనుషులు ఈ సమాజంపేరు విని పరిహసించే వాళ్ళు. వెక్కిరింతలకు భయపడి ప్రారంభించిన పనిని విడిచే స్వభావం వీరేశలింగంపంతులుగారిలో ఏకోశాన లేదు. తను నమ్మిన సిద్ధాంతాలను, భావాలను వెల్లడి చేయకపోవడం అన్నది కూడా తనలో లేదు.

స్త్రీ విద్యావాదాన్ని ప్రారంభించిన ఏడాదిలో తమ ఆలోచనలని స్వంతపత్రిక ద్వారా సమాజానికి పరిచయం చేయడం మంచిదని 1874లో వివేకవర్ధిని పత్రికను స్థాపించి తన అభిప్రాయాలను నిర్భయంగా ప్రకటించారు.

స్త్రీ విద్యకోసం ప్రచారం చేశాక పంతులుగారు స్త్రీ పునర్వివాహాల కోసం కృషిచేశారు. 1874లో శుద్ధ వ్యావహారిక భాషలో "బ్రహ్మ-వివాహం" అనే నాటకం రాసారు. దానిని జనులు సమూహంగా కూర్చుని చదువుకొనేవారు. పంతులుగారు ఏ పేరు పెట్టినా ప్రజలు దాన్ని పెద్దయ్యగారి 'పెళ్ళిపుస్తకం' అని పిలిచేవారు. తెలుగులో ఇది మొదటి సాంఘిక నాటకం.

చిన్నప్పటినుండి వీరేశలింగం పంతులుగారిలో నాయకత్వపు లక్షణాలున్నాయి. పాఠశాలలో ఎవరు మంచి విద్యార్థి అని పరిశీలిస్తే తమ తరగతివాళ్ళే కాకుండా, పై తరగతివాళ్ళు, క్రింది తరగతివాళ్ళు ఏకగ్రీవంగా వీరేశ లింగం పంతులుగారి పేరే చెప్పారట. అదే సమయంలో ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానం లేని అసమర్ధ హెడ్మాస్టరు వద్దని పెద్ద ఎత్తున ఆందోళన చేసి, అతనిని బదిలీ చేయించారు పంతులుగారు.

పునర్వివాహ సమస్యను కూలంకషంగా చర్చించు కోదలచారు. ఆ రోజులలో ఈ సమస్యపై ఏఏ పుస్తకాలున్నాయో అతనికి తెలియవు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ల పుస్తకాలున్నట్లు తెలిసినా అవి అలభ్యాలు మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి,, పరాశరస్మృతి ఉన్నాయి. తత్త్వబోధినిలో వ్యాసం, పురుషార్థ ప్రదాయినిలో వ్యాసాలు వారికి కొంతవరకు తోడ్పడ్డాయి. వీటి సహాయంతో తను తొలివ్యాసం రాసారు. 1879లో రాజమండ్రి విజయనగర మహారాజా వారి బాలికల పాఠశాలలో స్త్రీ పునర్వివాహ విషయంపై మొదటిసారిగా ఉపన్యాసం ఇచ్చారు. వారి ఉపన్యాసం ప్రచురించగానే ఆంధ్రదేశమంతటా దీని గురించి చర్చలు జరిగాయి. ప్రతివాదులకు సభలలోనూ, పత్రికల ద్వారా సమాధానాలు ఇచ్చారు. పునర్వివాహం చేసుకున్న వాళ్ళకి ఆర్థికంగా రక్షణకల్పించే బాధ్యత తనదేనని వారికి నెలకు సరిపడే ఆదాయం సమకూర్చడానికి అభ్యుదయ భావాలుగల వ్యక్తులను ఆర్థికంగా ఉన్నవాళ్ళను, సంప్రదిస్తే అన్నదేవరపేట జమీందారుడైన పైడా రామకృష్ణయ్యగారు కందుకూరి వీరేశలింగం పంతులుగారి ఉద్యమానికి ముప్పయి వేల రూపాయల ఇస్తానని ప్రకటించారు. 1881లో అనేక సమస్యల మధ్య మొదటి పునర్వివాహం జరిపించారు. విద్యార్థుల అండదండలతో పంతులుగారు దాదాపు 55 పునర్వివాహాలు జరిపించారు.

తెలుగు భాషను అభివృద్ధి చేయాలని తనకు చిన్నప్పటి నుండి కోరిక ఉండేదని తన స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. తనకు పన్నెండో సంవత్సరం నుండి భారతంలోని యుద్ధాల గురించి, తపస్సుల గురించి చదవడం సరదా. పంతులుగారికి భారతంలోని ఉత్తర గోగ్రహణం అంటే చాలా ఇష్టం. తరువాత దక్షిణ గోగ్రహణాన్నే స్వతంత్ర నాటకంగా రాశారు. చిన్నప్పుడు వసుచరిత్ర అంటే చాలా ఇష్టం అది తన ఇంట్లో లేకపోతే ఆ పుస్తకం లభించే షాపులో ఒక నెల జీతం ముందుస్తుగా ఇచ్చి అక్కడే కూర్చొని చదువుకొనేవాడు. సంఘ సంస్కరణోద్యమం ప్రారంభించముందు పంతులుగారు కావ్య రచన చేస్తూ గర్భకవిత్వం, బంధ కవిత్వాన్ని రాశారు. స్త్రీలు పూనుకోకపోతే సంఘ సంస్కారం జయప్రదం కాదని పంతులుగారి అభిప్రాయం. అందుకే స్త్రీల కోసం సత్యవతి చరిత్ర. చంద్రమతీ చరిత్ర, సత్య సంజీవని మొదలైన వచన కావ్యాలు రాశారు. శాస్త్ర పరిజ్ఞానం పెరగకపోతే దురాచారాలు రూపుమాపవని విశ్వాసంతో పంతులుగారు వాటికి సంబంధించి అనేక గ్రంథాలు రాసారు. శరీర శాస్త్ర సంగ్రహం, జంతుజ్యోతిశాస్త్ర సంగ్రహం, జంతు స్వభావ చరిత్రం, పత్నీహిత సూచని అనే గ్రంథాలు రాశారు. రాజశేఖర చరిత్ర నవల సత్యారాజా పూర్వ దేశ యాత్రలను కూడా ప్రజలలో ఉన్న మూఢాచారాలు తగ్గించడానికే రాశారు. రాజశేఖర చరిత్ర నవలలో ఆంధ్రుల జీవితాలలో ఉన్న మూఢ విశ్వాసాలు, దురాచారాలు, దురాభిమానాలు, ముఖస్తుతులు, మోసాలు, భూత వైద్యాలు మొదలైన వాటిని ఆ నవలలో వర్ణించి తూర్పారపట్టారు. ఈ నవలపై గోల్డ్‌స్మిత్ రాసిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ ప్రభావం ఉన్నట్లు కన్పిస్తుంది. తెలుగునవల సాహిత్యంలో నూతన శకాన్ని ప్రారంభించింది రాజశేఖర చరిత్ర నవల. కందుకూరి వీరేశలింగం పంతులుగారు గ్రంథ పరిశోధన

కోసం తంజావూరు సరస్వతీ మహలుకు వెళ్ళారు. అక్కడి పుస్తకాలు చదివి వాటిలోంచి తనకవసరమైన భాగాలు రాసుకునే వారు అక్కడే ఉండి చాలా గ్రంథాలకు ప్రతులు రాయించారు. మూడు సంవత్సరాలు ఎండా కాలపు సెలవుల్లో చెన్నపట్నంలో ఉండి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో బ్రౌనుదొరగారు నిక్షిప్తం చేసిన గ్రంథాలు, మెకంజీ కైఫీయతులు, సూయిల్ దొరగాని శాసన సంపుటాలను కూడా పరిశీలించారు.

సంఘ సంస్కరణ ఒక వైపు చేస్తూనే మరోవైపు వివిధ ప్రక్రియలు రాశారు. సంస్కృతం నుండి ఆంగ్లం నుండి నాటకాలు అనువదించారు. స్వతంత్ర నాటకాలు, నవలలు, కావ్యాలు, వ్యాసాలు, ప్రహసనాలు, స్త్రీల కోసం రచనలు చేసారు. పత్రికలు నడిపారు. పంతులుగారు ఉత్తమ సాహిత్యాభిరుచి గలవారు. ఉత్తమాభిరుచి ఉత్తమవిమర్శకు దారితీయును. తెలుగు సాహితీ క్షేత్రంలో విమర్శనా స్రవంతిని అవతరింపచేసిన భగీరథుడు కందుకూరి వీరేశలింగం పంతులు. తొలి తెలుగు విమర్శనా గ్రంథమును వెలువరించిన కీర్తిమూర్తి కందుకూరి వారు రచించిన "విగ్రహతంత్ర విమర్శనం" వివేకవర్థిని పత్రికలో 1876లో వెలువడింది. తెలుగు సాహిత్యంలో వెలువడిన ప్రప్రథమ సాహిత్య విమర్శనా గ్రంథమిది.

తెలుగులో కందుకూరి వీరేశలింగం పంతులుగారి కంటే ముందు సాహిత్యవిమర్శ లేదని చెప్పవచ్చు. విమర్శకు నాందీ రూపమైన కృషి కొంత ఉన్నా అది మొత్తం ఆంగ్ల భాషనుండి వచ్చిందే. కావ్య వ్యాఖ్యానాలు కొన్ని వెలువడినప్పటికీ అవన్నీ టీ కాప్రాయములే కాని, అచ్చమైన వ్యాఖ్యానములు కావు. విమర్శకు స్పష్టమైన స్వరూపం ఏర్పర్చి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించి ప్రత్యేక ప్రక్రియగా చూపించిన ప్రథమాంధ్ర విమర్శకుడు పంతులు గారు. వివేకవర్థిని పత్రికలో సాహిత్య విమర్శ, పంతులుగారు రచించిన కవుల చరిత్ర, సరస్వతీ నారద విలాపం. సాహిత్య చరిత్రకు కవిత్వ తత్త్వ వివేచనకు మార్గదర్శకాలైనవి. లక్ష్య విమర్శకు నాంది పలికిన విగ్రహ తంత్ర విమర్శనం భాషా విశేషాలకు, కావ్యగతాంశాలను పరామర్శించింది. తొలి తెలుగు విమర్శనా గ్రంథం "విగ్రహతంత్ర విమర్శనం" ప్రథమాంధ్ర విమర్శకులు కందుకూరి వీరేశలింగం పంతులుగారని చెప్పవచ్చు. పంతులుగారి విమర్శవ్యాసాలు వివేకర్థని (1874-94), హాస్య సంజీవని (1876), చింతామణి (1892-98) మొదలైన పత్రిలలో వెలువడినవి. విమర్శగ్రంథం, కవుల చరిత్ర, పద్యకావ్యం మొదలైనవి. అతని విమర్శ ప్రక్రియలు. ఇవే కాకుండా వివిధ పత్రికలలో గ్రంథ సమీక్షలు, వ్యాసాలు ప్రాచీన కావ్యాలకు కూర్చిన లఘు పీఠికలు, లక్షణ గ్రంథాలు కలవు.

విగ్రహతంత్ర విమర్శనం ఆంధ్ర వాఙ్మయ విమర్శ గ్రంథాలలో ఉత్తమమైనది. దీనికి సంబంధించిన ఒక కథ కలదు. 1872లో కొక్కొండ వేంకటరత్నం పంతులు విగ్రహ తంత్రం రాశారు. ఈ గ్రంథానికై శివశంకరపాండ్యా టిప్పణి రాశారు. ఈ గ్రంథారంభమున ఆంధ్ర వచనారంభ వికాసములు, గ్రంథకర్త జీవితం అనే అనుబంధాలు చేర్చారు. కొక్కొండ వేంకటరత్నం విగ్రహతంత్రంను అనుసరించే వీరేశలింగంగారి విగ్రహతంత్ర విమర్శనం ఎడమ చేతి రాతగా రాయబడిందని శివశంకరపాండ్యా పేర్కొన్నారు. కొక్కొండ రచనలోని దోషాలను చూపుటకై కందుకూరి వివేకవర్థిని పత్రికలో "గుణాగుణ ప్రదర్శనీ సామాజికుడు" అనే పేరుతో "విగ్రహతంత్ర విమర్శనం"ను ధారావాహికగా వెలువరించారు. ఆంగ్లానుబంధాలు తప్ప టిప్పణి మొత్తం వేంకటరత్నంగారే పాండ్యా పేరుతో రాశాడని పంతులుగారి అభిప్రాయం. చివరికి పంతులుగారి అనుమానమే నిజమైంది. విగ్రహతంత్ర విమర్శనం ఎక్కువగా భాషాపరమైన విమర్శతో కూడి ఉంది. అపశబ్దాలు సందర్భశుద్ధిలేని వ్యర్థ పదాలు, సంస్కృత భాషా పరిజ్ఞానం లేకపోవడం వలన మూలాన్ని సరిగా అవగాహన చేసుకోలేదని కందుకూరి అభిప్రాయం. ఈ గ్రంథంలో దోషాలున్నను యమకపుష్టి, నారికేళపాకంతో ఒప్పుచు భాషావ్యాకరణ పరిజ్ఞానమునకు తోడుపడుతుందని పేర్కొన్నారు.

ప్రారంభకాలంలో కందుకూరి క్షీణ యుగ ప్రభావంతో "శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్య కావ్యం"ను రచించి అచిర

కాలంలోనే తన పొరపాటును తెలుసుకొని దాన్ని సవరించుకున్నారు. ప్రబంధ సాహిత్యాన్ని విమర్శించడం కోసం "అభాగ్యోపాఖ్యానం"ను 1876లో హాస్య ప్రబంధమును రాశారు. ఇందులో 116 గద్య పద్యాలున్న ఏకాశ్వాసకావ్యం హేళన కావ్యాలను పరిహసించుటకు రాయబడింది. ప్రబంధయుగం తరువాత వెలువడిన "శృంగార కావ్యాల్ని పరిహసించడం కోసం కందుకూరి ఈ గ్రంథాన్ని రాశారు. అభాగ్యోపాఖ్యానము విమర్శ గ్రంథాలలో చేరలేదు. హేళన కావ్యాల్లో దీన్ని కొందరు చేర్చారు. అయితే హేళనలో కూడా తప్పనిసరిగా విమర్శ ఉంటుంది. ఇందులో నిశితమైన కావ్య పరిశీలన కూడా ఉంది.

క్షీణ యుగ ప్రబంధాలలోని దోషాల్ని ఎత్తిచూపడం కోసం పంతులుగారు రాసిన లఘు పద్యకావ్యం సరస్వతీ నారద విలాపం (1895). భాషా వదూటి భారతి కుమారుడైన నారదుని తనదైన స్థితిని వెల్లడించగా నారదుడు వాగ్దేవి స్థితిని గమనించి బాధపడి ఆ హీనదైన పరిస్థితుల నుంచి భారతిని ఉద్ధరించడానికి దూరంగా తీసుకొని పోవడం ఈ గ్రంథంలోని ప్రధాన ఇతివృత్తం.

ప్రబంధాలలోని శృంగారంపై విమర్శచేసిన ప్రథమాంధ్ర విమర్శకుడు కందుకూరి. కవుల చరిత్రలోను పత్రికా వ్యాసాలలోను సందర్భానుసారంగా శృంగార ప్రబంధాలను విమర్శించారు. తారాశశాంక విజయాది ప్రబంధాలు అవినీతికి, అధర్మబోధకాలు. వసుచరిత్ర కావ్యం కామోన్మాద ప్రేరకమైనదని అంతగా చదువుకోవడానికి ఉపయోగపడదని విమర్శించేను. దిష్టి బొమ్మలుగా ఉన్న వేశ్యావృత్తి అంతరించలేదని, వేశ్యావృత్తి నిర్మూలనకు కృషిచేసారు. వివిధ పత్రికలలో గ్రంథ సమీక్షలు చేసారు. 'వివేకవర్ధనీ'లో 'ఆదానిక' శీర్షిక పేరుతో గ్రంథ సమీక్షలు, వ్యాసాలు రాశారు. ఒకే ఛందస్సులో రాయబడిన వావిలాల వాసుదేవశాస్త్రి 'సీజరుచరిత్ర'ను సమీక్షిస్తూ ఛందోవైవిధ్యం లేకపోవుట కొరతగా ఉందని అన్నారు. పూండ్ల రామకృష్ణయ్య హరిశ్చంద్రనలోపాఖ్యాన పీఠికను ఖండించారు. బమ్మెరపోతనపై ప్రత్యేకవ్యాసాలు రాశారు. అనేక ప్రాచీనాంధ్ర కావ్యాలు పరిష్కరించి వాటికి పీఠికలు కూడా రాశారు.

పద్యగద్య రూపాలలో కొనసాగిన పంతులుగారి విమర్శలన్ని పత్రికాపరంగా వెలువడినై. ఆనాడు సాహిత్య విమర్శలకు పాశ్చాత్య సాహిత్య పరిచయం ప్రేరకంగా తోడ్పడింది. పంతులుగారికి ఆంగ్ల భాషలో ప్రావీణ్యం ఉండటం వలన అనేక ఆంగ్ల కావ్య రూపకాలను అనువదించారు. ఆంగ్ల విమర్శ ప్రభావం వారిపై అధికంగా ఉంది. అందుకే బహుషా స్పెన్సర్ కవి రాసిన "The Tears of Muses" సరస్వతీ నారద విలాపంకు ప్రోద్బలం కావచ్చు. కవుల చరిత్ర రచనకు కూడా "Lives of Poets" (జాన్సన్) వంటి ఆంగ్ల సాహిత్య చరిత్రలు మార్గదర్శకములై ఉండవచ్చు. తెలుగులో సాహిత్య విమర్శనావతరణకు దారితీసిన ప్రథమాంధ్ర విమర్శకులు కందుకూరి. కట్టమంచి రామలింగారెడ్డి తన "కవితాతత్త్వ విచారము"ను సవరణలకై వీరేశలింగంపంతులుగారికి పంపించారు. పంతులుగారు రాసిన వ్యాసాల్ని విషయ వైవిధ్యాల్ని బట్టి వ్యాసాలు, విమర్శవ్యాసాలు, సాంఘీక వ్యాసాలు, ఆర్థిక, రాజకీయ వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు, జీవిత చరిత్ర వ్యాసాలు, మత సంబంధ వ్యాసాలు, విద్యావ్యాసాలు, నైతిక వ్యాసాలు, విజ్ఞాన శాస్త్రవ్యాసాలు, శిశువ్యాసాలు, వైద్యవ్యాసాలు, స్త్రీ సంబంధ వ్యాసాలు, వైశ్య సంబంధవ్యాసాలు మొదలైనవి ఉన్నాయి. వీరి శైలి సరళంగా సులభంగా ఉంటుంది. పంతులుగారి గ్రంథాలన్నీ ఒక ఎత్తు అయితే వారి ఆంధ్ర కవుల చరిత్ర మరో ఎత్తు. అందులో ఆనాటికి లభ్యమైన చారిత్రక అంశాల్ని ఆధారంగా తీసుకొని కవుల చరిత్ర రాశారు. ఇందులో 260 మంది కవులున్నారు. ఈ కవుల చరిత్రలో ఎందుకో గాని వేమనకు చోటు దక్కలేదు. పంతులుగారి కాలం విమర్శచరిత్రలో అవతరణ యుగమని చెప్పవచ్చు.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలంగాణ నవలల్లో కులవృత్తుల స్త్రీ - సామాజిక జీవనం

- డా॥ లింగాలమంగమ్మ, పోస్టు-డాక్టొరల్ ఫెలో, తెలుగుశాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలుగు నవలల్లో వస్తు వైవిధ్యం ఉంది. సామాన్య మానవుడు కథానాయకుడు అయ్యాడు. సామాన్య స్త్రీ కథానాయిక అయింది. నవలల్లో సామాజిక పరిస్థితి నిక్షిప్తమైంది. నవల సమాజ జీవన చిత్రీకరణను సమర్థంగా ప్రతిబింబించే సాహిత్య ప్రక్రియగా ఉన్నత దశకు చేరింది. అటువంటి నవల ప్రక్రియలో చిత్రీకరించిన బహుజన స్త్రీ అనగా కులవృత్తుల (వెనుకబడిన) స్త్రీల జీవితాలను పరిశీలించి వివరించడం ఈ పత్ర ఉద్దేశం.

### వెనుకబడిన (కులవృత్తుల) స్త్రీ జీవిత చిత్రణ :

మానవ సమాజ ఎదుగుదలలో బహుజనుల పాత్ర చాలా కీలకమైంది. దాదాపు ఉత్పత్తి కులాలన్నీ బహుజనులవే. మనది వ్యవసాయక దేశం. వ్యవసాయానికి వృత్తులకు అవినాభావ సంబంధం ఉంది. అయితే చాలామంది వీటిని విడదీసి చూస్తున్నారు. కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి, వడ్రంగి, జాలరి.... ఇలా బహుజనులంటే ముందు వారి వృత్తులే మనకు గుర్తుకు వస్తాయి. కులవృత్తులు చేసుకునే బహుజన స్త్రీ ఎన్నో కష్టనష్టాలు అనుభవిస్తుంది. ఆమె ఇంటా బయట అనేక అవమానాలు, పురుషాధిపత్యాన్ని ఎదుర్కొంటుంది. కులవృత్తుల్లో బహుజన స్త్రీ కాయాకష్టం చేయాల్సి ఉంటుంది. అందువల్ల బహుజవ స్త్రీ బయటకు రావాల్సి ఉంటుంది. అలా జీవనం కోసం బయటకు వచ్చిన బహుజన స్త్రీ అగ్రకులాల ఆధిపత్యానికి, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. కులవృత్తుల స్త్రీల జీవన విధానాన్ని తెలంగాణ నవలలు చిత్రీకరించాయి.

**అత్యాచారాలు :**

వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన 'గంగు' నవలలో అంతమ్మ అనే కంసాలి స్త్రీపై జగయ్య దొర తలపెట్టిన అత్యాచారం, ఆమె భర్త నాగభూషణం ఆలోచనల్లో స్త్రీలపై ఆ గ్రామ పెత్తందార్లు అమలు చేసిన అవమానాలు, స్త్రీల ఆత్మహత్యలు మొదలైనవి చెప్పబడ్డాయి. మహీధర రామ్మోహనరావు రాసిన 'ఓనమాలు' నవలలో చాకలి పద్దాలనే సంగకార్య కర్త హత్య, అతని భార్య మంగమ్మపై సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి చేసిన దుర్మార్గం కన్పిస్తుంది. గ్రామాలలో చాకలి, మంగలి,కుమ్మరి, కమ్మరి మొదలగు పనివారంతా వెట్టిచాకిరి చేయవలసి వచ్చేది.

**మూఢనమ్మకాలు :**

బోయజంగయ్య రాసిన 'జాతర' నవలలో మూఢ నమ్మకాలు మనిషిని గుడ్డివాన్ని చేస్తున్నాయనే సత్యాన్ని రచయిత చాకలి మంగితో చెప్పిస్తారు. రాయికి, రప్పకి మొక్కితే పిల్లలు పుడతారనే మూఢనమ్మకంతో స్త్రీలు ఎలా మోసగించబడుతున్నారో రచయిత తెలియజేశారు.

**చాకిరి :**

కులవృత్తుల స్త్రీలు తమ జీవనాన్ని కొనసాగించడానికి దొరల ఇండ్లలో పనులు చేస్తూ పొట్టపోషించుకున్నట్టు ఎం.సుజాతరెడ్డి రాసిన 'సంకెళ్ళుతెగాయి' నవలలో కనిపిస్తుంది. ఈ నవలలో దొరల ఇంటిలో శుభకార్యానికి వచ్చిన వారందరికీ లచ్చి బట్టలుతికి, దొరలకు, దొరసాన్లకు స్నానాలకు కావాల్సిన నీళ్ళను బావినుండి తోడి బిందెలతో లోపలున్న స్నానాల గదుల్లోకి నీళ్ళుతోడి కష్టపడి జీవించడం కనిపిస్తుంది. ఆమె భర్త, పిల్లలు కూడా ఆ దొరలకు చాకిరి చేస్తూ, వారి జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే నవలలో మంగలి ఈరయ్య, అతని భార్య రంగి కూడా దొరలకు వెట్టిచాకిరి చేస్తూ జీవిస్తున్నారు. ఇదే నవలలో మంగలి కులంలో పుట్టిన నారాయణ జీవితం చిత్రించబడింది. ఇది బహుజనుల జీవితాన్ని చిత్రించిన నవల.

**తిరుగుబాటు :**

వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన 'ప్రజల మనిషి' నవలలో బ్రాహ్మణుల పొలం కౌలు చేసుకుంటూ జప్తు

చేయాలని ప్రయత్నించినప్పుడు అంతమ్మ చాకలి ఐలమ్మలా ఎదురుతిరిగి పోరాడుతుంది. దాశరథి రంగాచార్య రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలలో కరణం వెంకటరావు తన భార్య మంగమ్మపై మొదటి మూడు రాత్రులు వరసగా బలాత్కారం చేస్తాడు. భోగం వాళ్ళతో గడుపుతూచెడు తిరుగుళ్ళు తిరిగే ఈ కరణంలాంటి వారు ఆనాటి గ్రామాధికారులు, దొరల విలాసవంతమైన జీవితాన్ని అక్షరాల అనుసరించడానికి గ్రామాధికారులు శ్రామిక స్త్రీలను అనుభవించడానికి ప్రయత్నించేవారు. కామంతో వున్న కరణం కొత్తగా పెళ్ళై వచ్చిన గౌండ్ల వీరిగాడి భార్యతో అక్రమ సంబంధం కొనసాగిస్తాడు. నవలలో చిత్రించబడిన ఇలాంటి సంఘటనలు ఆనాడు గ్రామాలలో కరణాల దౌర్జన్యాలకు బలైన స్త్రీల జీవితాలకు నిలువుటద్దాలు.

బి.ఎస్.రాములు రాసిన బతుకుపోరు (1982) నవల బీడి కార్మికుల జీవితాలతోపాటు, చేనేత కులాల గురించి వారు మధ్యతరగతిగా ఎదుగుతున్న క్రమాన్ని చిత్రించారు. ఈ నవల విశిష్టమైంది. ప్రాసంగికతతోపాటు ఆత్మకథాత్మక లక్షణాలు ఉన్న కార్మిక నవల ఇది. ఈ నవలలో లక్ష్మి, రాజయ్యలు భార్యాభర్తలు. లక్ష్మి, పొరుగింటి పెళ్ళికాని సుగుణ బీడీ కార్మికురాలు. రాజయ్య బట్టల దుకాణంలో గుమస్తా. తమ్ముని డాక్టరు కోర్సు చదివిస్తుంటాడు. పేదరికంలో మగ్గుతున్న జీవితాలు వీరివి. న్యాయంగా ఇవ్వవలసిన కూలిడబ్బులు ఇవ్వకపోవడంతో రామక్క అనే కార్మికురాలి నేతృత్వంలో సమ్మె ప్రారంభమవుతుంది. స్త్రీలు ప్రధాన చోదక శక్తులుగా ఉండడం వల్ల ఏకకాలంలో కార్మికశక్తికి, స్త్రీ శక్తికి ఇది ప్రతీకగా నిలిచిపోతుంది.

**సంచార జాతులు :**

బుడగ జంగార అనే సంచార జాతుల జీవనం పాణిని రాసిన 'గుమ్మెటమోత' నవలలో కనిపిస్తుంది. సంచార జీవనంలో పురుషుడితోపాటు స్త్రీ కూడా సంచార జీవితాన్ని కొనసాగిస్తుంది. ఆమె అనుభవించే కష్టనష్టాలు అన్నీ ఈ నవలలో వ్యక్తీకరించబడ్డాయి. పెద్దింటి అశోక్ రాసిన 'జిరిగి' నవల గుడ్డెలుగు ఆడిస్తూ బతికేవారి జీవితాలను చిత్రిస్తుంది.

తెలుగు నవలకు బహుజన పరిమళం అద్దిన రచయితలలో బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య, బోయ జంగయ్య ముఖ్యులు. బి.ఎస్.రాములు బతుకుపోరు నవలలో పద్మశాలి జీవితం కొంత చోటుచేసుకుంది. తెలుగులో పద్మశాలీల జీవితం గురించి పూర్తిస్థాయిలో వచ్చిన మొట్టమొదటి నవల పోరంకి దక్షిణామూర్తి 1967లో రాసిన ముత్యాలపందిరి. ఇది ఆంధ్రప్రభ వీక్లీలో సీరియల్‌గా వెలువడింది. ప్రపంచీకరణ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వెతుక్కోవడం మొదలైన పరిణామాలను నేపథ్యంగా తీసుకొని పద్మశాలీల జీవితం గురించి, కాలువ మల్లయ్య రాసిన చతుర మాసపత్రికలో గువ్వల చెన్నా నవల ప్రచురించబడింది.

గీత కార్మికురాలిగా మోహిని వ్యక్తిత్వాన్ని ననుమాసస్వామి రాసిన 'మోహిని' నవలలో అద్భుతంగా చిత్రించారు. ననుమాసస్వామి రాసిన మోహిని నవల, నేరెళ్ల శ్రీనివాసగౌడ్ రాసిన బతుకుతాడు నవలలు గౌడ స్త్రీల జీవన విధానాన్ని తెలియజేస్తున్నాయి. నర్సింగ్‌రావు రాసిన జరీపోగు పద్మశాలి స్త్రీల ఆర్థిక స్థితిగతులను వివరిస్తుంది. బి.ఎస్.రాములు రాసిన బతుకుపోరు, చూపు నవలలు బీడికార్మికుల స్త్రీల స్థితిగతులను వ్యక్తీకరిస్తున్నాయి. వి.ఆర్.రాసాని రాసిన మట్టిబతుకులు కుమ్మరి స్త్రీల జీవితాలను, బతుకాట, చీకటిరాజ్యం నవలలు సంచార తెగలైన గంగిరెద్దుల జీవన విధానాన్ని తెలియజేస్తున్నాయి. జి.రాములు రాసిన పెరటిచెట్టు(1954), కె.వెంకటేశ్వర్లు రాసిన కల్లుమండువ నవలలు గౌడల జీవితాలను వివరిస్తున్నాయి. గూడూరు సితారం రాసిన సంఘం నవల పద్మశాలి స్త్రీల జీవితాలను తెలియజేస్తుంది. ఇలా వెనుకబడిన స్త్రీలు తమ జీవనంలో లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, మూఢనమ్మకాలకు, వెట్టిచాకిరీలకు గురవుతూ, కొన్నిసార్లు తిరగబడుతూ సమాజంలో తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారు.

నేరేళ్ళ శ్రీనివాస్‌గౌడ్ రాసిన 'బతుకుతాడు' నవల కళ్ళు గీత కార్మికుల స్త్రీల జీవితాలతో పెనవేసుకున్న రాజకీయాలు, సంస్కృతి, సామాజిక పరిణామాలు

చిత్రించాయి. చేనేత కార్మికుల మొదటితరంఉద్యోగులుగా, విద్యావంతులుగా ఎదిగిన క్రమాన్ని ఆ తర్వాత వారి పిల్లలు గ్లోబలైజేషన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న యువతరం గురించి కాలువ మల్లయ్య 'గువ్వలచెన్నా' అనే నవలలో చిత్రించారు.

సమాజంలో కులవృత్తులు చేసుకునే పురుషుడే ఒక బానిస. కులవృత్తుల స్త్రీ ఆ బానిసకు బానిసలాంటిది. పురుషుడికి కుటుంబ జీవితంకన్నా సామాజిక జీవితంలోనే సమస్యలెక్కువ. కానీ స్త్రీ కుటుంబ సమస్యలను, సామాజిక సమస్యలను ఏకకాలంలో ఎదుర్కోవాల్సి వస్తుంది. స్త్రీలుపడిన మనోవేదన, అస్సహాయత, బాధలు, సమస్యలు మొదలైన అంశాలు ఈ నవలల్లో ప్రధాన వస్తువుగా కనిపిస్తున్నాయి. ఈ నవలల్లో కులవృత్తుల స్త్రీలు వివిధ రూపాలలో కనిపిస్తున్నారు. కొందరు పల్లెపడుచులుగా దర్శనమిస్తే, మరికొందరు భూస్వాములకు దాసీలుగా, మోసగించబడినవారుగా కనిపిస్తున్నారు. అంతేగాక అభ్యుదయ స్త్రీల సామాజిక జీవనం కూడా తెలియజేయబడింది. సృష్టికే ఆధారభూతమైన స్త్రీ జీవనం మీద వచ్చిన అనేక రచనలమీద పరిశోధన జరగవలసిన ఆవశ్యతక ఎంతైనా వుంది. అందునా బహుజన స్త్రీల జీవనం మీద మరికొంత లోతుగా అధ్యయనం చేయడం వల్ల మట్టిలో మాణిక్యాలావంటి ఎందరో స్త్రీమూర్తులు భావితరాలకు ఆదర్శప్రాయులుగా ఉండగలరు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. ఉదయ,ఎం. తెలుగు నవలల్లో తెలంగాణా జనజీవనం. హైదరాబాదు: శ్రీబాలాజి ఆర్ట్ ప్రింటర్స్, 1999.
2. చంద్రశేఖర్‌రెడ్డి,రాచపాళెం(సం). 1980 తర్వాత తెలుగు దళిత నవల. హైదరాబాదు: సెంటర్ ఫర్ రూరల్ స్టడీస్ అండ్ డెవలప్‌మెంట్,2013.
3. ననుమాసస్వామి. మోహిని.సికింద్రాబాదు: ఉదయశ్రీ ప్రచురణలు, 1994.
4. మంగమ్మ,లింగాల. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార నవలలు - పరిశీలన. హైదరాబాదు : హైదరాబాదు విశ్వవిద్యాలయం (అముద్రిత సిద్ధాంత గ్రంథం).2014.
5. రాములు,బి.ఎస్. బహుజనతత్వం. హైదరాబాదు: విశాల సాహిత్య అకాడమి, 2003.
6. రాములు, బి.ఎస్. బతుకుపోరు. హైదరాబాదు: విశాల సాహిత్య అకాడమి, 2006.
7. రాంబాబు, నూనావత్. గిరిమల్లెలు (అంతర్జాతీయ భాషా, సాహిత్య వ్యాసాలు). విశాఖపట్నం : రోషన్ పబ్లికేషన్స్, 2018.
8. వెంకటేశ్వరరావు,దార్ల. బహుజన సాహిత్య దృక్పథం. హైదరాబాదు : సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు, 2012.
9. వెంకటేశ్వర్లు,ఏకుల. ఎన్నెల నవ్వు. ఒంగోలు : బహుజన కెరటాలు ప్రచురణలు, 2011.
10. సిధారెడ్డి,నందిని. కులవృత్తులు తెలంగాణ సాహిత్యం. హైదరాబాదు: తెలంగాణ రచయితల వేదిక, 2008.
11. సుజాతరెడ్డి, ముదిగొండ. సంకెళ్ళుతెగాయి. హైదరాబాదు:రోహణం ప్రచురణలు, 1994.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# దేశికవితా ప్రక్రియల ఆద్యుడు - పాల్కురికి సోమనాథుడు

- జె. విజేందర్, నిజాం కాలేజ్ (ఓ.యు.).

**ఉపోద్ఘాతం :**

తెలుగు సాహితీవనంలో తెలుగు చందంలో గానం చేసిన తొలి కవికోకిల పాల్కురికి సోమనాథుడు. దేశి కవితా పతాకాన్ని తెలుగు సాహితీ లోకంలో ప్రతిష్ఠించిన ఘనుడు. దేశీయచ్ఛందమైన ద్విపద, పురాణం, శతకం, చరిత్రకావ్యం, ఉదహారణ, రగడ, మొదలగు దేశి ప్రక్రియలకు పట్టాభిషేకం చేసిన ఘనకీర్తి పాల్కురికి సోమనది.

**పరిచయం :**

సోమన శ్రియాదేవమ్మ, విష్ణురామి దేవుడు దంపతులకు వరంగల్ జిల్లాలోని జనగామ సమీపంలోని పాలకుర్తి గ్రామంలో సాంప్రదాయ కుటుంబంలో జన్మించారు. గురులింగార్యుని వద్ద శివదీక్షను పొంది, కట్టకూరి పోతిదేవర దగ్గర శిక్షాభ్యాసం చేసి, కరస్థలి విశ్వనాథయ్యా నుండి కవితా రహస్యాలను తెలుసుకున్నాడు. ఈ విధంగా నేర్చుకున్న కవితా రహస్యాలను సోమన్న అనేక దేశీ కవితా ప్రక్రియల ద్వారా రచించి, చివరకు బెంగుళూరులోని మైసూరు జిల్లా కల్య క్షేత్రంలో పాల్కురికి సోమన శివైక్యం (జీవసమాధి) పొందారు.

**సోమనగారి కవితా ప్రక్రియలు :**

**తొలిదేశి పురాణం (బసవ పురాణం) :**

తెలుగు సాహిత్యంలో తొలి దేశి స్వతంత్రపురాణం, బసవపురాణం, బసవ పురాణం శుద్ధమైన తొలి ద్విపద కావ్యం. ఈ కావ్యం 7 ఆశ్వాసాలు, 6288 ద్విపదలతో కూడి ఉంటుంది. తెలుగు నుండి సంస్కృతంలోకి అనువదించబడిన తొలి గ్రంథంగా ప్రసిద్ధి చెందింది. పంచ లక్షణాలు లేని పురాణం పాడుకోవడానికి వీలైనటువంటి దేశికవితా ప్రక్రియ ద్విపద.

పాల్కురికి సోమన గారి బసవపురాణానికి కథాశ్రోతగా గొబ్బూరి సంగనామాత్యున్ని పేర్కొంటారు. ఈ కావ్యంలో కన్నడ దేశంలో వీరశైవాన్ని ప్రచలితం చేసినటువంటి నందీశ్వరుని అవతారమని భావించే బసవేశ్వరుని ప్రధాన కథతోపాటు ఉడుమూరి కన్నప్ప, కిన్నెర బ్రహ్మయ్య, మడివాలు మాచయ్య, సకతశుమాది రాజయ్య, సిరియాళుడు, గొడగూచి, మరియు తల్లి గల్గిన నేల తపసి గానిచ్చు, దల్లిగల్గిన నేల తల జడల్గట్టు? అని శివుని గురించి ఆలోచించిన బెజ్జమహాదేవి లాంటి దాదాపు 80 మంది శివభక్తుల కథలు వివరించబడ్డాయి.

కర్ణాటకలోని కళ్యాణ పాలకుడైన బిజ్జలుని దండనాయకుడు (మంత్రి) బసవేశ్వరుడు. ఇతను వర్ణాశ్రమ భేద రాహిత్యం కొరకు వీరశైవ ప్రచారానికి కంకణం కట్టుకొన్నాడు. మంత్రి పదవి వల్ల ఖడ్గాన్ని, ఖజానాను అందుకు వినియోగించారు. వీరశైవ మతంలో వర్ణభేదాలు - స్త్రీ పురుష భేదాలు లేవు. శివభక్తులంతా సమానులే. వారు శివుని కన్నా పూజనీయులు. వైదిక కర్మకాండను కాదని, శివభక్తిఒక్కటే ముక్తి మార్గమని సులభోపాయం చూపిన బసవడు ధార్మిక రంగంలో సంచలనాన్ని సృష్టించాడు. బసవేశ్వరుని మహిమలు, గాథలు విని ప్రభావితుడైన సోమనాథుడు అతని చరిత్రను తన కవితా గానం ద్వారా ప్రజల్లో ప్రచారం చేయాలని సంకల్పించాడు. అందుకు పాడుకోవడానికి వీలైనటువంటి ద్విపద చందస్సును ఎన్నుకొన్నాడు.

"ఉరుతర గద్య పద్యోక్తులకంటే
సరసమై బరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
గూర్చెద ద్విపదలు గోర్కిదైవార
తెలుగు మాటలనంగ వలదు వేదముల
కొలదియగా జూడు డిల నెట్టులనిన"

ఈ విధంగా దేశీయమైన ద్విపద చందస్సులో, ప్రజలకు సన్నిహితమైన తేట తెలుగులో కావ్యరచన చేశారు. పండితుల దృష్టిలో చులకనగా చూడబడుతున్న ద్విపదకు

వేదములు సమానమనీ "ఐహికాముష్మిక హేతువు" అనీ గౌరవస్థానం కల్పించాడు. "అది ప్రాస నియతి దప్ప కుండగ ద్విపదలు రచింతు" నని అనేకమంది కవులకు ఆదర్శప్రాయంగా నిలాచాడు. ఈ విధంగా తెలుగులో సమకాలీన సమాజమును తొలిసారిగా చిత్రించిన సాంఘిక కావ్యం బసవపురాణం.

## తొలి తెలుగు శతకం (వృషాదిప) :

సంఖ్యానియమం, మకుట నియమం గల తొలి శతకంగా వృషాదిప శతకం ప్రఖ్యాతిగాంచింది. ఇది పరిపూర్ణమైన శతక లక్షణాలు గల ప్రథమాంధ్ర శతకం. 108 పద్యాలు కల్గినటువంటి ఈ శతకం. చంపకమాల, ఉత్పలమాల, వృత్తాలను కలిగి ఉండి, బసవా! బసవా! బసవా! వృషాధిపా! అనే మకుటంతోపాటు స్తోత్రరూపమైన భక్తిని కలిగి ఉంటాయి.

నా యెడయుండ నా విభుడ నా హృదయేశ్వర నా
మనోరమా
నా యిలవేల్ప నా వరుడ నా గురులింగమ నాదు
జంగమా
నా యధినాధ నా వరద నన్ను గృపామతి
బ్రోవుమయ్య దే
వా యమిబృంద వంద్య బసవా బసవా బసవా
వృషాధిపా!

ఈ విధంగా భక్త్యావేశంతో కట్టలు తెంచుకొని ప్రవహించే సోమన కవితా వాహినిలో అంత్య ప్రాసలు, ముక్తపద గ్రస్తాలు మొదలగు శబ్దాలంకార తరగలు ఎగిసిపడుతుంటాయి.

"భక్తి రసాభిషిక్త, భవపాశ వితాన విముక్త జంగమా
సక్త, దయాభిషిక్త, తన సంగత సౌఖవిరక్త..."
(అంత్యానుప్రాస)

"సురవరపూజ్య, పూజ్యగుణ శోభిత, శోభితరూప, రూప వి
స్ఫురతర శీల, శీల గుణపుంగవ, పుంగవ సత్వ"
(ముక్తపదగ్రస్తం)

పాల్కురికి సోమనగారి "బసవన్న దండనాయకునకు నొప్పనీశతకం మర్పణచేసె" అన్న మాటలను బట్టి ఇది బసవేశ్వరునికే అంకితమివ్వబడింది. బసవపురాణం ప్రస్తావన వృషాధిప శతకంలో ఉండడం మూలంగా బసవ పురాణం తర్వాతే ఈ శతకాన్ని సోమనాథుడు రాసినట్టు తెలుస్తుంది. శతకంలోని మొదటి సగభాగం బసవేశ్వరుని సంబోధనలతోనే కూడా ఉన్నా ఎక్కడా పునరుక్తులు కానరావు. తర్వాతి భాగంలో బసవడు జొన్నలను ముత్యాలుగా మార్చడం లాంటి మహిమలు కానవస్తాయి. సంస్కృతం, తమిళం, కన్నడం, ఆరె భాషలలో ఒక్కొక్క పద్యం తర్వాత వివిధ భాష మిశ్రితమైన "మణి ప్రవాళ భాష"లో ఐదు పద్యాలు రచించటం మూలాన పాల్కురికి బహుభాషలపై పాండిత్యం కలదని వ్యక్తమవుతుందన్నది.

"బలుపొడ తోలుసీరయును బాపసరుల్ గిలుపారు
కన్ను వె
న్నెలతల చేదు కుత్తుకయు నిండిన వేలపుటేఱు పల్గు
పూ
సలు గల ఱేని లెంకవని జాను దెనుంగున
విన్నవించెదన్
వలపు మదిన్ దలిర్ప బసవా..."

పై విధంగా దేశి పదాలతో సరసమై ప్రసన్నమైనటు వంటి జానుతెనుగులో వినిపించిన పద్యం హృద్యమైనది. కానీ వృషాదిప శతకం మాత్రం సంస్కృత సమాస పూరిత మైన శైలిలోనే కొనసాగటం గమనించదగిన విషయం.

## తొలి ఉదాహరణం (బసవోదాహరణం) :

స్తుతి రూపమైన ఉదాహరణ కావ్యానికి మార్గదర్శకుడు పాల్కురికి సోమనాథుడు. గాన యోగ్యంగా ఉండే ఉదాహరణ కావ్యంలో దాదాపు 15 నుండి 26 పద్యాల వరకు ఉంటాయి. అనిబద్ధ కావ్యవర్గము, మధుర కవిత శాఖకు చెందిన ఉదాహరణ కావ్యం 8 విభక్తులతో, 8 వృత్తాలు, 8 కళికలు, 8 ఉత్కళికలు, చివరన సార్వ విభక్తిక పద్యమును కల్గి ఉంటుంది. సోమన రచనల తరువాతనే విద్యానాథుడు తన ప్రతాపరుద్రయ

శోభూషణంలో మొట్ట మొదటగా ఉదాహరణ లక్షణాలను పేర్కొన్నాడు.

సోమన్న మొదటగా బసవోదాహరణం రచించాడు. ఉదాహరణ కావ్యం తెలుగు నుండి సంస్క ృతంలోకి తరలివెళ్ళినటువంటి సాహితీ ప్రక్రియ, సోమనాథుడు దీనితోపాటు పాండవోదాహరణం అనే మరో ఉదాహరణ కావ్యాన్ని రచించినట్టు బిరుదురాజు రామరాజుగారి పరిశోధన ద్వారా వ్యక్తమౌతుంది.

**తొలి చారిత్రక కావ్యం - పండితారాధ్య చరిత్ర :**

ముదిమి వయస్సులో పాల్కురికి సోమనాథుడు రచించినటువంటి చివరి కావ్యం పండితారాధ్య చరిత్ర. పాల్కురికి గారు ద్విపదలో రాసినటువంటి ఈ కావ్యాన్ని శ్రీనాథుడు పద్యకావ్యంగా వ్రాసారు. తెలుగుజాతి తొలి విజ్ఞాన సర్వస్వంగా పాండితారాధ్య చరిత్ర ప్రసిద్ధి గాంచింది. ఈ కావ్యాన్ని మొదటగా సోమనగారు సూరా మాత్యునికి వినిపించారు ఇందలి దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వత ప్రకరణలు ఐదింటిలో పర్వత ప్రకరణ ప్రధానమైనదని తెలియజేశారు. శ్రీశైలమును సాక్షాత్ రుద్రరూపంగా భావించిన పర్వత వర్ణనతో కూడిన ఈ ప్రకరణం క్షేత్ర మహత్మ్య కావ్యంగా రూపొందింది. అంతేకాకుండా సంగీత, నాట్య రసవాద, వైద్యాది శాస్త్ర పరిజ్ఞానంతో కూడిన చారిత్రక కావ్యం. భక్తజనుల శ్రీశైలయాత్రలో సమకాలీనమైన పెక్కు జానపద పాటలు, పదాల ప్రస్తావన పండితారాధ్య చరిత్రలో అధికంగా కలవు. సోమన బహుభాషా విజ్ఞానానికి, వివిధ శాస్త్ర వైదుష్యానికి, బహుగ్రంథ పరిచయానికి ఇది మంచి నిదర్శనం. మహాభక్తుల వృత్తాంతములు మణిపూసలుగా, మల్లిఖార్జున పండితుని జీవిత చరిత్ర సంగ్రహము నాయకమణిగా, శ్రీశైలక్షేత్రము రత్నపథకముగా, వీరశైవ మతము సువర్ణ సూత్రముగా సంఘటించిన అనర్ఘమణి హారము పండితారాధ్య చరిత్ర.

**ముగింపు :**

ప్రజాకవిగా ప్రసిద్ధి గాంచిన పాల్కురికి సోమన తన ఆరాధ్య దైవమగు పరమేశ్వరుని, శివస్వరూపుడైన బసవేశ్వరుని, మల్లికార్జున పండితారాధ్యుని కథలను ద్విపదలో గానం చేసిన బసవపురాణం తొలి దేశి పురాణం కాగా, పండితారాధ్య చరిత్ర తొలి చారిత్రక కావ్యం. పండితారాధ్య చరిత్రలోని శ్రీశైల యాత్ర వర్ణన సమకాలీన సాంఘిక, సాంస్క ృతిక విశేషముల కూడలి. ఈ విధంగా ద్విపదకు దివ్య సారస్వత స్థాయిని కలిగించి భావితరాలను ప్రభావితం చేసిన పాల్కురికి సోమన్న తెలుగు సాహితీ చరిత్రలో దేశి కవితాప్రక్రియ పరమేశ్వరునిగా చిరస్మరణీయుడు.

# తెలంగాణ నవల - బహుజన అస్తిత్వ చిత్రణ

- డా. పంతంగి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

తెలంగాణ సాహిత్యానికి సంబంధించినంతవరకు బి.సి.అస్తిత్వ రచనలను బహుజన సాహిత్యంగా పేర్కొం టున్నారు. దీనికి కారణం దళిత సాహిత్యంలో లేదా నవలల్లో దళితుల అస్తిత్వ జీవన చిత్రణ ఉండడం, దాని కొక సిద్ధాంత భూమిక ఉండడం కారణం. పూలే, అంబేద్కర్ ఆలోచనా విధానం ఆయా నవలా రచయిత లను దళిత అస్తిత్వ చిత్రణ చేయడానికి ప్రేరేపించింది. అస్తిత్వ ఉద్యమ సాహిత్యంలో ఎవరి బాధలను వారే రాసుకోవాలనే వాదన ప్రబలంగా వినిపించడంతో బి.సి. రచయితలు రాసిన సాహిత్యాన్ని గుర్తించాల్సి వచ్చినపుడు బహుజన సాహిత్యంగా వ్యవహరించడం జరుగుతున్నది. బహుజనుల జీవితాల నుండి ఎన్నో అంశాలను ఈ నవలాకారులు చిత్రించడం చూడవచ్చు. వీటిల్లో కుల అస్తిత్వాన్ని గుర్తించడం, కులపరంగా జరిగిన అవమానా లను సాహిత్యంలో చిత్రించడం, కుల ప్రాతిపదిక మీద అణచివేత, దోపిడీలు ఏవిధంగా చోటు చేసుకుంటాయో విశ్లేషించడం ఇటువంటి రచనల్లో మనం గమనించవచ్చు.

బి.సి అస్తిత్వాన్ని గుర్తించి చిత్రణ చేసిన నవలాకారులు విశేషంగా కుల మూలాలను, బాధిత అస్తిత్వాలు చెల్లిం చిన మూల్యాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. బహు జనుల జీవితాలు, సంస్కృతి,భాష, కులవృత్తులు, వెనుక బడి పోతున్న జీవన విధానాలు నవలా సాహిత్యంలో చిత్రించబడ్డాయి.

ఇంతకు ముందు నవలా సాహిత్యంలో లేని ఒక ముఖ్యమైన మలుపు ఏమిటంటే అగ్రవర్ణ రచయితలు కుల సంబంధ పాత్రలను, వాళ్ల బాధలను చిత్రించి నప్పటికీ అవి భూస్వామ్య వ్యవస్థ పెడుతున్న హింస, అణచివేతలకు బలైపోయిన వారిగా చూపడం జరిగింది. ఆయా అస్తిత్వాల జీవన సంఘర్షణ అంతగా చిత్రిత మయ్యేది కాదు. ఆయా కుల వృత్తులకు చెందిన వ్యక్తుల బాధలు చూసి చలించకపోయిన తీరు కనబడుతూ ఉండేది. తరువాత కాలంలో వచ్చిన నవలల ప్రత్యేకత ఏమిటంటే సమాజంలో కింది కులాలుగా పరిగణింప బడిన యువకులు కథకులుగా, నవలా రచయితలుగా రూపొందారు. తమ తమ కులాల్లోని అస్తిత్వాన్ని ప్రత్యక్షానుభవం ద్వారా గ్రహించి నవలా రచనలు చేశారు.

తెలంగాణ అస్తిత్వ బాధను, సమస్యలను చిత్రిస్తూ తెలంగాణ భాషలో బి.స్. రాములు, బోయ జంగయ్య, పులుగు శ్రీనివాస్, కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, శిరంశెట్టి కాంతారావు పంజాల జగన్నా థం, బి.వి.ఎన్ స్వామి, కె.వి.నరేందర్, చొప్పదండి సుధాకర్, భూపాల్, బోధనం నర్సిరెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్, నేరెళ్ల శ్రీని వాస్‌గౌడ్ మొదలైన ఎంతోమంది తెలంగాణ రచయితలు నవలలు, కథలు రచించారు.

నేను ఈ వ్యాసంలో కాలువ మల్లయ రాసిన 'బతుకు పుస్తకం, గువ్వలచెన్నా' నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ రాసిన 'బతుకు తాడు' నవలలను తీసుకొని వాటిలో బహుజన అస్తిత్వాన్ని పరిశీలించే ప్రయత్నం చేస్తాను.

కాలువ మల్లయ్య 'బతుకుపుస్తకం' నవల అయిదు దశాబ్దాల గ్రామజీవితంలోని అనేక పరిణామాలను చిత్రిం చింది. ఇందులోని ఎన్నో పాత్రలు వాటి సంభాషణలు, స్వగతాలు, మనోగతాలు తెలంగాణ మాండలికంలోనే సాగుతాయి. కుల అస్తిత్వాల మీద ఒక అవగాహన, సరైన ఆలోచనాదృక్పథం గల రచయిత సాధికారికంగా కుల అస్తిత్వాన్ని గురించి ఇందులో ప్రస్తావించడం జరిగింది.

"సమాజానికి అవసరమయ్యే వస్తువులు ఉత్పత్తి చేయ డంలో ఏ కులం ప్రాముఖ్యత ఆ కులానికుంది. ఉత్పత్తితో సంబంధమున్న ప్రతి కులం గొప్పదే. ఆయా వృత్తులు చేసేవాళ్లను ఆ కులమని అనడంలో తప్పులేక పోవచ్చు గాని ఫలానా పెద్ద ఫలాన కులం చిన్న అనడం వల్లనే ఈ కుల భేదాలు ఘోర ప్రభావాన్ని చూపు

తున్నాయి.'' (బతుకు పుస్తకం - కాలువ మల్లయ్య పుట;177)

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 12 ఏళ్లకు కరీంనగర్ జిల్లాకు దగ్గరగా ఉన్న ఒక కుగ్రామంలో జరిగిన సంగతులు, సంఘటనలు, మార్పులు, పరిణామాలు 'బతుకు పుస్తకం' నవలా నేపథ్యంగా కనిపిస్తాయి. ఇందులో కొండలరావు దొర, రాజయ్య కుటుంబం, భూమయ్య కుటుంబం ప్రధాన పాత్రలుగా సాగుతాయి. గ్రామం కొండలరావు దొరను ఎంతో ఆత్మీయంగా పంతులు అని పిలుచుకుంటుంది. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా అతను పాటుపడుతుంటాడు. ప్రతి అభివృద్ధి కార్యక్రమం పంతులు చేతులమీదుగానే జరుగుతుంది.దొర డబ్బున్న వాడైనప్పటికీ ఆధిక్యతను ప్రదర్శించకపోవడం విశేషం.

దొర భార్య ఆనందబాయమ్మ ఊరందరికి తల్లిలాగా ఉండి ఆదరిస్తుంది. అలాగే కాపుకులానికి చెందిన లసుమయ్యకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కొద్దిపాటి వ్యవసాయాన్ని నమ్ముకొని జీవితం గడుపుతున్న లసుమయ్య ఆర్థిక స్థితిగతులు సహకరించకపోవడంతో పెద్దవాడైన మల్లేశాన్ని వ్యవసాయనికి ఉంచి చిన్న కొడుకు రాజయ్యను చదివించాలనుకుంటాడు.ఇక దళిత కులానికి చెందిన సాంబయ్య రామ సింహకవి రాసిన కీర్తనలను బాగా పాడుతుంటాడు.ముఖ్యంగా ఇతను ఊరిలో జరిగే ఉత్సవాలలో కీర్తనలు పాడుతుంటాడు.ఇతనికి నలుగురు సంతానం. పెద్దకొడుకు భూమయ్యను బాగా చదివించాలనుకున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించదు. కొండలరావు దొర ఈ విషయం తెలుసుకొని భూమయ్యను చదివించేలా ప్రోత్సహిస్తాడు. ఈ నవలలో కొండలరావు దొర కొడుకు పురుషోత్తమరావు, రాజయ్య, భూమయ్య ఒకే తరానికి చెందిన వ్యక్తులు. వీరి జీవిత విశేషాలతో నవల చిత్రితమైంది.

ఈ నవలలో సమకాలీన రాజకీయాలు కూడా చిత్రితమయ్యాయి. ఒక గ్రామం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అవసరాలు తీరడానికి సకల వృత్తులు, సమస్త కులాల అవసరం ఉంటుంది. ఒక గ్రామం అవసరం తీరడానికి కనీసం 16 కులాలవాళ్లు అంటే వృత్తులవాళ్లు అవసరమని చెపుతారు. కులాల మధ్య హెచ్చుతగ్గులు, చిన్నా పెద్ద తారతమ్యాలు ఉండకూడదంటాడు రచయిత. చేతి వృత్తుల వాళ్లు అయిన చాకలి,మంగలి, కుమ్మరి, వడ్రంగి, గొల్ల, కుర్మ, గౌడ, వడ్డెర మొదలైన కులాలు, వాళ్లవెతలు కూడా 'బతుకుపుస్తకం' నవలలో చిత్రించబడ్డాయి.

సంప్రదాయ మగ్గాలు పోయి మరమగ్గాలు వచ్చిన తరువాత చేనేత కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. బ్రతుకు గడవని స్థితిలో బలవంతంగా బొంబాయి, సూరత్ లాంటి పట్టణాలకు ఈ కార్మికులు వలసలు పోవడం మొదలైంది. ఆర్థికంగా ఇబ్బందులను తట్టుకోలేక కుటుంబాలకు కుటుంబాలే ఆత్మహత్యలకు పాలుపడ్డాయి.ఇటువంటి నేత పనివారల జీవితాలను చిత్రించిన మరో నవల కాలువ మల్లయ్య రాసిన 'గువ్వలచెన్నా'

కరీంనగర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో నేత పని చేసుకునే సిప్ప మల్లయ్య కుటుంబం ఎదుర్కొన్న బాధలే ఈ నవలలో ప్రధానాంశం. లింగమ్మ, మల్లయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు. రాజమల్లు, వీరయ్య, శంకరయ్య. కొడుకులను చదివించాలన్న ఆకాంక్ష ఎంతగా ఉన్నప్పటికీ అంత స్తోమత లేని మల్లయ్య పెద్ద వాన్ని మినహా చిన్న కొడుకులను మాత్రమే చదివిస్తాడు. తమ పిల్లలను చదివించలేకపోతున్నమనే బాధ వృత్తిపనివారల కుటుంబాలలో సాధారణంగా ఉంటుంది. చిన్న కొడుకు శంకరయ్య తండ్రి చేసే కులవృత్తికి చేదోడువాదోడుగా ఉంటూనే చదువుకుంటాడు. తండ్రి చేసే పనిలో ఏమాత్రం వృద్ధి కనిపించదు. తండ్రి బాధ, ఆర్థిక పనిలో ఏమాత్రం వృద్ధి కనిపించదు. తండ్రి బాధ ,ఆర్థిక లోతు శంకరయ్యను కలచివేస్తుంది. ఎన్నోబట్టలు నేసినా తన తల్లి ఒక పట్టుచీరయినా ధరించాలన్న కోరికను తీర్చుకోలేకపోవడం అనుభవపూర్వకంగా గ్రహిస్తాడు.

ఇటువంటి కుటుంబాలు వృత్తిని నమ్ముకొని ఎంత నిజాయితీగా శ్రమించినా ఈవర్గాల శ్రమని గుర్తించని దొరలు 'సాలెసంకటం గోచిలిరుకటం' అంటూ అవమానా

లకు గురిచేయడం రాజమల్లు, శంకరయ్యలను బాధకు గురిచేస్తుంది. కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న రాజ మల్లు ఆర్థికంగా స్థిరపడటం కోసం భీవండి వెళాతాడు. అయితే అక్కడ మతఘర్షణలతో హత్యకు గురవుతాడు. కొడుకు మరణాన్ని లింగమ్మ, మల్లయ్యలు తట్టుకొలేక పోతారు.

ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మూడు రకాల జీవన విధానాలలోకి మారి కులవృత్తికి మార్పులకు మధ్య నలిగిపోవడాన్ని ఈ నవల చిత్రించింది. గిట్టుబాటు కాని వృత్తులను వదిలేసి కొందరు వ్యవసాయం, మరి కొందరు వ్యాపారం, ఇంకొందరు ఉద్యోగాలు ఇంకా వలసలుపోవడం వంటి రకరకాలమార్గాలలో బతికేందుకు ప్రయత్నం చేయడం కనిపిస్తుంది. జగిత్యాల, సిరిసిల్ల లాంటి ప్రాంతాల్లోని పద్మశాలి కుటుంబాల దుర్భర పరిస్థితులను ఈ నవల చిత్రించింది.

కులవృత్తుల మీద నవలలు రాసిన రచయితలు ఆశ్రిత కులాల అస్తిత్వ సమస్యలను కూడా చిత్రించారు. పద్మశాలీలపై ఆధారపడి బ్రతికే ఉపకులం సాధనా శూరులు. వాళ్లు జానపద కళాకారులు. ఊళ్లో ఉన్నన్ని రోజులు వారి పోషణ భారం అంతా పద్మశాలీలదే. సాధనా శూరులు ఊర్లో కొస్తే సాలీలకు పండుగలాగా ఉంటుంది. కులాలు అంతరించే క్రమంలో కులాలపై ఆధారపడి బ్రతుకుతున్న ఉపకులాల మనుగడ ప్రశ్నార్థకమై పోయింది. నేడు సాధనాశూరుల విద్యలు కనుమరు గయ్యాయి. చొప్పబెండ్ల పల్లకిపై నిల్చోవడం, మనిషిని మాయం చేయడం వంటి అద్భుతమైన కళారూపాలు నేడు అంతరించిపోయాయి.

నిజానికి ఆశ్రిత కులాలు అనే కాకుండా నేత కార్మికు లవి కూడా పరాధీన జీవితాలే. అందరికి బట్టలు నేసి ఇచ్చేవారైనా వాళ్లు వంటి నిండా బట్టలు ధరించలేని పరి స్థితి. ఆయా కుటుంబాలలో ఒకరిద్దరు ఉద్యోగస్థులున్న ప్పటికీ వాళ్లు కూడా ఆర్థిక ఉన్నతిని సాధించినవారు కాదు. పొట్టకు బట్టకు వెళ్లదీసుకోగలిగిన వెసులుబాటు మాత్రమే శంకరయ్యలాంటి వ్యక్తులకు కలిగింది. మిల్లు వస్త్రాలు వచ్చి కొద్దిమందికే లాభాన్ని చేకూర్చాయి. ఎక్కువ మంది ఉపాధిలేని వారయ్యారు.పదిమంది చెయ్యాల్సిన పనిని యంత్రం ఒక్కటే చేయడంతో ఉపాధి భద్రత, ఆహార భద్రత ఆ కుటుంబాలకు కరువయ్యింది. ఒక ప్పుడు గౌరవప్రదంగా భావించిన నేతవృత్తి నేడు పద్మ శాలీలను నేత కూలీలుగా మార్చింది. ఆప్కోలాంటి సంస్థలు పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న స్థితిని నవ లలు బహుముఖంగా చిత్రించాయి.

నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ రాసిన 'బతుకుతాడు' గౌడ కులం వారి అస్తిత్వం గురించి సమగ్రంగా చర్చించింది. ఇది వెలువడిన సంవత్సర కాలంలోనే దీని ప్రభావంతో నల్ల గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన కె. వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' రాశాడు. కులవృత్తి నేపథ్యంగా ఒక నవల వచ్చాక దాని ప్రభావంతో వెంటనే మరో నవల రావడం కుల అస్తిత్వ చిత్రణ నవలా సాహిత్యంలో ప్రబలంగా సాగాల్సిన అవసరాన్ని చెపుతుంది. బతుకుతాడు నవల ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. మూడు కుటుంబాలలో ఒక కుటుంబం రచయిత పెద నాన్నది కాగా రెండవది రచయితది. మూడవ కుటుంబం చిన్నాన్నది. మరొక విశేషం ఏమిటంటే నవలలో రచ యిత శ్రీనివాస్ గౌడ్‌ది కూడా ఒక ముఖ్యమైన పాత్ర.

ఈ మూడు కుటుంబాలలో పెదనాన్నది అభివృద్ధి చెందిన కుటుంబం. చిన్నాన్న కుటుంబం దరిదాపులేక మధ్యలోనే అంతమైపోయింది. రచయిత కుటుంబం మూడు దశాబ్దాలు శ్రమించినా బాగుపడింది లేదు సంపా దించి నిలబడింది లేదు. ఇట్లా గౌడ కులస్థుల జీవితాల్లోని దుర్భర దుస్సహ జీవన పరివేదనలను ఈ నవల చిత్రిం చింది. కుల వృత్తిని వదులుకోలేక దానినే నమ్ముకొని ఎటుకాని బతుకు బతికేస్తున్న అనేక వేల కుటుంబాల బతుకులు ఛిద్రం కావడం ఈ నవలలో గమనించవచ్చు.

ఈ వృత్తి ఎంతటి ప్రమాదభరితమో ప్రజలలో ఉన్న సామెతలు కూడా తెలియజేస్తాయి.''గౌండ్లోని పెళ్లాం రోజుకు మూడుసార్లు ముత్తైదువ, మూడు సార్లు ముండ''

లాంటి సామెతలు ఈ వృత్తిలో గల ప్రమాదాలను తెలియ జేస్తాయి. తమ వృత్తి నిర్వహణలో భాగంగా గీత కార్మికులు తమ ప్రాణాలను కూడా కోల్పోవలసివస్తుంది. ఒకే కుటుంబం నుంచి మూడు తరాలవాళ్లు తాటిచెట్టుపై నుండి పడి మృత్యువాతపడటం ఈ నవలలో చూస్తాం.

"బోడయ్య చెట్టుపై నుండి కిందపడి మరణించిన కొంతకాలానికే అతని కొడుకు రామయ్య కూడా మరణిం చడం ఆ ఊళ్లోనే విషాదం నింపింది. రామయ్య భార్య సీతమ్మకు సీత కష్టాలేవచ్చాయని అనుకున్నారంతా. ప్రభుత్వం ఏ విధమైన ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా గీత కార్మికుల పట్ల నిర్లక్ష వైఖరి ప్రదర్శిస్తున్న రోజులవి. పిల్లల కోసం సీతమ్మ గుండె దిటవు చేసుకొని బతుకు వెళ్ల దీస్తుంది. కొంత కాలానికి సీతమ్మ కూతురు స్వరాజ్యం కూడా విధవరాలవుతుంది. అల్లుడు తాటిచెట్టుపై నుండి పడి మరణించడం వల్ల కుటుంబానికి మగదిక్కు లేకుండా పోయింది." (కల్లు మండువ - కె.వి.ఆర్)

తెలంగాణ నవలా కారులు వృత్తి జీవితాలను ఇతి వృత్తాలుగా చేసుకొని వారి స్థానిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ జీవన అస్తిత్వ సంబంధ విషయాలను నవలా సాహిత్యం ద్వారా చర్చించి తెలంగాణ నవలకు కొత్త కోణాన్ని ఇచ్చారు. తెలంగాణ నవలకున్న అదనపు గుణం కాల్పానికత లేకపోవడం. యదార్ధ జీవన చిత్రణ ఇక్కడి రచనల నేపథ్యం. రచయితలు ఏమిరాసినా ఇక్కడి జీవి తాల అస్తిత్వ సంక్షోభాల చిత్రణే ప్రధాన లక్ష్యంగా చేసు కున్నారు. 1960 తరువాత తెలంగాణ ప్రాంతంలో తలెత్తిన పలు సామాజిక, రాజకియ ఉద్యమాలు తెలంగాణ నవలను పరిపుష్టం చేశాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. భాస్కర్ మడత- తెలంగాణ నవల-జన జీవిత చిత్రణ (అముద్రిత సిద్ధాంత గ్రంథం).
2. మల్లయ్య కాలువ - బతుకు పుస్తకం, గువ్వల చెన్నా.
3. శ్రీనివాస్ గౌడ్ నేరెళ్ల - బతుకుతాడు.
4. కె.వి.ఆర్ - కల్లుమండువ.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ముక్తేవి భారతి జీవితం - సాహిత్యం

**- టి. దేవరాజ్,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

## పరిచయం :

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందనడానికి ముక్తేవి భారతి జీవితం లక్ష్యప్రాయకంగా నిలుస్తుంది. సాహిత్యాన్ని ఆమె జీవితాన్ని వేరు చేసి చూడలేం. సాధారణ స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహిళామణి. విద్యార్థి దశలోనే కథలు, వ్యాసాలు రాయడం నేర్చుకొన్నారు. ఆమె రచనల్లో సామాజిక చైతన్యం ఎంతో ఉంటుంది. పరిశోధక వ్యాసాలు కూడా రాబోయే తరాలకు మార్గదర్శకంగా ఉంటుంది. వృత్తినే దైవంగా భావించి ఎందరో విద్యార్థులకు చేయుత నిచ్చి మార్గదర్శకంగా నిలిచిన ఆమె జీవితం, సాహిత్యం గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## బాల్యం-విద్యాభ్యాసం :

ముక్తేవి భారతి వెలువలి శంకరం, అరవిందు దంపతులకు 1941 జూన్ 10న కృష్ణా జిల్లాలోని పెడన గ్రామంలో జన్మించారు. అదే గ్రామంలో ఒకటవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు చదివారు. మచిలీపట్నం హిందూ హైస్కూలులో తొమ్మిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివారు. మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ వరకు చదువుకున్నారు. 1961వ సంవత్సరంలో కాశీ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ.చరిత్ర, 1969వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ.తెలుగు, 1974వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 'తంజావూరు నాయక రాజుల కాలంలో రచయిత్రుల రంగాజమ్మ' అనే అంశంపై ఎం.లిట్.పట్టాను పొందారు. 1978వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి భాషాశాస్త్రంలో పి.జి.డిప్లొమాను పూర్తిచేసి అదే విశ్వవిద్యాలయంలో 1980వ సంవత్సరంలో 'చిలకమర్తి సాహిత్య సేవ' అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి పట్టాను అందుకున్నారు.

## వివాహం - ఉద్యోగం :

ముక్తేవి భారతి గారు న్యాయవాది అయిన ముక్తేవి లక్ష్మణరావు సతీమణి. భర్త సహాయ సహకారాలు అన్ని విధాల ఉన్నాయి కాబట్టే ఆమె జీవితం 'మూడు పువ్వులు ఆరు కాయలు' గా సాగింది. భారతి గారు హైదరాబాద్ లోని నారాయణగూడలో వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో సహ ఆచార్యులుగాను, చివరకు హైదరాబాద్ లోని చిక్కడపల్లి సరోజిని నాయుడు మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ పదవీ బాధ్యతలు నిర్వహించి, విద్యార్థుల శ్రేయస్సు కోరి పోటీ పరీక్షల కోసం ప్రశ్నలనిధిని, పోటీ పరీక్షలలో పాల్గొనే వారి కోసం చేయూతనిచ్చారు. ఓపన్ స్కూల్ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను రచించారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏపిపి పాఠ్యాంశాలు చక్కగా బోధించారు. ఓపెన్ యూనివర్సిటీ తెలుగు పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించారు. బి.ఎ. విద్యార్థులకు పాఠ్యాంశాలలో బోధన, ప్రభుత్వ టి.వి., మన టి.వి.లలో ప్రత్యక్షమై తమ వంతు సేవ చేశారు. ఎం.ఫిల్., పిహెచ్.డి. విద్యార్థులకు పరిశోధన నిమిత్తం పర్యవేక్షక బాధ్యతలను చేపట్టారు. పదవీ విరమణ చేసినా సాహిత్యానికి తన వంతు ఈనాటి కూడా సేవలందిస్తూనే ఉన్నారు. ఉద్యోగ విషయంలోనూ, రచనా సాంగత్యం లోనూ తన ప్రతిభను చాటుకున్న ముక్తేవి భారతి జీవితం, సాహిత్యం గురించి నేటి సమాజానికి తెలియ వలసిన ఆవశ్యకత ఉంది.

## ముక్తేవి భారతి రచనలు :

**కథానికా సంపుటాలు :** 1.భారతంలో ప్రేమకథలు (1991), 2.కంచె చేనుమేస్తే (1993), 3.ముక్తేవి భారతి కథలు-1 (1994), 4.ముక్తేవి భారతి కథలు-2(1996), 5.భారతంలో నీతికథలు (1999-2003), 6.ప్రబంధాలలో భక్తి కథలు (2001-2003), 7.భక్తి తరంగాలు కథలు

(2002) 8.ధర్మగంట మోగదు (2007). నవలలు: 1.గాంధర్వం (2004), 2.తరిగొండ వెంగమాంబ (2004), 3.చతురస్రం (2005), 4.జైత్రయాత్ర (2006) 5.దక్షిణకాశి (2007), 6.పాండురంగలీలు (2008), 7.బతుకు నేర్పిన న్యాయం (1996), 8.ప్రగతి (2000), 9.మళ్ళీ వచ్చిన వసంతం (2002), 10.మమత (2002), 11.ప్రక్షాళనమ్ (2002), 12.అరుణోదయం (2006), 13.మూడోతరం (2008). ముక్తేవి భారతి కథలు, నవలలే కాకుండా వ్యాస సంకలనాలుకూడా వెలువరించారు. 1.వ్యాస సుధ (2001) 2.తెలుగు సాహితీ మూర్తులు (2009), 3.మోనోగ్రాఫ్ ఇల్లందుల సరస్వతీదేవి. భారతీ గారు వారు చేసినటువంటి పరిశోధన గ్రంథాలను కూడా వెలువరించారు. 1.చిలకమర్తి కవితా వైభవం (1984), 2.చిలకమర్తి సాహిత్య సేవ (1988). ముక్తేవి భారతి గారు కొన్ని దిన, వార పత్రికలకు కాలమ్స్ 'మనసాహిత్యం', 'కదంబం', 'భావలహరి', 'మంచిమాట', 'మేలుకొలుపు', 'సాహిత్యవీధి', 'ఉదయరాగం', 'సంవీక్షణం' 'ఆలోకనం' అనే పేర్లతో సూర్యశక్తి, ఆంధ్రభూమి, ప్రియదత్త, నేటి నిజం, విజేత తదితర పత్రికలకు 1999 నుంచి 2007 వరకు కోకొల్లలుగా తన జీవితాన్ని సమాజానికి అంకితం చేశారు.

### హోదాలు - పురస్కారాలు :

రెడ్ క్రాస్ సంస్థకు జీవిత సభ్యురాలిగా, ఆంధ్ర మహిళా సభకు జీవిత సభ్యురాలిగా, శ్రీత్యాగరాజ గాన సభకు జీవిత సభ్యురాలిగానూ, సుకన్య ఆర్ట్స్ సాంస్కృతిక సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా, వనస్థలి పురంలోని 'మానస' మానసిక వికలాంగుల పాఠశాలకు వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. అలాగే సికింద్రాబాద్‌లోని మహ బూబ్ కాలేజి సెంటినరీ స్కూల్‌కు సలహా మండలి సభ్యు రాలిగా ఉన్నారు. 1986-1989, 2007వరకు ప్రాంతీయ చలనచిత్ర సంస్థ రిజనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సలహా మండలి సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం సర్దార్ జమలా పురం కేశవరావు స్క్రిప్ట్‌రైటర్‌గా దూరదర్శన్ కేంద్రంలో బాధ్యతలు నిర్వహించి సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతూనే ఉన్నారు.

ముక్తేవి భారతి గారు 1985వ సంవత్సరంలో 'దుర్గా బాయ్ దేశ్‌ముఖ్ అవార్డు'ను అభినందన సాంస్కృతిక సంస్థవారు ప్రదానం చేశారు. 1989వ సంవత్సరంలో 'చల్లపెల్లి వేంకటశాస్త్రి అవార్డు'ను ఆంధ్రమహిళా సభవారిచే అందుకున్నారు. 1991వ సంవత్సరంలో 'ఉత్తమ అధ్యాపక అవార్డు'ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు అందజేశారు. 1996వ సంవత్సరంలో 'స్వర్ణకంకణ' పురస్కారాన్ని మద్రాసు పట్టణంలోని కేసరి కుటీరం వారు బహుకరించారు. 1998వ సంవత్సరంలో 'వాసిరెడ్డి రంగ నాయకమ్మ' పురస్కారాన్ని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ప్రదానం చేశారు. 1998వ సంవత్స రంలో 'ఉగాది' పురస్కారాన్ని మద్రాసులో అందు కున్నారు. 2002వ సంవత్సరంలో 'ఇల్లిందుల సరస్వతీ దేవి' పురస్కారాన్ని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయం వారే అందజేశారు. 2002వ సంవత్సరంలో 'తెలుగు సాహిత్య విమర్శ' అవార్డును విశ్వసాహిత్య సంస్థ వారు ప్రదానం చేశారు. 2006వ సంవత్సరంలో సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. 2007వ సంవత్సరం అక్టోబర్ 30వ తారీఖున నాయని సుబ్బారావు సాహిత్య పురస్కారాన్నికైవసం చేసుకున్నారు. 2008వ సంవత్సరం ఆగస్టు 1వ తారీఖున డాక్టర్ రావూరి కాంతమ్మ భరద్వాజ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు.

### సాహిత్యం - సమాజం :

ముక్తేవి భారతి జీవితాన్ని సాహిత్యాన్ని వేరు చేసి చూడలేం. సమాజంలోని వివిధాంశాలను వస్తువులుగా తీసుకొని కథలు రాయడం వలన వీరి కథలలోని వస్తువులో భిన్నత్వం కనిపిస్తుంది. త్రిపురనేని మధు సూదనరావు గారు "సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. లేదా రచయిత సాహిత్యంలో ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు" అని వెలిబుచ్చారు. పాపినేని శివశంకర్ గారు "మనిషి మానవ సంబంధాలు, సామాజిక జీవితం అందులోని వైరుధ్యాలు వీటన్నిటి యొక్క కళాత్మక ప్రతిఫలనం సాహిత్యంలో వస్తువు అవు తుంది. సాహిత్య వస్తువుకి, సామాజిక వస్తువుకి భేదం

ఉంది. సాహిత్యంలో కన్పించేది సామాజిక, వాస్తవికత యొక్క కళాత్మక ప్రతిఫలనం, రెండో ప్రపంచం, మొదటి ప్రపంచంలోని మామూలు తనం అక్కడ వడకట్టబడతాయి'' అని తెలియజేశారు.

మానవ జీవితాన్ని చిత్రణ చేయడంలో సాహిత్యంలో సహజంగా కనిపిస్తుంది. రచనల్లో వాస్తవికతను ఆశించిన ప్రతి రచయిత తన చుట్టూ ఉన్న సమాజాన్ని, వ్యక్తులను, వ్యక్తిత్వాలను, తన రచనలో భాగాలుగా చెబుతాడు. ముక్తేవి భారతిగారు వాస్తవికతను ఆశించడం చేత మానవ జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు.

ముక్తేవి భారతి 'వాన' కథలో ధనిక-పేదల తారతమ్యం గురించి వివరించారు. 'మంచు మండింది' కథలో మానవుని కన్నా ధనానికి ప్రాముఖ్యమిచ్చి బంధువులు, స్నేహితులు అవివాహితురాలైన రాజ్యలక్ష్మిని ఏ విధంగా మోసం చేస్తారో రచయిత్రి చాలా చక్కగా వివరించారు. 'సుశీల మనసు' కథలో ప్రేమించి పెళ్ళి చేసుకున్న సుశీలను భర్త ఏ విధంగా వ్యభిచారిగా ముద్రించి మోసం చేయడానికి సిద్ధ పడతాడు. లాయర్ రామనాథం సుశీలను మానవత్వంతో ఎలా కాపాడుతాడో రచయిత్రి తనదైన శైలిలో చెప్పారు.

'మమత-మానవత' కథలో చిన్న పిల్ల రమకు-ముష్టిదానికి గల సంబంధం ఆట వస్తువుతో పరిచయం ఏర్పడి చివరికి ముసలి దానికి ఎటువంటి డబ్బులు ఇవ్వలేదని రమ బాధపడడం కనిపిస్తుంది.ముష్టిది ఇచ్చిన బొమ్మలను మానవత్వంతో జ్ఞాపకంగా ఎలా దాచుకొంటుందో ఈ కథలో తెలుస్తుంది.

'ఓ ఇల్లాలు కావాలి' కథలో తల్లిదండ్రులు కూతురు పెళ్ళి చేస్తే తమకు జీవనాధారం లేకుండా పోతుందని కూతురు చేసే ఉద్యోగం మీద ఆధారపడే జీవితాలను ఇందులో చవిచూడవచ్చు. 'పరమార్థం' కథలో వృధాప్య సమయంలో భర్త, పిల్లల వల్ల పుణ్యం పురుషార్థం రాదు, గుడిగోపురాలతోనే వస్తుందని రచయిత్రి తనదైన బాణీలో చిత్రీకరించారు. 'హే ఆషాఢస్య ప్రథమ దివస' అనే కథలో రామం, ఇందిర భార్యాభర్తలు. ఆషాడంలో పెళ్ళి చేసుకుంటారు. కొన్ని రోజులు తర్వాత ఇందిరతండ్రి పుట్టింటికి రమ్మని ఉత్తరం రాస్తారు. అది ఆచారంగా వస్తున్నటువంటి సంప్రదాయం. ఆ ఉత్తరంలో ఆషాడం వస్తుంది కూతుర్ని పంపించండని రాసుంటుంది. రామానికి ఆచార సంప్రదాయాలు మీద నమ్మకాలు లేవు. కాబట్టి భార్యను పుట్టింటికి పంపించనని నిర్మొహమాటంగా చెప్పిన తీరు రచయిత్రి తనమాటల్లో చాలా అద్భుతంగా తెలియజేశారు.

'మనసు తీరని మాతృత్వం' కథలో స్త్రీ ఒంటరి జీవిత స్థితిగతులను తెలియజేశారు. 'నిద్రించిన వెన్నెల' కథలో ధనం ఉన్న కుటుంబాల్లో స్త్రీ కోడలుగా వెళితే వారు వారికి అనుగుణంగా ఉండాలనడం, వారి కొత్త అలవాట్లు వల్ల ఆ స్త్రీ ఎదుర్కొన్న సమస్యల్లో ఆమె ఒంటరిగా ఎలా జీవితం గడుపుతుందో అలాంటి జీవిత సోయగాలను చూడవచ్చు. 'చెట్టు' కథలో కొత్తగా పెళ్ళి చేసుకొని అత్తవారింటికి అడుగుపెట్టిన ఓ కొడలికి ఒక జామ చెట్టు వలన ఇంట్లో పెద్ద సమస్య తలెత్తుతుంది. జామ చెట్టును తొలగిస్తే పిల్లలు, పెద్దలు ఎవ్వరూ ఇంట్లోకి రారు. ఆమె ప్రవర్తన వల్ల ఇంట్లో వాతావరణం మారిపోవడం చూసి ఆ స్త్రీ పడిన అవస్థను రచయిత్రి చిత్రీకరించారు.

'పడిలేచే కడలి తరంగం' కథలో గృహిణి సమస్యను చిత్రించింది. స్త్రీకి కొంత ఇంట్లో స్వేచ్ఛ స్వాతంత్రం ఉండాలనేది ఈ కథా లక్ష్యం. 'అయ్యగారికి దణ్ణంపెట్టు' కథలో ఆత్మాభిమానం అనేది ప్రతి మనిషికి ఉంటుంది. ఆత్మాభిమానం చంపుకొని నేటి కాలంలో ఎలా జీవిస్తున్నారో ఈ కథలో చూడవచ్చు. 'మనసు తీరని మాతృత్వం' కథలో శారద పడిన మానసిక అవస్థను, కుటుంబంలో భర్త చేసే ఉద్యోగం మీద కోపంతో ఇంట్లో తనతో సంతోషంగా ఉండకపోవడం, సదరు వ్యక్తి అచ్చం మా అమ్మలాగే ఉన్నారనడంతో ఆమె పడిన హృదయ వేదనను ఈ కథలో ముక్తేవి భారతిగారు ఎంతో అభివర్ణించారు.

'చిగిర్చిన వసంతం' కథలో భార్యాభర్తల మధ్య ప్రేమ బంధాన్ని, భర్తను అర్థం చేసుకోలేని భార్య ఆమె

అనుభవించిన ఆవేదనను ఈ కథలో చిత్రీకరించారు. 'సీటు దొరికింది' కథలో కాలేజీ అడ్మిషన్ల సమస్యను నేటి సమాజానికి రచయిత్రి చవిచూపించారు. 'పడక నీడ' కథలో వేంకటరామయ్య ఊరిలో పెద్ద మనిషిలా ఉంటూ మిగతా వాళ్ళ కాపురాలలో ఏ విధంగా చిచ్చుపెట్టి కాపురం చెడగొడతాడో అనే అంశాలను నేటి సమాజానికి అందజేశారు. ఇలా చెప్పుకుంటూపోతే ముక్తేవి భారతి సాహిత్య జీవితం సమాజానికి ఎంతవరకు దగ్గరగా ఉంటుందో వేరే చెప్పవలసిన పనిలేదు. సమాజంలో జరిగే ప్రతి చిన్న అంశాన్ని కూడా ఎక్స్‌రే కళ్ళతో చూసి స్కానింగ్ చేసినవారు మాత్రమే ఇలాంటి రచనలను చేయగలరు.

సమాజ శ్రేయస్సు కోసం తన వంతు, తన రచనల ద్వారా సేవలందిస్తూనే ఉన్నారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధనాత్మకంగా పరిశోధన పత్రాలను సమర్పించారు. ముక్తేవి భారతి సాహిత్యాన్ని, జీవితాన్ని మొత్తం ఔపాసన పట్టి పరిశోధనాత్మకంగా వ్యాసం రాయలంటే ఈ వ్యాసం సరిపోదు. ఎన్నో కథలు, వ్యాసాలు, నవలలు, కాలమ్స్, సంకలనాలు రచించిన ముక్తేవి భారతి జీవితం, సాహిత్యం అధ్యయనం చేయాలంటే ఈ వ్యాసం సరిపోదు.

## ముగింపు :

ముక్తేవి భారతి గారికి ప్రాచీన, ఆధునిక సాహిత్యాల మీద పట్టు ఎక్కువ. అయితే ఆధునిక సాహిత్యమంటేనే చాలా ఇష్టం. వీరు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదంటే ఆశ్చర్యం పోవలసిన అవసరం లేదు. వీరి రచనలు మొత్తం వారి జీవితం నుంచి అనుభవించి, చూవిచూసి సమాజానికి చూపించినవే. అతిశయోక్తులో, ఉపమానాలో కనబడవు. కల్పనలు, వర్ణనలకు తావులేదు. వాస్తవాలకు దగ్గరగా ఉంటాయి. భాష సరళంగా ఉంటుంది. శైలి మృదుమధురంగా ఉంటుంది. పాఠకుల హృదయాన్ని దోచుకొనేలా కాలమ్స్ రాయడంలో వీరు అందవేసిన చెయ్యి. వారం వారం కాలమ్స్ రాయాలంటే ఎంతో జీనియస్ అయి ఉండాలి. పాఠకులను ఉర్రూతలూగించే నైపుణ్యం రచయితకు ఉండగలగాలి. ఇవన్నీ కలిసిన కలగూర గంపె మన ముక్తేవి భారతి. పాత్రలన్నీ నేటి సమాజానికి దగ్గరగా ఉంటాయి. ఈమె ఏ రచనను చేపట్టినా మానవత్వంతో మసులు కోవడం వీరి రచనా నైపుణ్యానికి నిదర్శనం. ఇలా చెప్పుకుంటూ పోతే ముక్తేవి భారతి జీవితం ఎంతో విశేషం. ముక్తేవి భారతి జ్ఞాన భాండాగారానికి అన్ని వైపుల పదునే. అందువల్లనే ఎన్నో ధర్మనిధి ఉపన్యాసాలను ఆమె చేత ఇప్పించారు. ఆమె అందుకోని అవార్డు గానీ, పురస్కారం గానీ లేదంటే అది ఆశ్చర్యమే. దాదాపు నలభైకి పైగా పురస్కారాలను అందుకుని ఉత్తమ రచయిత్రిగా ఖ్యాతికెక్కారు. ఇలాంటి ముక్తేవి భారతి జీవితం, ఉద్యోగం, వ్యక్తిగత హోదాలు, పురస్కారాలు, సాహిత్య పరిచయాలు, సృజనాత్మక రచనలు, పరిశోధనాత్మక రచనలు విపులంగా ఆధారాలతో సహా వెలికి తీయవలసిన అవసరం ఉంది. ఇప్పటికీ ఎన్నో విశ్వవిద్యాలయాల్లో ముక్తేవి భారతి రచనా సాంగత్యం మీద, ఆమె జీవితం మీద ఆమె రచించిన నవలలమీద, కథల మీద, సంకలనాల మీద, వివిధ పత్రికలలో వచ్చిన శీర్షికల మీద పరిశోధన జరుగుతూనే ఉంది. ముక్తేవి భారతి సాహిత్యం నేటి తరానికి ఆదర్శం కావాలి. రాబోవు తరాలకు మార్గదర్శకం చూపించాలి.

## ఆధార గ్రంథాలు :

1. ముక్తేవి భారతి - ముక్తేవి భారతి కథలు-1, ముక్తేవి ప్రచురణలు, సికింద్రాబాద్, 1994.
2. ముక్తేవి భారతి - ముక్తేవి భారతి కథలు-2, ముక్తేవి ప్రచురణలు, సికింద్రాబాద్, 1996.
3. ముక్తేవి భారతి - ధర్మగంట మోగదు, ముక్తేవి ప్రచురణలు, 2007.
4. పాపినేని శివశంకర్ - సాహిత్య మౌలిక భావనలు, పాపినేని ప్రచురణలు, గుంటూరు, 1996.
5. త్రిపురనేని మధుసూదనరావు - సాహిత్యంలో వస్తుశిల్పాలు, నవోదయ పబ్లికేషన్స్, హైదరాబాద్, 1987.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# కాళోజీ కవిత్వము - ప్రజారాజకీయాలు

- డా॥ గంగు కిషన్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

కాళోజీ అంటేనే ఆగని, అలుపెరుగని, నిరుపమాన నిరంతరోద్యమ చైతన్యం. కులమనక, మతమనక, వర్గమనక, పార్టీ అనక, ఒక సిద్ధాంతం అనక ప్రజోప యోగమైన, కార్యక్రమం ఏదైనా అందులో పాల్గొంటూ, సమకాలీన సామాజిక రాజకీయ పరిస్థితులకు స్పందిస్తూ ఉద్యమైక జీవిగా జీవించిన, "సామాజిక శక్తి కాళోజీ" లోక్ నాయక్ జయప్రకాశ్‌నారాయణ మరణించిన సందర్భంలో కాళోజీ "పుట్టుక నీది, చావునీది" బతుకంతా దేశానిది అన్నాడు. ఆయనన్న ఆ మాటలు ఆయనకే వర్తిస్తాయి.

ప్రజలు, వారి జీవిత వేదనలు ఆయనకు ముఖ్యం. ప్రజల గొడవను, తన గొడవగా చేసుకున్న ప్రజలమనిషి కాళోజీ. అందుకే మహాకవి శ్రీశ్రీ కాళోజీని "లూయీ అర గాన్‌తో పోల్చాడు. అప్రజాస్వామిక విలువలకు ధిక్కరిం చడం, సామాన్య జనం హక్కులకై కలియబడటం కాళోజీ కవిత్వ వ్యక్తిత్వం. తను ఏది చెప్పాడో అది చేసి చూపాడు. ప్రభుత్వ పాలక వర్గాలను ఏ స్థాయిలో ప్రశ్నించాడో, నక్సలైట్లను అదే తీరున ప్రశ్నించాడు. అవసరమైనప్పుడు సమర్థించాడు కూడా. నిఖార్సయిన ప్రజాస్వామిక వాది కాళోజీ. రాజకీయాలకు ఆయన సృజించిన పదం "ప్రజాకీయాలు" అ ప్రజాకీయాలు ఏవిధంగా వారి కవి త్వంలో ప్రతిఫలించాయన్నది పరిశీలన చేయటం ఈ వ్యాస ఉద్దేశ్యం.

కాళోజీ కవిత్వంలో సమైఖ్య రాష్ట్రంలో అవినీతి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం- వివిధ పార్టీల వైఖరిని తెలిపే కవితలు, ప్రజాస్వామ్యం, ఓట్లు, రాజ్యాంగ కవితలు, ఉద్యమం అణచివేతను నిరసించిన కవితలు. భాషా సాంస్కృతిక కవితలు కనిపిస్తాయి.

స్వాతంత్ర్యానంతరం 1951లో బెంగళూరులో జరిగిన అఖిల భారతీయ జాతీయ కాంగ్రెసు సమావేశంలో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర ప్రస్తావన తేవడంతో నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థంలేని ప్రసంగాలు తగవని విమర్శించారు. (కడుపుమండిన గోస, తవనం గోవర్ధన్, కవిలవాయి రవీందర్-పు 53) దీన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం కూడా తెలుగు మాట్లాడే ప్రజలంతా ఒక రాష్ట్రంగా ఉండాలని కోరుకోలేదని తెలుస్తుంది.

రాష్ట్రాల పునర్విభజన సంఘ ఏర్పాటుతో విశాలాంధ్ర భావనకు ఊతం వచ్చింది. చివరికి కేంద్ర ప్రభుత్వం విశాలంధ్ర ఏర్పాటుకు అంగీకరించింది. కాని తెలంగాణ నాయకులు దీన్ని వ్యతిరేకించారు. ఆంధ్ర తెలంగాణ నాయకులను సమావేశ పరచి వారిలోని విభేదాలు పరిష్క రించుకోమంది. కేంద్రంలో వున్న కాంగ్రెసు ప్రభుత్వం అమాయకమైన తెలంగాణ ప్రాంతం విశాలాంధ్రలో అన్యాయానికి గురవుతుందని భావించారు. ఇరుపక్షాల నాయకులు కలిసి ఒక ప్రాంతం ఆధిక్యానికి మరో ప్రాంతం బలికాకుండా ఉండడం కోసం తెలంగాణ ప్రాంతానికి రక్షణలు కల్పిస్తూ (సేఫ్‌గార్డ్స్) ఒక ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందాన్ని "పెద్దమనుషుల ఒప్పందం (జెంటిల్‌మెన్ అగ్రిమెంటు) అంటారు. ఈ సమావేశంలో పాల్గొని ఒప్పందంపై సంతకాలు చేసారు. అప్పటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి ఉప ముఖ్య మంత్రి నీలం సంజీవరెడ్డి, మంత్రి గౌతులచ్ఛన్న ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమీటి అధ్యక్షుడు అల్లూరి సత్యనారా యణ రాజులు ఉన్నారు.

తెలంగాణ ప్రాంతం నుంచి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మంత్రులుగా ఉన్న కొండా వెంకటరంగారెడ్డి, మర్రిచెన్నారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ కమీటి అధ్యక్షులు జె.వి. నర్సింగరావు హాజరై ఈ ఒప్పందంపై సంతకం చేశారు. ఒప్పందం జరిగిన రెండో రోజే ఉపముఖ్యమంత్రి పదవి ఆరోవేలు లాంటి దని ఒప్పందాన్ని ఉల్లంఘించి తెలంగాణ ప్రజల అసంతృప్తికి కారణమైనారు. నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్య

మంత్రి నీలం సంజీవరెడ్డిగారు. తెలంగాణ మిగులు నిధులన్నీ తీసుకెళ్ళి సీమాంధ్ర ప్రాంతంలో ఖర్చుచేశారు[1] ఇక అక్కడి నుండి తెంగాణ ప్రాంత ప్రజలు సీమాంధ్ర పాలకులు కాంగ్రెసు పార్టీ విధానాల వల్ల మోసగింప బడుతూ వచ్చారు.

ముఖ్యమంత్రి, కాసుబ్రహ్మానందరెడ్డి, అఖిలపక్ష సమావేశం, ఏర్పాటు చేయగా తెలంగాణకు అన్యాయం జరిగిందని గణాంకాలతో సహా బహిర్గతమైంది. ఉద్యోగ నియమకాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, తెలంగాణలో ఖర్చుపెట్టాల్సిన కోట్లాది మిగులు నిధులు ఖర్చు చెయ్యలేదని, మళ్ళీ నిబంధనలకు విరుద్ధంగా నాలుగు వేల అయిదువందల మంది సీమాంధ్రులను తెలంగాణ ప్రాంత ఉద్యోగాల్లో నియమించారని వారందరిని వెనక్కి పంపించాలని నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావడం తప్పెందుకవుతుందని కాళోజీ సూటిగా ప్రశ్నించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కాంక్షిస్తూ వేలాది మంది వీధుల్లో ఉద్యమాన్ని నిర్వహిస్తున్నప్పుడు కాళోజీ

తెలంగాణ జిందాబాద్
నినాదాల వూరేగి
మిలటరి అదుపులో నగరం
గాంధీ "సెంటినరి" జరిగెను
భారత మాతాకీ జై
తెలంగాణ జిందాబాద్
అడ్వకేట్లు,
తెలంగాణ వాసులైన అడ్వకేట్లు
గవర్నరు దర్బారులో
మెమరాండం మొరబెట్టిరి
(హైదారాబాదు వీధుల్లో పుట.393)

అంటూ ఆ దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లుగా తెలిపాడు.

తెలంగాణకు జరిగిన అన్యాయాల్ని సాగుతున్న పక్షపాతవైఖరినీ తేటతెల్లం చేశాడు. ఆంధ్రప్రదేశ్ అవతరణను ఆహ్వానించిన కాళోజీ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత. తాను శాసన సభ్యుడైన తరువాత అప్పటివరకున్న భ్రమలన్ని పటాపంచలయినాయి. ఆ తొలగిన భ్రమల్లోంచి. ఆవేదనల్లోంచి వచ్చిన కవితే ఎవరనుకొన్నారు ఇట్లౌనని ఎవరనుకొన్నారు.

ఎవరనుకొన్నారు? ఇట్లౌనని ఎవరనుకొన్నారు
ఆంధ్ర తెలంగాణలకు -అన్యత ఏర్పడుతుందని
హామీలిచ్చిన వారే అంతా స్వాహాచేస్తారని ॥ఎవరు॥
అన్నలు, ఒప్పందానికి సున్నా చుట్టేస్తారని
పరిపాలనతో తమ్ముల ఫణీతలు పాలు చేస్తారని ॥ఎవరు॥
ముఖ్యమంత్రియే స్వయముగ సఖ్యత ఛేధిస్తాడని
ప్రాంతీయాధ్యక్షుడు ప్రక్కతాళమేస్తాడని ॥ఎవరు॥

ఈ విధంగా తుంగలో తొక్కబడిన హామీలు వలసాంధ్ర పెత్తందారుల మోసాలు, దోపిడీలు, తప్పుడు లెక్కలు అమలు కాని ఒప్పందాలు, విఫలమైన పోచంపాడు ముల్కీ నిబంధనల వైఫల్యం మొదలైనవి తెలుపబడినాయి.

తెలంగాణ మాండలికంతో రచనలు చేసి స్వతంత్ర తెలంగాణకై కాళోజీ పడిన తపన తొలిదశ ఉద్యమ కవితల్లో కనిపిస్తుంది. హేతుబద్ధంగా ప్రశ్నించిన వైనం "కాళోజీ తెలంగాణ వేరైతే కవితలో కనిపిస్తుంది.

తెలంగాణవేరైతే! దేశానికి ఆపత్తా
తెలంగాణవేరైతే! తెలుగు బాస మరుస్తారా!
తెలంగాణవేరైతే! కిలోగ్రాము మారుతుందా!
తెలంగాణవేరైతే! తెలివి తగ్గిపోతుందా!
ప్రాజెక్టులు కట్టుకున్నా! నీరు ఆగనంటుందా
పోచంపాడు వెలసి కూడా, పొలము లెండిపోతాయా
తెలంగాణ వేరైతే! దేశానికి ఆపత్తా అని అంటాడు.

తెలంగాణ ఉద్యమ తీవ్రతను తగ్గించడానికి ప్రభుత్వం అష్టసూత్ర ప్రణాళికను ప్రకటించిన సందర్భంగా 1970లో కాళోజీ వ్రాసిన కవిత అష్టసూత్ర ప్రణాళిక (పుట 347)

తెలంగాణ వేర్పాటును తేల్చనిది అయితె మానె
అష్టసూత్ర ప్రణాళిక- అందముగా రుజువుచేయు
. . . . . . . . . . . . . . . . . . . . . . .
. . . . . . . . . . . . . . . . . . . . . . .

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


బ్రహ్మానందుని అండన బ్రతుకుచున్న ముల్కిమంత్రి
అష్టకాని కొక్కటి! అందెను ప్రమాణ పత్రము
ఒప్పందాలను మరచి తప్పుడు కూతలు కూస్తూ
ప్రాంతాన్ని పాడుచేయు! పన్నాగపు బాబా'ల
అష్టకాని కొక్కటి! అందెను ప్రమాణపత్రము, అంటూ

ఆంధ్ర వలసవాదుల కుట్రలను బహిర్గతం చేసే వైనమే ఈ కవితలో కనిపిస్తుంది.

కాళోజీ అచ్చమైన పౌరుడు. పౌర హక్కులకు ఏవిధమైన భంగం కలిగిన గొడవపడడం ఆయన నైజం. ప్రశ్నించడం, నిలదీయడమే కాళోజీయిజం. దేశంలో ఎమర్జన్సీ విధించినపుడు బహిరంగంగా సాక్షాత్తూ రాష్ట్ర పతిని ప్రశ్నించిన సాహసి కాళోజీ. ఆత్మయిక పరిస్థితిపై కాళోజీ కవితా శతాఘ్నులు కురిపించాడు. ప్రజలకోసం ఎమర్జన్సీని నిరసిస్తూ కూడా కవిత్వం వ్రాసాడు.

ఇంతకన్న చావునయం
ఇంకనేను బ్రతికున్నన?
నాగొడవకు నిప్పుబెట్టి
నాగొంతును అదిమిపట్టి
ఎమర్జెన్సీ సామ్రాజ్యం
ఎదిగి మిడిసి పడుతుంటే
ఇంతకన్న చావునయం
పౌరునిగ పలుక వీలులేనప్పుడు
బ్రతికెందుకు కాళోజీ
. . . . . . . . . . . . .
రాజ్యంగం సమకూర్చిన
అవకాశము ఎమర్జన్సీ
ఎమర్జిన్సీ పరిపాలన
కూడా ప్రజాస్వామ్యంబే
అని ఇందిర చాటితేమి
పౌర జీవితమ్ము కాలి
కమురు కంపు కొడుతుంటే
ఎమర్జన్సీ అత్తరుతో
ఏమాత్రం ఆపగలవు

రాష్ట్రపతి ఎమంటవు అంటూ సూటిగా రాష్ట్రపతిని జంకు గొంకు లేకుండా ప్రశ్నించాడు. ఎమర్జన్సీని ప్రకటించిన రెండో రోజే పౌరునిగా తన హక్కులను కవిగా తన బాధ్యతను గుర్తించాడు. అందుకే ఆయన ప్రజాకవి అయ్యారు.

కాళోజీ నారాయణరావు అహర్నిశలు పేదలకోసం సామాన్యులకోసం పరిశ్రమించిన మహావ్యక్తి,

"అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి / అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి, ప్రాప్తి".

"అన్యాయాన్నెదిరించిన వాడు నాకు ఆరాధ్యుడు" అన్న కాళోజీ అసమానతలపైన అక్రమాలపైన నిరంతరం సమరం చేశాడు. సూటిదనం ఆయన కవిత్వలక్షణం. నిగర్వం ఆయన జీవన విధానం.

ఉదయం కాదనుకోవడం నిరాశ.

ఉదయించి అలాగే ఉండాలనుకోడం దురాశ" లాంటి కవితా వాక్యాలు కాళోజీ తాత్వికతను తెలియ జేస్తాయి. ప్రభుత్వ పురస్కారాలందుకున్న కాళోజీ అదే ప్రభుత్వం ప్రజావ్యతిరేక సంస్కరణలు చేసినపుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు నిస్సందేహంగా నిర్మొహ మాటంగా వ్యతిరేకించే వాడు. గాంధీజీ అహింసా సిద్ధాంతాలు మొదలైన విధానాల పట్ల అభిమానం వున్న అదే కాళోజీ అవసరమైన సందర్భాల్లో నక్సలైట్లను కూడా సమర్థించాడు.

ఒకసారి నక్సలైట్లు ఎన్నికలను బహిష్కరించి ఎవరైనా ఓటు వేస్తే "వేళ్ళు నరుకుతాం" అని హెచ్చరిక ప్రకటన చేసినప్పుడు మొదటి ఓటు తానే వేసి ప్రజలకు భద్రత కల్పించే విషయంలో పోలింగ్ బూత్ ముందు నిలుచొని నక్సలైట్లకు సవాల్ విసరడం అతని వ్యక్తిత్వం విశిష్టత. విప్లవ రైతు కూలీ యోధులైన భూమయ్య, కిష్టయ్య గౌడ్ లను ప్రభుత్వం ఉరితీసినపుడు కాళోజీ వ్రాసిన కవిత ఆయనకు ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉండే అన్ని రకాల హక్కులపై ఉన్న అచంచల విశ్వాసానికే ఉదాహరణ. అయితే కాళోజీ ఏవాదానికి లొంగని మనిషి.

కాళోజి రాజ్యాంగ బద్ధ పాలనను కోరినట్లుగా కనిపించినా దుర్మార్గ ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలే నిర్ణయించుకుంటారని భావించాడు. దీన్ని బట్టి ప్రజాస్వామిక

హక్కుల కోసం కాళోజీ ఎంతగా ఆరాట పడ్డాడో అర్థం చేసుకోవచ్చు.

భూస్వామ్య వ్యవస్థలో అసమానత వివిధ రూపాలలో తీవ్రంగా ఉండేది. కులీనులు తప్ప సామాన్య మానవులు హీనంగా చూడ బడేవాళ్లు. దాన్ని తిరస్కరించి అన్నార్థుల ఆకలి బాధలు తీర్చేదిగా సమాజంలో రూపుదిద్దుకోవాలనే మానవవాదాన్ని సామ్యవాద దృక్పథంతో మిళితం చేసి కాళోజీ కవితగా వ్రాశాడు.

అన్నపురాసులు ఒకచోట
ఆకలి మంటలు మరొకచోట
మమత యున్న మనసులోన
సమతా భావము కలుగును
సమభావననది
సమరస భావన నది. . . . .

సమతారాజ్యం నెలకొల్పడానికి కృషిచేసిన శాంతి కాముకులు, సాయుధ పోరాట యోధులు. ఇరువురి పక్షంలో తన సమకాలంలో అగ్రపంక్తిలో కాళోజీకి స్థాన మున్నదనడంతో విప్రతి పత్తిలేదు.

1966లో పరాభవ సంవత్సరంలోని శరత్కాలంలో అధి కారులు అవినీతిలో, అక్రమాలతో, దోపిడీతో కుట్రలతో, మోసాలతో ఏ రకంగా హాయిగా వున్నారో "పరాభవశరత్తు" అనే కవితలో కాళోజీ తెలిపాడు.

సమకాలీన సామాజిక వ్యవస్థలో అధికారం మత్తులో రాజకీయ నాయకులు తూలుతున్నారనీ ప్రజల డబ్బుతిని అధికారులు ఏమీ తెలియని వాళ్ళలాగా తిరుగుతున్నారని ఫలితంగా ప్రజాహితం, జీవితంలో నీతి చితికి పోయాయని ప్రభుత్వానికున్న ప్రజాస్వామ్య ముసుగు జారి పడగ విప్పిందని చెప్తూ..

ఇది పరాభవశరత్తు
పాపం పండిన మత్తు
అధికారపు రాజకీయ
మదము చేయు కసరత్తు అన్నాడు కాళోజీ

అన్నింటిని ప్రశ్నించే కాళోజీ కి "అహింసపై గాంధీజీకి ఉన్నంత విశ్వాసం ఉంది. అదే సమయంలో ప్రజాహితం కోసం అవసరమైన సందర్భాలలో హింసకు ప్రతిహింస తప్పేకాదు అనడం ఆయన వ్యధార్థ జనం పక్షపాతి అనడానికి స్పష్టాతి స్పష్టమైన నిదర్శనం.

గాంధీని సంబోధిస్తూ వ్రాసిన కవితలో, గాంధీ స్వయంగా తన రాజకీయవారసుడుగా పేర్కొన్న నెహ్రూ పాలనలో, నీతి, నిజాయితీ, న్యాయం, సత్యం, అహింస మొదలైన గాంధేయ విలువలు నిర్వీర్యమై పోతుంటే విల విలలాడిన కాళోజీ.

"నీ వారను రాజ్యంలో నీతికి తావేదిబాపూ?
నీ మాటలు విని ప్రాణము నిలుపుకునేదెట్లు బాపు?

అని ప్రశ్నించాడు. గాంధీ బొమ్మకు పట్టంగట్టి వేలాడ దీసి, గాంధీ టోపిని కాంగ్రెసు రాజకీయాలకు గుర్తును చేసి, గాంధీ బోధించిన విలువలను, మరచిపోయిన జాతి ఆత్మ న్యూనతను అధిక్యంగా మార్చుకొని అధికారం చెలాయిస్తూ కాలం గడుపుతున్న తీరును "ఇంకెమి కావలె? ఇంకేమి చేయాలే? బ్రతికినన్నాళ్ళు నిను బాపు అని పిలిచితిమి/ చచ్చిపోయిన నిన్ను జాతిపితాజేసితిమి' అన్న మాటలలో వ్యక్తం చేశాడు."

నీ పేరుతో టోపి నిత్యమైపోయినది" అన్న ఒక్క మాటలో
ఎదుటవారిని ముంచి వేసే దుర్మార్గవైఖరే రాజ కీయమై
కొనసాగుతున్న వైనాన్ని సూచించాడు.

1971లో లోక సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ప్రధానమంత్రికి తెలంగాణా నాయకులకు జరిగిన చర్చలు విఫలం కావడం వల్ల తెలంగాణ ప్రాంతంలో "తెలంగాణ ప్రజాసమతి అభ్యర్థులు ప్రత్యేక తెలంగాణ నినాదంతో ఎన్నికల్లో పాల్గొన్నారు. అధికారం చేతిలోవున్న కాంగ్రెసు ప్రభుత్వం ఓటర్లపై తూటాల వర్షం కురిపిస్తూ బెది రించింది. అధికార దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఓటర్లు తూటాలకు భయపడక ప్రత్యేక తెలం గాణాను సాధిస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రజలను భయపడవద్దని ఓట్లు షాట్లు అనే కవిత ద్వారా చైతన్య పరిచాడు.

మర్రి చెన్నారెడ్డి కాళోజీకి సన్నిహితమిత్రుడు. కాని అతడి రాజకీయాల్ని తెలంగాణకు ఆయన చేసిన ద్రోహాన్ని కాళోజీ క్షమించలేదు. ఒకనాడు చెన్నారెడ్డి కాళోజీతో ఈ రోజుల్లో ఏం చేస్తున్నావ్ కాళన్నా " అనగానే నువ్వ ఆడే ఆటకు రన్నింగ్ కామెంట్రీ ఇస్తున్నానన్నాడట. అంతటి సమయస్ఫూర్తి నిర్మోహమాటం కాళోజీది.

కాళోజీ తన ఆవేశాన్ని ఆవేదనను, ఆలోచనను, స్పందనను, ప్రజాపక్షపాతం వహించి కవిత్వకరించాడు

"ఏ దేశమురా నీది ఏమిభాషయురా
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా
అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!

అని భాషాభిమానాన్ని దేశాభిమానాన్ని ప్రకటించాడు. నిజాం పాలనలో సొంత వేషభాషలకు ఆదరణ లేక పోవటాన్ని నిరసించాడు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కాళోజీ ఒక్కడే సంఘానికి మించి పని చేసాడు. కాసుబ్రహ్మానందరెడ్డి మొదలు ఇందిరాగాంధీ వరకు ఎవరిని వదలకుండా ప్రశ్నించాడు. మొత్తంమీద పార్లమెంటు రాజకీయాలు, పౌరహక్కుల ఉద్యమం, నక్సలైట్ ఉద్యమాలను సమర్థించడం-వ్యతిరేకించడం, సామాజిక ప్రాంతీయ అసమానతలు తెలంగాణ ఉద్యమం భాషా సంస్కృతికి సంబంధించిన అంశాలన్నీ ఈ వ్యాసంలో చోటు చేసుకున్నాయి.

## ఉపకరించిన పుస్తకాలు :

1. జనధర్మ -తెలంగాణ ప్రత్యేక సంచిక-5.6.1969
2. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర- పి. రఘునాథరావు, స్టెర్లింగ్ పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూఢిల్లీ, రీప్రింట్-2012-13
3. 1969 తెలంగాణ ఉద్యమం- ప్రజాకవి కాళీజీ కవిత్వం-డా॥ బన్న అయిలయ్య నానీ ప్రచురణలు-వరంగల్ (కాళీజీ శతజయంతి సందర్భంగా)
4. 1969 -1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం-సంపాదకలు -సంగిశెట్టి శ్రీనివాస్, డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సింగిడి, తెలంగాణ రచయితల సంఘం, హైదరబాద్, తెలంగాణ డిసెంబర్ 2009.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# చింతా అప్పలనాయుడు కవిత్వం – 'దళిత స్పృహ'

– అంపావిల్లి ఈశ్వరరావు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం,

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో సమకాలీన సమస్యలను చిత్రిస్తూ ప్రజలను చైతన్యపరిచే ఆధునిక సాహిత్య ప్రక్రియ వచన కవిత్వం. ఎలాంటి పాండిత్యం లేని సామాన్య పాఠకుడిని కూడా ఆనందపరిచే ప్రక్రియ ఇది. శ్రీశ్రీ పఠాభి, కుందుర్తి ఆంజనేయులు వంటి కవులు తమ వచన కవితల ద్వారా సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. వచన కవితల్లో ముఖ్యంగా 'సామాజికత', సమకాలీనత, ప్రజలువాడుక భాష ఉండాలని కుందుర్తి ఆంజనేయులు అన్నారు.

చింతా అప్పలనాయుడు రాసిన దుక్కి వచన కవితా సంపుటి కుందుర్తి గారు పేర్కొన్న లక్షణాలను కలిగివుంది. చింతా అప్పలనాయుడు విజయనగరం జిల్లా చినగుడబ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. ఈయన జీవితంలోని స్వీయ అనుభవాలనే కవితలుగా మలచడంలో సిద్ధహస్తులు. ఉత్తరాంధ్ర కవులలో చాలా సూటిగా, సహజంగా సాగిపోయే శైలి చింతా అప్పలనాయుడుది. ఈయన కవిత్వం చదువతుంటే పల్లెటూరి వాతావరణం స్పష్టంగా కనిపిస్తుంది.

దుక్కి వచన కవితా సంపుటిలో దళితుల జీవిన విధానాన్ని గ్రామాల్లో వారు ఎదర్కొనే సమస్యలను కవి చక్కగా చిత్రించాడు. ఈ సంపుటిలో 35 కవితలున్నాయి. హరిజన వాడల్లోని పరిస్థితులను కవి దుక్కి కవిత్వంలోని 'ఒక మాలపేట కొన్ని దృశ్యాలు' 'మా ఊరి మాలపిల్ల' కవితల ద్వారా ఎంతో సహజంగా అక్షరీకరించాడు.

ఊరు ఊరంతటికీ.....
ఉదయమే పొద్దుపొడుస్తుంది గానీ
నిజానికి మాలపేటలో
సాయంకాలమే సూర్యోదయమౌతుంది!
పొద్దుపోయి పోయి తిరిగొచ్చి
మాలపేట పొయ్యిల్లో దూరినట్టుంటుంది!

'మాలపేట' కొన్ని దృశ్యాలు అనే కవిత ద్వారా దళితుల పరిస్థితిని చూపించాడు. హరిజనులు కూలి పనికి పొద్దుపొడిచేటప్పుడు వెళ్ళి పొద్దుగుంకే వరకు కష్టపడతారు. సూర్యాస్తమయమైన సూర్యుడు పోతూ పోతూ హరిజనవాడల పొయ్యిలో దూరినట్టు కవి వర్ణించాడు. దళితులు రోజంతా కష్టపడితే గానీ వారి కుటుంబం ఆకలి తీరే అవకాశం ఉండదనే విషయాన్ని కవి తెలిపారు.

దళిత వాడలో పిల్లలు ఆర్థికంగా వెనుకబడినా వారు సృజనాత్మకతలో, నైపుణ్యంలో మాత్రం వెనుకబడలేదనే విషయాన్ని తెలుపుతూ......

"ఒంటి మీద గుడ్డల్లేకపోతే లేవు గానీ
కొబ్బరి బురికిని బంతి చేసి
తాటి మట్టతో సిక్సర్ కొట్టబోతున్న
ఆ చిన్నోడ్ని చూడు!
శిక్షణ లేక గానీ మాలపేటలో ప్రతిపిల్లోడు
మరో సచిన్ టెండూల్కరే..........

ప్రపంచమంతా క్రికెట్ ఆట మీద శ్రద్ధ చూపిస్తుంది. ఎన్నో దేశాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ క్రీడను నిర్వహిస్తున్నాయి. ఈ క్రీడకోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు.

ఈ ఆటను పిల్లలు ఎంతో ఇష్టంతో వీధుల్లో కూడా ఆడుతుంటారు. అయితే దళితవాడల్లో పిల్లలకు క్రికెట్ పై ఉన్న ఆసక్తితో క్రికెట్ బాల్, బ్యాట్‌కి బదులుగా కొబ్బరి బురికి, తాటిమట్టని ఉపయోగించి ఆడడంలో వారి సృజనాత్మకతను కవి తెలిపాడు. సరైన వసతులు, శిక్షణ లేకపోవడం వల్ల వారు వెనుకబడిపోతున్నారే తప్ప లేదంటే 'మాలపేటలో ప్రతి పిల్లోడు మరో సచిన్ టెండూల్కరే". ఇలాంటి ఆణిముత్యాలు, మట్టిలో మాణిక్యాలు ప్రతి చోటా వుంటాయి. అవకాశాలు, వసతులు లేక అనేక మట్టిలో మాణిక్యాలు మట్టిలోనే వుండిపోతున్నాయి.

"చెరువు గట్టుమీద రోజంతా నాని
తడిమోపై సాయంకాలానికి గడపచేరితే

కంకటిల్లిపోతున్న పిల్లాడ్ని చెంకనేసి
పాలుపెడుతూ తన ఆకలినే మరిచిపోయిన అమ్మను
చూస్తే....."
అమ్మతనం ఇంకా మాలవీధిలోనే బతికుందని
డప్పేసి చెప్పొచ్చురా తమ్ముడా!

అమ్మతనం గురించి కవి చాలా హృద్యంగా వర్ణించాడు. చెరువుల్లో జనపనార కోసం జనపమొక్కలను ఊర బెడతారు. అవి బాగా నానిన తరువాత మొక్క నుండి నారను వేరు చేస్తారు. ఈ ప్రక్రియ చాలా గ్రామాల చెరువుల దగ్గర జరుగుతుంది. ఒక చంటి పిల్లాడి తల్లి పగలంతా శ్రమించి ఇంటికి చేరే సమయానికి చాలా అలసటకు గురౌతుంది. సమయానికి తిండిలేకపోయి ఆకలిగా ఉన్నా తడిబట్టలతో చలికి వణికిపోతూ బిడ్డకు పాలిస్తుంది అదే తల్లిప్రేమ. ప్రస్తుత సమాజంలో అందాలు తగ్గిపోతాయని కన్నబిడ్డలకు పాలు ఇవ్వడానికి నిరాకరించే తల్లులు కన్నా రోజంతా కష్టపడి ఆకలిని, అలసటని మరిచి బిడ్డలకు పాలు ఇచ్చే మాలవీధి అమ్మను చూస్తుంటే అమ్మతనం ఇంకా మాలవీధిలోనే బతికుందని కవి తెలిపాడు.

మాలపేట కొన్ని దృశ్యాలు కవిత ద్వారా చింతా అప్పలనాయుడు దళితులు జీవన స్థితిగతులను చక్కగా చిత్రించాడు. దళిత వాడల్లోని పేదరికం, మాలపేట పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను, మాలపేట స్త్రీ మాతృప్రేమను కవి ఎంతో హృద్యంగా చెప్పాడు.

దుక్కి కవిత్వంలోని 'దళిత స్పృహ'తో కూడిన మరొక కవిత "మావూరి మాలపిల్ల" ఈ కవితలో గ్రామీణ ప్రాంతంలో వున్న మాలపిల్ల సౌందర్యాన్ని కవి వర్ణించాడు. ఎండ్లూరి సుధాకర్ గారు చేసిన దళిత స్త్రీ సౌందర్య వర్ణన పోలిన విధంగా ఈ కవిత వుంటుంది. దళిత స్త్రీ సహజమైన సౌందర్యం ముందు ప్రపంచ సుందరి కూడా నిలబడలేని కవి తెలపాడు.

"తాటికమ్మల దడిలో దూరిపోయి
కురుస్తున్న వెన్నెలతో పాటు
కుండడు నీళ్ళు తానమాడి
పసుపు రాసుకున్న ఆమె ముఖాన్ని చూస్తే
నువ్వుండగా నన్నెవరు చూస్తారని
మబ్బుల్లో చందమామ మాయమవుతాడు!"
- 'మావూరి మాలపిల్ల'

పల్లెటూరుల్లో స్త్రీలు స్నానం చేసేందుకు స్నానపు గదులు వుండవు. అదే దళితవాడల్లో అయితే తాటి కమ్మలతో చుట్టూ దడిలా కట్టి, పైభాగాన్ని ఆకాశం కనిపించేలా వదిలేస్తారు. పసుపు రాసుకొని స్నానం చేస్తున్న మాలపిల్ల ముఖాన్ని చూస్తున్న చందమామ ఆమె అందం ముందు నిలబడలేక మబ్బుల్లోకి వెళ్లి దాక్కున్నాడని కవి చమత్కరించాడు.

గ్రామాల్లో కులంపరంగా మాలపిల్లల గురించి చులకనగా మాట్లాడేవారు వుంటారు. అయితే అలా మాట్లాడిన వారు కూడా ఆమె అందం చూస్తూ గుటకలేయడాన్ని వర్ణిస్తూ కవి మా వూరి మాలపిల్ల కవితలో......

"మాలోల గుంటరా అని
మాటికీ నోళ్లు పారేసుకుంటారు గానీ
నీల కుండతో నీలాటిరేవు చేరినప్పుడల్లా
ఊరి పెత్తందార్లతోపాటు
వయసొచ్చిన గుంటలల్లా.....
ఆమె అందాన్ని చూసి నోళ్ళూరబెట్టుకున్నోల్లే!
అప్పడాల ముద్ద పేలించినట్లు
ఫెయిర్ అండ్ లౌలీ పూసుకున్నోళ్లంతా
నాటుకోడిలా నిగ నిగ మెరిసిపోయే
ఆమె ముందు ఫారం కోళ్ళే గదా?"

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న వర్ణ వ్యవస్థ గురించి కవి ప్రస్తావించాడు. కులం పేరుతో హీనంగా మాట్లాడే పెద్దలు ఈనాటికీ లేకపోలేదు. కానీ తమ పడక సుఖం కోసం వారిని లోబరుచుకుని అనుభవించినప్పుడు మాత్రం కులం గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే. సహజమైన మాలపేట స్త్రీ అందం ముందు సుగంధద్రవ్యాలు పూసుకొని ముఖమంతా మేకప్ వేసుకొనే పట్నం స్త్రీలంతా నాటుకోడి లాంటి హరిజన యువతి ముందు ఫారంకోళ్ళే అనడం కవి చమత్కారం.

"మాలోల పిల్లయితేటి
కూలోల పిల్లయితేటి
శ్రమ జీవన సౌందర్య వేదిక మీద
ఆమే కదా విశ్వసుందరి"

దళిత స్త్రీ సాధారణంగా ఆర్థికంగా వెనకబడి వుంటుంది. అందువల్ల ఈమె పొద్దస్తమానం కష్టపడి శ్రమజీవిగా బ్రతుకుతుంది. నేలతల్లి కూడా ఈమె కష్టం చేసి పులకించిపోయి కూతురా నా కొంగు బంగారమా అని పంటనవ్వులై పరవశించిపోతుందని కవి భావించాడు. చింతా అప్పలనాయుడు దుక్కి వచన కవితా సంపుటి ద్వారా అచ్చమైన ఉత్తరాంధ్ర మాండలికాన్ని ఉపయోగించాడు. దుక్కి కవితా సంపుటిలో దళితవాడ స్థితి గతులను, దళిత స్త్రీ సౌందర్యవర్ణన, దళితుల శ్రామి కత్వం, హరిజన పిల్లల నైపుణ్యాలను చిత్రించాడు. ఈయన కవిత్వం చదువుతూ వుంటే పల్లెటూరి వాతా వరణంలో తిరుగుతున్న అనుభూతి కలుగుతుందనడంలో అతిశయోక్తిలేదు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు కవితా వికాసం - కడియాల రామ్మోహన్‌రాయ్
2. నగరంలో వాన - కుందుర్తి ఆంజనేయులు
3. 'దుక్కి' కవితా సంపుటి - చింతా అప్పలనాయుడు

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# అలపర్తి రామకృష్ణ నవలలు - సామాజిక స్పృహ

- సి. విజయలక్ష్మి, పరిశోధకురాలు, తెలుగు అధ్యయనశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమాజం పరిణామశీలి. ఆ పరిణామాలకు మూల హేతువులు ప్రజలు. ప్రజల ఆలోచనలు అభిరుచులు నిరంతరం మారుతుంటాయి. వాటికనుగుణంగా సమాజంలో మార్పులొస్తుంటాయి. అవి వ్యక్తిగతమైనవి కావచ్చు లేదా సామాజికమైనవీ కావచ్చు. అయితే ఈ మార్పులు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. ఒక మార్పు వచ్చినపుడు ముందటి సామాజిక స్థితిగతుల్లో మార్పులొస్తుంటాయి. ఈ మార్పుల్లో కొన్ని సమాజహితాన్ని కలిగించేవీ ఉంటాయి, హానిచేసేవి ఉంటాయి. హాని చేసేటివి ప్రజా జీవితం నుంచి తొలగిపోతాయి. ఉదాహరణకు సతీ సహగమనాన్నే తీసికోవచ్చు. అది స్త్రీ సమాజానికి గొడ్డలిపెట్టు వంటిది. అందువల్ల అది చాలా కాలం రాజ్యమేలినా ఆ తరువాత నామరూపాలు లేకుండా పోయింది. ఇలాంటి దురాచారాలు ఎన్నో కాలగర్భంలో కలసిపోయాయి.

సమాజంలో వచ్చే మార్పులను వాటి మంచి చెడ్డలనూ వివేచించేవారూ, చిత్రించేవారూ కవులు, రచయితలు. సమకాలీన సామాజిక స్థితిగతులను వారు తమ రచనల్లో ప్రతిబింబిస్తారు. కొందరు రచయితలు వాటి మంచి చెడ్డలను తాత్వికంగా చెబుతారు. అయితే కొందరు వాటిని మార్చాలని ప్రబోధిస్తూ, చైతన్య పరుస్తూ రచనలు చేస్తారు. ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా కళ్ళకు కట్టినట్లు వర్ణించిన వారికి నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథాది కవులను పేర్కొనవచ్చు. అలా గాకుండా సమాజాన్ని మార్చాలని రచనలు చేసిన కోవకు చెందిన కవులుగా కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, చలం వంటి వారిని పేర్కొనవచ్చు. అయితే ఇరువర్గాలకు చెందిన వారినీ గొప్ప రచయితలుగానే పేర్కొనక తప్పదు.

ఆధునిక కాలంలో వందలాది మంది కవులు, రచయితలు సమాజాన్ని సంస్కరించాలనే దృక్పథంతోనే రచనలు చేస్తున్నారు. అందుకు వారు కథ, నవల, నాటిక వంటి ప్రక్రియలను ఎన్నుకుంటున్నారు. ఈ క్రమంలోనే కాలానుగుణంగా పాఠకుల్లో వచ్చిన మార్పు మూలంగా రచయితలు సరళ శైలిలో రచనలు చేస్తూ ఎక్కువ మందిని ఆకట్టుకుంటున్నారు. అందుకు వారు నవల ప్రక్రియను ఎన్నుకుంటున్నారు. అలాంటి నవలా రచయితల్లో చెప్పదగినవారు అలపర్తి రామకృష్ణ. వారి కలం నుంచి దాదాపు ఇరవైకి పైగా నవలలు వెలువడ్డాయి. ప్రతి నవలలోనూ సమకాలీన సమాజ పోకడలను ఈయన చక్కగా చిత్రించారు. ఈయన కలం నుంచి అయిన వాళ్ళు, మంచి గంధం, వెన్నెలదారి, వెలుగు లోగిలి, అనబంధాలు, మజిలీ, మాయ, పేగుబంధం, అమ్మకడుపు చల్లగా, అనురక్తి, కొంగుముడి, జీవనలిపి, పాలకొండలు, గుండెగుప్పెడంత, వలపు వరద, మలుపు తిరిగింది, వాలిపోయేపొద్దు, సంచారి, యాత్ర, జీవన లాలస వంటి నవలలు వెలువడ్డాయి. ప్రతి నవల పరిమాణంలో చిన్నదైనా వస్తురీత్యా ఘనమైనదని చెప్పవచ్చు. ఈయన సమాజ శ్రేయస్సు కోరుతూ సరళశైలిలో నవలలను రాశారు.

అలపర్తి రామకృష్ణ నవల్లో డ్రగ్స్, కిడ్నాప్, ప్రైవేటు పాఠశాలల ధనదాహం, ప్రైవేటు పాఠశాలలపట్ల తల్లిదండ్రుల వ్యామోహం, ఆంగ్లభాషా వ్యామోహం, ప్రేమలు, పబ్ కల్చర్, పరస్త్రీ వ్యామోహం, ఉద్యోగులు పనిచేసే చోట ప్రేమించుకోవడం, తల్లిదండ్రులు పెళ్లి సంబంధాల కోసం వెంపర్లాడటం, అక్రమ సంబంధాలు, ఒంటరి జీవితం, పెద్దలపట్ల నిరాదరణ వంటి సామాజికాంశాలు చిత్రించబడ్డాయి. ఇవన్నీ మనం నిత్యం ఎలక్ట్రానిక్ ప్రింట్ మాధ్యమాల్లోనో, మన ఊర్లోనో, ఇంటిలోనో చూస్తున్నవే. ఇవన్నీ సామాజిక అరాచకాలు. దండనలు, నైతిక విలువలు లేకపోవడం వంటివాటి మూలంగానే పైన పేర్కొన్న సంఘటనలు జరుగుతున్నాయని చెప్పవచ్చు.

**1. డ్రగ్స్ :**

సమకాలీన సమాజాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి డ్రగ్స్. ఆర్థికంగా బాగా స్థిరపడినవారు వీటిని తీసికుంటున్నారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్మేముఠాలు తరచుగా దొరుకుతున్నాయి. వీరు ఉన్నత వర్గాలను, వారి పిల్లలను లక్ష్యంగా చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో సినిమా కళాకారులు చాలామంది డ్రగ్స్ తీసి కుంటున్నట్లు హైదరాబాదులో బయటపడింది. వారిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసుల దర్యాప్తులో నమ్మలేని నిజాలు చాలా బయట పడ్డాయి. ఎంతో ఉత్తములు అని అనుకున్న కళాకారు లంతా ఈ రాకెట్లో చిక్కుకున్నారు. దీనితో సభ్యసమాజం ఒక్కసారిగా నివ్వెరబోయింది. ఇలాంటి డ్రగ్స్ గురించి అలపర్తి రామకృష్ణ 'గుండె గుప్పెడంత' అనే నవలలో ఇలా తెలిపారు.

"ఘటికాచలం పెద్ద ప్లాన్‌లో ఉన్నాడు. ఇబ్రహీం వచ్చి కె.జి. కొకైన్ ఇచ్చి వెళ్ళాడు. అపుడపుడు అతను వచ్చి బ్రౌన్‌షుగర్, కొకైన్, హెరాయిన్ ఇచ్చి వెళ్తుంటాడు. చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసిన డ్రగ్స్‌ను తను సంపన్నులకు అందజేయాలి. వాళ్ళిచ్చిన డబ్బు తీసికొని తన కమీషన్ మినహాయించుకొని మిగతాపైకం ఇబ్రహీంకు ఇచ్చే యాలి. ఎక్కడా ఏ తేడా రాకూడదు.

ఇబ్రహీం డ్రగ్ తనకు సరఫరా చేస్తున్నట్లు ఎక్కడా మాటదొర్లకూడదు. అంతా సీక్రెట్‌గా జరిగిపోవాలి. పోలీసు లకు చిక్కినా ఎటువంటి పరిస్థితుల్లోనూ తనకు ఏ ముఠా సరఫరా చేస్తున్నది చెప్పకూడదు.

చిల్లర మల్లర వ్యక్తులకు డబ్బుకు ఆశపడి డ్రగ్స్ అమ్మకూడదు. సంపన్నుల పిల్లలను, సినిమా వాళ్ళనూ, బిజినెస్ చేసే వాళ్ళనూ టార్గెట్‌గా చేసుకోవాలి. రిస్కుతో కూడిన వ్యవహారమే! కష్టపడితే లక్షల్లో ఆదాయం" అంటాడు. డ్రగ్స్‌ను ప్రభుత్వం నిషేధించింది. అయినా చట్టాన్ని ధిక్కరించి సంపన్నులు దాన్ని వినియోగిస్తున్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకొని కొన్ని ముఠాలు డ్రగ్స్‌ను సరఫరాచేస్తున్నాయి. అలా చేయడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసికుంటున్నారో నవలా రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

**2. ప్రైవేటు పాఠశాలల పట్ల వ్యామోహం :**

ప్రభుత్వపాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. దీనికి చాలా కారణాలున్నాయి. అలాంటి కారణాల్లో కొన్నింటిని అలపర్తి రామకృష్ణ ఒక నవలలో ఇలా తెలిపారు.

"ప్రైవేటు స్కూళ్ళలో సౌకర్యాలు, టీచింగ్ ఎయిడ్స్ లేక పోయినా తల్లిదండ్రులు ఈ కాన్వెంటు సూళ్ళమీదే మోజు చూపిస్తున్నారెందుకు? శర్మను అడిగింది అనూ రాధ.

ప్రభుత్వ పాఠశాలలు మరీ ఘోరంగా వున్నాయండి. ఉపాధ్యాయుల ఖాళీలుంటాయి. అవి భర్త చెయ్యరు. ఈవాళో, రేపో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉంటాయి. కొన్ని స్కూళ్ళకి తలు పులు, ఇంటి కప్పులు కూడా ఉండవు. వాటికంటే మెరుగ్గా ప్రైవేటు పాఠశాలలుండడంతో తల్లిదండ్రులు ఈ పాఠ శాలలను ప్రిఫర్ చేస్తున్నారు" అంటాడు రచయిత 'అమ్మ కడుపు చల్లగా' నవలలో. ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని ప్రతిబింబించాడు రచయిత. ప్రభుత్వం ఈ లోపాలను సరిదిద్దకుండా ఉండడం మూలంగా ప్రభుత్వ పాఠ శాలలో నిరుపేదలు కూడా చేర్పించడానికి వెనుకంజు వేస్తున్నారు. వివిధ నివేదకలు, ప్రభుత్వ సర్వేలు కూడా ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి.

**3. యాసిడ్ దాడులు :**

నేడు సమాజంలో ప్రేమ పేరుతో కొందరు యువ కులు వికృత, అనాగరిక, దుర్మార్గపు చేష్టలకు పాల్పడు తున్నారు. ప్రేమ పేరుతో ఆడపిల్లల జీవితాలను బుగ్గి చేస్తున్నారు. ఈ విషయాన్ని నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా చిత్రించారు.

"మౌర్య ప్రక్కన ఉన్న కుర్చీలో కూర్చుంది లాలస. తదేకంగా లాలసను చూస్తుండి పోయాడతను. ఎంతో వింతగా ప్రత్యేకంగా కనిపించిందామె. హత్యచేస్తే తప్పు,

రేప్ చేస్తే తప్పుగాని ప్రేమిస్తే తప్పేముందండి? అన్నాడు మౌర్య.

ప్రేమతోనే చిక్కులు వచ్చిపడతాయండి. ప్రేమ సామ్రాజ్యాలను కూల్చివేసింది. అమ్మాయి తనను ప్రేమించలేదని కక్ష కట్టి రేప్ చేస్తాడు. మరొకడు యాసిడ్ పోస్తాడు. హత్య చేయడానికి కూడా వెనుకాడడు. అన్నీ మగవాళ్ళే ఈ పనులు చేస్తారు. ప్రేమించలేదని ఏ అబ్బాయి మీద ఏ అమ్మాయి యాసిడ్ పొయ్యదు" అంటాడు 'కొండ ముడి' నవలలో. ఒక అబ్బాయిని ప్రేమించడం, ప్రేమించకపోవడం అన్నది అమ్మాయికి రాజ్యాంగం కల్పించిన హక్కు. దాన్ని కొందరు యువకులు కాలరాస్తున్నారు. మగవాడిననే అహంకారంతో అమ్మాయిల ముఖంపై యాసిడ్ పోయడం, హత్యచేయడం, రేప్ చేయడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి దుర్మార్గులపట్ల ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి కఠినంగా అణచివేయాల్సిన అవసరం ఉంది.

### 4. పబ్ కల్చర్ :

పాశ్చాత్య సంస్కృతికి భారతీయులు విపరీతంగా ఆకర్షితులవుతున్నారు. వారి వికృత వికార చేష్టలకు దాసోహమంటున్నారు. అలాంటి వాటిలో చెప్పదగినది 'పబ్ కల్చర్'. ఇది కుటుంబ జీవితాన్ని భ్రష్టుపట్టిస్తుంది. దీని ద్వారా పవిత్రమైన భారతీయ కుటుంబ జీవన వ్యవస్థ ఘోరంగా దెబ్బతింటున్నది. ఈ విషయాన్ని గూర్చి నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు ఒక వ్యక్తి అనుభవం ఆధారంగా.

"ఓ రోజు పబ్‌కు వెళ్ళాడు ఆకాష్. స్వర్గం అవుట్ లెట్స్ అవి. ఇంద్రుడు కుబేరుడు అక్కడే ఉంటారు. చూపులతో మైకం తెప్పించే మగువలు, మధు పాత్రలు అమ్మాయిలు సయ్యాటలు..... ఖుషీ ఖుషీగా ఉంటుంది అన్నాడో స్నేహితుడు.

అతనితోబాటు నైట్ క్లబ్‌కు వెళ్ళాడు. అందమైన పార్టీవేర్‌లో అద్భుతంగా కనిపించారు, అమ్మాయిలు - అబ్బాయిలు లోపలికి వెళ్ళేటప్పుడు కాక్‌టైల్‌చప్పరిస్తూ మ్యూజిక్‌కు అనుగుణంగా షోర్ మీద డ్యాన్సులు చేసేటపుడు మొదట్లో పద్ధతిగా డిగ్నిఫైడ్‌గానే కనిపించారు. ఆ తర్వాత మొదలైంది కోలాహలం.

ఎక్కువసేపు అక్కడ ఉండలేక బయటకు వచ్చేశాడు. నైట్‌హొటల్లోనే రూము తీసుకొని వుండిపోదామన్న మిత్రుడు మాట విన్పించుకోకుండా.

కారుపార్కింగ్ వైపు వెళ్ళాడు. ఎటువైపు చూసినా అన్నీ ఖరీదైన కార్లే! వాచ్‌మెన్ ఎక్కడో దూరంగా గేటు దగ్గర ఉన్నాడు. ఓ కారు పక్కన అమ్మాయి ఏడ్పు వినిపించింది.

అటువైపు వెళ్ళాడు. ముగ్గురు కుర్రాళ్ళమధ్య వో అమ్మాయి సన్నగా ఏడుస్తూ నిలబడి ఉంది. ఆ అమ్మాయి కూడా డ్రింకు పుచ్చుకున్నట్లు ఉంది. తూలిపోతూ ఉంది. ఆ అమ్మాయిని కారు సీట్లోకి నెట్టేప్రయత్నం చేస్తూ వున్నాడో అబ్బాయి.

నా తర్వాత నీటర్న్‌రా అన్నాడు కుర్రాడు.

ఆ అమ్మాయి వాళ్ళ ప్రయత్నాలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తోంది. కానీ ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. వాళ్ళను అడ్డుకోబోయాడు.

తనను చితకదన్ని అవతలకు తోసేసారు. తన కళ్ళ ముందే ఆ అమ్మాయిని కారు వెనుక సీట్లోకి నెట్టడం, లోపలికి ఓ కుర్రాడు దూరడం తలుపు వేసుకోవడం జరిగిపోయింది. మిగిలిన ఇద్దరూ కుర్రాళ్ళూ బాడీగార్డులా పక్కన నిలబడ్డారు" అంటూ ఆ దుర్మార్గ వర్తనాన్ని కళ్ళకు కటినట్లు చిత్రించాడు 'గుండె గుప్పెడంత' నవలలో.

పెద్ద పెద్ద నగరాల్లో ఈ పబ్ సంస్కృతి విచ్చల విడిగా సాగుతున్నది. ఒకరి భార్యతో మరొకరు, ఒకరి భర్తతో మరొకరు వెకిలి డ్యాన్సులు వేస్తారు. అర్ధనగ్నంగా ఉన్న అమ్మాయిలు డ్యాన్సులు చేస్తుంటే వీరు డ్రింక్స్ తీసికుంటూ మత్తులో మునుగుతామేమో కూడా తెలియనంతగా రాసలీలలు చేస్తుంటారు. భారతీయ సంస్కృతిని ఇవి మంటగలుపుతున్నాయి.

### 5. అక్రమసంబంధాలు :

నేటి సమాజంలో అక్రమ సంబంధాలు రాజ్యమేలుతున్నాయి. దీనిమూలంగా హత్యలు చోటుచేసికుంటు

న్నాయి. అక్రమసంబంధం కొనసాగించడంకోసం భర్త భార్యను, భార్య భర్తను హత్య చేస్తున్నారు, చేయిస్తున్నారు. ఈ దుర్మార్గాలు రోజురోజుకూ పెరుగుతున్నాయేగాని తగ్గడంలేదు. ఇలాంటి అక్రమ సంబంధాన్ని గూర్చి నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు.

"మా పిన్ని గాయత్రి బ్యాంకులో పనిచేసేది. బ్యాంకు మేనేజర్‌ని ప్రేమించింది. అతనికి అంతకు ముందే పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు... మా పిన్ని వలలో పడి భార్యను, పిల్లల్ని సరిగ్గా చూడటం లేదని బ్యాంకు మేనేజరు భార్య బంధువులు వచ్చి మా పిన్నితో పోట్లాడారు. నేను మానాన్న వాళ్ళకు సర్దిచెప్పి పంపాం. నా అనుమానం ఏమిటంటే వాళ్ళే మా పిన్నిని వ్యాన్ కిందికి నెట్టేశారేమోనని" అని తెలిపాడు 'పేగుబంధం' నవలలో.

ఏరోజు పత్రిక చూసినా అక్రమసంబంధాలు, దాని దుష్టపరిణామాలకు చెందిన వార్తలు మనకు కనిపిస్తాయి. అవినీతి బాహ్యమైనవని తెలిసినా వాటికి పాల్పడుతున్నారు. ఇలా చేస్తున్నవారు బాగా చదువుకున్నవారు కావడం గమనార్హం.

## 6. దెబ్బతిన్న మానవసంబంధాలు :

ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు మంటగలసి పోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఉండాల్సిన ఆత్మీయ అనురాగాలు ఘోరంగా దెబ్బతింటున్నాయి. పిల్లలకు అవ్వతాతలకు సంబంధమే లేకుండా పోతున్నది. అవ్వ, తాతలు అనాథాశ్రమాల్లోనో, వృద్ధాశ్రమాల్లోనో ఉంటుండగా పిల్లలు హాస్టళ్ళలో ఉంటున్నారు. అందువల్ల పూర్వము ఉన్నట్లుగా కుటుంబ సభ్యుల భవబంధాలు తెరమరుగవుతున్నాయి. ఈ విషయాన్ని గూర్చి నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు.

"మీ పిన్నిది నాదీ ఎన్నో జన్మల బంధం. ఢిల్లీలో ఉండే నా కొడుకు నన్నెప్పుడూ తలచుకోడు. నాలుగైదు నెలలకోసారి ఫోన్ చేస్తాడు, నేను బతికి ఉన్నానో లేదో తెలుసుకోవడానికి. నన్ను చూడడానికి రాడు. కోడలికి నా పోడే గిట్టదు. మనవడికి తెలుగురాదు. ఇంట్లో అందరూ హిందీ మాట్లాడతారు. ఓసారి ఢిల్లీ వెళ్ళానుగానీ వారం రోజుల కంటే ఎక్కువ ఉండలేకపోయాను.

నేను ఎప్పుడు చనిపోతానా... ఇల్లు ఎప్పుడు సొమ్ము చేసుకుందామా అని ఎదురు చూస్తూ ఉన్నాడు నా కొడుకు అని రాజమ్మ పాత్ర ద్వారా 'వెలుగులోగిలి' నవలలో తెలిపాడు రచయిత.

తల్లిదండ్రులు తిని తినక బిడ్డలకు ఎలాంటి కొరత లేకుండా, రాకుండా, కంటికి రెప్పలా చూసుకుంటారు. మరిన్ని ఉన్నత చదువులు చదివిస్తారు. అయితే ఆ బిడ్డలు తమకు పెళ్ళి కాగానే అమ్మనాన్నలను అనాథలుగా వదిలేస్తారు. వారి బాగు పట్టించుకోరు. ఉద్యోగం నెపంతో వేరే ఊర్లో కాపురం పెడతారు. అన్ని విధాల వారిని నిర్లక్ష్యం చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. కొందరు బిడ్డలు తల్లిదండ్రులపై భౌతిక దాడులు కూడా చేస్తున్నారు. బతికుండగానే స్మశానంలో పారేస్తున్నారు. అలపర్తి రామకృష్ణ తన నవలల్లో చిత్రించిన సామాజి కాంశాలన్నీ ప్రస్తుత సమాజంలో మనం చూస్తున్నవే. వాటిని సామాజిక స్పృహతో నవలల్లో చిత్రిస్తున్నాడు. ఈ విధంగా ఒక రచయితగా తన సామాజిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు.

## ఉపకరించిన గ్రంథాలు :

1. తెలుగు నవల - అంపశయ్య నవీన్
2. తెలుగు నవలా వికాసం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3. నవలా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
4. తెలుగు నవల - మనోవిశ్లేషణ - కోడూరి శ్రీరామమూర్తి
5. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీజోగారావు
6. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
7. తెలుగు సాహిత్యసమీక్ష - ఆచార్య జి.నాగయ్య
8. అలపర్తి రామకృష్ణ నవలలు.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# దళిత స్త్రీల కథలు - స్త్రీవాద ఉద్యమం

- డా. ఎస్. ప్రవంతి

1980 నుండి ఇప్పటి దాకా కొనసాగుతున్న కాలాన్ని అస్తిత్వ దశగా చెప్పుకోవచ్చు. దళితవాదం, స్త్రీవాదం రెండు ఉద్యమాలు కూడా ప్రపంచ రాజకీయ, సాహిత్య ఉద్యమాలుగా నిలదిక్కుకొని నిర్దిష్టంగా పని చేస్తున్నాయి. ఈ ఉద్యమాలలో కొనసాగుతున్న ప్రజాస్వామిక వైఖరివల్ల ఈ ఉద్యమాలలో ఉన్న అమూర్తతను గురించి కూడా ప్రశ్నలు వేయడం జరుగుతోంది. అయితే స్త్రీలును స్థూలార్థంలో ఒకే కేటగిరిగా పరిణమించినప్పటికీ స్థూలార్థంలో అందరినీ ఒకే కట్టగా కట్టడం సరికాదు. ఎందుకంటే పరిగణించినప్పటికీ స్త్రీల మధ్య కూడా కులం, మతం, తెగలాంటి అంతరాలున్నాయి. ఈ అంతరాలలో కూడా దళితస్త్రీలు ఏదో ఒక రూపంలో అణచివేతకు గురి అవుతున్నారు. ఈ అణచివేతను ప్రశ్నించటం నేటి సాహిత్యంలో కనిపిస్తోంది. ఇలాగే దళితులు కూడా స్థూలార్థంలో ఒక కేటగిరి, సూక్ష్మార్థంలో ఒక కేటగిరి అన్నట్లు దళితుల మధ్య ఈ అంతరాలు కనిపిస్తున్నాయి. ఈ అంశాన్ని మాదిగ దండోరా ఉద్యమం స్పష్టం చేసింది. ఈ అంతరాల్ని ప్రశ్నించే ఉద్యమం ఇవాళ దళిత స్త్రీలు కొనసాగిస్తున్నారు. దీనికి సాహిత్య రూపాన్ని కూడా ఇవ్వ గలుగుతున్నారు.

దళితస్త్రీలను దళిత పురుషులు కూడా ఒక బాధితుల రాలిగానో, ఒకరి నీడన నిలబడే వారిగానో గుర్తిస్తున్నారే కానీ, హక్కులు కలిగిన వ్యక్తిగా, పోరాడే శక్తిగా గుర్తించ లేదు. సాంఘీక, లైంగిక అంశాలలో దళితస్త్రీలకు ప్రత్యేకమైన సమస్యలు, పోరాటాలు, హక్కులు, సంఘీభావం అవసరమనే విషయాన్ని గుర్తించాల్సి ఉంది. ఇప్పటి వరకూ, జరిగిన దళితోద్యమాల్లో కూడా దళిత స్త్రీల ప్రశ్నలు పితృస్వామ్య భావజాలం చాటున సరిగా చర్చకు రాకపోవడం, ఉద్యమాలు వారిని ఉపయోగించుకొని తరువాత పక్కకి తోసివేయడం జరుగుతూనే ఉందనే విషయాన్ని అనేకమంది దళితస్త్రీల అనుభవాలు చెబుతూనే ఉన్నాయి. ఈ దళిత స్త్రీలపైన రచయిత్రులు వెలువరించిన సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన కోణంలో అవసరం ఉందని గ్రహించిన 'అన్వేషి' దళితస్త్రీల సాహిత్య సంకలనాలు రావడానికి ఇది ప్రేరణగా నిలిచింది.

దళిత స్త్రీల కథా సాహిత్యాన్ని ఇతర ప్రక్రియలతో పోలిస్తే విభిన్నమైన వస్తువులు చోటు చేసుకున్నాయి. అందులో ప్రధానంగా జైలు కథలు, స్వలింగ ప్రేమ, ప్రత్యుత్పత్తి హక్కులు మాదిగ ఆశ్రితకులాల ప్రస్తావనలు మొదలైనవి. దళితస్త్రీల జీవితకోణాలు ప్రస్ఫుటంగా కథా సాహిత్యంలో సృజించారు. విభిన్నమైన పరిష్కారాలు చూపించారు. దళితస్త్రీలు స్త్రీవాద ఉద్యమం నుండి తమని తాము అన్వేషించుకుంటూ తమ ప్రస్తావన లేని దశ నుండి తమకంటూ ప్రత్యేకమైన చరిత్రలున్నాయని, భూమిపై మూలవాసులు దళితులేనని అందులోనూ ఉత్పాదక రంగంలో దళితస్త్రీలదే ప్రథమస్థానం అని నిరూపించే కథలను రచించారు. వ్యవసాయ భూమితో దళిత స్త్రీల జీవితం ముడిపడి ఉందని, భూమిని చీల్చి పంట పండించినా దళిత స్త్రీలు మాత్రం నేటికీ కూలీలుగానే పరిగణించబడుతున్నారు. శ్రమకు తగ్గ ఫలితం అందక ఆకలితో అలమటిస్తూనే ఉందన్న వాస్తవాన్ని కథల్లో చిత్రించారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలతో పోరాడుతూ అక్షరానికి దగ్గరై ఉద్యోగాలు, పదవులు చేపట్టినా చివరికి అంటరాని సమస్యలను అనుభవిస్తూ ప్రతిక్షణం అవమానాలను భరిస్తున్న ఆధిపత్య కులదౌర్జన్యాలను చిత్రించారు. ఇలా విభిన్నమైన జీవిత దృశ్యాలకు రూపాన్ని అందించిన కథలను రాశారు.

స్త్రీవాద ఉద్యమం అంతా అగ్రవర్ణస్త్రీలకు సంబంధించిందే కానీ అందులో దళితస్త్రీలకు చోటులేదనే విషయాన్ని, అందరి స్త్రీల బాధలు ఒకటి కాలేవనే వాస్తవాన్ని దళిత స్త్రీలు వెలికితీశారు. అగ్రవర్ణ స్త్రీలకు లేని ఎన్నో

సమస్యలు దళిత స్త్రీలు అనుభవిస్తున్నారు. వీళ్ళ సమస్య లను, జీవితాలను ఏ ఉద్యమాలు కూడా పట్టించు కోలేదని, స్త్రీల ఉద్యమంలో కూడా దళితస్త్రీలు లేరు. అలాగే దళితోద్యమంలో కూడా దళిత స్త్రీలు లేని దౌర్భా గ్యపు పరిస్థితులను వీరు చిత్రించారు.

ఎం.ఎం. వినోదిని రాసిన 'తప్పిపోయిన కుమార్తె' కథలో అగ్రవర్ణ సమాజంలో దళితస్త్రీ ఎదుర్కొనే అవ మానాలను తనదికాని జీవితాన్ని, తనదిగా చేసుకోవాలను కొనే ఒక అయోమయ పరిస్థితులను ఎదుర్కొంటున్న అనేకమందికి కనువింపు కలిగించి, తనపైన, తన ఆహారం పైన, తన జీవితం పైన, ప్రేమను పెంచుకుంటూ తన మూలాలను అన్వేషించాలనే దృఢ నిశ్చయాన్ని కలిగించే మనో విశ్లేషణాత్మక కథ. ఈ కథలోని సువార్తరాణి దళిత కుటుంబంలో పుట్టిపెరిగిన అమ్మాయి. తన తల్లి దండ్రులను, వారి ఆహరపు అలవాట్లను అసహ్యించుకొని తనవికాని వాటిని తనవిగా చేసుకోవడంలో అనేక అవ మానాలను భరిస్తుంది. తన స్నేహితురాలు గాయత్రి బ్రాహ్మణ కుటుంబానికి చెందినది. వాళ్ళ ఇంట్లో వాళ్ళను తన వాళ్ళుగా కలుపుకుపోతున్నా వాళ్ళు మాత్రం ప్రతి విషయంలో తాను దళితురాలిగా, కిరస్తానీ అమ్మాయిలాగే వేరు చేసి ప్రవర్తిస్తారు. గాయత్రి వాళ్ళ అక్క భర్త వలన లైంగిక వేధింపులకు గురవుతుంది. దళితస్త్రీలంటే లైంగిక వాంఛలను యదేచ్ఛగా తీర్చుకోవడాని ఉపయోగపడే వాళ్ళుగా ట్రీట్ చేస్తాడు. ఆ అవమానాన్ని దిగమింగు తుంది. గాయత్రి నాన్న సమాజంలో పేరు ప్రతిష్టలు కలిగిన ఆదర్శవంతమైన రచయిత. పుస్తకాల్లో నీతులు వల్లించి నప్పటికీ, ఇతను నిజజీవితంలో తన పరిస్థితిని చూసి అసహ్యించుకుంటుంది. మాలమాదిగలంటే నీచంగా చూసే ఇతనా ఈ రచనలు చేసింది అని అసహ్యపడి అక్కడి నుండి తనపాదులను, తన వేర్లను, వెతుక్కుంటూ తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొని శిలువను మెడలో ధరించి బొట్టును చెత్తడబ్బాలో పడేసి తప్పిపోయిన చోటుకే తిరిగి వస్తుంది ఆ అమ్మాయి.

భారతీయ నిచ్చెనమెట్ల వ్యవస్థ ఉన్నతకులం, దిగువకులం, అట్టడుగుకులం అనే భావాలను మనిషి నరనరాల్లో ఇంకిపోయేలా చేసింది. తనకులం తక్కువ కాదు. శ్రమ జీవితమే అసలైన సౌందర్యం అని గుర్తించ లేనంత లోతుల్లో కూరుకుపోయేలా ఒక మనిషి మెదడును క్రమక్రమంగా తమ ఆధిపత్యాల్లోకి తీసుకొని దళితులను ఆత్మనూన్యతాభావనలో పడేసిన అగ్రవర్ణకుల రాజకీయా లను ఈ కథలో చిత్రించారు రచయిత. ఆ భావన నుండి ఆ ఆలోచన దొంతరలను తొలగించుకొని చూస్తే తమ కులంలోని గొప్పతనాన్ని సమాజానికి చాటిచెప్పి తక్కువ, అట్టడుగు అన్న భావనలను అంతమొందించే దిశగా ప్రయాణం సాగించాలే కానీ మనది కాని దానిని మనదిగా స్వీకరించి మనగలగాలనుకోవడంలో ఎదురయ్యే సమస్య లను చిత్రించారు. ఆధిపత్య వర్గాల కోరల్లో ఇరుక్కొని అవమానాలపాలవుతూ కూడా తన అస్తిత్వాన్ని నిలబెట్టు కొనే దిశగా తన జీవన పయనాన్ని కొనసాగించింది సువార్త రాణి. ఈ కోవలోకి చెందినవే నంబూరి పరిపూర్ణ రాసిన 'ఏమైతే మాకేమిటి', జూపాక సుభద్రరాసిన 'షెవ్వానెత్తు' మొదలైన కథలు.

దళిత స్త్రీల జీవితాల్లో మరో ముఖ్యమైన సమస్య కులాంతర వివాహాలు, వీటికారణంగా దళిత స్త్రీ, పురు షులే ఇబ్బందులను ఎదుక్కొంటున్నారు. ఈ విషయాన్ని నంబూరి పరిపూర్ణ రచించిన 'ఆదర్శాలు - అన్వయాలు' కథ ద్వారా నిరూపించారు. ఈ కథలో శకుంతల, వేణు గోపాల్ తల్లీ కొడుకులు వీరిద్దరూ కులాంతర వివాహాల కారణంగా అనేక సమస్యల్ని ఎదుర్కొన్నారు.

వేణుగోపాల్ ప్రమీలది సంఘ సంస్కర్తల భావ జాలంతో పెద్దలు కుదిర్చిన కులాంతర వివాహం. ఈ కులవివక్ష అన్నది వీళ్ళిద్దరి కొడుకు ప్రవీణ్ పుట్టిన రోజుకు వేణుగోపాల్ అమ్మ, పెద్దమ్మ వస్తానంటే ప్రమీల వద్దు అంటుంది. అందులోని ఆంతర్యం ఏమిటంటే వాళ్ళ పెద్దమ్మది కూడా వీళ్ళలాగే కులాంతర వివాహం. నల్లగా ఉంటుంది. చూడగానే తక్కువకులం అన్న భావన కలుగు తుంది. కాబట్టి తన బంధు మిత్రుల సమక్షంలో తమ పరువు పోతుందని అత్తల్ని గౌరవించడం అటుపోనిచ్చి, మాట్లాడటమే మానేసింది. దీనితో వేణుగోపాల్ తీవ్రమాన

సిక సంఘర్షణకు లోనవుతాడు. తమ పెళ్ళి జరిపించిన పురుషోత్తమరావు గారిని పిలిపించి ప్రమీలకున్న కుల వివక్షతను వివరించి చెప్తాడు. పురుషోత్తమ రావు సంస్కర్త, స్వాతంత్ర్యోద్యమకారుడు ప్రమీలతో మాట్లాడి కులం కావాలో భర్తకావాలో తేల్చుకోమని వివరంగా ఆమెకు చెప్తాడు.

అలాగే వేణుగోపాల్ పెద్దమ్మ శకుంతలది కూడా కులాంతర వివాహమే. చదువుపైన చాలా శ్రద్ధ చూపు తుంది. స్వాతంత్ర్యోద్యమంలో చాలా చురుగ్గా పాల్గొంది. విద్యార్థి సంఘానికి నాయకురాలుగా ఎదిగింది. జిల్లా విద్యార్థి నాయకుడు ప్రసాద్‌ని ప్రేమించి, ప్రసాద్ బల వంతంతో చదువుకు స్వస్తిచెప్పి పెళ్ళి చేసుకుంది. నిమ్న కులానికి చెందిన స్త్రీని పెళ్ళి చేసుకోవడం కారణంగా ప్రసాద్ తల్లిదండ్రులు వీళ్ళని వెలివేశారు. కొద్దిరోజులకే ఈ ప్రేమ వివాహం ఎండిపోయిన బావిలా మారింది. ఇద్దరు పిల్లల పోషణభారం వల్ల రకరకాల ఉద్యోగాలు చేసింది శకుంతల. కొంతకాలానికి క్రమంగా ప్రసాద్ వాళ్ళ తల్లిదండ్రులతో కలిసి కులం ఉన్న పిల్లను పెళ్ళి చేసుకొని ఆమె తెచ్చిన కట్నం తోటి రాజకీయ జీవితాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాడు. తనకు శకుంతలకు జరిగిన ఆదర్శ వివాహానికి అప్పట్లో చట్టబద్ధత లేదు. దీని కారణంగా శకుంతల నిలదొక్కుకొని గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించి, పిల్లల్ని పోషించి, ఉన్నత చదువులు చెప్పించి, ప్రయోజకుల్ని చేసింది. అన్ని ఆటుపోట్లకు నిలదొక్కుకొని జీవిస్తున్నప్పటికీ కోడలి దృష్టిలో కూడా కులవివక్షకు గురైన విషయాన్ని తలచుకొని కుటుంబమంతా విలపిస్తారు. తరాలు మారినా వివక్ష మారలేదు.

ఈ కులాంతర వివాహాలన్నవి ఇద్దరు వ్యక్తుల జీవితం. ఆ ఇద్దరి కుటుంబాలు ఆనందంగా ఉండటం కోసం కాదు. సమాజంలో ఇరుకులాలు బలం కోసం, మెప్పు కోసం. ఆదర్శాల కోసం మాత్రమే జరుగుతున్నాయి. అవి దాదాపు ప్రేమ వివాహాలు అందులో అట్టడుగు వ్యక్తులు, మాత్రమే తమ కుటుంబాలకు దూరమైపోతున్నారు. అది స్త్రీ అయినా, పురుషుడైనా దిగువ తరగతికి చెందిన వాళ్ళే ఇబ్బందులు అనుభవిస్తున్నారు. అందులో కులాంతర వివాహాలు, పెద్దలు కుదిర్చిన వివాహాలు చేయడమన్నది ఈ కథలోలాగ సంస్కరణభావాలు, ఉద్యమ నేపథ్యం కలిగిన కుటుంబాల్లోనే సాధ్యం. అలాంటప్పుడు కూడా ఇబ్బందులు ఎదుర్కొనేది మాత్రం దళితులే. ఈ కారణం గానే నేడు కులాంతర వివాహాలు ఎక్కువ శాతం విజయ వంతం కాలేకపోతున్నాయి అనడానికి కారణం "త్రివర్ణ హిందువుల ఫ్యూడల్ పవిత్ర ఆధిక్య భావన! వాళ్ళ పవిత్ర ఆధిక్య భావనని యీ జాతి - అంతర విందులు; జాతి - అంతర వివాహాలు మైలపరుస్తాయి" (పుట.484 - అరుణా సొదా డా॥ బి.ఆర్. అంబేడ్కర్ వర్ణనిర్మూలన) అని అంబే డ్కర్ గారు అన్నారు. అంబేడ్కర్ హయంలో త్రివర్ణాల ఆధిపత్యంతో పోరాడితే నేటికాలంలో వేలకులాలుగా, వర్ణాలుగా విభజించబడి ఎవరి ఆధిక్యతను వాళ్ళు ప్రకటిం చుకుంటున్నారు. ఈ అధికారదాహంతో అసలు బాధితు లకు నష్టం జరుగుతోంది అనడానికి ఈ కులాల వివక్ష సమసిపోవడానికి ఈ కులాంతర వివాహాలన్నవి పైపై పూతలు మాత్రమేనని స్పష్టపడింది. ఈ సమాజంలో ఈ వివక్షను నిర్మూలించాలంటే అంబేడ్కర్ అభిప్రాయం ప్రకారం "నిజమైన దెబ్బ త్రివర్ణ హిందువుల ఆధిక్యతను పెంచిపోషించే వాళ్ళ శాస్త్రాలలో దాగిన ఫ్యూడల్ పవిత్ర విశ్వాసాల మీద పడాలి! (పేజి. నెం.485) సొదా అరుణ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ 'వర్ణనిర్మూలన) అప్పుడు మాత్రమే ఈ అంతరాలు చెదిరిపోతాయి. కానీ ఈ వివాహాల కార ణంగా మాత్రం పోవని తేలిపోయింది. ఈ విషయాన్నే ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజేశారు. ఇలాంటి కోవకు చెందినవే జూపాక సుభద్ర రాసిన అమాసకన్నుల పున్నమి, రాయక్కమాన్యం, ఆదర్శ విధ్వంసం, వినోదిని రాసిన 'కుమారక్క' మొదలైనవి.

దళిత స్త్రీల కథలో దుర్మార్గమైన దురాచారం 'జోగినీ వ్యవస్థ' ఊరందరి లైంగిక అవసరాలు తీర్చుకోవడానికి బలహీనమైన వారిని ఆచారాల పేరుతో అరాచకానికి పాల్పడుతున్న అగ్రకుల దౌర్జన్యానికి ప్రతీక ఈ జోగినీ

వ్యవస్థ. ఈ సమస్యపై కథలు రచించిన వారిలో ప్రథము రాలు గోగుశ్యామల. ఈమె రాసిన 'రడం' కథలో జోగినీ వ్యవస్థను నిరసించినందుకు, వ్యతిరేకించినందుకు ఆధిపత్య కులాల చేతుల్లో బాధితపక్షం ఏ విధంగా హింసకు గురైంది ఉన్న ఊరిని, ఆస్తిని పోగొట్టుకొని అనాథల్లాగా ఊరి నుండి బలవంతంగా వెళ్ళవలసి వచ్చిన కుటుంబ కథే ఈ 'రడం'.

ఈ కథలో అంటరానితనం, ఆధిపత్య భావజాలం, దోపిడి, జోగినీ వ్యవస్థ కనిపిస్తుంది. ఇందులోని ప్రధాన పాత్రధారి బాలయ్య ఇతనికి ఒక్కగానొక్క కూతురు సాయమ్మ. ఈమెను బాగా చదివించి మంచి ఉద్యోగస్తు రాలిని చేయడమే ఇతని ఉద్దేశ్యం. అయితే ఆ ఊరిలోని అగ్రకులస్తులంతా కలిసి ఆమెను జోగినీని చేయాలను కుంటారు. అందుకు సాయమ్మ తండ్రి ఒప్పుకోక పోవడంతో వాళ్ళని బెదిరించి కొట్టి, హింసించి, ఆస్తిని దోచుకొని వాళ్ళని ఊరు నుండి వెళ్ళగొడతారు. సహాయం చేసిన వారిని కూడా బెదిరిస్తారు. అన్ని కష్టాలను ఒర్చుకొని, అన్ని సమస్యలను ఎదుర్కొని కూతుర్ని చదివించాలనే పోరాటం ఆదర్శనీయమైనది.

అగ్రకులాధిపత్యం తన ఆధిపత్యాన్ని బాధితపక్షంలో నిలబెట్టుకొని కొనసాగించాలనే తాపత్రయం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే సాయమ్మను జోగినీని చేయడానికి ఆధిపత్యకులస్తుల మాటల్లో గమనిస్తే "ఉన్న ఊర్ల ఏర్పులకేస్తే మనకళ్ళ ముందుంటది. సదివితే ఏమున్నదిరా బాలిగా ఎంత చదివినా పని తప్పది కదా జెర్రపెద్దగయితే ఎవ్వనంబడన్నా పడిపోదని ఏం నమ్మకం. యా చాయకప్పలు కడిగేటోనెంబడో పోదని ఏం గ్యారంటిరా?" (పుట.68, గోగుశ్యామల, 'ఏనుగంత తండ్రి కన్నా ఏకుల బుట్టంత తల్లినయం') అని నయాన వినని వాళ్ళని భయపెట్టి ఒప్పుకునేలా చేయడానికి వేసిన పన్నాగం కనిపిస్తుంది. "మీ బిడ్డను జోగినీ చేయమన్నది నా కోసం కాదు ఊరు కోసం ఊరుబాగు కోసం అంటే మీ మొద్దు మెదళ్ళకు అర్థంకావడం లేదు. ఇంక మీతో మాట్లాడే ఓపిక నాకు లేదు. మీ పోరీని వేస్తే జోగుకు వేయండి లేదా మీరు ఊరొదిలేసి పోండి. ఇదే ఆఖరి మాట. ఆ పని జెయ్యకుండ ఊర్లో ఉండనీకె వీళ్ళేదు. మొండికేసి ఉంటమంటిరా నిరుడు మీ మాదిగ జెంగానికి వట్టిన గతే మీకు పడుతది చూస్కుండి" (పుట:42, గోగుశ్యామల, ఏనుగంత తండ్రికన్నా ఏకుల బుట్టంత తల్లి నయం) అని బెదిరించి వాళ్ళ ఆస్తిని లాక్కొని చార్జీలకు మాత్రమే డబ్బులిచ్చి వెళ్లగొడతారు. అయిన ప్పటికీ ఈ కథలోని తండ్రి వేటికీ లొంగక తల్లీ, బిడ్డను తీసుకొని వెళ్ళిపోతాడు. ఈ పోరాటంలో చదువుపై ఉన్న నమ్మకాన్ని, ఆశయాన్ని, చదువుకుంటే ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కోవచ్చు అనే నమ్మకాన్ని చూస్తాం.

అలాగే జోగినీ చేయాల్సిన పనులను కూడా ఈ కథలో చర్చించటం జరిగింది. "రేపటి ఊరడమ్మ పండగకు రంగమెవ్వరెక్కుతరు? పోలెపల్లిలో 'సిడె' ఎవరు కడ్తరు? మానూర్ల జోగుకి దీసినలస్మి ముసల్థయింది. దానికి కొలువుజెప్ప నడుగులు డొల్లకొచ్చినయి. ఊర్ల శానా మందికి అమ్మవారు పోసినప్పుడు ఊరడమ్మకు జీవులను, దున్నపోతులను కోసి పెద్ద పచ్చితునకను జోగినీ నోటిలో వేలాడదీసి ఊరు చుట్టూ దిప్పాలంటే ఏడసాధ్యపడ్డది. ఈ ముసల్దాని కాళ్ళు సుట్టకపోయి వీరి బందాలల్ల దిమ్మిరపోయి పడ్డది" (పుట:63, గోగుశ్యామల ఏనుగంత తండ్రికన్నా ఏకుల బుట్టంత తల్లి నయం) ఈ వాక్యాల్లో జోగిని పడ్డ కష్టం, పడాల్సిన పాట్లను గమనించవచ్చు. ఊరుక్షేమం కోసం, ఊర్లో జనాలకి, పశువులకు ఎటువంటి రోగాలు రాకుండా అరికట్టడానికి జోగినిగా మార్చటం జరగాలనేది అగ్రకులస్తుల అభిప్రాయం. ఈ కుట్రలో ఉన్నందంతా బలహీనులను, బాధితులను తమ అవ సరాలకు ఉపయోగించుకోవడం కోసం, తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడం కోసం మాత్రమే. స్త్రీలను దేవుడికి అంకితమిస్తున్నట్లు, దీనితో ఆధ్యాత్మిక శక్తులు ఆమెలో ఉంటాయని నమ్మించి ఊరందరి వినోదాల కోసం, ఆమె రంగమెక్కించటం, ఆ ఊరి పురుషులందరి లైంగిక వాంఛ లను తీర్చుకోవడానికి చేసే అగ్రకుల ఆధిపత్య కుట్ర. దీనితో ఆమె అనేక రోగాలకు నిలయమై, బాగుచేసుకోలేని

స్థితిలో ఉంటుంది. చివరికి కడుపునిండా తిండి కూడా తినలేని స్థితిలో ఉంది. కన్న పిల్లలకు తండ్రి పేరు లేకుండా అనేక అవమానాల పాలవుతూ వారి పిల్లలు చదువులకు, సమజానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితికి గురిచేస్తోందీ వ్యవస్థ. ఎన్ని చట్టాలు వచ్చినా నేటికీ వీళ్ళ జీవితాల్లో చీకట్లు అలుముకొనే ఉన్నాయి. ఇలాంటి మరో కథ 'బైండ్లామె భూమి అడగదామరి'.

దళితస్త్రీల కథాసాహిత్యంలో మరో సమస్య 'పాకీవృత్తి' అనగా మానవ మలాన్ని ఎత్తి శుభ్రం చేయటం. ఈ పని చేయటంలో ఎక్కువశాతం దళితులే ఉన్నారు. అందులోనూ స్త్రీలే ఎక్కువగా ఉన్నారు. ఈ పనిని దళితులే చేయాలని నిర్ధేశించిన ఆధిపత్యకుల దుర్మార్గం, దురాచారం ఎంత హేయమైనది. ఒక మనిషి మలాన్ని మరో మనిషి ఎత్తివేయటమన్న అనాగరిక చర్యను మహాత్మా గాంధీ తల్లి, బిడ్డకు చేసే పనిగా వివరించారు. ''1936లో గాంధీ ఇలా రాశారు భంగీలు చేసే సేవలకు మూలం ఒకతల్లి బిడ్డకోసం ఏం చేస్తుందో అది భంగీలు సమాజం కోసం చేస్తారు. ఒకతల్లి తన బిడ్డ మురికిని శుభ్రంచేసి, అతడి ఆరోగ్యం కాపాడుతుంది అదేవిధంగా భంగీలు పరిశుభ్రపనులు నిర్వహించటం ద్వారా మొత్తం ప్రజానీకం ఆరోగ్యాన్ని పరిరక్షిస్తారు'' (పుట:30 గీతారామస్వామి విమల, మాకొద్దీ ఛండాలం) దీనిని తీవ్రంగా డా॥ బి.ఆర్. అంబేడ్కర్ విమర్శించారు. కానీ నేటి దళితులు గాంధీ మాటల్లోని రాజకీయ కుట్రను ఎంత చెప్పినా అర్థం చేసుకోలేని స్థితిలో ఉండిపోయారు. లేకపోతే ఏనాడో ఈ పాకీవృత్తి అంతరించిపోయి ఉండేది. నేటికీ మన సాహిత్యంలో వస్తువుగా కనిపించి ఉండేదికాదు. కనిపిస్తోందంటే ఈ రాజకీయాలను తెలుపకుండా పాకీవృత్తి వారి బాధల్ని తెలపటంవల్ల దళితులు ఇలాంటి పనులు చేయటం వల్ల మరింత నిరాదరణకు, చీదరింపుకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితి కేవలం ఒక ఇంటికో, ఒక వీధికో ఒక ఊరికో పరిమితమైంది కాదు. బస్టాండులాంటి బహిరంగ ప్రదేశాల్లో నీటికొరత ఉన్నప్పుడు కాంట్రాక్టు కార్మికులు కొందరు లెట్రీన్లను శుభ్రం చేస్తారు. అంతే కాకుండా నేటికీ ఆసుపత్రుల్లో కాన్పుల సమయంలో మూత్రాన్ని, మలాన్ని, రక్తాన్ని శుభ్రం చేసే వాళ్ళున్నారు. నేటికీ డ్రైనేజీల్లో దిగి ఎలాంటి భద్రతా కవచాలు లేకుండా పని చేసేవాళ్ళు మనకు కనిపిస్తున్నారు. కానీ వీళ్ళ విషయంలో ప్రభుత్వాలు తగుచర్యలు తీసుకుంటున్నామని అలవెన్సుల పేర్లతో సేఫ్టీబెల్టులు, రబ్బరుగ్లౌజులు, ఇన్‌హిలేటర్లు, డ్రైవర్‌సూట్లు మొదలైనవి ఎన్నో ఇస్తున్నామంటారు. కానీ అవి జాబితాలో పేర్లరూపంలోనే కనిపిస్తాయి.

ఇలాంటి జీవితాను సాహిత్య వస్తువులుగా చేసుకొని దళితస్త్రీలు కథ, కవిత్వం సృజించారు. అందులో ముఖ్యంగా జూపాక సుభద్ర, వినోదిని మొదలైన వారు ముఖ్యులు. కథా ప్రక్రియలో వినోదిని రాసిన 'బ్లాక్' కథలో జిలకరమ్మ తన కూతురు ప్రేమించిన వ్యక్తికిచ్చి పెళ్ళి చేయాలనుకుంటే వాళ్ళు ఐదువేలు కట్నంగా అడుగుతారు. ఆ డబ్బును సంపాధించడానికి నానా రకాల తంటాలు పడుతుంది. చివరిగా వెయ్యి రూపాయలకోసం వాళ్ళ యజమాన్లను అడిగినందుకు అవమానించటమే కాక, హీనాతిహీనంగా తిడతారు. ఇలాంటి సమయంలో ఆమె స్నేహితురాలి సలహామేరకు ఒక ఉపాయం పన్ని లెట్రీన్ గుంతల్ని తానే బ్లాక్ చేస్తుంది. తిరిగి వాటిని తానే తీసి డబ్బు సంపాధించుకోవచ్చునన్నది ఆమె సలహా. ఇలా చేసి చివరికి అందరితో చావుదెబ్బ తింటుంది. కొడితే కొట్టారు డబ్బులైన ఇవ్వచ్చు కదా అని బాధపడుతుంది. కట్నం డబ్బులు లేక కూతురి పెళ్ళి ఆగిపోతుంది.

పాకీవృత్తివాళ్ళ జీవితాలు అందరి చేతుల్లో అవహేళనకూ, అవమానాలకూ, దౌర్జన్యాలకూ, అసహ్యాలకూ గురిఅవుతున్నాయి. కడుపు నిండా అన్నంలేక ఆకలి బాధ భరిస్తూ, వచ్చే డబ్బులు సరిపోక, ఎవ్వరూ ఆదరించక ఊరి చివర్లో అంటరానివారిగా బలైపోతున్నారే కానీ దాహమేస్తే గ్లాసు నీళ్ళను కూడా ఇవ్వలేని ఈ సమాజంలో వీళ్ళ జీవితాలు ఎంత దుర్లభమైనవో ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది.

జాజులగౌరి రాసిన 'కంచె' కథలో దళితస్త్రీలు అగ్రకులాధిపత్య దుహంకారానికి బలై అత్యాచారానికి గురవుతున్నారు, ప్రాణాలను కోల్పోతున్నారు. అయినప్పటికీ ఈ సమస్యలు చీకటిలోనే ముగిసిపోతున్నాయి. ఇంతటి దైహీన్యమైన జీవితాలతో నిత్యం పోరాడుతున్నారు దళితస్త్రీలు. ఈ కథలోని బాలికలు కట్టెలు కొట్టుకు రావాలని వెళ్ళి కొడుతూ కంచె దాటి వెళ్తారు. వాచ్‌మెన్లు వచ్చి ఆ బాలికల్లో సుగుణ అనే అమ్మాయిని అత్యాచారం చేసి వదిలివెళ్తారు. మిగిలిన వాళ్ళు సుగుణను ఇంటికి తీసుకొస్తారు. కొంతకాలానికి గర్భవతి అని సుగుణ తల్లికి తెలిసి కొడుతుంది. ఆ బాధ భరించలేని సుగుణ ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది. అందుకు తల్లి గర్భాన్ని తొలగించుకొనైనా బ్రతకాలి కానీ ఆత్మహత్య చేసుకోకూడదని ధైర్యాన్ని ఇచ్చి బిడ్డను హక్కున చేర్చుకుంటుంది.

ఈ కథలో సుగుణ తల్లి ప్రాణమే ప్రధానమని తెలియజేస్తుంది. "ప్రాణం పోయినా పర్వాలేదు మానం పోవద్దనే నీతుల్లో ఇమడని వాళ్ళు దళితస్త్రీలు" అని జూపాక సుభద్ర అన్న మాటల్ని ఈ కథకు అన్వయించి చూస్తే నిజమనిపిస్తుంది. సుగుణ తల్లి మాటల్లో ఈ విషయాన్ని పరిశీలిద్దాం "పానం ఉన్నదంటే మీద పడ్డ బురదను కడుక్కొని మంచి బతుకు బతకొచ్చు" (జాజులగౌరి 'మన్నుబువ్వ', పుట:69) అని అనగలిగిందంటే ఆమెలోని చైతన్యం ఎంత లోతైనదో తెలుస్తుంది. మన ప్రమేయమే లేకుండా జరిగిన అగాయిత్యాన్ని బురదతో పోల్చి చెప్పగలిగింది. అంతేకాకుండా ఈ సమాజం కంటే చివరికి నాకంటే కూడా నీ జీవితం నీకు ఎక్కువ అని కూతురికి చెప్పడాన్ని గమనిస్తే ఆమెలోని బలమైన ఒక కౌన్సిలర్ కనపడుతుంది.

స్త్రీ నేటికీ కూడా మానం అన్నదాని చుట్టూ తిరుగుతున్నది. శీలం అన్నది కేవలం స్త్రీల శరీరానికి సంబంధించినట్లుగా, పరపురుషులతో సంభోగం జరిగితే శీలం పోతుంది అని పురుషాధిపత్య భావజాలం భావించింది. దీనికి అంతరార్థ పరమార్థం ఏమిటంటే పెరియార్ ఈవే రామస్వామి నాయకర్ అభిప్రాయం ప్రకారం "శీలమనే మాటకు పాతివ్రత్యమని వ్యాఖ్యానించినందువల్ల, మహిళలకన్నా పురుషులు బలవంతులుగానూ, సంపాదనాపరులుగానూ, ఆస్తిపరులుగానూ ఉన్నందువల్ల పురుషులు మూర్ఖంగా శీలమనేది తమకు సంబంధించినవి కావనీ, అది కేవలం స్త్రీలకే అన్వయిస్తుందని నిర్ధారించుకునే వారు" (పుట:12, రామస్వామి నాయకర్ పెరియార్ ఈవే 'స్త్రీ ఎందుకు బానిసైంది') ఈ భావన ప్రకారంగానే శీలం కేవలం స్త్రీలకు సంబంధించినదిగా అయిపోయింది. ఈ ధోరణి దళితస్త్రీలు ఎప్పుడో కనుగొన్నారు. ఇందుకు దళితుల్లో మారు మనువులు జరుగుతుండడాన్నే ఒక సాక్ష్యంగా భావించాలి.

దళితస్త్రీలలో ఏ ఉద్యమ ప్రభావాలు తాకక ముందు నుండే చాలా సహజంగా ఫెమినిజ భావజాలాలు కలిగి ఉన్నారు. అందుకనే దళితస్త్రీలు మానం కన్నా ప్రాణం ప్రధానమనే భావజాలం కలిగి ఉండటాన్ని ప్రాచీనకాలం నుండే చూడవచ్చు. ఇదే ధోరణి ఈ కథలోని సుగుణ తల్లి పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. ఆమె మాటల్లోనే గమనిస్తే "గీ దునియాల మొగోడు పశువు లెక్క ఎంతో మంది కాడ్కిపోయినా ఆడునీటుగాడే కానీ అనికావరం భరించిన ఆడది ఆ పాపం మూట మోస్తే దానికి రంకుతనం అంటగడ్తరు. ఆళ్ళకు లేని న్యాయం నీకే ఎందుకమ్మ" (పుట.69, జాజులగౌరి 'మన్నుబువ్వ') మగవాళ్ళకు లేని న్యాయం ఆడవాళ్ళకు మాత్రం ఎందుకు అని కూతురికి అబార్షన్ చేయించడానికి సిద్ధపడుతుంది. బిడ్డ భవిష్యత్తుని ఈ లోకం పోకడల నుండి, ఈ పురుషాధిపత్య భావజాలం నుండి కాపాడుతుంది.

అయితే ఈ కథలో ఇప్పటికైనా మించిపోయింది లేదు. కేసు పెట్టమని దోషులకు శిక్షపడుతుందని డాక్టరమ్మ తల్లికి సలహా ఇస్తుంది. కానీ ఆ సలహా గురించిన ప్రస్తావన కానీ ఆలోచన కానీ మరెక్కడ కనిపించకపోవడం విచారమే. కారణం ఎన్ని కేసులు పెట్టినా చివరికి అన్యాయం జరిగేది మాత్రం దళితులకే, బాధితులకేనని గ్రహించడం వల్ల, చట్టాలు, ప్రభుత్వాలు అన్ని కూడా పచ్చనోటు చుట్టూ

తిరగడం వల్ల. దీన్ని దళిత స్త్రీలు బాగా అర్థం చేసుకున్నారు. కనుక తమ బలహీనతల వల్ల కూడా డాక్టరమ్మ చెప్పినట్లు బాధితులు తగిన చర్య తీసుకులేకపోయారు. ఈ అభద్రతభావం వల్ల కూడా దళిత స్త్రీలు నష్టపోతున్నారు. ఈ వైనాన్ని మార్చుకోవాల్సిన ఆవశ్యకతను కూడా రచయిత్రి అంతర్గతంగా తెలియజేశారు. ఈ కోవకు చెందిన మరికొన్ని కథలు నిర్మలారాణి 'మలుపు', నంబూరి పరిపూర్ణ 'వీలుదొరికితే', శరత్‌జ్యోత్స్నారాణి 'అమ్మాయి చదువు', మానుకొండజ్యోతి 'వెలుగురేఖలు' మొదలైనవి.

దళిత స్త్రీలు రాసిన కథల్లో మరో ముఖ్యమైన సమస్య వేశ్యా సమస్య. వేశ్యా వృత్తిలోకి పరిస్థితుల కారణంగా, బతుకుభారమై ప్రాణాలను కాపాడుకోవాలనే ఆశయంతోటి, నేనేమైనా ఫర్వాలేదు నా కుటుంబ సభ్యులైనా సుఖంగా వుండాలనే ఆశలతోటి, అప్పుల బాధలవల్ల ఆధిపత్యపోరువల్ల బలవంతంగా నెట్టివేయబడ్డ జీవితాలు కోకొల్లలు. అలాంటి ఆడవాళ్ళను దేశవిదేశాలు రవాణా చేస్తున్నాయి. అంగడి సరుకులాగ మారిన స్త్రీల జీవితాల్లో ఎక్కువగా బలహీన, బడుగువర్గాల స్త్రీలే ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి సమస్యలను కేంద్రంగా తీసుకొని చిత్రించిన కథల్లో ఎండ్లూరిమానస రాసిన 'అమ్మకో లేక' కథలో ఆడపిల్లలను, స్త్రీలను అక్రమంగా వేశ్యా వాటికల్లో ప్రవేశం చేలా చేయటం, అక్కడ ఆ బాలికలు, స్త్రీలు పడే కష్టాలను, వారి కుటుంబ నేపథ్యాలను ఈ కథలో చూస్తాం.

పేదరికం కారణంగా తల్లే కూతుర్ని పడుపువృత్తికి పంపించటం, అక్కడి నుండి తప్పించుకోని ఎలాగైనా వస్తానన్న కూతుర్ని రావద్దని చెప్పటం, అందుకు కారణం చెల్లి చదువు, తమ్ముడి నిర్లక్ష్య ధోరణి, నువ్వు కూడా వచ్చేస్తే ఇళ్ళు గడవదని సుచిత్రను రావద్దని తన తల్లే ఉత్తరం ద్వారా చెప్తుతుంది. చేసేదేమీ లేక వచ్చిన విటులతో కష్టాలు పడుతూ అక్కడే జీవిస్తుంది. అక్కడి యాజమాన్యానికి తెలీయకుండా ఇంటికి ఉత్తరం, డబ్బులు పంపించాలంటే నానా ఇబ్బందులను ఎదుర్కోవాలి. ఎవరికైనా తెలిస్తే ప్రాణాలు ఉండవన్న భయంతో ఇంటికి డబ్బులు పంపిస్తూ ఉంటుంది. తల్లి ఉత్తరం ద్వారా రావద్దని తెలిపినా కూడా బాధపడదు సుచిత్ర. తనను తన తల్లే ఈ పనికి పంపించిందని తెలుసు. కానీ కన్న ప్రేమకథా కరుగుతుందేమోనని ఇంటికి వచ్చేస్తానని ఉత్తరం రాసినప్పటికీ తల్లి హృదయం కరగని విధానాన్ని "నన్ను అమ్మే అమ్మేసిందన్న పచ్చినిజం కూడా నాకు తెలుసు!! కానీ ఏమూలో కన్న ప్రేమ కరిగి నాకో అవకాశం ఇస్తుందని ఆశించి అమ్మకో లేక రాశాను. కానీ అమ్మ కరగలేదు" (పుట:52, చినుకు మాసపత్రిక ప్రత్యేక సంచిక జూన్, 2016, ఎండ్లూరి మానస రాసిన కథ 'అమ్మకో లేఖ') ఈ మాటల్లో వారి జీవన విధానంలో మరో స్త్రీ బలికాకూడదు అంటే ముందు వరుసలో వున్న స్త్రీ బలి కావాలని సుచిత్ర నిర్ణయించుకుంది. అందుకే తన చెల్లి కోసం ఎప్పటికీ పింకిలాగ వేశ్యావాటికలోనే వుండిపోవాలని నిర్ణయించుకుంది.

మహితా అనే స్త్రీకి ఎయిడ్స్ ఉందని తానే స్వయంగా వచ్చిన కష్టమర్‌కి చెబితే వినిపించుకోకుండా వెళ్ళిపోతూ తనకు పెదవి చిట్లేలా కొట్టి మొహం మీద వూసి వెళ్ళిపోతాడు, మరోపాత్ర వసంతక్క ఈమె భర్త మెకానిక్ రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి దీన్ని అధిగమించడానికి ఈమె ఎన్నుకున్న పని వేశ్యావృత్తి ఇళ్ళల్లో పని చేస్తున్నానని చెప్పి కొంత సంపాయించుకొని భర్తా పిల్లల్ని పోషించుకుంటూ ఉంటుంది. ఎక్కడైనా మరణిస్తే దు:ఖం, కానీ వేశ్యావాటికల్లో మరణిస్తే సంతోషం ఇదే పరిస్థితి ఈ కథలో హారికా అనే పాత్ర డిప్రేషన్‌కు లోనై మరణించింది. అందరూ పైకి బాధపడుతున్నా అంతర్గతంలో మాత్రం ఈ పరిస్థితి నుండి తప్పించుకుంది అన్న ఆనందం కనిపిస్తుంది.

కిడ్నాప్‌కి గురైనవాళ్ళు, భర్త అమ్మేసిన వాళ్ళు, తమకై తాముగా వచ్చినవాళ్ళు, తిరిగి వెళ్ళాలని వున్నా వెళ్ళలేనివాళ్ళు, వెళ్ళాలని ప్రయత్నించి చావుదెబ్బలు తిన్నవాళ్ళు ఇలా ఎంతోమంది చివరికి ఆరు సంవత్సరాల పసిపిల్లలు కూడా ఈ వేశ్యా వాటికల్లో విలవిలలాడిపోతున్నారు. ఇలాంటి వాళ్ళ కోసం ఏ ప్రభుత్వాలు పనిచెయ్యవు, ఏ

చట్టాలు కల్పించవు అన్న బాధని ఈ కథలో బాధిత పాత్రల ద్వారా రచయిత్రి వెలిబుచ్చారు. ఈ కోవకు చెందిన కథలు ఝాన్సీ కె.వి. కుమారి 'ఏమని పిలవాలి', నిర్మళారాణి 'గాజుకళ్ళు' మొదలైనవి.

ఈ విధంగా మామూలు స్త్రీలకన్నా విభిన్నమైన ఎన్నో సమస్యలను దళితస్త్రీలు ఎదుర్కొంటున్నారు.

ఇలాంటి ఎన్నో సమస్యలకు దూరంగా ఉండాలని చదువుకుంటున్నా అక్కడ ఎదురయ్యే సమస్యలను మన్నుబువ్వ కథా సంకలనంలోనూ, చదువుకొని ఉద్యోగం చేస్తూ అక్కడతోటి ఉద్యోగస్తుల మధ్య అంటరానితనానికి గురై మానసిక క్షోభను ఎదుర్కొవడాన్ని తెలిపే కథ 'శుద్ధిచేయాలె' కథలో చిత్రించారు. అలాగని పొలం పనులు చేస్తుంటే అక్కడ యజమాని, యజమానిభార్య ఇలా ఆధిపత్యాలకు తనతోటి అగ్రవర్ణస్త్రీల ఆధిపత్యానికి గురౌవుతూ కుటుంబ భారాన్ని మోస్తూన్నప్పటికీ తమ పురుషుల ఆధిపత్యాలకు కూడా గురౌవుతున్న స్థితిగతుల్ని, రైతు కూలీల జీవితాలను చిత్రించిన కథ 'ఒక విలన్ ఆత్మహత్య'. ఇలా ప్రతీ విషయంలోనూ అత్యంత అట్టడుగుస్థానంలో అనేక మంది ఆధిపత్యాలను భరిస్తున్నప్పటికీ చేసిన పనికి తగ్గ ప్రతిఫలం అందక ఆకలి బాధలతో, అనారోగ్యాలతో నేటికీ సతమతమవుతున్నారు.

దళితస్త్రీల కథా సాహిత్యం. స్త్రీవాద సాహిత్యం స్పృషించిన అనేక కోణాలను సమాజానికి తెలియజేసింది. అంతా ఒకే కట్టగా కట్టిన స్త్రీవాద సాహిత్యంలో స్త్రీలంతా ఒకటి కాదని నిరూపించారు దళిత స్త్రీ రచయిత్రులు. తమ సమస్యలు వేరని ఒకే కట్టలో ఒదగటం కష్టమని అందువల్ల దళిత స్త్రీలకు నష్టంజరుగుతోందని నొక్కి వక్కానించారు. తమకంటూ ప్రత్యేకమైన సమస్యలు, అవసరాలు ఉన్నాయని తెలియజేసి తమ అస్తిత్వాన్ని కాపాడుకొనే స్థితిలో తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఇంతటి చైతన్యాన్ని దళిత స్త్రీలు ఉద్యమ ప్రభావాల కారణంగానే పొందారని వీరి సాహిత్యాధారంగా తెలుస్తున్నది.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆవేశంలో కెరటం - ఆలోచనలో కిరణం - కుమారస్వామి నాయుడి కవిత్వం

- డా॥ పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

అక్షరాలే నేస్తాలుగా, భావాలే బంధువులుగా, రసాలే పంచప్రాణాలుగా, ఆలోచనలే ఇల్లుగా కవితే ఊరుగా పరిచయం చేసుకున్న కవి కుమారస్వామినాయుడు. సామాజిక స్పృహ కల్గిన కుమారస్వామి నేను మనిషిగా ఏనాడో చచ్చిపోయి కవిగా పుట్టానంటారు. కవిగా కలాన్ని కదిలిస్తూ పువ్వులను నవ్వించాడు. సాగరాలను పొంగించాడు. దివిటీతో దివాకరుని చూపించాడు. తిమిరాన్ని తరిమేయడానికి ఆరని దీపాలు వెలిగించాడు. మనిషిగా బతకడానికి మార్గాన్ని అన్వేషిస్తూనే మనసుకు వయస్సు లేదని ప్రతిపాదించి మానసవీణను మీటాడు.

పువ్వుల నవ్వుల్లో రవ్వల దివ్వెలని వెలిగించారు. సూక్తిని సూర్యుడి కంటె మిన్నగా భావించే సుకవి కుమారస్వామినాయుడు. మానవ సమాజంలో పునరుజ్జీవింప చేసుకుంటున్న సామాజిక చైతన్యం కుమారస్వామి గారి సూక్తుల్లో పరవళ్లు తొక్కుతుంది. నలిగిన పువ్వుల నవ్వుల్లో నడుం బిగించిన విప్లవజ్యోతుల్ని చూచిన జ్వాలా హృదయం వీరిది. వీరి కవితల్లో జాలి ఒక కన్ను అయితే 'జ్వాల' మరోకన్ను. ముల్లు మీదపడి చినిగిపోయిన అరిటాకు జీవితానికి వీరి కవిత కన్నీరు కారుస్తుంది. సమాజంలో జరిగే దారుణాలకు వీరి కవిత అరుణారుణ జ్వాలాపతాకంలా రెపరెపలాడుతుంది. చీకటి చిరునామా లేకుండా చేయటానికి ప్రయత్నిస్తున్నారు. అంటే బడుగు బలహీన ప్రజానీకానికి వెలుగుబాట చూపించాలన్న తపన ఉన్న ఆశాకిరణం కుమారస్వామి.

కన్నార్పక మనోనేత్రంతో అన్వేషించడం ఈ కవినైజం. భజనచేతిలో సృజన ఓడిపోయిన చిహ్నాలను, చరిత్రకార్చిన కన్నీరు, భూదేవి చీరచెరుగున మాసిపోని రక్తం మరకలుగా నిలిచిన విషాద సన్నివేశాలని చూసి కవి కలం కొదమ సింగంలా గర్జించింది.

నాతరం తలలో ప్రబోధరత్నాన్నై మెరుస్తాను. రేపటి తరం గుండెల్లో ప్రజ్వలనాన్నై ప్రభవిస్తానంటాడు. స్వర్గం, నరకం నీచేతిలోనే ఉన్నాయి. విప్లవానికి చెయ్యి లేపితే స్వర్గం, బానిసతనానికి చెయ్యిలేపితే నకరం అని భావాన్ని సరళ సుబోధకంగా స్పష్టం చేస్తారు.

ఆ కుమారస్వామికి ఆరుముఖాలు గల షణ్ముఖుడైతే, దయ, దానం, కవిత, నవత, న్యాయం, ధర్మం గల షణ్ముఖుడు ఈ కుమారస్వామి అని డా॥ తిరుమల శ్రీనివాసాచార్య గారి భావన అక్షర సత్యం.

"ఎదిగిన మనస్సును యముడయినా నొప్పించలేడు" ఎదగని మనస్సును శివుడయినా మెప్పించలేడంటారు. జీవితంలో సంతోషానికి మించిన సంపదలేదు. ఏడుపును మించిన దారిద్ర్యం లేదంటారు. అన్నింటికి కారణం మనస్సే కదా. మనస్సు వికసిస్తే స్వర్గం, మనస్సు సంకోచిస్తే నరకం అని మనసుతో సుమాలు పూయించవచ్చు. మనస్సుతో అమృతం కురిపించవచ్చు. మనస్సుతో రణం చేసేవారే వీరులనీ, రణాలకు, రుణాలకు, వ్రణాలకూ మనస్సే కారణమనీ, మనస్సును జయించిన వారికి మరణమే లేదని, అందుకే మనస్సుకు వయస్సు లేదంటారు కుమారస్వామి.

అందమైన మందారాన్ని తిలకించాలంటే వేయి కన్నులు కావాల్సిందే. సృష్టికర్త బ్రహ్మదేవుడు నీ ఆయుష్షు ఒక్కరోజుకే పరిమితం చేసిన కఠినాత్ముడని పెద్దవాళ్ళంతా అందాన్ని ఆనందాన్నీ ఎక్కువ రోజులు బ్రతుకనివ్వరని; కాని నేను నా హృదిలో అక్షరామృతాన్ని చల్లి (చావ లేకుండా చేస్తాను) శాశ్వతత్వం ఇచ్చేస్తాను అని మరణించ లేని మందారాన్ని ఆకాంక్షించారు. దేశభక్తి బీజాలను అణువణువునా జీర్ణించుకున్న కుమారస్వామి దేశాన్ని గూర్చి

నీవు నా దేహానివి నా దేశానివి
నేను నిన్ను కాపాడే సైనికుడిని
నీవు నా ఆత్మవు నా అమ్మవు
నేను నిన్ను రక్షించే సేవకుణ్ణి

అని తనను తాను సేవకుడిగా అభివర్ణించుకొని

"కంటిపాపలా నిన్ను కాపాడుకోవాలనుకుంటున్నాను
నీ కన్నుల్లో పాపాయినయి నిద్రించాలనుకుంటు న్నాను..." అని

"నీలో నేనున్నాననడం వాస్తవం
నాలో నీవున్నావనడం నా నమ్మకం" అంటాడు 'నీవూనేను' కవితలో.

ఒక్క సిరాచుక్కతో కోటి మందిలో కదలిక రగిలించగల సత్తా వుంది. నా నరాల నిండా చైతన్యం అనే సిరా వుంది అని సిరాచుక్కనే సూర్యుడుగా అభివర్ణించాడు.

కన్నవారు దూరమైతే కంటి పాపలు దూరమయినట్లే కదా, ప్రాణమిత్రుడు దూరమైతే పగలే రాత్రియినట్లుగా భావించాడు. కనిపించిన వాళ్ళు నీడలా ఉంటారనుకున్న వాళ్ళు శత్రువుగా చూసినప్పుడు, వేయరాని వినరాని నిందలు వేసినప్పుడు శేషజీవితాన్ని గడపడానికి కొత్త మార్గం వేసుకోవాలంటాడు. సమాజంలో కుళ్లునంతా కడిగేసి స్వచ్ఛమైన పున్నమి చంద్రుడిగా మారడం తప్పు కాదు కదా అంటారు.

దైవాంశసంభూతుడే నాయకుడుకాదని జనం మనస్సును జయించిననాడే నాయకుడవుతాడని, పరిపాలకుడవుతాడని స్పష్టం చేశాడు.

అక్రమార్కుల బలమెంత?
వాళ్ళ అధికారాలెంత?
నా కలంలో సిరాచుక్కంత,

నా తనువులో రక్తం బొట్టంత అని ఆవేదన వ్యక్తం చేశారు. కాఠిన్యానికీ కరుణకూ జరిగే పోరాటంలో ఓడేదెవ్వరు, గెలిచేదెవరు? అని ప్రశ్నించి కరుణముందు ఓడిపోక తప్పదని కాఠిన్యం రావణాసురుడు, కరుణ శ్రీరామచంద్రుడు అని కరుణకు ఏనాటికైనా పట్టాభిషేకం తప్పదన్న కరుణార్ధ్ర హృదయుడు కుమారస్వామి.

వస్తున్నది మంచికాలం
మంచికోసం మానవత కోసం
నవత కోసం నాణ్యత కోసం
ఎదురుచూస్తున్నది జనం
ఇప్పుడిప్పుడే వస్తున్నది నవపవనం
నివురుకప్పిన నిప్పులా వుందీ తరం
ధనంకోసం ద్రవం కోసం అమ్ముడుపోదీ నవయుగం

అంటూ భవిష్యవాణి వినిపించారు.

జగతిలో మూడు భాగాలాక్రమించిన సముద్రునితో వ్యంగ్య సంభాషణం చేస్తాడు.

"పున్నమి వెన్నెలను చూసి పొంగిపోతావు
అమావాస్య వస్తుందని మరచిపోతావు
ప్రణయజీవుల గుండెల్లో సునామీలూ ప్రళయాలూ
సృష్టిస్తావు" కాని
జలసంపద నల్లధనంలా
నీ యింటి నిండా ఉన్నా
జనానికి గుక్కెడు నీళ్ళ దానం చేయలేవు

దాహాన్ని తీర్చడం నీచేతకాదని నిట్టూర్పులు విసురుతాడు.

దేవుడున్నాడని వేదాలు, పురాణాలు ఘోషిస్తున్నాయి. సమాజంలో రౌడీలు రాజకీయం చేస్తున్నారు. రావణ దుర్యోధనాదుల కంటే దుర్మార్గాలు చేస్తూ వుంటే చూస్తూ ఊరుకొన్న వీళ్లని

"కనుల్లేని కబోదులా
నోరులేని మూగవాళ్ళా
దుష్టులను శిక్షింపలేని
దేశాన్ని రక్షింపలేని వీళ్ళా దేవుళ్ళు?
అసలు దేవుళ్ళా? రాళ్ళా?" అని ప్రశ్నిస్తాడు.
బంధువులందరినీ ఉద్దేశించి
నన్ను బాగుచేద్దామని దగాచేసింది చాలు

దోచుకున్నది చాలని నాకు ఇప్పుడే జ్ఞానోదయమయింది. మనిషిలా బ్రతకాలనే యత్నంలో ఉన్నాను. నిశి నిర్మూలించి, కసిని వదిలేయాలని, పసితనంలోకి వెళ్ళాలనే ఆలోచన కుమారస్వామిది. వెలుతురు పువ్వులా

వికసించి, విశాల విశ్వానికి వెలుగునిచ్చే సూర్యుడు కూడా సర్దుకుపోతాడు... మబ్బులు అడ్డువస్తే వెళ్ళిపోతాడు మౌనంగా పర్వతాలు అడ్డుతగిలితే నిగర్విలా నిష్క్రమిస్తాడు సూర్యుడు. జీవితం అర్థవంతంగా ఆహ్లాదంగా మారాలంటే సర్దుకుపోవడం నేర్చుకోవాలి సూర్యుణ్ణి చూసి'' అంటాడు.

వాస్తవాన్నే స్థిరాస్థిగా నమ్ముకున్న వ్యక్తి కుమారస్వామి. ఓడుతానో గెలుస్తానో కాలమే నిర్ణయిస్తుంది. కలాన్ని చీపురు చేసుకొని చెత్తనంతా వూడ్చివేయాలనుకునే ధోరణి వీరిది. సూర్యుడిలా నిద్రలేస్తాను, గడియారంలా దినచర్య ప్రారంభిస్తానంటాడు.

''ప్రతి అక్షరముక్షరమవుతుంది
ప్రతి క్షణమూ అక్షరమవుతుంది
దానిని వుంచాల్సిన చోట వుంచితే
ప్రతిపదమూ ప్రతిధ్వనిస్తుంది
కర్త, కర్మ, క్రియలను సక్రమంగా వాడితే
ప్రతిపాటా పూలతోట అవుతుంది
లయబద్ధంగా పాడితే
ప్రతినుడీ గుడి అవుతుంది
నుడికారాలను జోడించి నుడివితే
సూర్యుడిలా ప్రవర్తిస్తే ప్రతి జీవితము ప్రకాశిస్తుంది''

అంటారు. ప్రేమించడం తప్పుగాదు. తిరస్కారానికి పతనం తప్పదు. ప్రేమలేని గుండ బండరాయితో సమానం అంటారు.

గుండెల నిండా ప్రేమలతను పెంచుకుంటే
శత్రువులను జయించినట్టే
శాంతం మనసులో చెట్టులా ఎదుగుతూ వుంటే
కరుణ కనుపాపల్లో కదలాడుతూ వుంటే
కోపాన్ని కాశీలో వదిలేస్తే
ఆశను అయోధ్యకు పంపేస్తే
కామాన్ని హిమాలయాల్లో లయం చేస్తే
మదాన్ని సముద్రంలో కలిపేస్తే
మచ్చరాన్ని భూమిలో పాతేస్తే
మరణంతో రణం అవసరమే లేదంటాడు. సాటివానికి తోడుపడుతూ మనిషి మనిషిగా బ్రతికితే మరణాన్ని జయించినట్లే జీవితానికి పచ్చతోరణం కట్టినట్లే అంటారు.

త్యాగం లేని చోట ప్రేమకు చోటులేదని పక్షులు గురించి ''ఆకాశవీధుల్లో పూచిన పువ్వుల్లా కన్పిస్తాయి. ప్రమాదవశాత్తు ఒకటి మరణిస్తే రెండవది ప్రాణత్యాగం చేసేస్తుంది అని త్యాగధర్మాన్ని స్పష్టం చేశారు. బాల్యం బంగారం, తరువాతంతా గందరగోళం అని

'కాలాణా' చిక్కేనప్పుడు కల్గిన సంబరం

కోట్ల రూపాయలున్నా కలగడంలేదిప్పుడు? అని అప్పటికి ఇప్పటికీ ఉన్న తేడాను విశ్లేషించారు. 'మనసే మంచిదీపం' అని అందులో ప్రేమను వత్తిగా చేసి ధైర్యమనే నూనెపోసి మనోదీపాన్ని వెలిగిస్తే వెలుతురు పువ్వులా సదా వెలుగుతుందంటారు. తిమిరం మీద సమరం చేసి ఆనందపు వెలుగులను అందరికీ పంచుతుందంటారు. ప్రేమించడం తప్పుగాదు. తిరస్కారానికి పతనం తప్పదు. ప్రేమలేని గుండె బండరాయితో సమానం అంటారు. గుండెలనిండా ప్రేమలతను పెంచుకుంటే శత్రువులను జయించినట్లే.

శాంతం మనసులో చెట్టులా ఎదుగుతూ వుంటే,
కరుణ కనుపాపల్లో కదలాడుతూ వుంటే
కోపాన్ని కాశీలో వదిలేస్తే
ఆశను అయోధ్యకు పంపేస్తే
కామాన్ని హిమాలయాల్లో లయం చేస్తే
మదాన్ని సముద్రంలో కలిపేస్తే
మచ్చరాన్ని భూమిలో పాతేస్తే
మరణంతో రణం అవసరమే లేదంటాడు. సాటివానికి తోడుపడుతూ మనిషి మనిషిగా బ్రతికితే మరణాన్ని జయించినట్లే జీవితానికి పచ్చతోరణం కట్టినట్లే అంటారు.

త్యాగంలేనిచోట ప్రేమకు చోటు లేదని పక్షులు గురించి ''ఆకాశ వీధుల్లో పూచిన పువ్వుల్లా కన్పిస్తాయి. ప్రమాదవశాత్తు ఒకటి మరణిస్తే రెండవది ప్రాణత్యాగం చేసేస్తుంది అని త్యాగధర్మాన్ని స్పష్టం చేశారు. బాల్య, బంగారం, తరవాతంతా గందరగోళం అని 'కాలాణా' చిక్కినప్పుడు కల్గిన సంబరం కోట్ల రూపాయలున్నా కలగడం

లేదిప్పుడు? అని అప్పటికి ఇప్పటికి తేడాను విశ్లేషించారు. 'మనసే మంచిదీపం' అని అందులో ప్రేమను వత్తిగా చేసి ధైర్యమనే నూనె పోసి మనోదీపాన్ని వెలిగిస్తే వెలుతురు పువ్వులా సదా వెలుగుతుందంటారు. తిమిరం మీద సమరం చేసి ఆనందపు వెలుగులను అందరికీ పంచుతుందంటారు.

దౌర్జన్యాలు దారుణాలు వికృత విన్యాసాలు మీద తిరగబడితే నీలో మానవతా బీజం మొలకెత్తినట్లు పదుగురూ నీ వెంట నడిచి విజయకేతనం ఎగురవేస్తే మానవతా వృక్షం ఫలాలు కాచినట్లు ఆ ఫలాలను సక్రమంగా అందరికీ అందించగలిగితే నేను మహాత్ముడివిగా మారినట్లు అమరుడవయినట్లు" అని మానవత్వాన్ని చాటిన మానవతా మూర్తి కుమారస్వామి.

అందరూ బుద్ధులు చెప్పేవాళ్ళే! నేను మాత్రం బుద్ధుడుగా మారలేదు. సంసారం బురదగుంటలో నుండి బయటకి రాలేకపోతున్నాను. మార్పు వస్తుందనే ఆశతో బ్రతికేస్తున్నాను. సంసారసాగరాన్ని దాటే సేతువు నిర్మాణాన్ని చేస్తున్నాను. మోహాంధకారం తొలగించడానికి తపో దీపాన్ని వెలిగిస్తున్నాను. అన్న చైతన్యదీప్తిని వినిపించారు.

సమాజంలో రావణ దుర్యోధన కీచకాదులు చావనే లేదు. వనితల చిన్నారుల మానప్రాణాలను హరిస్తూనే ఉన్నారు. జనం మేలుకొంటే తమ ముందు జరిగే ఘోరాలనెదుర్కొంటే, అన్యాయాల మూలాలను కూకటి వేళ్లతో పీకిపారవేస్తే దుర్మార్గుల పీచమణిచినట్లే అంటారు.

మాటలేకదా మారణహోమాలు రగిలించేది. స్వార్థం ఆటలే కదా యుద్ధాలకు పురికొల్పేది మనసులు మార్చుకొని మనుషులంతా ఒకటే అనుకుంటే అందరూ గళాలు కలిపి సోదరగీతం పాడితే విశ్వమంతా ఒక్క కుటుంబంగా మారదా అన్న భావన వీరిది. రణాలెందుకు? మరణాలెందుకు? ప్రగతిని సాధించడానికి పోటీపడాలని పరోపకారులుగా మారి మనిషి పేరు నిలబెట్టమని పిలుపునిచ్చాడు.

కొత్త సంవత్సరం పెళ్లికూతురులా వస్తోంది. వెళ్లేటప్పుడు ముసలమ్మలా వెళుతుంది. సంవత్సరం మారినప్పుడంతా వయసు పెరుగుతుంది. ఆయుస్సు తరుగుతుందంటారు. రైతులనుద్దేశించి

"రైతులంతా ఏకమయితే
ఈ రౌతుల పని గోవిందా
ముందు రానున్నది మంచికాలం
ఆత్మవిశ్వాసం పెంచుకోండి
ఆత్మహత్యలు మానుకోండి"!

అని ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తిచేశాడు. ధైర్యముంటే, తరగని పట్టుదల ఉంటే రణంలో రావణుణ్ణి కూడా జయించవచ్చని, సన్మార్గంలో దుర్మార్గాన్ని జయించవచ్చు. అసత్యాన్ని సత్యంతో జయించవచ్చంటారు.

ప్రాణవాయువునిచ్చే చెట్టు, ప్రగతికి మెట్టని, చెట్టుని పరోపకార సమ్రాట్టుగా పేర్కొన్నాడు. ఏ పూర్వ పుణ్యమో నరుడైపుట్టావు. అమరుడవు కావడానికి అవకాశాలున్నాయి. భయం అనే పిరికి మందుతాగి మరణిస్తూ ఎందుకు బ్రతకాలి. అన్యాయం చీకట్లను పారద్రోలడానికి ఆరిపోని దీపాన్ని వెలిగించు, వెలుగును సృజించు, పదిమందికి పంచు. నవ్వే చుక్కల్లో స్థానం సంపాదించమంటారు. మనస్సు మంచిదైతే లోకమంతా స్వర్గమే. అధికారం ఉన్నంత మాత్రాన సంతోషం రాదు. మనసు మంచిదైతే సంతోషానికి కరువే లేదంటారు. ఆకలితో అల్లాడిపోతుంది కడుపు. ఆవేదనతో మండిపోతుంది మనసు. చిమ్మ చీకటిని తరిమెయ్యాలని మధనపడుతుంది మేధస్సు. ఇలా అభ్యుదయ బీజాలు కవితాక్షేత్రంలో వెదజల్లారు కుమారస్వామి.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# నల్లమల అడవి బిడ్డలైన చెంచుల - జీవన విధానం

- డా॥. కె. భాను నాయక్, తెలుగు లెక్చరర్, యస్.యస్.యన్. కళాశాల, నరసరావుపేట.

చెంచులు అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజనులు. వీరు నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తుంటారు. వీరు ప్రకాశం, కర్నూలు, గుంటూరు, మహబూబ్‌నగర్, నల్గొండ, కృష్ణా నది కొండల్లో జీవిస్తున్నారు. నిజానికి వీరు నాగరిక ప్రపంచానికి దగ్గరగానే ఉంటున్నప్పటికీ ఆధునిక జీవితాన్ని అలవరచుకోవటానికి ఇష్టపడకుండా తమ జీవన విధానాన్నే కొనసాగిస్తున్నారు. వీరు శారీరక శ్రమను తట్టుకోగలగుతారు. చెంచులు 'విల్లు' చేతపట్టుకుని వేటాడుతారు. దుంపలు, తేనె, పళ్ళు, చింతపండు, వెలగ పళ్ళు, కరివేపాకు, విప్పపువ్వును సేకరిస్తారు. వీరు శాకాహారాన్నీ, మాంసాహారాన్ని కూడా భుజిస్తారు. చెంచులు ఉడుతలను, కోతులను, ఉడుములను, కుందేళ్ళను తింటారు. విప్పపువ్వును ఉడికించి తింటారు. అదేవిధంగా దుంపలను కాల్చి లేదా ఉడికించి తింటారు. విప్పసారాను ఇష్టంగా తాగుతారు. ఆవు, మేకలు, గేదెలను మచ్చిక చేసినా కూడా వాటి విలువ వాటిని ఉపయోగించే పద్ధతి తెలియక వాటిని దాళానులకు చౌకగా అమ్మేస్తారు. తేనెను సేకరించి ఆ తేనెను, గేదెలు, మేకలు, ఆవులు, గొర్రెలు లాంటి జంతువులను దళారులకు ఇచ్చి, వారి నుంచి తమకు కావలసిన వస్తువులను తీసుకుంటారు. వాటి విలువ, ఖరీదు తెలియకపోవడం వల్ల దళారులు చెంచులను వస్తు మారక విషయంలో ఎంతో మోసం చేస్తారు.

చెంచులు సంచారక జీవులు, ఒక ప్రాంతంలో స్థిరంగా ఉండరు. ఒక ప్రదేశం నుండి మరొక ప్రాంతానికి వలస వెళ్ళిపోతుంటారు. ఈ మధ్య చెంచులలో ఈ సంచారక జీవనంలో కొంత మార్పు వచ్చినప్పటికీ రెండు, మూడు సంవత్సరాలకయినా వేరే ప్రదేశానికి వెళ్ళిపోతుంటారు. వీరు తమ నివాసాలను ఎత్తయిన ప్రాంతాలలో తమ ఇళ్ళను నిర్మించుకుంటారు. వీరి ఇళ్ళు శంకు ఆకారంలో ఉంటాయి. వీరి గుడిసెకు చిన్న ద్వారం ఉంటుంది.

చెంచులు తమ గుడిసెలను చెరువులకు, నీటి గుంటలకు దూరంగా నిర్మించుకుంటారు. ఇందుకు కారణం, నీటి కోసం వచ్చే అడవి జంతువుల బారి నుండి తమను తాము కాపాడుకుంటారు. ఈ విధంగా నీటికి దూరంగా ఉంటారు. చెంచులు జంతువులను వృక్షాలను పూజిస్తారు. ఒక్కొక్క తెగవారు ఒక్కో జంతువులను పూజిస్తూ వాటిని పవిత్రంగా భావిస్తారు.

చెంచులలో బాల్య వివాహాలు జరగవు. మేనరికపు పెళ్ళిళ్ళు ఉంటాయి. పరస్పరం ఇరువురు కుటుంబాల మధ్య అంగీకారం జరిగి వివాహం నిశ్చయింపబడినపుడు వధువు చీర, జాకెట్టు, అత్త గారికి జాకెట్టు ఇస్తాడు వరడు. చెంచులకు పెద్ద, చెంచుల పెళ్ళి సమయంలో పూజారిగా వ్యవహరిస్తూ, వారి వివాహాన్ని జరిపిస్తారు. పెళ్ళి అయిన తర్వాత తనకు భార్య నచ్చకపోతే ఆమెను పుట్టింటికి పంపేయవచ్చు. వీరికి విడాకులు పొందే స్వేచ్ఛ ఉంది. భర్త నుండి విడిపోయి వేరుగా ఉన్న భర్త భర్త బతికి వుండగా మరో వివాహం చేసుకోకూడదు. కాని తనకు వచ్చిన పురుషునితో కలిసి జీవించే ఆ అవకాశం ఆమెకు ఉంటుంది.

చెంచులు ప్రకృతి ఆరాధకులు. భైరవుడిని వీరు పూజిస్తారు. అదే విధంగా గారెల మైసమ్మ కూడా వీరి దైవం. వీరు ప్రత్యేకంగా పండుగలను చేసుకోరు. మరణించిన వారిని పాతిపెట్టడం అదే కర్మకాండని ఆచరిస్తారు. వీరు కొంతకాలం నుండి హిందు మతానికి ప్రభావితులై, చనిపోయిన వారికి దహన సంస్కారాన్ని జరిపిస్తున్నారు. చెంచులు భవిష్యత్తును గురించి ఆలోచించరు. తమ సంపాదనను దాచుకోరు తాను సేకరించిన వాటిని ఏరోజు కారోజు తినేస్తారు. మర్నాడు తిరిగి ఆహారాన్వేషణకు బయలుదేరుతారు. వీరు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆహారాన్వేషణ చేస్తారు. రేపటి ఆలోచన వీరికి ఉండదు.

"అక్కలు లేనోడ - ఇయ్యాలో
చెల్లికురా మాకాడ - ఇయ్యాలో
ఆడ్పించి శివశంకు - ఇయ్యాలో
తల్లికాడికి పేయ్ - ఇయ్యాలో
ఎండి గిన్నలో ఇయ్యాలో
బువ్వ పిట్టి ఇయ్యాలో
ఆదన్న బుక్కడే ఇయ్యాలో
తినరా నాయనా ఇయ్యాలో
ఎండి గిన్నలో ఇయ్యాలో
పాలార పేస్న ఇయ్యాలో
ఆవన్న బుక్కడే ఇయ్యాలో
తాగ్రా నాయినా ఇయ్యాలో
తూర్పున్ని ఓక్క ఇయ్యాలో
రాజ్యమేలే అక్క ఇయ్యాలో
పర్మట ఓక్క ఇయ్యాలో
పల్లె లేలే అక్క ఇయ్యాలో
దచ్చినాన ఓక్క ఇయ్యాలో
ధనము లేలే అక్క ఇయ్యాలో
ఉత్తరాన ఓక్క ఇయ్యాలో
పట్నమేలే అక్క ఇయ్యాలో
పట్టెనే కళ్ళెములు ఇయ్యాలో
పోయెనే శివశంకు ఇయ్యాలో
తూర్పు అక్కా కాడికి ఇయ్యాలో
ఎన్నడూ రానోడివి ఇయ్యాలో
పంపనికి వచ్చితిని ఇయ్యాలో
మన ఇండ్లల్లోన ఇయ్యాలో
పెండ్లిండ్లు జరిగినక్కా ఇయ్యాలో
చూడ ప్రేమలు కలిగి ఇయ్యాలో
చూడబ్బ తినక్కా ఇయ్యాలో.."

**పాడినవారు : మండ్లి గురవయ్య**

**పాట విశిష్టత :**

ఒక రావగానికి ఇద్దరు భార్యలు ఉంటారు. మొదటి భార్యకు నాలుగురు ఆడ పిల్లలు పుడతారు. మగ పిల్లలు లేరని రావగాడు బాధపడతాడు. ఒకరోజు రావగాడు అడవికిపోయి ఒక మామిడిపండును తీసుకొని వచ్చి తన భార్యకు ఇస్తాడు. దేవుని దయ వలన ఈసారైనా నా మొదటి భార్యకు బంగారం లాంటి మగ పిల్లవాడు పుట్టాలని ఆమెను మామిడి పండు తినమంటాడు. ఆమె ఆ పండును దేవునికి పూజ చేసి ఎంతో ఆనందంగా తింటుంది.

రావగాడు తెచ్చినపండు పని చేస్తుందో లేదో అనుకొని మళ్ళీ ఆడపిల్ల పుడితే తను చూడలేను అనే బాధతో భార్యను ఏటి అవతల ఆమె పుట్టింటికి పంపిస్తాడు. మరల మగ పిల్లాడితోనే తన వద్దకు రమ్మని, లేకపోతే రావద్దని చెబుతాడు. కొన్నాళ్ళ తర్వాత ఆమె అక్కడనే కాన్పు అవుతుంది. ఆమెకు ఒక 'శంకు' పుడుతుంది. ఆ శంకు పుట్టినందుకు ఆమె చాలా బాధపడుతుంది. ఆ శంకును ఆమె ఇంట్లో ఒక మూలన పెడుతుంది. ఆ శంకులో ఉండే బాలుగు రోజురోజుకు పెద్దవాడు అవుతూ ఆ శంకులోనే ఉంటాడు. ఈ విధంగా రోజు రోజుకు శంకులో ఉండే బాలుడు మరియు బాలుడు బయటకి వచ్చి తల్లి చేసి తినగా మిగిలిన వంటలను తిని తిరిగి శంకులోకి పోయేవాడు. ఏంటి నేను రోజు పంటలు మిగిలించి పోతుంటే ఇవి ఉండడం లేదని తల్లి బాధ పడుతుంది. ఈ ఆహారం ఎవ్వరు తింటున్నా రోదనే అనుమానంతో ఆ తల్లి ఒకరోజు తాను ఇంట్లో నుండి వెళ్ళి పోయినట్లుగా పోయి మరల తిరిగి వచ్చి వాకిలి వద్ద తడిక దాపున దాగి ఉంటుంది. కొంతసేపటికి రోజు మాదిరిగానే శంకులో ఉన్న బాలుడు బయటికి వచ్చి తన తల్లి చేసిన వంటను తింటుంటాడు. ఆ తల్లి వెంటనే వచ్చి ఏంది నాయనా? నీవు ఎవరవు? అని అడుగుతుంది. అపుడు నేనమ్మా నీ కొడుకును మా నాన్న (అయ్య) నేను కడుపులో ఉండగా నీకు ఆడపిల్లలు పుడుతున్నారని నిన్ను మన తాతగారి ఇంటికి పంపినాడు కదా! అని మొత్తం గతం చెబుతాడు. తల్లి అవును నాయనా అని కొడుకును గుర్తిస్తుంది.

ఆ తర్వాత కొంతకాలానికి శివశంకు పెద్దవాడు అవుతాడు. కొన్ని రోజుల తర్వాత శివశంకుకు పెండ్లి వయస్సు

వస్తుంది. అన్ని విద్యలలో ఆరితేరిన శివశంకు గుర్రంపై బయలుదేరి తన తండ్రి దగ్గరికి పోతాడు. తన అక్కలు గురించి తెలుసుకుని తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణ వైపుల రాజ్యం ఏలుతున్న అక్కల వద్దకు వెళ్ళి, జరిగిన విషయం చెప్పి, మీరంతా మన ఇంటికి దగ్గరుండి నా పెండ్లి చేయాలి అని కోరతాడు. ఈ విధంగా శివశంకు తన కుటుంబం అంతటినీ ఒకటిగా కలిపేదే ఈ పాట.

"వగలేటి బావగారు చిటికెనేలు చిన్ని ఉంగరమిస్తా
నన్ను పాలేర్ వాటించవోయి చిన్నవాడా
చిటికెనేలు చిన్ని ఉంగరమొద్దు చిన్నద్యానా
నిన్ పాలేరే దాటించలేన్ చిన్నద్యానా
కాల్లక్ క్యడాలిస్తా చిన్నోడా
నన్ను పాలేర్ దాటించవోయి చిన్నోడా
కాల్లకు క్యడాలొద్దు చిన్నద్యానా
నిన్ పాలేర్ దాటించలేన్ చిన్నద్యానా
చేత్‌లకు గాజులిస్తా చిన్నోడా
వన్నేరే దాటించవోయి చిన్నోడా
చేతి గాజులోద్దు చిన్నద్యానా
నిన్నేరే దాటించలేన్ చిన్నద్యానా
నడ్మెడ్డానమిస్తా చిన్నోడా
నన్నేరే దాటించవో చిన్నొడా
నడ్యెడ్డానమొద్దు చిన్నద్యానా
నన్నేరే దాటించలేన్ చిన్నద్యానా
ముక్‌కు ముక్రాయిన్తా చిన్నోడా
నన్నేరే దాటించవోయి చిన్నోడా
ముక్కుకు ముక్రాయొద్దు చిన్నద్యానా
నిన్నేరే దాటించలేన్ చిన్నద్యానా
నన్నే పెళ్ళాడతాను చిన్నోడా
నన్నేరే దాటించవోయి చిన్నోడా
ఏరే దాటిస్తానే చిన్నదానా
మనము పెండ్లే చేస్కుందామే ఓ చిన్నదానా"

**పాడినవారు : కుడుముల పోతయ్య**

## పాట విశిష్టత :

నల్లమల అడవుల్లోని కృష్ణా నదికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నదికి ఈ చెంచులు ఉత్తరం వైపు, దక్షిణం వైపు నేటికి స్థిర నివాసం ఏర్పరచుకుని జీవిస్తున్నారు. కృష్ణా నది నీరు వాలవలే తేటతెల్లంగా ఉండి చాలా లోతుగా ఉందని వర్ణిస్తూ ఆ ఏరు (కృష్ణా నది) దాటించమని మరదలు బావను అడుగుతుంది. నేను ఏరు దాటించను అంటాడు. వగలమారి బావ, అపుడు మరదలు తన ఒంటి మీద ఉండే ఉంగరము, కాళ్ళ కడియాలు, చేతి గాజులు, నడుము వడ్డాణం, ముక్కురాయి మొదలగు అన్ని ఆభరణాలు ఇస్తాను, నన్ను సంతోషంగా పాలేరు దాటించమని అడుగుతుంది. అపుడు అతను నీ వంటి మీద అభరణాలు నాకేమి వద్దు, కానీ నన్ను పెండ్లి చేసుకుంటానంటే ఏరు దాటిస్తానగా చివరకు ఆ మరదలు సరే అని, నిన్నే పెండ్లి చేసుకుంటాను అని మాట ఇవ్వగానే బావ ఆమెను ఏరు దాటిస్తాడని ఈ పాటలో భావం.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ప్రపంచీకరణ - తెలుగు సంస్కృతి

- డా॥. హెచ్. కిషన్

## 1. ప్రారంభం :

ఒక స్రోతస్విని ప్రవహిస్తున్నది. అది గంగానది
ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి
సీతాద్రిసు
శ్లోకంబైన హిమాద్రి నుండి భువి భూలోకంబు నందుండి యత్సో కాంబోధి పయోధి నుండి పవనాంతో లోకముంజేరె....

మిగతా ఇక్కడ అసంతనం. చెప్పినవాడు లక్ష్మణ కవి. సందర్భం ఏమిటో అందరికీ తెలిసిందేనూ. అమ్మతల్లిని ఆరాధించిన నాటికాలపు సంస్కృతి, ప్రకృతిని పరిశీలించి, దానికి అనుగుణంగా ఒదిగిపోయి కాలంలోని మార్పులను పండుగలుగా స్వీకరించిన నాటికాలపు సంస్కృతి, మనుషులంతా ఒక్కటై, ఆత్మీయతాను బంధాలను పెన వేసికొని, సంఘ చైతన్యమంతా కలగలసి జాతరలను నిర్వహించుకొన్న నాటికాలపు సంస్కృతి, ప్రకృతిని దైవంగా తలచి ఉత్సవాలను జరుపుకొన్న సంస్కృతి, నేటికి ఈ క్రీస్తు శకపు రెండువేల రెండవ దశకం నాటికి ఏ స్థితికి చేరుకున్నదో గమనిస్తే, అప్పుడు మనకు ఈ పద్యాన్ని ఇక్కడ ఎందుకు జ్ఞాపకం చేసుకోవాల్సి వచ్చిందో బోధ పడక మానదు.

ఆకాశంలో ప్రవహించే గంగానది, శివుని శిరసు చేరి, ఆపైన హిమాలయాలలో చేరి, అక్కడ నుండి భూలోకమంతా ప్రవహించి ఆపైన పాతాళం చేరినట్లుగా వర్ణింపబడిన ఈ పద్యం మనకు ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సంస్కృతి వైభవం ఏ విధంగా మారుతున్నదో కళ్ళకు కట్టినట్లు ప్రతీకాత్మకంగా కనిపిస్తుంది.

వేల సంవత్సరాల చరిత్ర తెలుగువారిది. అంటే మనది. భాషావాచిగా, జాతివాదిగా, దేశవాదిగా త్రివిధ రూపాలలో త్రిలింగ దేశాల మధ్య వ్యాపించిన ఒక మహోదాత్తమైన సంస్కృతి నేడు తన అస్తిత్వాన్ని చరిత్ర మూలాలలో వెదుకుకొంటున్నది. పారసీక సంప్రదాయం, బౌద్ధ జైన సంస్కృతుల ప్రభావం, క్రైస్తవ మిషనరీల సునామీలు, భారతదేశంలోనే ఉన్న ఇతర భాషా సంస్కృతులు సంప్రదాయాలు... ఇలా ఎన్నింటినో ఎదుర్కొన్న మన తెలుగు సంస్కృతి నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో వరదలో కొట్టుకుపోతూ మునకలు వేస్తున్నది.

ఒక జాతి జనుల సర్వ వ్యవహారాలు అంటే భాష, కుటుంబ జీవన సరళి, అలవాట్లు, ఆచారాలు, సాంఘిక నియమాలు, ప్రవర్తన పద్ధతులు, కట్టుబాట్లు, ఆహార విహారరీతులు అన్నీ కలిపి ఆ జాతి జనుల సంస్కృతి అని నిర్వచించుకోవచ్చు. ఈ సంస్కృతిని అనుసరించే వారంతా, ఇందులో నిర్వచించబడిన ప్రతి లక్షణాన్ని కలిగి ఉన్నవారే అవుతారు. ఇందుకు కొంచెం భిన్నమైన స్వరూపం సంప్రదాయానిది. ఒక నిర్ణీతకాల ప్రమాణాన్ని ఆధారంగా స్వీకరించి, దానికి పూర్వకమైన సంస్కృతిని సంప్రదాయమంటున్నాం. పరమైన దానిని సంస్కృతిగా పిలుచుకొంటున్నాం. సంప్రదాయం మారదు కానీ సంస్కృతిలో మార్పులు చోటుచేసుకొంటాయి.

భిన్న భాషలు, భిన్న సంస్కృతులు... అన్నీ కలగలిపి ప్రపంచ సంస్కృతిగా నేటికాలంలో ఏకరూపంలో కనిపిస్తున్నాయి. అదీ గ్లోబలైజేషన్ అనే ప్రపంచీకరణ పేరుతో.

అసలు ప్రపంచీకరణ అంటే ఏమిటి అని ప్రశ్నించుకుంటే సాహిత్యపరమైన భాషలో ఈ నిర్వచనాలు చెప్పుకోవచ్చు.

## 2. గ్లోబలైజేషన్ :

గ్లోబలైజేషన్ 'ఈ పదం సాంఘిక శాస్త్రాలలో 1960లోనే విరివిగా ఉపయోగింపబడినప్పటికీ తర్వాతకాలంలో ఈ పదం 'వాణిజ్యభూతం' అని కూడా వర్ణింపబడింది. ప్రపంచీకరణ వివిధ సంప్రదాయాలను అనుసంధానించడంతో, ఆ ప్రభావంతో ప్రతి సంస్కృతి కూడా తన

స్వరూపాన్ని పోగొట్టుకుంది. అందుకు దేశ సంస్కృతి కూడా అతీతమేమీ కాదు. మార్పును అంగీకరించకపోతే జీవనంలోని నాణ్యతను తగ్గించేంత తీవ్రతను చూపించింది ఈ ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణ అనేది సాహిత్య పరంగా చూస్తే స్థానిక లేదా ప్రాంతీయ విషయాలను, ప్రపంచ విషయాలుగా మార్చివేసే ప్రక్రియ. ప్రపంచంలోనే ప్రజలు అందరినీ ఏకం చేసి ఒకే ఒక సమాజంగా కలిసికట్టుగా పనిచేసేటట్లుగా చేసే ఒకే పద్ధతిగా దీనిని వర్ణించవచ్చు.

## 3. సంస్కృతి :

సంస్కృతి అనేది మానవ సమాజ జీవన విధానంలో ప్రముఖమైన విషయాలను - అనగా జీవనం, ఆచారాలు, వ్యవహారాలు, ప్రమాణాలు, మతం, సంబంధాలు, పాలన - వంటి వాటిని సూచించే పదం. దీనికి ఆంగ్లంలో సమానమైన కల్చర్ లాటిన్ పదం కల్చర్ లేదా కొలెరె అనేవి "టు కల్టివేట్" అనగా వ్యవసాయం చేయడం నుండి ఉద్భవించాయి. ఒక సమాజంలో ముఖ్యమైన పద్ధతులు మరియు నిర్మాణాలు మరియు వ్యవస్థలు ఆ సమాజం యొక్క సంస్కృతిని సూచిస్తాయి. సంస్కృతిని సూచించే సంకేతాలు, నిర్మాణాలు, వ్యవస్థలు, ఆచారాలు, వ్యవహారాలు, ఇతమిత్థమైన హద్దులు లేవు. అవి నిరంతరాయంగా మారుతుంటాయి. ఒక దానితో ఒకటి కలుస్తూ, విడిపోతూ పరిణామం చెందుతుంటాయి.

ఒక సమాజం జీవనంలో మిళితమైన కళలు, నమ్మకాలు, సంస్థలు తరాలలో జరిగే మార్పులు, తరాల మధ్య వారసత్వంగా కొనసాగే విధానాలు అన్నీ కలిపి ఆ సమాజం యొక్క "సంస్కృతి" అంటారు. ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి అని నిర్వచించవచ్చు. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు అభివాదాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు అన్నీ కలిసి సంస్కృతి అవుతాయి. గతించిన కాలం గురించి భవిష్యత్తు తరాలకు అందించే వారధి సంస్కృతి.

ఒక సమాజం నిర్మాణం చేసిన, వాడిన పరికరాలు, నిర్మించిన కట్టడాలు, వారి సంగీత కళ, జీవన విధానం, ఆహారం, శిల్పం, చిత్రం, నాటకం, నాట్యం, సినిమా. ఇవన్నీ ఆ సమాజపు సంస్కృతిని సూచిస్తాయి. ఒక సమాజంలో ఉన్న వస్తు వినియోగం, సంపన్నత, జానపద వ్యవహారాలు కూడా సంస్కృతిగా భావింపబడతాయి. వస్తువుల వినియోగమే కాకుండా వాటి ఉత్పత్తి విధానం, వాటిని గురించిన దృక్పథం, సమాజంలో ఆ వస్తువులతో పాటు పెనవేసుకొని పోయిన సంబంధాలు, ఆచారాలు కూడా సంస్కృతిలో లోనివే అని సమాజ శాస్త్రవేత్తలు భావిస్తారు. నైతికత కూడా సంస్కృతి అని వీరి అభిప్రాయం.

టైలర్ సంస్కృతిని ఇలా వర్ణించాడు. "సంస్కృతి" లేదా 'నాగరికత'ను విస్తారమైన జాతిపరమైన అంశంగా భావిస్తే, ఆ జాతి లేదా సమాజపు సంక్లిష్టమైన జ్ఞానం, విశ్వాసాలు, కళలు, నైతికత చట్టం, ఆచారాలు మరియు సమాజంలో భాగస్తుడైనందున వ్యక్తికి సంక్రమించే అలవాట్లు, నైపుణ్యత, అవకాశం - అన్నింటినీ కలిసి సంస్కృతి అనవచ్చు.

ఐక్యరాజ్య సమితి విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ (యునెస్కో) వారు సంస్కృతిని ఇలా వర్ణించారు. ఒక సమాజానికి లేదా సమూహానికి చెందిన ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, లౌకిక వైజ్ఞానిక, భావోద్వేగ అంశాలు ఆ సమాజపు (సమూహపు) సంస్కృతి అవుతాయి. కళలు, జీవన విధానం, సహజీవనం, విలువలు, సంప్రదాయాలు, విశ్వాసాలు ఈ సంస్కృతిలోని భాగాలే.

## 4. ప్రపంచ సంస్కృతులతో పోలిక :

థాయ్ చరిత్రలో ఒక కథ ఉంది. కౌండిన్యుడనే బ్రాహ్మణుడు కాంబోడియా చేరి అక్కడ స్థిరపడ్డాడు. ఆ దేశాన్ని ఏలే రాణిని పెళ్ళాడాడు. భారతీయ సంస్కృతిని, ఆచారాన్ని ఆమె చేత అనుసరింపజేశాడు. రాణి గారు అనుసరించడంతో దేశంలోని మిగతా జనులంతా భారతీయ ఆచార సంప్రదాయాల్ని స్వీకరించారు.

నెమ్మదిగా భారతీయ సంస్కృతిలోని కొన్ని అంశాలను ఆగ్నేయ ఆసియా ప్రజలు గ్రహించారు. అయినా ఆ ప్రజలు తమ సంప్రదాయాల్ని విడనాడలేదు. నిజానికి వాళ్ళ సంప్రదాయాలకు మన ఆచారాలతో చాలా మట్టుకు పోలికవుంది. భారతీయ సంస్కృతి ఎక్కువగా ఆగ్నేయ ఆసియా పట్టణాల్లోను, రాజస్థానాల్లోను సమాదరణ పొందింది. గ్రామాల్లో, పాత జీవన పద్ధతులే కొనసాగాయి. భారతీయ వర్తకులు సౌరాష్ట్ర, తమిళనాడు, బంగాల్ మొదలైన అనేక ప్రాంతాల నుంచి అక్కడికి వెళ్ళారు. కాబట్టి వాళ్ళు తమతోపాటు తమ ప్రాంతీయ అలవాట్లను, భావాలను అక్కడికి తీసుకుపోయారు. సౌరాష్ట్ర నుంచి వెళ్ళిన వాళ్ళలో ఎక్కువమంది జైన మతస్థులు, దక్షిణాది నుంచి వెళ్ళినవారు శైవ, వైష్ణవ మతస్థులు, బెంగాలు నుంచి వెళ్ళిన వాళ్ళలో చాలామంది బౌద్ధులు.

బర్మా (సువర్ణభూమి), మలయా (సువర్ణద్వీపం), కంబోడియా (కాంభోజ) జాణ (యవద్వీపం)లు, భార తీయ దేవాలయాల్ని పోలిన బ్రహ్మాండమైన ఆలయాలు అక్కడ నిర్మింపబడ్డాయి. భారతీయ ఆచారాలు పాటించ బడ్డాయి. కాంబోడియాలలోని అంకోడ్‌వాట్ దేవాలయాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. పౌరోహితులు, రాజ కుటుంబీకులు సంస్కృత భాష నేర్చుకున్నారు. మన పురాణ, ఇతిహాసాలలోని కథలు తెలుసుకున్నారు. స్థానిక కథలతో భారతీయ కథల్ని కలగలిపిన ఒక కొత్త తరహా సాహిత్యం అభివృద్ధి చెందింది. జావా ద్వీపంలో ఆలపింప బడే రామాయణం, జావా, భారతదేశాల సంప్రదాయాల మేలు కలయిక.

అలాగే ఆయా దేశాల సంస్కృతీ స్వరూప స్వభావాలు మన దేశానికి వచ్చి చేరాయి. ఆ లక్షణాలలో అతి ముఖ్యమైనది పట్టణీకరణ. జనులు పల్లెల నుండి పట్టణాలకు వలసలు రావడం. అలాగే యంత్ర విని యోగాల, వినిమయాల జోక్యం పెరగడం మరో లక్షణం.

### 5. జనవాసాల నుంచి నగర జీవనం వైపు :

కాలక్రమేణా చిన్నచిన్న జనావాసాలు పెరిగి పెద్ద వయ్యాయి. అక్కడ నివసించే జనం కూడా వృద్ధి అయ్యారు. కొత్త అవసరాలు పెరిగాయి. కొత్త వృత్తులు అవతరించాయి. పెద్ద గ్రామల్లో నివసించే ప్రజలు తమ అవసరాలకు మించి ఆహారం పండించటం వల్ల తిండికి కొరత లేకుండా సుఖంగా ఉన్నారు. మిగులు ధాన్యాన్ని మార్పిడి చేసి బట్టలు మట్టి పాత్రలు, ఆభరణాలు వగైరా తెచ్చుకుంటున్నారు. ప్రతి కుటుంబం పొలం పనికే అంకితం కావలసిన అవసరం ఇకలేదు. ఇది ప్రపంచీకరణ వల్ల వచ్చిన మార్పుగా భావించవచ్చు.

బట్టలు వేసేవాళ్ళు, కుండలు వేసేవాళ్ళు, వడ్రంగులు మొదలైన వృత్తి పనులవాళ్ళు వ్యవసాయ కుటుంబాల వారికి తాము వస్తువులు తయారు చేసి పెట్టి వారి నుంచి ధాన్యాన్ని తీసుకుంటున్నారు. ఈ వస్తు మార్పిడితో వ్యాపార దశ మొదలై క్రమేణా పుంజుకొంది. వారితో రకరకాల వృత్తి పనులవాళ్ళు ఒకచోట పోగుబడ్డారు. అటువంటి గ్రామాలే రామరామ పట్టణాలుగా వృద్ధి చెందాయి.

నగర జీవితం ప్రారంభం కావటంతో సాంకేతికత ప్రగతి జరిగింది. అంటే పనిముట్ల తయారీలో వస్తూ త్పత్తిలో కొత్త ప్రక్రియలు, పద్ధతులు ప్రవేశించాయి. పూర్వం కంటే మెరుగైన నాగరికత పెరిగింది. ఇది ప్రపంచీ కరణ ప్రభావం వల్లనే అనాలి. మనిషి తన భౌతికావసరలు తీరడంతో సంతృప్తి పడకుండా అంతకుమించిన అవస రాల్ని తీర్చుకోవటం కోసం అన్వేషించే దశని నాగరికత అనవచ్చు. ఈ దశలో మనిషికి చాలినంత తిండి ఉంది. తమ ఉత్పత్తి చేసిన వస్తువుల్ని ఇతర వస్తువులకు మార్పిడి చేసుకుంటున్నాడు. వ్యవసాయానికే అంటి పెట్టు కుని పల్లెలోనే ఉండనవసరం లేకుండా పట్టణాల్లో వేరే వృత్తుల్లో కుదురుకొని జీవిస్తున్నారు. మెదడుకు మేత వేసే తీరిక దొరికింది. జీవితానికి సంబంధించి తికమకపెట్టే అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కునే వ్యవధి దొరి కింది. రాయటం కాబట్టి తన ఆలోచనలని రాసి పెట్టు కోగలడు. తను జీవించే సమాజం చట్టం కట్టుబాట్లలో ఉంది.

**5.1 మార్పు :**

మనిషి తన బుద్ధికి సంబంధించిన అవసరాల్ని సంతృప్తిపర్చుకోవడానికి ప్రయత్నించినప్పుడు నాగరికుడవుతాడు.

పట్టణాల్లో ఇటుకలతో ఇళ్ళు కట్టారు. తీర్చిదిద్దినట్లు రోడ్లు నిర్మించారు. మురుగు పారుదల సౌకర్యాలు ఏర్పరచుకొని నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చుకున్నారు. రాకపోకల సౌకర్యాలు పెరిగి వ్యాపారం పెంపొందింది. సాంఘిక జీవనం మనుపటంత అలక్ష్యంగా లేదు. అనేక రకాల నియమ నిబంధనలు అవసరమయ్యాయి. పరిపాలన నిర్వహించటానికి ఒక ప్రభుత్వం అవసరమైంది. ఇది ప్రపంచీకరణ దశలో సాధించిన అసమాన ప్రగతి అని చెప్పవచ్చు.

**5.2 దుస్తులు :**

ప్రపంచీకరణ ప్రభావంతో ప్రజలు ధరించే దుస్తులలో అనేక రకాల మార్పులు చోటుచేసుకున్నాయి. అమ్మాయిలు లంగా ఓణికి బదులు విదేశీ దుస్తులు, వేల రకాలలో వేసుకుంటున్నారు. పురుషుడు ధోతి, అంగి, భుజంపై కండువా వీటికి బడులు ప్యాంటు, టీ షర్టు వేసుకొంటున్నారు. తలపాగా ఏనాడో వదిలేశాడు. స్త్రీలలో నేడు చీరకట్టు రానివాళ్ళ సంఖ్య అధికం అని చెప్పవచ్చు.

**5.3 ఆభరణాలు :**

ప్రపంచీకరణలో స్త్రీలు, పురుషులు వేసుకొనే ఆభరణాలలో అనేక రకాల మార్పులు సంభవించాయి. బంగారు వెండి వంటి రాజ లోహాలకు బదులుగా ప్లాస్టిక్, ఇనుప వస్తువులు ఆభరణాల చోటును ఆక్రమించడం కొత్త విశేషం. స్త్రీలు పురుషులు ప్రపంచమంతటా చిన్నా పెద్ద భేదం లేకుండా ఎక్కడ పడితే అక్కడ పచ్చబొట్లు పొడిపించుకోవటం నేడు అధికంగా కన్పిస్తుంది. ప్రపంచీకరణ ప్రభావంతో ఆధునిక కాలంలో సినిమా మరియు మీడియా ప్రచారాలతో ఇది మరింత ఎక్కువ అయింది.

**5.4 ఇంటిలోని వస్తువులు :**

కాలానుగుణమైన మార్పుల వల్ల ఇటీవలి కాలంలో చాలామంది మట్టిపాత్రలకు, వెండి పాత్రలకు ప్రత్యామ్నాయంగా అల్యూమినియం, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను వాడుతున్నారు. అన్నింటా ప్లాస్టిక్ భూతం తొంగిచూస్తుంది.

**5.5 ఆహార పానీయాలు :**

పూర్వం ప్రకృతి పరిసరాలకు తగ్గట్టుగా ఆహారాన్ని సంపాదించుకోవడం ఉండేది. ఆరోగ్యం కూడా బాగుండేది. కాని ప్రపంచీకరణ మార్పుల వల్ల దేశీయ పానీయాలకు బదులు విదేశీ పానీయాలు తాగుతున్నారు. పండ్లు మొదలైన సాత్విక ఆహారానికి బదులు బర్గర్లు / చైనీస్ పాస్ట్‌పుడ్లు తింటున్నారు.

ఒకనాడు పాటలు పాడే ఫ్లూట్ వాయించాలంటే కర్రతో తయారు చేసిన పరికరాన్ని మాత్రమే వాడేవారు. కాని నేడు దీనికి బదులు ప్లాస్టిక్ ఫ్లూట్లు వచ్చాయి. కాగితంలో తయారు చేసిన అద్దాలు ధరించే పిల్లలకు కాని నేడు ప్లాస్టిక్ అద్దాలు తప్ప వేరే మార్గం లేదు. ఇది ప్రపంచీకరణ వల్ల అని చెప్పవచ్చు.

**ముగింపు :**

స్రోతస్విని ఒక ప్రవాహం. నిన్నకు, నేడు ఎంత సహజంగా వస్తుందో, నేడు రేపటికి నిన్నగా మారిపోతుంది. ఎల్లుండికి, అవతల ఎల్లుండిగా కూడా అయిపోతుంది. కాల ప్రవాహంలో సంస్కృతిలోని మార్పులు కూడా అంతే నిజం. నడుస్తున్న చరిత్రకు వర్తమానం ఒక సాక్షీభూతం మాత్రమే. నిన్న గతం నేడు నిజం, రేపు నమ్మకం అయితే నిన్నటి గురించి "నేడు" నిలువుటద్దంలో చూపిస్తుంది. అచ్చమైన కుంకుమకు బదులుగా టిక్లీ ప్లాస్టిక్కు బొట్లు సాధారణమైపోయాయన్నదే చింతించాల్సిన విషయం. నిర్లిప్తంగా యదాలాపంగా ఆకాశంబునందుండి, శివుని శిరసుపై అన్నట్లుగా అలా అలా క్రమంగా పాతాళంలోకి దిగజారిపోతున్నామా!

**ఆధార గ్రంథాలు :**

1. భారతీయ వారసత్వం - సంస్కృతి. 2. తరతరాల భారత చరిత్రం. 3. మహతి.

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తమిళ, తెలుగు జానపద శ్రామిక గేయాలు

- డా॥. ఎస్. యజ్ఞశేఖర్, శాఖాధిపతి, తెలుగు విభాగం, మద్రాసు క్రిష్టియన్ కళాశాల, చెన్నై, తమిళనాడు.

తమిళాంధ్ర దేశాలకు సంప్రదాయాల్లోను, ఆచారాల్లోను, విశ్వాసాల్లోను చాలా పోలికలు ఉన్నాయి. ఈ రెండు దేశాల మధ్య చాలాకాలం నుండి అవినాభావ సంబంధం ఉంది. చేరచోళ పాండ్య పల్లవరాజులు భారతాన్ని తమిళభాషలో క్రీ॥శ॥ 9వ శతాబ్దంలో అనువదింపజేశారు. చోళరాజకన్య, వేంగీ విభుడైన చాళుక్యరాజు రాజరాజ నరేంద్రుని పరిణయ మాడింది. ఆమెతోపాటు ఆరణపు కవిగా నన్నయ్య (నారాయణయ్య) వచ్చాడనీ, ఆమె ప్రోత్సాహం వల్లనే రాజరాజన నరేంద్రుడు, నన్నయ్యచే భారతాన్ని అనువదింపచేశాడనీ డా॥ దివాకర్ల వెంకటావధాని గారు తమ నాటకం 'భారతావతరణము'లో పేర్కొన్నారు. ఆ తరువాత విజయనగర చక్రవర్తులు ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు మధురలోను, అచ్యుత దేవరాయలు తంజావూరులోను తమ ప్రతినిధుల్ని ఉంచి పరిపాలన చేశారు. క్రీ॥శ॥ 17, 18 శతాబ్దాల్లో తంజావూరు, మధర, చెంజి, మైసూరు, పుదుక్కోట మొదలైన కేంద్రాల్లో తెలుగు సాహిత్యయం, సంస్కృతి జేగీయమానంగా వెలుగొందింది. ఇలా తెలుగు రాజులు తమిళ దేశాన్ని పరిపాలించడం వల్ల ఆ ప్రభావం తమిళుల ఆచార వ్యవహారాల్లోను, సాహిత్యంలోను, జానపద సాహిత్యంలోను కనిపిస్తుంది. ఈ వ్యాసంలో తమిళ, తెలుగు జానపద గేయాల ఉనికిని స్పృశిస్తూ శ్రామిక గేయాల్లో ప్రముఖ స్థానం వహించిన వ్యవసాయక గేయాల ప్రస్తావన చేయడం జరిగింది.

మానవుని జీవన స్రవంతిలో కలిసిపోయిన ఈ జానపద గేయాలు తెలుగు సాహిత్యం ప్రారంభదశలో అనాధృతంగా, అస్పృశ్యంగా వదిలివేయబడడం శోచనీయం.

తెలుగు సాహిత్యంలో దేశికవుల్ని, స్తుతించి వారి కవితల్ని కొనియాడిన కీర్తివన్నెచోలునికే దక్కింది.

"మునుమార్గ కవితలకం
బున వెలయంగ, దేశికవిత బుట్టించి తెనుం
గున నిలపే రంధ్ర విషయం
బున జన చాళుక్యరాజు మొదలగ బలువుర్" - అన్నాడు.

ఈయన తన కాలంలో ప్రజల్లో ప్రచారం పొందిన అంకమాలికల్ని, ఊయల పాటల్ని, గౌడు గీతాల్ని, రోకటి పాటల్ని పేర్కొన్నారు. పాల్కురికి సోమన్య (పండితారాధ్య చరిత్రలో) ప్రజల వ్యవహారంలోని జానపద గేయాల్ని ద్విపద పాదాల్లో బంధించిన మొదటి కవి.

భక్తులు నక్షత్ర పర్వతాన్ని ఎక్కుతూ...

"చేదుకో చేదుకో శ్రీ గిరినాధ
చేదుకో మల్లయ్య చేదుకొమ్మనుచు
చేదుకో చేదుకో శ్రీశైల నిలయ
చేదుకో మల్లయ చేదుకొమ్మనుచు
చేదుకో చేదుకో చేనేత నొడయ
చేదుకో మల్లయ్య చేదు కొమ్మనుచు"

అంటూ "మల్లయ్య చేదు కొమ్మనుచు" అంటూ పాటలు కట్టి పాడారని సోమన్న రాశాడు. (పండితారాధ్య చరిత్ర ప్రకరణం పు. 370).

తెలుగు సాహిత్యంలో నన్నెచోడునికి ముందు జానపద గేయాల ప్రస్తావన కూడా లేదని తెలుస్తూ ఉంది.

తమిళంలోనే కాక ద్రావిడ భాషలోనే ప్రథమ గ్రంథం తోల్ కాప్పియం. దీన్ని క్రీ॥పూ॥ 500 నుండి క్రీ॥శ॥ 100 వరకు ఉన్న సంగ సాహిత్య కాలంలో రచించి ఉండ వచ్చునని చెపుతున్నారు. ఇందులోని 'పొరుళధిగారం'లో పేర్కొనబడిన 'పణ్ణత్తి', రాగయుక్తాలైన జానపద గేయాల్ని సూచిస్తూ ఉంది. ఇందులోని మరొక సూత్రంలో మౌఖిక సాహిత్యాన్ని, పొడుపు కథల్ని, హాస్యగేయాల్ని, సామెతల్ని తొల్కాప్పియనార్ పేర్కొన్నాడు. సంగసాహిత్యంలో ఈ జానపద గేయాల ప్రస్తావన మిక్కుటంగా ఉంది. ఎట్టుత్తొగై, పత్తుపాట్టుల్లో రోకటి పాటలు (మలై ఏడుగడాం

342) స్త్రీలు చిలుకల్ని తోలడానికి పాడే పాటలు (మలై ఏడుగడాం 329) స్త్రీల పాటలు (కలిత్తొగై 104-36-64) భక్తి గీతాలు (నట్రినై 222) కర్షక గీతాలు (మధురైక్కాంజి 259-270) ఊయల పాటలు (కలిత్తొగై 131-24) మొదలైన పాటల ప్రస్తావన ఉంది.

ము.వరదరాజన్ గారు తమ తమిళ వాఙ్మయ చరిత్రము (తిమ్మావజ్ఝల కోదండ రామయ్య అనువాదం)లో జానపద గేయాల ప్రాముఖ్యాన్ని గూర్చి ఇలా అంటారు. "తొలుత జానపద గీతముల యొక్క నాద విధానములను, అర్ధ విభేదములు అనుసరించి యభి వృద్ధి చేయబడిన ముక్తక రచనలే తమిళ సాహిత్యము యొక్క ప్రారంభము" అన్నారు. క్రీస్తు శతకం 2, 3 శతాబ్దాలకు చెందిన 'శిల్పపృధిగారం'లో దానికర్త ఇళంగో ఆడిగల్ జానపద సాహిత్యానికి లిఖిత రూపం ఇచ్చాడు. దీన్ని గూర్చి చెబుతూ వరదరాజన్ "కథలలో నెచ్చటెచ్చట అవకాశము లభించునో యచట వెల్ల నాగాన ఫణితులకు ప్రాణము పోసెను. సముద్ర తీరమున చెంబడివారు (బెస్తలు మొదలగువారు పాడు ప్రణయ గీతములు, కావేరి నదిని గురించి ప్రజలు పాడు చుండిన పాటలు, వేట గాంౘ్రు కాళిని కొలుచు పాలు, వారు విష్ణుదేవుని (తిరు మాత) నారాధించుచు పాడినవి, పర్వత వాసులైన ప్రజలు మురుగని నారాధించుచు పాడినది, చేరదేశమున స్త్రీలొకచోచేరి అచ్చునగాయనలాడుచు పాడిన పాటలు, వడ్లు దంచునపుడు పాడినవి, ఊయాలలూగునపుడు పాడినవి మొదలైన ప్రాచీన కాలపు పాటలు, జనుల చేతనేయే విధములుగా పాడబడినచో తెలిసికొని, యాయా రూపములలో పాటలను రచించి యాయా ప్రదేశములయందలి జనులు నోరారపాడినట్లుగా కావ్యమునందు కూర్చియున్నాడు. అందుచేత ప్రాచీన కాలపు జానపత గీతములు యొక్క ఫణితులను నేడు మనం తెలిసికొనవలయునిన' శిలప్పది గార' మొక్కటే మనకు సహాయ భూతముగా నున్నదని చెప్పవచ్చును" (తమిళ వాఙ్మయ చరిత్రము పు. 99)

ఇలా ప్రాచీన తెలుగు తమిళ భాషా సాహిత్యాన్ని పరిశీలించినపుడు తెలుగు వాళ్ళకంటే, తమిళులు తమ సంస్కృతికి దర్పణంగా నిలిచిన జానపద గేయాల పరిరక్షణకు క్రీ॥పూ॥. నుండే ప్రయత్నించారని తెలుస్తూ ఉంది. జానపద గేయాల సంకలనం కూడా తెలుగువారి కంటే తమిళులే ముందు చేపట్టారు.

జానపద సాహిత్య సంకలనానికి పూనుకొన్న మొదటి ఆంధ్రుడు ఎమ్. రామయ్య. ఈయన 1872లో గుత్తెన దీవి రామాయణము, 1884లో 'జానకి పాటలు', 1893లో 'కోలాట కీర్తనలు' అచ్చొత్తించారు. తమిళంలో 1863లో 'పవళ కొండిమాలై' అనేక కథా గేయాల్ని కరుణానందస్వామి ప్రచురించారు. అదేవిధంగా తమిళంలో వెలువడిన మొట్టమొదటి వివరణాత్మక గ్రంథము. అరుణాచలం గారి 'కాట్రి నిలే వంద కవిదై'! దీన్ని 1943లో ప్రచురించారు. ఈ మార్గంలో కూడా తమిళులే ముందున్నారు. ప్రస్తుతం తమిళం, తెలుగు జానపద గేయాలపై పరిశోధన బహుముఖంగా కొన సాగుతుంది. ఈ వ్యాసంలో చిత్తూరు జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వ్యవసాయిక గేయాల్లో గూర్చి తెలుసుకొందాం.

మానవుడు శ్రమించేటప్పుడు తన శ్రమను మరచి పోవడానికి పాటలల్లి పాడుతూ ఉంటాడు. ఇలా శ్రమించేటప్పుడు మానవుని అంతరాంతరాల్లో పుట్టి సమిష్టి సొత్తుగా మారే గాన విశేషమే పనిపాట. అలసిన మానవు నికి ఉత్తేజాన్ని కలిగించేది కూడ ఈ పాటయే. ఈ పని పాటను తమిళంలో ఉళైప్పు పాడల్‌గళ్ అంటారు. "ఆడి ప్పాడి వేలైసెయ్‌దాల్ అలుప్పిరుక్కాదుతంబి" అనే తమిళ గేయాన్ని పోలినదే తెలుగులో శ్రీశ్రీ" ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపు సాలుపేమున్నది" అనే గేయం రాశారు.

### 1. వేట పాటలు :

పని పాటల్లో అత్యంత ప్రాచీనమైనవి వేటపాటలు. ఆదిమ మానవుడు వేటాడడానికి వెళ్ళినప్పుడు మృగాల అరుపులు, వాటి నర్తనలు అతణ్ణి ఆకర్షించాయి. వేటాడి వచ్చిన తరువాత ప్రకృతిలోని అరుపుల్ని, చలనాన్ని

అనుకరించడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో ఆట, పాట పుట్టింది. అలా పుట్టిన గేయాల్లో వేట పాటలే మొదటి తెగకు చెందినవనడంలో సందేహం లేదు.

చిత్తూరు జిల్లాలో యానాది వాళ్ళు, గువ్వలోళ్ళు వేట ప్రధానవృత్తిగా జీవిస్తారు. ఈ జిల్లాలోని యానాది వాళ్ళను ఇర్లోళ్ళు అంటారు. వీరినే తమిళంలో ''ఇరులర్'' అంటారు. పాములు, ఎలుకలు, ఈసుళ్ళు పట్టడం, తేనే తయారి వీరి ప్రధాన వృత్తి. వీరి సేవలు వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయోగం. ఒక చిన్న టింగు బారను భుజాన చేసుకుని, ఊదర బాసను తగిలించుకొని, తన భార్యను వెంటబెట్టుకొని, అడవుల్లో పంట పొలాల్లో తిరుగుతూ ఎలుకల్ని, ఉడుముల్ని, పాముల్ని వేటాడుతూ ఉంటారు. ఇలా వేటకు వెళ్ళే ముందు అతడు ఎలా తయారవుతాడో కింది గేయం తెలియజేస్తుంది.

''లెయ్యేసే! నలనాగు మన లేడికి బోదామె
అబ్బబ్బా నేరాల నా పల్లేమో బాగలేదు
వలీలకి పట్టేసి నీ తలాకు పూతేసి ॥ లెయ్యేసే ॥
టింగెత్తి బయటేయ్ వలపుల్లెత్తి బయటేయే
॥ లెయ్యేసే ॥

(పెద్దక్క - వుత్తరమద్ది - ఐరాలమండలం) ఆలు మగలు ఇద్దరు వేటాడడానికి కావలసిన టింగువార, వల, వలపుల్లలు ఎత్తుకొని వెళ్ళడానికి తయారు కావాల్సిందిగా తన భార్యతో చెప్పడం ఈ పాటలో చూడవచ్చు.

రాత్రి వేళలో కొందరు గ్రామ ప్రజలు ఇరుగేటకు వెళుతూ ఉంటారు. ఇరుగేట అంటే రాత్రి వేట అని అర్థం. తమిళంలో ఇరవు అంటే 'రాత్రి', వేటై అంటే వేట. ఇరవు వేట, ఇరుగేట అయింది. కొన్ని నాటకాలలో ఇర్లోళ్ళ వేషణ ధరించి ఈ క్రింది పాటను పాడుతారు.

అద్దద్దో కుందేలి - అది పోతుంటే కుంచేలి
పాడిపాడి చెట్లల్లో - అది పోతుందే కుందేలి
నల్జెరువూ కట్టకిందా - అది నాల్లేరూ పాదకిందా
చిన్న చిన్నా చెట్లల్లో - అది చిటికాలూ ఆడుతుంటే
పెద్ద పెద్దా చెట్లలో - అది పరుగాటా ఆడుతుంటే
॥ అద్దెద్దో ॥

ఈ యానాది పాటల్ని తమిళంలో 'ఇరుళర్ పాడల్గళ్' అంటారు. తమిళ దేశంలోని ఉత్తర ఆర్కాడు జిల్లాలోని ప్రజల ఆచార వ్యవహారాలు, చిత్తూరు జిల్లాలోని ప్రజల ఆచార వ్యవహారాలు దాదాపు ఒకేవిధంగా ఉంటాయి. ఒక 'ఇరుళర్ పాడల్'ని చూస్తాం.

వీర॥ కంజిక్కు పంజమోడి పాలమ్మా
కాలం పాక్కిలె నాముం నాట్టిలె
కాలం కళిప్పోమడి పాలమ్మా
ఊదిఊది వాయి నోవుదె పాలమ్మా
ఉళ్ళ గీర ఎలిపుడు పాలమ్మా
ప్రాయ్మపల్గా ఎడుత్తుప్పారడా వీరా
ఎలివళయైత్తోండి పారడా వీరా
నెల్లు కదిలిక్కునెల్లు కదిరిరుక్కూం
నల్లా ఆడక్కుం నల్ల నల్ల వెటి యెడా.

పై గేయం యానాదుల జీవన విధానానికి దర్పణం లాంటిది. యానాది రోజూ చేసే తన కులవృత్తిని వదిలి కాలానుగుణంగా నడుచుకొందాం అంటాడు. కాని అతని భార్య ఎలుకల కలుగుల్లోని వడ్ల కొలకల్ని తీసుకుంటే అదే మన జీవనానికి సరిపోతుందని చెబుతుంది. ఈ పాటలో యానాదులు ఎలుకల్ని పట్టే వైనం తెలియజేయ బడింది. యానాదులు ఒక చిన్నకుండకు అడుగు భాగంలో చిన్నరంధ్రం చేస్తారు. ఆ కుండలో గడ్డిని దూర్చి వెనుక భాగం నుంచి మంట పెడతారు. ఎలుకల కలుగుల్ని చూసి కొంతభాగం తవ్వి కుండ ముందు భాగాల్ని ఆ కులుగులో పెట్టి చుట్టూ మట్టిని కప్పి వెనుకభాగం నుండి నోటితో ఊదుతారు. ఇలా ఊదితే వచ్చే పొగకు కలుగులలోని ఎలుకలు బయటికి రావడా నికి ప్రయత్నించి కలుగు ముందరి భాగంలో చచ్చి పోతాయి. ఆ తరువాత తాము చెప్పిన టంగుభారతో కలుగుల్ని త్రవ్వి అందులో చచ్చిపోయిన ఎలుకల్ని, ఎలుకలు భద్రపరచిన వడ్ల కంకుల్ని ఏరుకుని తమ జీవనాన్ని గడుపుతుంటారు. ఇలా చేసినందుకు రైతులు వారికి 'మేర' ఇస్తారు.

## 2. నాగళ్ల పాటలు :

ఆంధ్రప్రదేశ్‌లో పొలం పనులు ఏరువాకలో ఆరంభ మౌతాయి. ఏరువాక అంటే భూమిని దున్నడానికి ప్రారంభించే సమయం. చిత్తూరు జిల్లాలో ఏరువాకనే 'దుక్కుల ఏకాదశి' అంటారు. ఆరోజు రైతులు ఉదయాన్నే లేచి దుక్కిటెద్దుల్ని నాగళ్లను అలంకరించి పూజించి పొలాల్లో దుక్కి దున్నడం ప్రారంభిస్తారు. నాట్లు వేసే వరకు భూమిని అనువుగా దున్ని పెడతారు. ఇలా పొలం పనులు ఆరంభించే ముందు దేవుని పూజిస్తారు. ఈ సమయంలో ఏరువాకమ్మని పూజించడం మన ఆంధ్రదేశంలో గల ఆచారం.

"ఏమో కావాలీ ఏమీ కావాలి
ఏరువాకమ్మకీ ఏమికావాలీ
ఎర్రఎర్రని బంతిమా కావాలి
ఎరుపు తెలుపుల మబ్బు బెండ కావాలి ॥ ఏమి ॥
పొలం గట్టున నిలిచి వేడుకోవాలి
పసుపు కుంకుమలతో పూజ చేయాలి" -

అంటూ పాడతారు.

తమిళంలో నాగలి పాటల్ని ఏర్‌ప్పాట్టు అంటారు. తమిళ దేశంలో కూడా నాగలిని పూజించి పొలం పనులు ప్రారంభించే ముందు సూర్యుణ్ణి గాని వినాయకుణ్ణి, (పిళైయార్ భగవంతుని) గాని పెరుమాన్ శివుణ్ణిగాని, (శివనార్) పూజించడం కనిపిస్తుంది.

కాళయిరే యన్ తోళనార్ కాళయిరే
సుత్తు పళయ మోట్టి యన్ తోళనార్ కాళయీరే
సూరియనై దండనిట్టేన్ యన్ తోళనార్ కాళయీరే ॥ చో ॥
పక్క వళయమోట్టి యన్ తోళనార్ కాళయీరే
భగవానై దండనిట్టేన్ యన్ తోళనార్ కాళయీరే ॥ చో ॥

అని పాడే పాటలో ఎద్దుల్ని తన స్నేహితులుగా భావించి ఓ రైతు కొండ్ర, కొండ్రకు దేవుణ్ణి స్తుతించాలని తన ఎద్దులకు హితవు పలకడం కనిపిస్తుంది.

## 3. నాట్ల పాటలు :

రైతులు తాము సాగుచేయాలనుకొనే పొలానికి సరిపడేటట్టు భూమిలో ఒక మూల నీరు పెట్టి దున్ని ఆకు, ఎరువు వేసి నారు పోసుకుంటారు. వానలు పడిన వెంటనే పేడ ఆకు, ఎరువు వేసి అడుసును బాగా దున్ని, మడుపుతోలి, మిట్టాపల్లాలు సరిచేసి గెనాలకు మన్ను పెడతారు. ఆ తరువాత మరలా దున్ని 'మానుదోలి' పొలాన్ని పైరు నాటడానికి అనువుగా చేసుకొంటారు. ఆ తరువాత నారు కట్టలు కట్టి పొలమంతా వేస్తారు. స్త్రీలు పొలాల్లో దిగి మునాలు పట్టుకొని నారు నాటతారు. ఇలా నారునాటే సమయంలో అనేక జానపదగేయాలు పాడుతారు.

నాట్ల పాటల్ని తమిళంలో 'నడుపుప్పాట్టు' అంటారు. ఈ పాటల గొప్పదనాన్ని మాధుర్యాన్ని అనుభవించిన తమిళ కవులు 'ముక్కూడర్పళ్ళు' మొదలైన కావ్యాల్లో పొలాల్లో నాట్లు నాటే దృశ్యాల్ని రమ్యంగా వర్ణించారు. తమిళ, తెలుగు జానపద గేయాల్లోని నాట్ల పాటల్లో రైతుల దైన్యస్థితిని వివరించే గేయాలు కూడా చోటుచేసుకున్నాయి.

ఒక భూస్వామి తాను చాలా బీదవాడినని నాట్లు కొంచెం దగ్గరగా నాటమని బ్రతిమిలాడే రైతు నామమే కొంజెం ఏళ్తెయడి నడువు కొంజెం నేత్తుప్పోడు అంటాడు. దుక్కులు దున్ని నాట్లు వేసి పంట పండే వరకు గల సన్నివేశాల్ని జానపదులు చక్కగా వర్ణించారు.

దుక్కెలు దున్నెరా ఓహోహో, దుక్కెలు దున్నెరా అహోహో దుక్కెలు దున్నెరా
గింజె వేసెరా ఓహోహో గింజె వేసెరా ఆహోహో గింజె వేశె మొలకెమొలసెరా
రెమ్మాలిడిసెరా ఓహోహో రెమ్మాలిడిసెరా ఆహోహో రెమ్మాలిడిసెరా
పూతే బూచెరా ఓహోహో పూతే బూచెరా ఆహోహో పూతే బూచెరా
పిందెలేసిరా ఓహోహో పిందేలేసెరా ఆహోహో పిందెలేసెరా

దొరా దొల్లెరా ఓహోహో దొరా దెల్లొరా ఆహోహో దొరా దొల్లెరా సరిలో
పండె బండెరా ఓహోహో పండె బండెరా ఆహోహో పండే బండెరా సరిలో
బండి కెసెరా ఓహోహో మండీ కెసెరా ఆహోహో మండీ కెసెరా
డబ్బె దీసెరా ఓహోహో డబ్బే దీసెరా ఆహోహో డబ్బే దీసెరా - అంటూ గేయం సాగంది.

దుక్కులు దున్ని గింజలేస్తే మొలకలు మొలిచింది. ఆకుల రెమ్మలిడిచింది. పూత బూసి పిందెలేసింది. దోర పండ్లయి పండాయి. దీన్ని కోసి బండికేసుకుని మండికీ తీసుకెళ్ళి డబ్బు తీసుకొచ్చాడని ఈ గేయ భావం. గేయంలో రైతులు చేసిన కృషికి తగిన ప్రతిఫలం పొందడం కనిపిస్తుంది.

దీన్ని పోలిన తమిళ జానపద గేయం ఒకటి ఉంది. దీనిలో వేసిన విత్తనం మొలకెత్తి కొంచెం కొంచెం పెరిగి కోత కొచ్చి దాన్ని కోసి గెరిసెల్లో పోశారని ఆ గేయం చెబుతుంది.

ఒణ్ణామ్ తింగళిలే ఒరుముళై విట్టు
ఇరండామ్ తింగళిల్ ఇరుముళై విట్టు
మూణామ్ తింగళిల్ మూణాముళై విట్టు
వాలామ్ తింగళిల్ నా గాభా గమాగి
అంజామ్ తింగళిల్ పంజుబ్ కదిరుమాగి
ఆరాజామ్ తింగళిల్ ఆరుతై ఆడిక్క
పొతిక్కు అయ్యాయిర కలమానదు

చిత్తురు జిల్లాలో సన్నకారు రైతులే అధికం. పైద రైతులు తమకున్న ఒకటి రెండు ఎకరాల పొలాన్ని ఏతమెత్తి పోసి లేదా మోటతోలి పంటలు పండిస్తారు. అప్పు సప్పు చేసి పండించిన పంటలోనే చాకలి, కుమ్మరి, మంగళివాళ్ళకు, 'మేర' పనివాళ్ళ కిచ్చేధాన్యం ఇచ్చి, అప్పుల వాళ్ళకివ్వగా తనకు కనీసం గంజికి కూడ కరువ యిందనే జానపద గేయాల రైతుల కడగండ్లను చక్కగా విడమరిచి చెబుతోంది.

ఏతమెత్తేపోసి ఏడుగుంట్ల మడినాటి
ఏమ్మిగీలి ఏమాయర్నా
నాకు గంజికీ కరువాయరన్నా
కులీల కూలిస్తి, కుమ్మరి మేరిస్తి
కుడువ కూడు లేదు రన్నా
నాకు గంజికి కరువాయెరన్నా ॥ ఏత ॥

మంగలీ మేరిస్తి, చాకలి మేరిస్తి
గంజి కట్టాయిస్తిరన్నా
నాకు గంజికి కరువాయరన్నా ॥ ఏత ॥

అప్పొళ్ళు సప్పొళ్ళు కుప్పంతా దోసీరి
కుడువ కూడు లేదురన్నా
నాకు గంజికి కరువాయరన్నా ॥ ఏత ॥

అంటూ సాగే ఈ గేయంలో తెలంగాణాలో "ఏటి కేతనం ఎత్తి ఎయ్యి పుట్లు పండిస్తే గంజికి కరువాయెరాన్న" అని గేయం చాలా ప్రసిద్ధి చెందింది.

కొందరు వ్యవసాయ కూలీలకు పొలం ఉండదు. కాని కాడెద్దులను కొని ఇతరుల పొలం దున్నడమో లేక పైరు చేయడమో చేస్తుంటారు. అయినా వారి కష్టానికి తగిన ప్రతిఫలం దొరకదు. కనీసం వారి ఎడ్లను కసువుకు కూడా కటకటలాడవలసి వస్తుంది. తినడానికి తిండికి కూడా కరువు ఏర్పడుతుంది. అయినా తన భార్య ఓరచూపులకి మురిసిపోయే ఓ రైతు కూలీ జీవనాన్ని ఈ క్రింది తమిళ గేయం తెలుపుతూంది.

నల్లపంబా నాత్తెడుత్తు నామె
నాడు నన్మై పెర నాత్తు వడువోమె
మాడురెండు పుల్లిల్లా మల్ సావుదు మామా
పొరై ఎడుత్తు పోడెళుదు నాళుంపోవుదు
కంజివేళై యాచ్చి కొంజు మిదు నేరమె
నల్లపార్కుళ్ళెపయిర్ వళర్తదోమె
చొల్లి ఎన్నపయన్ సోర్ ఉండామానే
కొట్టపాక్కిరుందా కొడుక్కిరియా మామ
కొట్టపాక్కిరుందా కొడుక్కిరియా మామ
కొట్టపాక్కు ఇల్లామల్ కిట్టె వరలామా
పొల్లి ఎన్నప్పయన్ పోరు ఉండామానె

ఓ భార్యా భర్తలిరువురు సంబా పైరు (వరి) నాటారు. తత్ఫలితంగా ఊరు బాగుపడింది. వారు కొన్న ఎద్దులు రెండింటికి కనీసం కసువు కూడా కరువయింది. వాటి కష్టార్జితంగా వచ్చిన కసువును మాత్రం ఇతరుల కోసం వామి వేయడానికి వారి కాలమంతా సరిపోయింది. ఇంత కష్టపడిన వారికి అన్నం గాక గంజినీళ్ళే గతి అయింది. గంజినీళ్ళు తాగే సమయంలో భార్యతో సరసాలాడతాడు రైతు. సరసాలకది సమయం కాదంటుంది అతని భార్య. పై పాటలో శ్రమదోపిడిని జానపద కవి చక్కగా పొందు పరచాడు. తెలుగులోని వ్యవసాయక పాటల్లో వానదేవర పాటలు, ఏతం పాటలు, గూడ పాటలు, కపిల పాటలు, కలుపు పాటలు, మంచె పాటలు, కోత పాటలు, కుప్ప నూర్పిడి పాటలు, చేట పాటలు, చెరుకు గానుక పాటలు, వంటివి ఉన్నాయి. అవి కూడా తులనాత్మకంగా పరిశీలనార్హాలు.

తమిళంలో జానపద సాహిత్యంలో పూలుకోసే పాటలు, పూలుకట్టేపాటలు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఉత్తరార్కాడు జిల్లాలో పూల తోటలు ఎక్కువగా ఉన్నాయి. పూలు కోస్తూ స్త్రీలు పాడే పాటలు జానపద గేయాల్ని సుసంపన్నం చేస్తున్నాయి.

సేత్తులిదాం ఏలేలో పొన్నమ్మ
నెండలరి ఆమాంచొల్లు
నెండు నెండామ్ ఏలేలో
పూర్తిరుకుం మెయ్దాం చొల్లు
పూత్తపూవులేతీలో
పూముడియ ఆమాం చొల్లు
ఇన్నుం కొంజెం ఏలేలో
నేర జెల్లుం మెయ్దాం చొల్లు
కొళతిలేదాం లేలేలో
కొత్తలరి ఆమాంజొల్లు
గొత్తు గొత్తాయ్ ఏలేలో
పూత్తిరుకుందే ఆమాం చొల్లు

పై పాటలో రకరకాలు పూలు కోసి, దాన్ని మాలలుగా కట్టడం పేర్కొనబడి ఉంది.

తెలుగు తమిళంలోని వ్యవసాయిక గీతాల్లో భక్తి, శృంగారం, ప్రజల జీవన సరళి చక్కగా వర్ణింపబడి ఉన్నాయి. తెలుగులో లేని కొన్ని ప్రత్యేకతలు తమిళంలో ఉన్నాయి. తమిళంలోని జానపద గేయాలు చాలా ప్రాచీన కాలం నుండి ఆదరింపబడుతూ ఉన్నాయి. తెలుగులో లేని పూలు కోసే పాటలు, పూలు కట్టే పాటలు తమిళంలో ఉన్నాయి.

ప్రతి భాషకు ఒక ప్రత్యేకత ఉంటుంది. జానపద గేయాల్ని తులనాత్మకంగా పరిశీలించడం వల్ల ఆయా దేశాల సంస్కృతీ వైవిధ్యాన్ని తెలిసికొనడానికి వీలవు తుంది.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. తెలుగు జానపదగేయ సాహిత్యము, ఆచార్య. బి. రామరాజు - 1958.
2. తెలుగు కన్నడ జానపద గేయాలు, డా॥ ఆర్వీయన్ సుందరం - 1979.
3. తెలుగు - తమిళ జానపద గేయాలు - తులనాత్మక పరిశీలనము - డా॥. నిర్మల, పలనివేలు - 1992.
4. చిత్తూరు జిల్లా జానపద గేయాలు, డా॥. కె. మునిరత్నం - 1992.
5. తమిళ వాఙ్మయ చరిత్రము, ము. వరదరాజన్ - (అనువాదం) తిమ్మావజ్ఝ కోదండరామయ్య - 1982.

## తమిళ గ్రంథాలు :

1. క్కాట్టినిలే మిదిందదందకవిదై ము. అరుణాచలం - 1943.
2. క్కాట్టిలే వంద కవిదై - వై. తూరన్ - 1958.
3. వడ ఆర్కాడు మావట్ట నాట్టుప్పుర పాడల్‌గళ్ - డా॥. మా. కోదండరామయ్య.

BHAVAVEENA
VOL. 16, ISSUE. 9(2), September - 2019.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావ వీణ
UGC Approved Journal No. 42500

# శ్రీ సిద్ధాంత శిఖామణి - వచన సాహిత్యం

**డాక్టర్ మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు)
డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల.

**ఉపోద్ఘాతము :**

వీరశైవధర్మ విశిష్టతను, సిద్ధాంతము చాటి చెప్పే అత్యద్భుత గ్రంథము శ్రీసిద్ధాంత శిఖామణి. 12వ శతాబ్దములో బసవాది శివశరణులు సరళమైన వచనములలో వీరశైవ సిద్ధాంతాలను నాటి భక్త జనులకు అందించారు. రెండు కూడా వీరశైవ ధర్మప్రదీపకలే.

శ్రీశివయోగి శివాచార్యులు వీరశైవ సిద్ధాంత తత్వమును వేద, ఆగమ, ఉపనిషత్తుల ఆధారముగా శ్రీసిద్ధాంత శిఖామణిలో ప్రతిపాదించారు.

ఆలోక్యశైవ తంత్రాణి కామికాద్యాని సాదరమ్
వాతూలాంతాని శైవాని పురాణాప్యఖిలానితు॥
వేదమార్గ విరోధేన విశిష్టాచార సిద్ధయే।
అసన్మార్గ నిరాసాయప్రయోదాయ వివేకినామ్॥
సర్వస్వం వీరశైవానాం సకలార్థ ప్రకాశకం

పై శ్లోకముల ద్వారా శ్రీశివయోగి శివాచార్యులు కామికాది వాతులాంతాది ఇరవై ఎనిమిది శివాగమములను, సమస్త పురాణములను, వేదభాగమును అభ్యసించి వైదిక మార్గానుసారముగా వీరశైవుల విశిష్ట ఆచారములను "శ్రీసిద్ధాంత శిఖామణి" యందు ప్రతిపాదించారు.

శ్రీసిద్ధాంత శిఖామణియందు మొత్తం ఇరవై ఒక్క పరిచ్ఛేదములున్నాయి. ప్రథమ పరిచ్ఛేదములో శివస్తుతి, శక్తిస్తుతి, గ్రంథకర్త వంశవర్ణనం, శ్రీశివయోగి శివాచార్య వర్ణన అనే అంశాలు ఉన్నాయి.

ద్వితీయ పరిచ్ఛేదంలో జగత్ సృష్టి విచారము, తృతీయ పరిచ్ఛేదంలో కైలాస పర్వతవర్ణన, శివవర్ణన, శక్తివర్ణన, దేవతాతతికృతసేవావర్ణన, శ్రీపరమేశ్వరుని రాజ్యవ్యాపార వర్ణన, శ్రీరేణుకగణేశ్వర ప్రతిశివాదేశము అనే విషయాంశములు కలవు.

చతుర్థ పరిచ్ఛేదంలో శ్రీరేణుక గణేశ్వరుల లింగావతార వర్ణన, మలయాత్రివర్ణన, అగస్త్యాశ్రమ వర్ణన, అగస్త్య మహర్షి వర్ణన, అగస్త్య కుశల ప్రశ్న, అగస్త్య మహర్షి ప్రార్థనలు కలవు.

పంచమ పరిచ్ఛేదంలో అగస్త్య మహర్షికి తత్వోపదేశము, భక్తస్థలము, పిండస్థలము, పిండజ్ఞాన స్థలము, సంసారహేయ స్థలము అనే విషయాంశములు ఉన్నాయి.

షష్ఠమ పరిచ్ఛేదంలో గురుకారుణ్య స్థలము, లింగధారణ స్థలము, సప్తమ పరిచ్ఛేదంలో భస్యధారణ స్థలము, రుద్రాక్షధారణ స్థలము, అష్టమ పరిచ్ఛేదంలో పంచాక్షర జపస్థలము, నవమ పరిచ్ఛేదంలో భక్తమార్గ క్రియాస్థలము, సోపాధిదానస్థలము, నిరుపాధిదానస్థలము, సహజదాన స్థలము అనే అంశములున్నాయి.

దశమ పరిచ్ఛేదంలో మహేశ్వర ప్రశంసాస్థలము, లింగనిష్ఠాస్థలము, పూరా&శ్రమ నిరసన స్థలము సర్వాద్వైత నిరసనస్థలము, ఆహ్వాననిరసన స్థలము,అష్టమూర్తి నిరసన స్థలము, సర్వగత్వనిరసన స్థలము, శివజగన్మయ స్థలము, భక్తదేహిలింగ స్థలములు, విశదీకరింపబడ్డాయి.

ఏకాదశ పరిచ్ఛేదంలో ప్రసాది స్థలము, గురుమహాత్మ్య స్తలము, భక్తిమహాస్త్య స్థలము, శరణమాహాత్మ్య స్థలము, ప్రసాద మహాత్మ్య స్థలములు కలవు.

ద్వాదశ పరిచ్ఛేదంలో ప్రాణలింగి స్తలము, ప్రాణలింగార్చన స్థలము, శివయోగ సమాధి స్థలము, లింగనిజ స్థలము, అంగలింగ స్థలము, అనే విషయాంశములు విపులీకరింపబడినాయి. త్రయోదశ పరిచ్ఛేదంలో శరణ స్థలము, తామస నిరసన స్థలము,

BHAVAVEENA
VOL. 16, ISSUE. 9(2), September - 2019.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

నిర్దేశ స్థలము, శీల సంపాదన స్థలముల ప్రసక్తి కలదు. చతుర్దశ పరిచ్ఛేదంలో ఐక్యస్థలము, ఆచార సంపత్తి స్థలము, ఏకభాజన స్థలము, సహభాజన స్థలము అనే అంశములు వివరింపబడినాయి.

పంచదశ పరిచ్ఛేదంలో దీక్షాగురుస్థలము, శిక్షాగురు స్థలము, జ్ఞానగురు స్థలము, క్రియాలింగ స్థలము, భావలింగస్థలము, జ్ఞానలింగ స్థలము, స్వస్థలము, చరస్థలము, పరస్థలము అనే అంశములు కలవు. షోడశ పరిచ్ఛేదములో క్రియాగమస్థలము, భావాగస్థలము, జ్ఞానాగమస్థలము, సకాయస్థలము, ధర్మాచారస్థలము, భావాచార స్థలము, జ్ఞానాచార స్థలముల గూర్చి వివరింపబడింది.

సప్తదశ పరిచ్ఛేదంలో కాయానుగ్రహ స్థలము, ఇంద్రాయాను గ్రహ స్థలము, ప్రాణానుగ్రహస్థలము, కాయార్పణ స్థలము, కరణార్పణ స్థలము, భావార్పణస్థలము, శిష్యస్థలము, శుశ్రూష స్థలము సేవ్యస్థలము అనే విషయములు వివరింపబడినాయి.

అష్టాదశ పరిచ్ఛేదములో ఆత్మస్థలము, అంతరాత్మ స్థలము, పరమాత్మ స్థలము, నిర్దేహాగమ స్థలము, నిర్భావాగమ స్థలము, నష్టాగమ స్థలము, ఆదిప్రసాది స్థలము, అంత్యప్రసాది స్థలము, సేవ్య ప్రసాది స్థలము అనే స్థలముల పరిజ్ఞానము కలదు. ఏకోన వింశతి పరిచ్ఛేదంలో దీక్షాపాదోదక స్థలము, శిక్షాపాదోదక స్తలము, జ్ఞానపాదోదక స్థలము, క్రియానిష్పత్తి స్థలము, భావనిష్పత్తి స్థలము, జ్ఞాననిష్పత్తి స్థిలము, పిండాకాశస్థలము, బింద్వాకాశ స్థలము, మహాకాశ స్థలము, క్రియాప్రకాశ స్థలము, భావప్రకాశ స్థలము, జ్ఞానప్రకాశ స్థలముల వివరణ కలదు. వింశతి పరిచ్ఛేదములో స్వకృత ప్రసాద స్థలము, శిష్టాదన స్థలము, చరాచరలయ స్థలము, భాండస్థలము, భాజనస్థలము, అంగాలేపస్థలము, స్వపరాజ్ఞ స్తలము, భావాభావలయ స్థలము, జ్ఞానశూన్య స్థలము అనే అంశముల వివరింపబడగా ఏకవింశతి పరిచ్ఛేదములో విభీషణా భీష్టవర ప్రదానము గూర్చి వివరింపబడింది.

**వచన సాహిత్యం:**

వీరశైవ సిద్దాంతమును సరళంగా, సుందరమైన రీతిలో వచన రూపములో ప్రతిపాదించిన వాడు బసవాది శివశరణులు. వీరు ఏ స్థాయిలో వచనాలు పలికారంటే వీరే వీరశైవ మతస్థాపకులనే రీతిలో వీరి సాహిత్య ప్రతిభలు వెలిగొందినాయి. వచనసాహిత్యం వేదతుల్యమైనది. దేవాగమోపనిషత్ విషయాంశములు వచనాలలో పొందుపరచబడ్డాయి. శివశరణుల అనుభవసారముతో వెలువడిన సాహిత్య సంపద వచనం.

కేవలం బసవేశ్వరుడొక్కడే నాలుగు లక్షల అరవై నాలుగువేలు రచించినట్టుగా పాల్కురికి సోమనాథుని బసవపురాణం వలన తేటతెల్లమవుతుంది. శివశరణు లందరూ కాయకమును నిర్వర్తిస్తూ సత్య శుద్ధ జీవనమును గడుపుతూ వచనాలను వెలువరించారు.

వచనకారులు పలికిన వాక్కులు స్ఫటిక ప్రశలాకవలే హృదయాంతరాళములోకి చొచ్చుకొని వెళు ్తతాయి. వచనాలలో సంసారిక, నీతి, మూఢాచార నిరసన, దైవభక్తి ఇత్యాది అంశాలు ఎన్నో కనిపిస్తాయి.వచన సాహిత్యానికి బీజములు వేసిన శివశరణులందరూ కన్నడ ప్రాంతమువారే. బసవేశ్వరుని భక్తి తత్వమునకు, ఇష్టలింగ దీక్షాకంకణ బద్ధులైన గురులింగ జంగముల అనుభావజ్ఞానమునకు ఆకర్షితులై వర్గ, వర్ణ, లింగభేదం లేకుండా ఎందరెందరో తమ తమ మృత్రీతమందు ఇష్టలింగమును ధరించి, లింగాంగ సామరస్యంచేత తమ జన్మలు ధన్యం చేసుకున్నారు, వచన సాహిత్యమును, సుసంపన్నం చేసిన వారిలో అగ్రగణ్యుల బసవేశ్వరులవారు ఆ తరువాత అల్లమప్రభుదేవుడు, చెన్నబసవణ్ణ, సిద్ధరామేశ్వరుడు, అక్కమహాదేవి, అక్కమ్మ, ఆయ్దక్కిలక్కమ్మ, కాళవ్వ, రేమమ్మ, రేచవ్వ, కిన్నెబ్రహ్మయ్య, ఏకాంతరామయ్య, అయిదక్కి, మారయ్య, ఉరిలింగ పెద్దయ్య మడివాలు మాచయ్య, మోళిగమారయ్య, దేవరదాసిమయ్య, తోంటద సిద్ధలింగశివయోగి ఎంకా ఎందరెందరో మహనీయులు వచన సాహిత్యమును సుపంపన్నం చేశారు.

మహాత్మా బసవేశ్వరుడు "కూడల సంగమదేవా! అనే మకుటంతో వచనాలు రచించగా 'చెన్నమల్లికార్జునా' అనే మకుటంతో అక్కమహాదేవి వచనాలు వెలువరించింది. "ఆచారమే ప్రాణమైన "రామలింగేశ్వరా" అనే మకుటంతో అక్కమ్మ, "భోగ బంకేశ్వరలింగ" అనే మకుటంతో అగ్ఘవణి హంపయ్య "మహాఘనసోమేశ్వరా" అనే మకుటంతో అక్కమ్మ "భోగబంకేశ్వరలింగ" అనే మకుటంతో అంగసోంకులింగతందె "హంపివిరూపాక్షి" మకుటంతో అగ్ఘవణి హంపయ్య "మహాఘనసోమేశ్వరా" అనే మకుటంతో అజగణ్ణ "నాచయ్యప్రియ చెన్నరామ" అనే మకుటంతో 'అనామిక నాచయ్య' 'అంభీగర చౌడయ్యా' అనే మకుటంతో 'అంభీగరచౌడయ్య' "మాగుడద మల్లికార్జునా" అనే అనే మకుటంతో అమరగుండం మల్లికార్జునుడు 'సిద్ధసోమనాథ' అనే మకుటంతో "అముగేదేవయ్య" 'అముగేశ్వరా' అనే మకుటంతో అముగెరాయమ్మ 'సదాశివమూర్తి' అనే మకుటంతో అరివిన మారతందె, 'గుహేశ్వరా' అనే మకుటంతో అల్లమాప్రభువు 'సద్యోజాతలింగా' అనే మకుటంతో ఆదయ్య "ఆనంద సింధురామేశ్వరా" అనే మకుటంతో ఆనందయ్య "అమరేశ్వరాలింగా" అనే మకుటంతో అయిదక్కిమారయ్య "గారుడేశ్వరలింగా" అనే మకుటంతో ఉప్పరగుడి సోమిదేవయ్య "కురంగేశ్వరలింగమా" అనే మకుటంతో ముక్తినాథయ్య "ఏలేశ్వలింగా" అనే మకుటంతో ఏలేశ్వరకేతయ్య, "భీమేశ్వరలింగా"అనే మకుటంతో "కోలశాంతయ్య" తదితర శివశరణులు, శరణీమణు లెందరెందరో వచన సాహిత్యమును పరిపుష్టం చేసిన మహనీయులు.

**ముగింపు :** వీరశైవ సిద్ధాంతము వేదాగ మోప నిత్రప్రతిపాదిత సిద్ధాంతము. సిద్ధాంత శిఖామణి వీరశైవమునకు అగ్రపీఠమైతే, శివశరణుల వచన సాహిత్యముమణిరత్నము. కావున వీరశైవులందరికీ శ్రీసిద్ధాంత శిఖామణి, వచన సాహిత్యము రెండు శిరోధ్యార్యములే.

**ఆధార గ్రంథాలు**

1. శ్రీసిద్ధాంత శిఖామణి – శివయోగి శివాచార్యులు.
2. బసవేశ్వరుని వచనాలు – సమగ్ర పరిశీలన.
3. బసవగీత – ఆచార్యముదిగొండశివప్రసాద్.

* * *

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# Telugu students of Upper Primary and High School Classes : Conversational Analysis : A Study

- ***B. Suresh Naick***, Ph.D Research scholar in Linguistics, Sri Venkateswarauniversity, Tirupati.

Conversation analysis (CA) is an approach to the study of social interaction, embracing both verbal and non-verbal conduct, in situations of everyday life. As its name implies, CA began with a focus on casual conversation but its methods were subsequently adapted to embrace more task- and institution-centered interactions, such as those occurring in doctors' offices, courts, law enforcement, help lines, educational settings, and the mass media. As a consequence, the term 'conversation analysis' has become something of a misnomer, but it has continued as a term for a distinctive and successful approach to the analysis of social interactions.

When compared to other analytical approaches, conversational analysis takes a much detailed approach. It does not use summarized or coded representations, but instead analyses detailed recordings of interactional activities and detailed transcripts. This allows it to identify various facets and subtleties in an interaction that would otherwise not be recognized by other analytical approaches. Conversation analysis focuses on naturally occurring data and not on conversations that are manipulated in a laboratory. This approach studies how oral language is used during a natural interaction. It tries to explain how people act as they do in a conversation. The whole conversation is viewed as a single event.

**Objectives of the Study :**

- ✡ To find out the conversational analysis of Upper primary and high school students
- ✡ To find out the conversational analysis of boys Upper primaryand high school students
- ✡ To find out the conversational analysis of girls Upper primaryand high school students
- ✡ To find out the conversational analysis of GovernmentUpper primaryand high school students

**Hupotheses of the Study :**

- Conversational analysis of Upper primary and high school students is high
- Conversational analysis of boys Upper primaryand high school studentsis high
- Conversational analysis of girls Upper primaryand high school studentsis high
- Conversational analysis of GovernmentUpper primaryand high school studentsis high

**Methodology :**

CA methods for isolating and studying interactional practices have a good deal in common with the method of analytic induction, and in particular the constant comparative method and the search for deviant cases. The method, of course, is specified to the interactional subject matter of conversation analysis.

Although there is no official, single way of doing conversation analysis, there are some fundamental methodological features common

BHAVAVEENA
Vol. 16, Issue. 9(2), September - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


to most research in the area and summarized in numerous introductory books and articles. The CA approach can be said to be ascetic forseveral reasons are it is a mixed method of qualitative and quantitative analysis covering socio linguistics and applied linguistics areas.

1.Data selection recoding speech samples. 2. Analysis of speech samples 3.Qualitative andQuantitative 4.Speech extract or analyzer 5.Quntitative number of occurrences of features counted and 't'test employed for comparison of number of occurrences

**Limitation of Study :**

- The present study limited to Conversational analysisskill of languages only.
- The present study limitedConversational analysisto Selected Government and Private upper primary and high schools in ChittoorDistrict.

**Plan of the Research Work :**

**Data Collection :**

The present study was conducted at some selected upper primary and high schools in Chittoor District with a batch of fifteen students for a time period of three years from class six to class eight. Since it is a longitudinal study, the same set of students was observed for three years.

The total numbers of students were limited to fifteen to ensure quality in the study. The research method is mixed in which both qualitative and quantitative analyses were done one after the other.

The actual data was speaking samples later converted into quantitative measure.

The speech samples of the student of each year are compared with the other two. Thus, there are three comparisons as follows :

1st year – 2nd year

2nd year – 3rd year

3rd year – 1st year

The final analysis revealed considerable improvement in their social, cognitive and linguistic abilities.

**Data Analysis :**

The data has varied experiences and situations considering the limitations of synopsis, I have included a few situations here for a detailed analysis:

The students at school have to speak to their teachers to get clarified of their doubts and to get information further. The Indian culture expects the 'student-teacher' role to have 'Devotee-God' aspects. When the teacher asks questions, the students mostly remain quiet as follows:

**Teacher** : Mana Jaati Pita Evaru? (Who is the father of the nation?)

**Student** : Gandhi, Sir.

**Teacher** : Eesamvastaram lo swatamtram vachhindi? (In which year India got freedom?)

**Student** : 1947, Sir.

**Teacher** : Neevueemaina prasnna nannu adugutaava? (Do you have any question to ask me?)

**Student** : Nissabdham(silence)

The role-relationship requires the exchanges of 'Question-Answering'. The students utter only a word or two along with the honorific term 'Sir'. When the teacher motivates them to ask a question, they all remain quiet. It has happened in all the questions.

**Question – Answer pairs :**

| Students | 1st year | 2nd year | 3rd year |
|---|---|---|---|
| 1 | 2 | 4 | 5 |
| 2 | 4 | 2 | 4 |
| 3 | 3 | 5 | 3 |
| 4 | 1 | 2 | 4 |
| 5 | 2 | 3 | 3 |
| 6 | 3 | 1 | 2 |
| 7 | 4 | 5 | 5 |
| 8 | 3 | 5 | 4 |
| 9 | 4 | 3 | 5 |
| 10 | 2 | 2 | 4 |
| 11 | 1 | 0 | 4 |
| 12 | 0 | 1 | 2 |
| 13 | 1 | 2 | 1 |
| 14 | 2 | 1 | 2 |
| 15 | 0 | 1 | 3 |

*1st year – 2nd year*

**The means of Group 1 and Group 2 <u>are not significantly different</u> at p < 0.05.**

**Summary**

| | Group 1 | Group 2 |
|---|---|---|
| Mean | 1.9333 | 2.4667 |
| Variance | 2.0667 | 2.6952 |
| Stand. Dev. | 1.4376 | 1.6417 |
| n | 15 | 15 |
| t | -1.6579 | |
| **degrees of freedom** | **14** | |
| **critical value** | **2.145** | |

Determine critical value for *t* with degrees of freedom = 14 and á=0.05.

In this example the critical value is **2.145** (see the table below).

**The absolute value of the calculated *t* is smaller than critical value (1.6579<2.145), so the means are not significantly different.**

**2nd year to 3rd year**

**The means of Group 1 and Group 2 <u>are significantly different</u> at p < 0.05.**

**Summary**

| | Group 1 | Group 2 |
|---|---|---|
| Mean | 2.4667 | 3.4 |
| Variance | 2.6952 | 1.5429 |
| Stand. Dev. | 1.6417 | 1.2421 |
| n | 15 | 15 |
| **t** | **-2.3569** | |
| **degrees of freedom** | **14** | |
| **critical value** | **2.145** | |

Determine critical value for *t* with degrees of freedom = 14 and á=0.05.

In this example the critical value is **2.145** (see the table below).

**The absolute value of the calculated *t* exceeds the critical value (2.3569>2.145), so the means are significantly different.**

**3rd year – 1st year**

**The means of Group 1 and Group 2 <u>are significantly different</u> at p < 0.05.**

**Summary**

| | Group 1 | Group 2 |
|---|---|---|
| Mean | 2.0714 | 3.4286 |
| Variance | 1.9176 | 1.6484 |
| Stand. Dev. | 1.3848 | 1.2839 |
| n | 14 | 14 |
| **t** | **-4.4129** | |
| **degrees of freedom** | **13** | |
| **critical value** | **2.16** | |

Determine critical value for *t* with degrees of freedom = 13 and *á*=0.05.

In this example the critical value is **2.16** (see the table below).

**The absolute value of the calculated *t* exceeds the critical value (4.4129>2.16), so the means are significantly different.**

The data shows that there is a lot of improvement between 2nd - 3rd year and 3rd – 1st year.

**Summary :**

Conversation analysis is an approach to the study of social interaction and talk-in-interaction that, although rooted in the sociological study of everyday life, has exerted significant influence across the Applied Linguistics and Socio-Linguistics. In sociolinguistics, conversation analysis is the study of the talk produced in ordinary human interactions.Four important domains of research within conversation analysis are turn-taking, repair, action formation and ascription, and action sequencing. This summary was taken from all the above chapters.

**Conclusions :**

- The data analysis shows a lot of improvement in all the three aspects of social, cognitive and linguistic abilities.
- Conversation analysts look at the order of our everyday interactions when we are talking.

**Uuseful and Enriching to the Socity :**

Conversation analysis skill to develop languages skills it is useful to enrich to live skills in society.

**References :**


- Ball, Martin. J; The Routledge Handbook of Sociolinguistics Around the World; Routledge Taylor and Francis Group, 2010
- Bussmann, Hadumod; Routledge Dicationary of Langauge and Linguistics; Routledge; 1996
- Cobley, Paul; The Routledge Companion to Semiotics and Linguistics, 2001, Routledge
- Gee, James Paul and Handford, Michael; The Routledge Handbook of Discourse Analysis; Routledge, London; 2012
- Heritage, John and Steven E. Clayman (2010). Talk in Action: Interactions, Identities and Institutions. Boston: Wiley-Blackwell.
- Heritage, John. "Conversation analysis and institutional talk." Handbook of language and social interaction 103 (2005): 47.

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

## Journal of Telugu Literary, Culture & Language Study

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

September (2) 2019




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.